సాక్షి

సత్యమేవ జయతే


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 136

మంగళవారం 6-8-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'



బేర్ విశ్వరూపం

అమెరికాలో మాంద్యం భయాలు మార్కెట్లను ముంచేశాయి. దేశీయ షేర్ల విలువ భారీగా పెరిగిపోవడంతో అమ్మకాల సునామీ వెల్లువెత్తింది. ఫలితంగా సెన్సెక్స్ 2,223 పాయింట్లు క్షీణించి నెల కనిష్టం, 80 వేల స్థాయి దిగువన 78,759 వద్ద ముగిసింది. నిఫ్టీ 662 పాయింట్లు పతనమై 24,055 వద్ద నిలిచింది.

- వివరాలు 15లో



అవి మృత్యుకుహరాలు...

ఢిల్లీలోని కోచింగ్ కేంద్రాలు డెత్ చాంబర్లుగా తయారై అభ్యర్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

- వివరాలు 6లో



కేజ్రీవాల్ అరెస్టు సబబే

మద్యం కేసులో సీబీఐ తనను అరెస్ట్ చేయడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టు మెట్లెక్కిన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు చుక్కెదురైంది.

- వివరాలు 6లో



సర్వేలో హారిస్ ముందంజ

అమెరికా అధ్యక్ష రేసులో ఉన్న ట్రంప్ కంటే కమలా హారిస్‌కే ఆదరణ ఎక్కువగా ఉందని సీబీఎస్ న్యూస్, యూగవ్ సర్వేలో తేలింది.

- వివరాలు 6లో



బడ్జెట్‌కు లోక్‌సభ ఆమోదం

గతవారం చర్చ ముగిశాక 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌కు సోమవారం లోక్‌సభ ఆమోదముద్ర వేసింది.

- వివరాలు 6లో



ఆగ్రహం

బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా నివాస భవనంపైకి ఎక్కిన ఆందోళనకారులు



ఆనందం

హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేశాక ఢాకాలో ఆందోళనకారుల సంబరాలు



షేక్ హసీనా (ఫైల్)

సంక్షోభ బంగ్లా

రాజీనామా చేసి దేశం వీడిన బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా

- ఢాకాకు నిరసనకారుల 'లాంగ్ మార్చ్'
- డిమాండ్లకు తలొగ్గి ప్రధాని పలాయనం
- జనం సంబరాలు, సైన్యం చేతుల్లోకి దేశం
- తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటుకు యత్నాలు
- హసీనా ఇంటిని, పార్లమెంటును ముట్టడించిన జనం
- భారత్ చేరిన హసీనా, త్వరలో లండన్ వెళ్లే చాన్స్

ఢాకా/న్యూఢిల్లీ: పొరుగుదేశం బంగ్లాదేశ్ పెను రాజకీయ సంక్షోభంలో చిక్కుకుంది. సోమవారం రోజంతా అత్యంత నాటకీయ పరిణామాలు చకచకా జరిగిపోయాయి. ప్రధాని షేక్ హసీనా (76)కు వ్యతిరేకంగా కొద్ది రోజులుగా జరుగుతున్న దేశవ్యాప్త ఆందోళనలు ఉధృత రూపం దాల్చాయి. నిరసనకారుల 'లాంగ్ మార్చ్' పిలుపునకు స్పందిస్తూ జనమంతా కర్ఫ్యూను ధిక్కరించి మరీ దేశ నలుమూలల నుంచీ రాజధాని ఢాకాకు తండోపతండాలుగా తరలారు. దాంతో ప్రజల డిమాండ్‌కు హసీనా తలొగ్గారు. ప్రధాని పదవికి రాజీనామా చేశారు. జనాగ్రహానికి జడిసి పలాయన మంత్రం పఠించారు. ఉన్నపళంగా దేశం వీడారు. సోదరితో కలిసి కట్టుబట్టలతో సైనిక విమానంలో భారత్ చేరుకున్నారు. వెంటనే సైన్యం పరిస్థితిని తమ చేతుల్లోకి తీసుకుంది. సైన్యాధ్యక్షుడు జనరల్ వకారుజ్జమాన్ జాతినుద్దేశించి టీవీలో ప్రసంగించారు. ప్రధాని రాజీనామాను అధికారికంగా ప్రకటించారు. ''శాంతిభద్రతలతో పాటు మిగతా 6వ పేజీలో ▶

అప్రతిష్ట మూటగట్టుకున్న ఐరన్ లేడీ! 6లో

పరిస్థితిని సమీక్షించిన మోదీ

బంగ్లా సంక్షోభం నేపథ్యంలో ప్రధాని మోదీ సారథ్యంలో భద్రతపై కేబినెట్ కమిటీ అత్యవసరంగా సమావేశమైంది. హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్, విదేశాంగ మంత్రి జైశంకర్, ఆర్థిక మంత్రి సీతారామన్ భేటీలో పాల్గొన్నారు. బంగ్లాలో తాజా పరిస్థితిని మోదీకి జైశంకర్ నివేదించారు.

సరిహద్దుల్లో అప్రమత్తత

బంగ్లాదేశ్‌తో 4,096 కిలోమీటర్ల పొడవునా సరిహద్దుల వెంబడి భద్రతను కట్టుదిట్టం చేశారు. బీఎస్ఎఫ్ హై అలర్ట్ జారీ చేసింది. అదనపు బలగాలను మోహరించారు.

మన విద్యార్థులు వెనక్కి ..

బంగ్లాదేశ్ సంక్షోభం నేపథ్యంలో అక్కడున్న భారత విద్యార్థులు పెద్ద సంఖ్యలో వెనక్కొస్తున్నారు. జూలై చివరికల్లా 2,894 మంది తిరిగొచ్చారు. మరో 3,000 మంది త్వరలో రానున్నట్టు అధికారులు వెల్లడించారు.

న్యూస్‌రీల్

నూతన రెవెన్యూ చట్టాన్ని తెస్తాం



ధరణి స్థానంలో నూతన రెవెన్యూ చట్టాన్ని తీసుకువస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పునరుద్ఘాటించారు. దీని స్థానంలో దేశంలోనే రోల్ మోడల్‌గా నిలిచే కొత్త రెవెన్యూ చట్టాన్ని తెస్తామన్నారు.

- వివరాలు 2లో

గుడుంబా పోయి గంజాయి గుప్పుమంది!



హైదరాబాద్ ధూల్‌పేటలో గుడుంబాను నిర్మూలించేందుకు ఎక్సైజ్–పోలీసు శాఖలు చేపట్టిన 'ఆపరేషన్ ధూల్‌పేట' సత్ఫలితాన్నే ఇచ్చినా..ఇందుకోసం చేపట్టిన పునరావాస పథకంలో ఉన్న లోపం గంజాయి విస్తరించడానికి కారణమైంది.

- వివరాలు 3లో

దళిత మహిళపై దాడి కేసు.. ఆరుగురిపై వేటు



చోరీ కేసులో దళిత మహిళను పీఎస్‌కు పిలిపించి తీవ్రంగా కొట్టిన ఘటనపై సైబరాబాద్ సీపీ మహంతి కఠిన చర్యలు చేపట్టారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రామిరెడ్డితో పాటు ఐదుగురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు.

- వివరాలు 3లో

'అనర్హత'పై స్పీకర్ నిర్ణయానికి ఇంకెంతకాలం?



శాసనసభ స్పీకర్ ముందున్న ఎమ్మెల్యేల అనర్హత ఫిర్యాదులపై ఎప్పటిలోగా నిర్ణయం తీసుకుంటారు? అందుకోసం ఎంతకాలం వేచి ఉండాలని అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎ. సుదర్శన్‌రెడ్డిని హైకోర్టు ప్రశ్నించింది.

- వివరాలు 11లో

ఇదండీ సంగతి





సోమవారం రాత్రి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ 20 గేట్ల నుంచి దిగువకు కృష్ణమ్మ పరవళ్లు

16లో

తెరుచుకున్న సాగర్ 20 గేట్లు

గంటగంటకూ పెరుగుతున్న వరద

- నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి దిగువకు కృష్ణమ్మ పరుగులు తీస్తోంది. జలాశయంలో నీటిమట్టం గరిష్టస్థాయికి చేరుకోవడంతో సోమవారం 20 గేట్లు ఎత్తి 1,47,260 క్యూసెక్కులు, సాగర్ ప్రధాన కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ మరో 28,907 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. నాగార్జునసాగర్ గరిష్ట నీటిమట్టం 590 అడుగులు.. పూర్తి నీటినిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు. ప్రస్తుతం సాగర్‌లో 584 అడుగుల నీటిమట్టం, 294.55 టీఎంసీల నిల్వను కొనసాగిస్తూ మిగిలిన వరదను కిందకు విడుదల చేస్తున్నారు.



న్యూజెర్సీలో కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ శాంతికుమారి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారావు, జయేశ్‌రంజన్ తదితరులు

కాగ్నిజెంట్ భారీ విస్తరణ!

హైదరాబాద్‌లో 10 లక్షల చ.అడుగుల విస్తీర్ణంలో కొత్త క్యాంపస్

- 15 వేల మందికి ఉద్యోగ అవకాశాలు
- అమెరికాలో సీఎం రేవంత్‌తో చర్చలు..విస్తరణ ప్రణాళికపై ఒప్పందం
- హైదరాబాద్ టెక్ కంపెనీలకు గమ్యస్థానంగా మారుతుందన్న ముఖ్యమంత్రి

సాక్షి, హైదరాబాద్: ఐటీ రంగంలో దిగ్గజ కంపెనీ కాగ్నిజెంట్ హైదరాబాద్‌లో భారీ విస్తరణకు ముందుకు వచ్చింది. దాదాపు 15 వేల మంది ఉద్యోగులకు పని కల్పించేలా, 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్, కంపెనీ ఇతర ప్రతినిధి బృందంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల అనంతరం కాగ్నిజెంట్ విస్తరణ ప్రణాళికపై ఒప్పందం జరిగింది. వాస్తవానికి గత ఏడాది ముఖ్యమంత్రి బృందం దావోస్ పర్యటన సందర్భంగానే ఈ ఒప్పందానికి పునాదులు పడ్డాయి. సాంకేతికత, కొత్త ఆవిష్కరణలకు అభివృద్ధి కేంద్రంగా హైదరాబాద్ అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న నేపథ్యంలో కంపెనీ మిగతా 3వ పేజీలో ▶

ప్రవాసులు పెట్టుబడులతో రావాలి


- సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- న్యూజెర్సీలో ప్రవాసులతో ముఖ్యమంత్రి ఆత్మీయ సమ్మేళనం
- స్కిల్స్ వర్సిటీ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా

2లో

'డీఎస్సీ' మరింత ఆలస్యం?

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సందేహాలు


- కొత్తగా జరిపే నియామకాల్లో వర్గీకరణ అమలు చేస్తామన్న సీఎం
- ప్రస్తుత నోటిఫికేషన్ ఎప్పుడో ఇచ్చామంటున్న అధికారులు
- స్పష్టత కోసం సర్కార్‌కు లేఖ రాయాలని విద్యాశాఖ నిర్ణయం
- నిన్నటితో ముగిసిన డీఎస్సీ పరీక్షలు.. రెండు రోజుల్లో వెలువడనున్న 'కీ'



సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామకాలపై షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) ఉపవర్గీకరణ తీవ్ర ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో కొత్తగా జరిపే నియామకాల్లోనూ వర్గీకరణను అమలు చేస్తామని.. అవసరమైతే ఆర్డినెన్స్ తెస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించడం తెలిసిందే. అయితే సుప్రీంకోర్టు తీర్పునకు ముందే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చినందున ఇప్పుడు నిబంధనల మార్పు ఎలా సాధ్యమని విద్యాశాఖ అధికారులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వమే దీనిపై స్పష్టత ఇవ్వాలని అంటున్నారు. నోటిఫికేషన్ ఇచ్చాక ఇప్పుడు మార్పులు చేస్తే చట్టపరమైన సమస్యలు వస్తాయని అధికార వర్గాలు అంటున్నాయి. దీంతో టీచర్ల నియామకానికి బ్రేక్ పడుతుందా? అనే సందేహాలు నిరుద్యోగులను వెంటాడుతున్నాయి.

ఫలితాలు వెలువడేనా?

రాష్ట్రవ్యాప్తంగా 11,062 టీచర్ పోస్టుల భర్తీకి జూలై 18 నుంచి ఆగస్టు 5 వరకూ డీఎస్సీ నిర్వహించారు. మొత్తం 2,79,957 మంది పరీక్షకు దరఖాస్తు చేశారు. సోమవారంతో ముగిసిన ఈ పరీక్ష 'కీ'ని రెండు రోజుల్లో విడుదల చేయనున్నారు. సెప్టెంబర్ మూడో వారానికి ఫలితాలు వెల్లడించి అక్టోబర్‌లో నియామకాలు పూర్తి చేయాలని ప్రభుత్వం భావించింది. ఈ తరుణంలోనే ఎస్సీ వర్గీకరణ తీర్పు, సీఎం ప్రకటన వెలువడటం డీఎస్సీ భవితవ్యంపై సందేహాలకు తావిస్తోంది. ఫలితాల వెల్లడిపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ఉప వర్గీకరణ డేటా సేకరణ, అమలు, దాని ప్రకారం డీఎస్సీలో పోస్టుల విభజన చేపట్టాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ఎంతకాలం పడుతుందో తెలియని పరిస్థితిలో అధికారులున్నారు. దీనిపై స్పష్టత మిగతా 3వ పేజీలో ▶



కూల్చడానికి ముందు..



కూల్చిన తర్వాత...

8 టవర్లు.. 8 సెకన్లలో నేలమట్టం

- విజయవంతంగా పాల్వంచ కేటీపీఎస్ పాత ప్లాంట్ కూలింగ్ టవర్ల కూల్చివేత
- ఒకేచోట కుప్పకూలేలా ఇంప్లోషన్ పద్ధతి అవలంబించిన కాంట్రాక్టు సంస్థ
- అందుబాటులోకి రానున్న 403 ఎకరాలు.. కేటీపీఎస్ విస్తరణకు ఉపయోగించే చాన్స్

2లో

రుణాల కోసం రాత్రంతా జాగరణ

పరకాల ఎస్‌బీఐ ఎదుట రైతుల బారులు

- సిబ్బంది కొరతతో రోజుకు 100 మందికే ఇస్తున్న అధికారులు
- అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని అన్నదాతల విజ్ఞప్తి

- వివరాలు 5లో



బ్యాంకు వద్ద క్యూలో కూర్చున్న రైతులు

8 టవర్లు 8 సెకన్లు

విజయవంతంగా పాల్వంచ కేటీపీఎస్ పాత ప్లాంట్ కూలింగ్ టవర్ల కూల్చివేత

ఒకేచోట కుప్పకూలేలా ఇంప్లోషన్ పద్ధతి అవలంబించిన కాంట్రాక్టు సంస్థ

అందుబాటులోకి రానున్న 403 ఎకరాలు

కేటీపీఎస్ విస్తరణకు ఉపయోగించే చాన్స్

పాల్వంచ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్)– ఓఅండ్ఎం కూలింగ్ టవర్ల కూల్చి వేత పనులు సోమవారం విజయవంతంగా పూర్తయ్యాయి. పేలుడు పదార్థాలతో టవర్లను పేల్చేయడంతో క్షణాల్లో నేలమట్టమయ్యాయి. కూల్చివేత పనులను 3 దశల్లో, మూడు గంటల వ్యవధిలో పూర్తి చేశారు. ఏ, బీ, సీ స్టేషన్లవారీగా టవర్లు తొలగించగా ఒక్కో టవర్ నేలమట్టం కావడానికి కేవలం 6 నుంచి 8 సెకన్ల వ్యవధి మాత్రమే పట్టడం విశేషం. రాజస్తాన్‌లోని జైపూర్‌కు చెందిన ఎక్సిక్యూడ్ కంపెనీ డైరెక్టర్ ఆనంద శర్మ నేతృత్వంలోని 30 మంది నిపుణుల బృందం పేలుడు పదార్థాలను టవర్లకు అమర్చి ఇంప్లోషన్ (ఒకేచోట కుప్పకూలడం) పద్ధ తిలో కూల్చేసింది. ఉదయం 8:20 గంటలకు 'ఏ' స్టేషన్ లోని 4 టవర్లు, 10:12 గంటలకు 'బీ' స్టేషన్‌లోని రెండు, 11:40 గంటలకు 'సీ' స్టేషన్‌లోని మరో రెండు టవర్లను నేల మట్టం చేసింది. టవర్ల శకలాలు చెల్లాచెదురుగా పడకుండా పిల్లర్ల చుట్టూ ఇనుప మెష్ ఏర్పాటు చేయడంతోపాటు బట్టతో వాటిని చుట్టేశారు.


కూలుతున్న దృశ్యం..

వెలుగులు పంచిన పాత ప్లాంట్..

ఉమ్మడి ఏపీకి నాలుగున్నర దశాబ్దాలపాటు వెలుగులు పంచిన ఘన చరిత్ర కేటీపీఎస్ ఓఅండ్ఎం (పాత ప్లాంట్)కు దక్కుతుంది. కరెంట్ అంటేనే ఎంతో అపురూపం అన్నట్లుగా ఉండే ఆ రోజుల్లో పాల్వంచలో జపాన్ టెక్నాలజీతో థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రాన్ని నిర్మించారు. మూడో పంచవర్ష ప్రణాళికలో భాగంగా 1960వ దశకంలో దేశంలో థర్మల్ పవర్ స్టేషన్ల నిర్మాణం ఊపందుకుంది. 1966–67లో ప్రస్తుత భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణానికి అడుగులు పడ్డాయి. ఎత్తయిన కూలింగ్ టవర్ నిర్మాణాల్లో పని చేసేందుకు స్థానికులు భయపడటంతో ఆఫ్రికా నుంచి కూలీలను రప్పించారు. అయినా కూలీలు సరిపోక ఒడిశాలోని పారదీప్ నుంచి తెప్పించారు.

కేటీపీఎస్ ప్రారంభంతో క్యూ కట్టిన కర్మాగారాలు

కేటీపీఎస్ ప్రారంభమయ్యాక 1970వ దశకంలో పాల్వంచలో ఏపీ స్టీల్స్, నవభారత్ ఫెర్రో ఎల్లాయిస్, స్పాంజ్ ఐరన్ కర్మాగారం, బేరియం కెమికల్స్, భద్రాచలం పేపర్ బోర్డు లిమిటెడ్ , ఏపీ రేయాన్స్ (మంగపేట, ములుగు జిల్లా), మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్ వంటి పరిశ్రమలు చకచకా ఏర్పాటయ్యాయి. సింగరేణి బొగ్గు గనుల్లోనూ యాంత్రీకరణ ఊపందుకుంది. 1980 దశకం వచ్చే సరికి హైదరాబాద్ నగర విద్యుత్ అవసరాలకు కేటీపీఎస్ ప్లాంటే ప్రధానమైంది.

తుక్కుకు రూ. 485 కోట్లు

→ పాల్వంచ కేటీపీఎస్‌లోని ఏ, బీ, సీ స్టేషన్లలో విద్యుదుత్పత్తి ఆపేయడంతో ప్లాంట్ నిర్మాణంలో ఉపయోగించిన టర్బాయిన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, కన్వేయర్ బెల్టులు, ఇతర యంత్ర సామగ్రిని తుక్కు కింద అమ్మేయాలని జెన్‌కో నిర్ణయించింది. ఈ విషయాన్ని కేంద్ర సంస్థ అయిన మెటల్ స్క్రాప్ ట్రేడ్ కార్పొరేషన్ (ఎంఎస్‌టీసీ)కు సమాచారం ఇవ్వగా టెండర్లను ఆహ్వానించింది. ముంబైకి చెందిన హెచ్ఆర్ కమర్షియల్స్ సంస్థ రూ. 485 కోట్లు చెల్లించేందుకు ముందుకొచ్చింది. ఇందుకుగాను రూ. 144 కోట్లను అడ్వాన్స్‌గా చెల్లించి 2023 జనవరిలో పనులు మొదలు పెట్టింది. తాజాగా కూలింగ్ టవర్ల కూల్చివేతతో ఈ ప్రక్రియ చివరి దశకు చేరింది. కూల్చివేత శిథిలాల తొలగింపుతో కేటీపీఎస్ ఏ, బీ, సీ ప్లాంట్లకు సంబంధించి మొత్తంగా 403 ఎకరాల స్థలం అందుబాటులోకి రానుంది. కేటీపీఎస్ విస్తరణకు దీన్ని ఉపయోగించే అవకాశం ఉంది. మరోవైపు థర్మల్ విద్యుత్ ఉత్పత్తిలో దూసుకుపోతున్న సింగరేణి సంస్థ కూడా ఇక్కడ ప్లాంట్ స్థాపనకు ఆసక్తి చూపిస్తోంది.

క్లుప్తంగా...

రుణమాఫీ కాని రైతులు వివరాలివ్వండి

- 8374852619 నంబర్‌కు వాట్సాప్ చేయండి..
- చర్చించి ప్రభుత్వాన్ని నిలదీద్దాం: మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రుణమాఫీ కాని రైతులకు తాము అండగా ఉంటామని బీఆర్ఎస్ ప్రకటించింది. రూ.లక్ష, రూ.లక్షన్నర లోపు కానీ బ్యాంకులో రుణం తీసుకొని, రుణ మాఫీ జరగకపోతే 8374852619 వాట్సాప్ నంబర్‌కి వివరాలు పంపాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సూచించారు. ఇందుకోసం తెలంగాణ భవన్‌లో ఇద్దరిని ఈ సమస్య మీదనే నియమించినట్లు ఆయన తెలిపారు. పట్టాదార్ పాస్ పుస్తకం కలిగి, అదే పాస్ బుక్ మీద రుణం పొంది ఉండి, లక్ష కానీ, లక్షన్నరలోపు కానీ రుణ మాఫీ కాకపోతే తెలంగాణభవన్‌కు ఆ వివ రాలు పంపొచ్చని తెలిపారు. రుణాన్ని ఏ సర్వే నంబర్ మీద పొందారో, ఏ గ్రామం, ఏ బ్యాంకు నుంచి రుణం తీసుకున్నారో ఆ వివరాలను వాట్సాప్ చేయాలని సూచించారు. ఎందుకు రుణమాఫీ కాలేదో, అధికారులు ఏమంటున్నారో దానికి సంబంధించిన రిమార్క్స్ కూడా రాయాలని సూచించారు. ఈ వివరాల న్నింటినీ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించి చర్చ కు పెడతామన్నారు. దానిపై ప్రభుత్వం ఏం చెబుతుందో ఆ వివరాలను సమాజానికి చెబుతామన్నారు.

ఎగ్గొట్టిన రుణమాఫీపై హెల్ప్‌లైన్లు పెట్టండి

పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు



సాక్షి, హైదరాబాద్: పదేళ్లలో రైతులకు ఎగ్గొట్టిన రుణమాఫీపై తెలంగాణ భవన్‌లో హెల్ప్ లైన్లు పెడితే బాగుంటుందని పెద్దపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే సీహెచ్ విజయ రమణారావు అభి ప్రాయపడ్డారు. అసెంబ్లీలోని సీఎల్పీలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో మాత్రమే సంపూర్ణ రుణ మాఫీ జరిగిందని, రుణమాఫీ వల్ల రైతులు సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఉమ్మడి కరీంనగర్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని, మల్లన్నసాగర్ కోసం మామ, అల్లుడు కరీంనగర్ పొట్టకొట్టారని విజయరమణారావు ఆరోపించారు.

'కేసీఆర్‌పై నమ్మకం లేకనే ఎమ్మెల్యేలు వీడుతున్నారు'



సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ మీద నమ్మకం లేకనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆ పార్టీని వీడుతున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ వ్యాఖ్యానించారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్, కేసీఆర్ కాపాడుకోలేక పోతున్న నాయకులను తప్పని పరిస్థితుల్లో కాంగ్రెస్ తీసుకుంటోందని చెప్పారు. కాంగ్రెస్‌లో చేరకుండా ఎమ్మెల్యేలను ఆపడానికి చేస్తున్న ప్రయత్నం చూస్తుంటే నవ్వొస్తుందని అద్దంకి ఎద్దేవాచేశారు. పార్టీ ఫిరాయింపులనేవి కేవలం తెలంగాణలోనే కాదు దేశంలోనే ఒక తంతుగా మారిందని చెప్పారు. టీడీఎల్పీని, సీఎల్పీని బీఆర్ఎస్‌లో విలీనం చేసుకున్నప్పుడు కేటీ ఆర్, కేసీఆర్‌లకు సిగ్గుగా అనిపించలేదా? అని ప్రశ్నించారు.

శాంతిభద్రతలు అడుగంటాయి: శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో శాంతి భద్రతలు అడుగంటాయని, ప్రజలు భయం గుప్పిట్లో బతుకుతున్నా రని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్ హయాంలో మహిళలకు సురక్షిత ప్రాంతంగా తెలంగాణ ఉండేదని, శాంతి భద్రతల విషయంలో దేశంలోనే రాష్ట్రం ఆదర్శంగా ఉండేదని అన్నారు. ఏడు నెలల కాంగ్రెస్ పాలనలో శాంతిభద్రతల పరిస్థితి పూర్తిగా మారిపోయిందని, షాద్ నగర్‌లో దళిత మహిళను పోలీసులు హింసించిన తీరు చాలా దారుణమన్నారు. శాంతి భద్రతలపై దృష్టి పెట్టకుండా ప్రభు త్వం సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వారిని వేధిస్తోందని ఎద్దేవా చేశారు. తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ కోల్పోక ముందే శాంతి భద్రతల విషయంలో ప్రభుత్వం కళ్లు తెరవాలన్నారు.

పెట్టుబడులతో రావాలి

ప్రవాసులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు

- తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి
- మీరు పెట్టే ప్రతి పెట్టుబడికి తగిన ప్రతిఫలం ఉంటుంది
- న్యూజెర్సీలో ప్రవాసులతో ముఖ్యమంత్రి ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఆయువు పట్టుగా ఉన్న తెలుగు రాష్ట్రాల ప్రవాసులు ఇకపై తెలంగాణకు అత్యధిక పెట్టుబడులతో రావాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. 'తెలంగాణ మీ జన్మభూమి. దేశంలో మీరు పెట్టే ప్రతి పెట్టుబడికి ప్రయోజనంతో పాటు మంచి ప్రతిఫలం కూడా ఉంటుంది. నైపుణ్యాలు, ప్రతిభా పాటవాలతో అమెరికాను సంపన్నంగా, పటిష్టంగా మార్చిన ప్రవాసులు తెలంగాణలో సేవలు అందించాలి. తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములైతే సంతృప్తి బోనస్‌గా లభిస్తుంది. కాంగ్రెస్ పాలనలో అపోహలు, ఆందోళనలకు తావు లేదు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని వేగంగా ఆర్థికాభివృద్ధిని సాధించేందుకు కొత్త పారిశ్రామిక విధానం తీసుకువస్తాం. నిధుల సమీకరణతో పాటు ఎక్కువ మందికి మేలు జరిగేలా ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధికి కొత్త పాలసీలో ప్రాధాన్యత నిస్తాం. తెలంగాణను మెట్రో కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్ క్లస్టర్లుగా విభజించి పెట్టుబడుల కోసం ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేస్తాం. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తరహాలో నాలుగో నగరం 'ఫ్యూచర్ సిటీ'ని అభివృద్ధి చేస్తాం. హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా అభివృద్ధి చేసేందుకు పోటీ పడతాం. ప్రపంచ స్థాయి మాస్టర్ ప్లాన్‌తో హైదరాబాద్‌ను అత్యున్నత స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రవాసులు కలిసి రావాలి..' అని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అమెరికా పర్యటనలో భాగంగా న్యూజెర్సీలో ప్రవాస భారతీయులతో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు.

అపోహలు సృష్టించేవారికి బుద్ధి చెబుతాం..

'ఎన్నికల ముందు కాంగ్రెస్ అంటే గిట్టని వాళ్లు విష ప్రచారం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాదని, వచ్చినా కొనసాగదని అన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక.. రాష్ట్రంలో అభివృద్ధి మందగిస్తోందంటూ అపోహలు కల్పిస్తున్నారు. వాళ్లకు తగిన బుద్ధి చెప్పడంతో పాటు వారివి అబద్ధాలని నిరూపిస్తాం. గత ఏడాది టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో అమెరికాలో పర్యటించినప్పుడు.. తెలంగాణలో పదేళ్లుగా సాగుతున్న దుష్పరిపాలన, విధ్వంసాలకు విముక్తి కల్పిస్తానని మాట ఇచ్చా. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వస్తాననే మాట మేరకు మళ్లీ వచ్చా. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుంటుంది. హామీల అమల్లో భాగంగా ఇప్పటికే రైతులు, మహిళలు, యువకుల సంక్షేమం, అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టాం. భవిష్యత్తు ప్రణాళికలతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళుతుంది..' అని సీఎం చెప్పారు.

సీఎంకు ఓవర్‌సీస్ కాంగ్రెస్ స్వాగతం

అమెరికాలో ముఖ్యమంత్రికి ఓవర్‌సీస్ కాంగ్రెస్ పార్టీ అమెరికా విభాగం అధ్యక్షుడు మొహిందర్ సింగ్ గిల్జియాన్ నేతృత్వంలో వేలాది మంది ప్రవాసులు స్వాగతం పలికారు. సీఎంగా రేవంత్‌రెడ్డి పనితీరును అభినందించడంతో పాటు తెలంగాణలో పెట్టుబడుల కోసం సహకరిస్తామని హామీ ఇచ్చారు. రేవంత్‌ను సీఎంగా చూడాలనే కోరిక తీరిందని, రాహుల్ గాంధీని భారత ప్రధానిగా చేసేందుకు అందరం కష్టపడదామని మొహిందర్ సింగ్ అన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు తెలంగాణ సంస్కృతిని చాటేలా పాటలు పాడటంతో పాటు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. కాగా అమెరికాలోని ఈస్ట్ కోస్ట్ ఇండియన్ కమ్యూనిటీకి చెందిన పలువురు ముఖ్యులతోనూ సీఎం సమావేశమయ్యారు.

స్కిల్స్ వర్సిటీ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా



→ 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణ' చైర్మన్‌గా ప్రముఖ పారిశ్రామికవేత్త, పద్మభూషణ్ ఆనంద్ మహీంద్ర వ్యవహరిస్తారు. ఈ మేరకు ఆనంద్ మహీంద్రా అంగీకారం తెలిపినట్లు న్యూజెర్సీలో జరి గిన ఒక కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. త్వరలోనే ఆయన బాధ్యతలు స్వీకరిస్తారని చెప్పారు. తెలంగాణ యువతను ప్రపంచంలోనే ఉత్తమ నైపుణ్యం కలిగిన మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు ఏర్పాటు చేసిన స్కిల్స్ యూనివర్సిటీకి అంతర్జాతీయంగా పేరున్న ప్రముఖుడిని చైర్మన్‌గా నియమిస్తామని సీఎం అసెంబ్లీ వేదికగా ప్రకటించిన సంగతి విదితమే. కాగా ఇటీవల ఆనంద్ మహీంద్రాతో ఈ విషయమై రేవంత్ చర్చించారు. రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల కేంద్రంగా అభివృద్ధి చేయనున్న 'ఫ్యూచర్ సిటీ' పరిధిలోని బ్యాగరికంచె వద్ద స్కిల్స్ యూనివర్సిటీ భవనానికి సీఎం ఇటీవల శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే.

సర్కారుకు నీళ్లు నింపాలనే సోయి లేదు

- యాసంగి, రబీ పంటలకు నీళ్లు ఇవ్వలేకపోయారు
- ఢిల్లీలో మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, గంగుల, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి


మీడియాతో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి. చిత్రంలో గంగుల, కొత్త ప్రభాకర్ రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: పంటల సమయానికి రిజర్వాయర్లు నింపి రైతులకు నీళ్లు ఇవ్వాలనే సోయి ఈ ప్రభుత్వానికి లేకపోవడం సిగ్గుచేటని మాజీ మంత్రులు జి.జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం యాసంగి సమయానికి 3.75లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది యాసంగి, రబీ పంటలకు కేవలం 1.25లక్షల ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇచ్చి రైతుల నోట్లో మట్టి కొట్టిందని ఆరోపించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఈ ముగ్గురూ మీడియాతో మాట్లాడారు. పరిపాలనను పక్కపెట్టి దాడులు, కేసులపైనే దృష్టిసారించారని జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. యాసంగిలోనే కాళేశ్వరం నుంచి 20–30 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ అలా ఇవ్వకుండా రైతాంగానికి ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. వ్యవ సాయాన్ని ఏ విధంగా కాపాడుకోవాలనే సోయి మంత్రులకు లేని కారణంగా ఇరిగేషన్ రంగంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

రైతుల నోట్లో మట్టి కొడుతోన్న ప్రభుత్వం

కన్నెపల్లి బరాజ్‌లో నీళ్లు లిఫ్ట్ చేస్తే ప్రభుత్వానికి వచ్చిన సమస్య ఏమిటని గంగుల కమలాకర్ ప్రశ్నించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సాకు చూపుతూ నీటిని లిఫ్ట్ చేయడం లేదని మండిపడ్డారు. కన్నెపల్లి పంప్ ఆన్ చేసి మిడ్ మానేరు నింపాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాలు రైతులకు ఉరితాళ్లుగా మారాయని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల పొలాల్లో నాట్లు పడక ఎండిపోతుంటే... సీఎం, మంత్రులు విదేశీ పర్యటనల్లో ఉన్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు తప్పవు

- పార్టీ ఫిరాయింపులపై త్వరలో సుప్రీంకోర్టులో పిటిషన్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడి
- పార్టీ నేతలతో కలిసి ఢిల్లీలో న్యాయవాదులతో భేటీ


ఢిల్లీలో న్యాయవాదులతో సమావేశమైన కేటీఆర్, హరీశ్, జగదీశ్ రెడ్డి, గంగుల, వద్దిరాజు రవిచంద్ర, కొత్త ప్రభాకర్ రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ కొద్దిరోజుల్లో సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు తెలిపారు. ఆ తర్వాత నెల రోజుల్లో అనర్హతపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని అన్నారు. అనంతరం ఫిరాయింపులకు పాల్పడిన పది మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు తప్పవని స్పష్టం చేశారు. కేటీఆర్ సోమవారం ఢిల్లీలో ప్రముఖ న్యాయవాదులు సి.ఆర్యమా సుందరం, మోహిత్‌రావులతో సమావేశమ య్యారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్వర్ రెడ్డి, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. రాష్ట్రంలో ఇటీవల పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించడంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా న్యాయ నిపుణులకు అవసరమైన ఆధారాలు, ఇతర సమాచారం నేతలు అందజేశారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

అధికారం కోసం ఫిరాయింపులు

న్యాయ కోవిదులు, రాజ్యాంగ నిపుణుల సలహాలు, సూచనల మేరకు ఫిరాయింపులపై న్యాయ పోరాటం కొనసాగిస్తామని కేటీఆర్ చెప్పారు. కారు గుర్తుపై ఇటీవల ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్యేలు అధికారం కోసం కాంగ్రెస్‌లో చేరారని అన్నారు. దీనిపై ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించామని తెలిపారు. హైకోర్టులో విచారణ జాప్యం అవుతుండటంతో సుప్రీంను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నట్లు చెప్పారు. ఆయా నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరగడం ఖాయమని, ఆ పది మంది ఎమ్మెల్యేలకు ప్రజలే గుణపాఠం చెబుతా రని పేర్కొన్నారు. మరోవైపు జాతీయ స్థాయిలో ఫిరా యింపులకు పాల్పడుతున్న ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ పార్టీ సుద్ద పూస ముచ్చట్లు చెబుతోందని కేటీ ఆర్ విమర్శించారు. ఇతర రాష్ట్రాల్లో ఫిరాయింపులు జరిగినప్పుడు రాజ్యాంగాన్ని పరిరక్షించాలని మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలకు.. తెలంగాణ విషయంలో రాజ్యాంగం గుర్తుకు రావట్లేదా? అని ప్రశ్నించారు.

స్పీకర్ ఎక్కువ రోజులు నాన్చలేరు!

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల విషయంలో నిర్ణయం తీసుకోకుండా స్పీకర్ ఎక్కువ రోజులు నాన్చ లేరని కేటీఆర్ బృందానికి ఆర్యమా సుందరం తెలి పినట్లు సమాచారం. ఈ మేరకు సుప్రీంకోర్టు పలు తీర్పులు ఇచ్చిందని ఆయన చెప్పినట్లు తెలిసింది. ఈ విషయంపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నందున హైకోర్టు సైతం ఎక్కువ కాలం వాయిదా వేసే అవకాశం లేదని పేర్కొన్నట్లు నేతలు చెప్పారు. కాగా ముగ్గురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు కోసం హైకోర్టులో పిటిషన్ వేయడం, పార్టీ మారిన మరికొందరు ఎమ్మెల్యేలపై స్పీకర్‌కు ఫిర్యాదు చేయడం సంబంధిత పరిణామాలను న్యాయవాదులకు బీఆర్ఎస్ నేతలు వివరించారు.

నేడు కవితను కలవనున్న కేటీఆర్, హరీశ్

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ తీహార్ జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవితను మంగళవారం కేటీఆర్, హరీశ్‌రావు పరామర్శించనున్నారు. మరికొందరు పార్టీ నేతలు కూడా వారి వెంట వెళ్లనున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురైన కవిత ప్రస్తుతం కోలుకున్నారు. కాగా కవితతో ములాఖత్ అనంతరం, ఆమె బెయిలు పిటిషన్లపై న్యాయ నిపుణులతో నేతలు భేటీ కానున్నట్లు తెలుస్తోంది. ఈడీ, సీబీఐలు బెయిలు విషయంలో వ్యవహరిస్తున్న తీరు, దాదాపు 150కి రోజులకు పైగా కవిత జైల్లో ఉంటున్న విషయంపై చర్చించనున్నారు. మరోవైపు సీబీఐ కేసులో కవిత డిఫాల్ట్ బెయిలుపై విచారణను రౌజ్ అవెన్యూ కోర్టు బుధవారానికి వాయిదా వేసింది.


తాండూరు పట్టణంలోని ముర్షద్ దర్గా వద్ద అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి. చిత్రంలో మనోహర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి తదితరులు

నూతన రెవెన్యూ చట్టాన్ని తీసుకొస్తాం

- ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తాం
- ఎల్ఆర్ఎస్ పెండింగ్ సమస్యలను మూడు నెలల్లో తీరుస్తాం
- రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దే
- స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటి

తాండూరు టౌన్: ధరణి స్థానంలో నూతన రెవెన్యూ చట్టాన్ని తీసుకువస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పునరుద్ఘాటించారు. వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సోమవారం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. అధికారంలోకి రాక ముందు ధరణి వెబ్‌సైట్‌ను బంగాళాఖాతంలో కలుపుతామని ప్రజలకు హామీ ఇచ్చిన హామీని నెరవేరుస్తామని, దీని స్థానంలో దేశంలోనే రోల్ మోడల్‌గా నిలిచే నూతన రెవెన్యూ చట్టాన్ని తీసుకువస్తామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న 25 లక్షల ఎల్ఆర్ఎస్ అప్లికేషన్ల సమస్యను రానున్న 3నెలల్లో పరిష్కరిస్తామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పేరుతో భూములను దొరలకు ధారాదత్తం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 15 రోజుల్లో కూలిపోతుందని, అభివృద్ధి చేతకాదని బీఆర్ఎస్ నాయకులు అవాకులు చెవాకులు పేలారనీ, కానీ పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని రైతు రుణమాఫీని, తాము అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే చేసి చూపించామని చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తెలంగాణ వ్యాప్తంగా 18 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించామని, బీఆర్ఎస్ పదేళ్లలో ఎంతమందికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చిందో లెక్క చెప్పాలని పొంగులేటి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాభివృద్ధిని తుంగలో తొక్కిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు విడ్డూరమన్నారు. గత ప్రభుత్వ ప్రభుత్వ పాలనలో ఆర్థిక చేయూత దక్కకపోవ డంతోనే రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు.

ప్రతి నెలా రూ.7 వేల కోట్ల మిత్తీ..

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. గత పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన రూ.7 లక్షల కోట్ల అప్పులకు ప్రతినెలా రూ.7 వేల కోట్ల మిత్తీ కడుతున్నామని తెలిపారు. అప్పట్లో తమ నియోజకవర్గాల్లో ఎలాంటి అభివృద్ధి చేయా లన్నా మంత్రులు సైతం స్వతహాగా నిర్ణయాలు తీసుకునే వారు కాదని ఎద్దేవా చేశారు. అన్నీ కేసీఆర్‌కు చెప్పే చేయాలనే ఆంక్షలు ఉండేవ న్నారు. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో అలాంటి ఆంక్షలేమీ లేవన్నారు. కేసీఆర్ పాలనలో ఆర్థిక, భూ, లిక్కర్, ఇసుక విధ్వంసం జరిగిందన్నారు.

కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి..

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ ఇంట్లో కూర్చుని మాట్లాడటం కాదని, ఒక ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని సూచించారు. రైతు రుణమాఫీ చరిత్రలో నిలిచిపోయే అంశమన్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడి రాష్ట్రంలో పలు రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, నాయకులు రమేష్ మహరాజ్, ధారాసింగ్, కల్వ సుజాత పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌కు కోర్టు సమన్లు

- మాజీ మంత్రి హరీశ్‌తోపాటు కొందరు అధికారులు, నిర్మాణ సంస్థలకు కూడా..
- సెప్టెంబర్ 5న భూపాలపల్లి కోర్టుకు హాజరు కావాలని ఆదేశం
- 'కాళేశ్వరం' నిర్మాణంలో అవినీతి జరిగిందన్న ఆరోపణలపై దాఖలైన పిటిషన్


కాళేశ్వరం: మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రిన్సిపల్ సివిల్ సెషన్స్ కోర్టు సమన్లు జారీ చేసింది. సెప్టెంబర్ 5న కోర్టుకు హాజరుకావాలని పేర్కొంది. బీఆర్ఎస్ హయాంలో నిర్మితమైన కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌లు, పంపుహౌస్‌ల నిర్మాణాల్లో అవినీతి జరిగిందని, అంచనా వ్యయాన్ని పెంచి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన నాగేపల్లి రాజలింగమూర్తి అనే సామాజిక కార్యకర్త వేసిన రివిజన్ పిటిషన్‌ను పరిశీలించిన కోర్టు... కేసీఆర్‌తోపాటు మాజీ మంత్రి హరీశ్ రావు, అప్పటి ఇరిగేషన్ శాఖ సెక్రటరీ రజత్ కుమార్, అప్పటి సీఎంవో స్మితా సబర్వాల్, అప్పటి చీఫ్ ఇంజనీర్ హరిరామ్, బరాజ్, పంపుహౌస్‌ల నిర్మాణ సంస్థలైన ఎల్ అండ్ టీ (సురేష్), మేఘా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (కృష్ణారెడ్డి) అధినేతలకు సమన్లు జారీ చేసింది. గతేడాది అక్టోబర్ 21న మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్ 7వ బ్లాక్‌లోని 19, 20, 21వ పియర్‌లతోపాటు వంతెన కుంగడం తెలిసిందే. అలాగే 2022 జూలై 14న లక్ష్మీ పంపుహౌస్ వరదలతో నీటమునిగింది. దీంతో గత ప్రభుత్వ పాలకుల అవినీతి వల్ల ప్రాజెక్టులో నాణ్యతా ప్రమాణాలు లోపించాయని పిటిషనర్ ఆరోపించాడు. దీనిపై స్పందించిన కోర్టు సంబంధిత వ్యక్తులకు సమన్లు జారీ చేసింది.

నేడు బీజేపీ రాష్ట్ర పదాధికారుల భేటీ

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలకు ఏ విధమైన కార్యాచరణతో ముందుకెళ్లాలనే అంశంపై బీజేపీ రాష్ట్ర నాయకత్వం దృష్టి సారించింది. మరో 3, 4 నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగవచ్చనే అంచనాల నేపథ్యంలో.. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో స్థానిక ప్రజా ప్రతినిధులను గెలిపించుకునేందుకు అవసరమైన వ్యూహాలు రూపొందించాలని ఆ పార్టీ భావిస్తోంది. ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు 'హర్ ఘర్ తిరంగా'కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటిపై జాతీయపతాకాన్ని ఎగురవేసేందుకు చేపట్టాల్సిన ప్రణాళికపై దృష్టిపెట్టింది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు పార్టీ కార్యాలయంలో కేంద్రమంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరగ నున్న రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఈ అంశాలపై చర్చించనున్నట్టు సమాచారం.

ఎన్నికలు అనగానే.. ప్రజలకు డబ్బుపై ఆశ

మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



చౌటుప్పల్: ఎన్నికలు వస్తే ఎక్కడాలేని విధంగా అందరికీ పండుగ వస్తుందని, ఎన్నికలు అనగానే ప్రజలకు డబ్బులపై ఆశ వస్తుందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సరదాగా వ్యాఖ్యానించారు. చౌటుప్పల్‌లో సోమవారం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో డబ్బు ఖర్చు అధికంగా ఉందని, 2022 ఉపఎన్నిక తర్వాత నుంచి ఆ పరిస్థితి వచ్చిందన్నారు. వచ్చే ఎన్నికల్లో మాత్రం తాను డబ్బులు ఇవ్వనని, ఐదేళ్లు అభివృద్ధి చేస్తున్నందున ప్రజలే ఖర్చులు భరించి తనను గెలిపించాలని కోరారు.

గుడుంబా పోయి... గంజాయి గుప్పుమంది!

- ధూల్‌పేటలో గుడుంబా నిర్మూలనకు 2016లో కార్యాచరణ
- గుడుంబా కేసుల్లో ఉన్న కుటుంబాలకు పునరావాస పథకం అమలు
- గంజాయి కేసుల్లో నిందితులకు దక్కని అవకాశం
- 5 కుటుంబాల నుంచి 150 కుటుంబాలకు విస్తరించిన దందా
- నగరంలోని ఇతర ప్రాంతాలకు వ్యాప్తి.. స్కూళ్లు, కాలేజీల్లోనూ మహమ్మారి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న ధూల్‌పేటలో దశాబ్దాల పాటు కొనసాగిన గుడుంబా దందాను నిర్మూలించేందుకు ఎక్సైజ్–పోలీసు శాఖలు చేపట్టిన 'ఆపరేషన్ ధూల్‌పేట' సత్ఫలితాన్నే ఇచ్చినా..ఇందుకోసం చేపట్టిన పునరావాస పథకంలో ఉన్న లోపం గంజాయి విస్తరించడానికి కారణమైంది. ఒకప్పుడు కేవలం ఐదు కుటుంబాలకు పరిమితమైన గంజాయి దందా ఇప్పుడు దాదాపు 150 కుటుంబాలకు విస్తరించింది. ధూల్‌పేట ప్రాంతం గణేష్, దుర్గామాత విగ్రహాల తయారీకి ప్రసిద్ధి. ఈ విగ్రహాల తయారీదారులకు ఆయా సీజన్లలో మాత్రమే పని ఉండేది. దీంతో అనేక కుటుంబాలు మిగతా సమయంలో గుడుంబా తయారు చేసి విక్రయించడం మొదలుపెట్టాయి. కొన్నేళ్ల క్రితం వరకు ఇక్కడ తయారయ్యే గుడుంబా నగరంతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకూ అక్రమ రవాణా అయ్యేది. క్రమంగా ఇది మరింత విస్తృ



తమైంది. ఈ దందా చేస్తున్న వారిని పట్టుకోవడానికి పోలీసు, ఎక్సైజ్ అధికారులు ప్రయత్నిస్తే స్థానికులు వారిపై దాడులకు సైతం పాల్పడేవారు. వీరికి కొందరు అవినీతి అధికారుల సహకారం తోడవటంతో ధూల్‌పేట కేంద్రంగా గుడుంబా దందా కొన్నేళ్ల పాటు కొనసాగింది. ఎన్ని కేసులు పెట్టినా, ఎందరిని అరెస్టు చేసినా, పలువురిపై పీడీ యాక్టులు ప్రయోగించినా పోలీసులు అక్కడి పరిస్థితిని మార్చలేకపోయారు.

'పునరావాసం' అందకపోవడంతో..



ధూల్‌పేటను ఎలాగైనా గుడుంబా రహిత ప్రాంతంగా చేయాలని 2016లో నాటి ప్రభుత్వం భావించింది. ఈ వృత్తిలో ఉన్న వారికి పునరావాసం కల్పించడానికి సిద్ధమైంది. ఈ పథకం చాలామందికి లబ్ధి చేకూర్చింది. అయితే ఈ పథకంలో ఉన్న కొన్ని లోపాలను అప్పటి అధికారులు గుర్తించలేదు. పునరావాస పథకం కింద లబ్ధి పొందాలంటే కచ్చితంగా గుడుంబా కేసుల్లో నిందితులుగా ఉండాలన్నది ఓ నిబంధన. దీంతో ఆ ప్రాంతంలో ఏళ్లుగా గంజాయి దందా చేస్తున్న ఐదు కుటుంబాలకు పునరావాసం దక్కలేదు. దీంతో వీళ్లు తమ దందా కొనసాగించారు. మరోవైపు మాదకద్రవ్యాల చట్టం ప్రకారం కేజీ లోపు గంజాయి కలిగి ఉంటే అతడు వినియోగదారుడి కిందికి వస్తాడు. దీంతో ఈ మొత్తం గంజాయితో చిక్కిన వారిని అరెస్టు చేయని అధికారులు కేవలం నోటీసులతో సరిపుచ్చారు. దీన్ని మరికొందరు ఆసరాగా తీసుకున్నారు. మరోవైపు గంజాయికి డిమాండ్ పెరగడంతో ఏకంగా 150 కుటుంబాలు ఈ దందాలోకి దిగాయి.

వివిధ ప్రాంతాలకు విస్తరించిన దందా

ఆంధ్రప్రదేశ్‌లోని ఏజెన్సీ ప్రాంతం, ఆంధ్రా–ఒడిశా సరిహద్దు, ఒడిశా నుంచి వస్తున్న గంజాయి ధూల్‌పేటకు చేరుతోంది. 'ఆపరేషన్ ధూల్‌పేట' మొదలయ్యేటప్పటికే ఇక్కడ పగలు, రాత్రి తేడా లేకుండా గంజాయి దందా సాగేది. ఈ క్రమంలోనే కొందరు ఇక్కడి నుంచి నానక్‌రామ్‌గూడ, సీతాఫల్‌మండి, ఫతేనగర్, ఉప్పల్, కూకట్‌పల్లి తదితర చోట్లకు వలస వెళ్లి ఆయా ప్రాంతాల్లో దందా మొదలెట్టారు. వీరి ద్వారా రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు గంజాయి సరఫరా సాగుతోంది. అక్కడ ఉన్న పెడ్లర్స్ ఈ సరుకును చిన్న చిన్న పొట్లాలుగా ప్యాక్ చేసి విద్యార్థులకు విక్రయిస్తున్నారు. ఈ కారణంగానే పాఠశాలలు, కళాశాలల్లోకీ ఈ మహమ్మారి పాకిపోయింది. ఈ నేపథ్యంలోనే గాంజ ముక్త్ ధూల్‌పేట (గంజాయి రహిత ధూల్‌పేట) సాధించడం కోసం ఆపరేషన్ చేపట్టిన అధికారులు మిగిలిన ప్రాంతాల్లోనూ ఆ దందా లేకుండా చేయడంపై దృష్టి పెట్టారు.

క్లుప్తంగా...

నేడు అమెరికా పర్యటనకు మంత్రి కోమటిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంగళవారం అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. ఈనెల 7న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి ప్రవాస భారతీయ లీడర్లతో జరిగే మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. 12న ఓహియోలోని రాబిన్స్ టన్నెల్ బేరింగ్ మెషినరీ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ సీఈఓ లాక్ హోమ్‌తో భేటీ కానున్నారు. బేరింగ్ ఇతర రిపేర్లతో ఆలస్యం అవుతున్న ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ తవ్వకాన్ని వేగవంతం చేసేందుకు అధునాతన బేరింగ్ మెషినరీ సమకూర్చేందుకు ఈ సమావేశంలో కోమటిరెడ్డి పాల్గొననున్నారు.

దళిత మహిళపై ఇంత దాష్టీకమా ?

'ఎక్స్'లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: షాద్‌నగర్‌లో దళిత మహిళపై పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత హేయమని, బీఆర్‌ఎస్ ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. బాధ్యులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలని, బాధిత మహిళకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 'దళిత మహిళపై ఇంత దాష్టీకమా ? ఇదేనా ఇందిరమ్మపాలన? ఇదేనా ప్రజాపాలన ? దొంగతనం ఒప్పుకోవాలంటూ థర్డ్‌డిగ్రీ ప్రయోగిస్తారా? మహిళ అని కూడా చూడకుండా ఇంత అమానవీయంగా ప్రవర్తిస్తారా? సిగ్గుసిగ్గు.. కొడుకు ముందే చిత్రహింసలా? రక్షించాల్సిన పోలీసులతోనే రక్షణ లేని పరిస్థితా?. నిక్కర్ తొడిగి, బూటు కాళ్లతో తన్నటమా? ఈ రాష్ట్రంలో మహిళలంటే ఇంత చిన్నచూపా.. ఓవైపు మహిళలపై అత్యాచారాలు, అవమానాలు. మరోవైపు దాడులు, దాష్టీకాలు. ఆడబిడ్డల ఉసురు ఈ ప్రభుత్వానికి మంచిది కాదు అని' కేటీఆర్ వెల్లడించారు.

ఫీజు పేరుతో సర్టిఫికెట్లు ఇవ్వకపోతే గుర్తింపు రద్దు

ప్రైవేటు కాలేజీలకు ఉన్నత విద్యా మండలి హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయని విద్యార్థుల సర్టిఫికెట్ల జారీకి ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని రాష్ట్రంలో అన్ని ప్రైవేటు కాలేజీలను ఉన్నత విద్యా మండలి హెచ్చరించింది. ఈ మేరకు సోమవారం ఓ సర్క్యులర్ జారీ చేసింది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనల ప్రకారం విద్యార్థి విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వాలని పేర్కొంది. ఉద్దేశపూర్వకంగా సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని పలువురు విద్యార్థులు ఉన్నత విద్యా మండలి దృష్టికి తెచ్చారు. పై చదువులు, పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసే గడువు ముగిసే వరకూ కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో నష్టపోతున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు. వీటిని పరిగణనలోనికి తీసుకున్న మండలి... సర్టిఫికెట్లు ఇవ్వడానికి నిరాకరించిన కాలేజీలను బ్లాక్ లిస్టులో పెడతామని, కాలేజీ గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాని విద్యార్థులు పూర్తి ఫీజు చెల్లించాలని, రీయింబర్స్‌మెంట్ జరిగిన తర్వాత దాన్ని వాళ్లు తీసుకోవాలని ప్రైవేటు కాలేజీలు ఒత్తిడి చేస్తున్నాయి. ఫీజులు కట్టని విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వకుండా నిరాకరిస్తున్నాయి. ఇలాంటి సమస్యలపై మండలికి రోజూ ఫిర్యాదులు వస్తుండటంతో తాజా నిర్ణయం తీసుకుంది.

'డీఎస్సీ' మరింత ఆలస్యం?

▶ మొదటి పేజీ తరువాయి

ఇవ్వాలని విద్యాశాఖకు లేఖ రాయాలని అధికారులు నిర్ణయించారు.

ఎవరి వాదన వారిదే..

ఇప్పుడు జరిపే నియామకాల్లో వర్గీకరణ చేపట్టాలన్నది మాదిగ వర్గీయుల వాదన. అసెంబ్లీలో సీఎం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని వారు కోరుతున్నారు. అవసరమైతే నిబంధనలు మార్చాలంటున్నారు. ఇదే వాదనతో అధికారులు, ప్రభుత్వ నేతలను కలిసేందుకు సిద్ధమయ్యారు. మరోవైపు మాల సామాజికవర్గం భిన్న స్వరం వినిపిస్తోంది. తీర్పు రాకముందే ఇచ్చిన డీఎస్సీని వర్గీకరణ పేరుతో ఆపడం సరికాదని అభిప్రాయపడుతోంది. అలా చేస్తే న్యాయపోరాటంతోపాటు వీధి పోరాటాలు చేస్తామని హెచ్చరిస్తోంది. ఇంకోవైపు పరీక్ష రాసిన విద్యార్థుల్లోనూ ఆందోళన నెలకొంది. రూ. లక్షలు వెచ్చించి కోచింగ్ తీసుకున్నామని ఆవేదన చెందుతున్నారు.

ఆపితే ఆందోళన చేస్తాం



ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం తీర్పునకు ముందే ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. అలాంటప్పుడు ఇప్పుడెలా నియామకాలు ఆపుతారు? సీఎం ఒక కులాన్ని భుజానికెత్తుకోవడం మంచిదికాదు. ఇది మా మనోభావాలు దెబ్బతీసే అంశం. డీఎస్సీ నియామక ప్రక్రియ ఆపితే ఆందోళనలు చేస్తాం. ఇప్పటికే కోర్టులో రివ్యూ పిటిషన్ వేసేందుకు సిద్ధమవుతున్నాం.

– జి. చెన్నయ్య, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు

అమలు చేయాల్సిందే



ఎస్సీ, ఎస్టీ ఉప వర్గీకరణను అమలు చేస్తామని సీఎం అసెంబ్లీ సాక్షిగా చెప్పారు. డీఎస్సీ నియామకాల్లోనూ ఇది అమలు కావాల్సిందే. అవసరమైతే నిబంధనలు సవరించాలి. గతంలో కానిస్టేబుల్, ఎస్సై నియామకాల్లోనూ కటాఫ్ రిజర్వేషన్ల విధానంలో సవరణలు తెచ్చారు. ఇప్పుడు దీన్ని అనుసరించడంలో తప్పేం లేదు. దీని అమలు కోసం మేం ఎంత దూరమైనా వెళ్తాం.

– గోవింద్ నరేశ్ మాదిగ, ఎంఆర్‌పీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి



ఎస్సీ, ఎస్టీ ఉప వర్గీకరణ నేపథ్యంలో డీఎస్సీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. ఈ విషయంలో లక్షల మంది విద్యార్థుల మానసిక ఆందోళనను పరిగణనలోకి తీసుకోవాలి. టీచర్ల బదిలీలు, పదోన్నతుల తర్వాత మరిన్ని టీచర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. ప్రస్తుత డీఎస్సీపైనే సందేహాలుంటే కొత్త ఉద్యోగాల పరిస్థితి ఏంటనే ఆందోళన నిరుద్యోగుల్లో ఉంది.

– రావుల రామ్మోహన్‌రెడ్డి, డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

నాలుగేళ్లు ఎక్కడ చదివితే

అక్కడే లోకల్

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ విద్యలో స్థాని కేతర కోటా ప్రామాణికతను ఉన్నత విద్యా మండలి నిర్ధారించింది. విద్యార్థి 6 నుంచి ఇంటర్ వరకు చదివిన స్థానికతను లెక్కలోకి తీసు కుంటోంది. ఈ ఏడేళ్లలో నాలుగేళ్లు ఎక్కడ విద్యా భ్యాసం చేస్తే ఆ రాష్ట్రానికి చెందిన స్థానికుడిగానే పరిగణిస్తామని మండలి తెలిపింది. ఇంజనీరింగ్ ప్రవేశాల్లో 15 శాతం కోటాను స్థానికేతరులకు కేటాయిస్తారు. ఉదాహరణకు ఏపీకి చెందిన ఎస్వీ, నాగార్జున యూనివర్సిటీ విద్యార్థులను స్థానికేతరులుగా పరిగణిస్తారు. వీరిలో ఆరవ తరగతి నుంచి ఇంటర్ వరకు నాలుగేళ్లు ఎక్కడ చదివినా, అతని స్థానిక రాష్ట్రం అక్కడేనని నిర్ధారిస్తారు.

ముగిసిన డీఎస్సీ..

87.61 శాతం హాజరు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీజీ డీఎస్సీ) సోమవారంతో ముగిసింది. జూలై 18 నుంచి ఈ పరీక్ష మొదలైంది. డీఎస్సీ కోసం మొత్తం 2,79,957 మంది దరఖాస్తు చేసుకోగా.. 2,45,263 మంది పరీక్ష రాశారని, దీంతో పరీక్షకు హాజరైన వారి శాతం 87.61గా ఉన్నట్లు పాఠశాల విద్య డైరెక్టరేట్ తెలిపింది.

అన్ని వర్గాలకు ప్రోత్సాహం..

మా ప్రభుత్వ లక్ష్యం: భట్టి

మధిరలో ఇండస్ట్రియల్ పార్క్‌కు శంకుస్థాపన



ఇండస్ట్రియల్ పార్క్ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మధిర: వ్యవసాయం, విద్య, వైద్యం, పారిశ్రామిక తదితర రంగాల్లో అన్నివర్గాల వారికి ప్రోత్సాహం అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. ఖమ్మం జిల్లా మధిర మండలం యండపల్లి గుట్టల వద్ద ఇండస్ట్రియల్ పార్కు పనులకు జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, టీజీఐఐసీ లిమిటెడ్ చైర్‌పర్సన్ తూర్పు నిర్మలా జగ్గారెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ, యువత పరిశ్రమలు పెట్టేందుకు ముందుకు వస్తే రుణాలు, వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ఏటా రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఈ డబ్బు ఎక్కడ పెట్టుబడి పెట్టాలి, ఎలా సద్వినియోగం చేసుకోవాలనే ఆలోచన లేని వారి కోసం ప్రభుత్వమే పరిశ్రమలు, వ్యాపారానికి సంబంధించిన ప్రాజెక్టు రిపోర్టు, బ్యాంకు రుణాలు, మార్కెటింగ్ వసతులు కల్పిస్తుందని చెప్పారు. ఇందుకోసం ఇండస్ట్రియల్ పార్కులు నిర్మించడానికి ఈ కార్యక్రమంతో మధిర నియోజక వర్గంలో పునాది పడిందన్నారు. గ్రామాల్లో చదువుకున్న యువత పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారిస్తే ప్రభుత్వం అన్నిరకాలుగా ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉందని భట్టి చెప్పారు. కాగా, మధిరలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయ డం దశాబ్దాల కల అని, 55 ఎకరాల్లో నిర్మించనున్న ఈ పార్కుకు రూ.44 కోట్ల నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. ఇక్కడ తక్కువ ధరలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్లాట్లు కేటాయిస్తామని, ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు మహిళలకు రిజర్వేషన్లు అమలు చేస్తామని భట్టి తెలిపారు.

ఆరుగురిపై వేటు

- దళిత మహిళ సునీతపై పోలీసుల దాడి కేసు
- డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సహా ఐదుగురు కానిస్టేబుళ్ల సస్పెన్షన్
- బాధితురాలిని పరామర్శించిన బీఆర్‌ఎస్ నేతలు
- కాంగ్రెస్ హయాంలో అఘాయిత్యాలు పెరిగాయి: సబితారెడ్డి
- సునీతకు రూ.కోటి పరిహారం ఇవ్వాలి: ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



బాధితురాలికి ఆర్థిక సహాయం అందజేస్తున్న సబిత. చిత్రంలో వాణీదేవి, మంద జగన్నాథం, ప్రవీణ్‌కుమార్

షాద్‌నగర్: చోరీ కేసులో దళిత మహిళను పీఎస్‌కు పిలిపించి తీవ్రంగా కొట్టిన ఘటనపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ మహంతి కఠిన చర్యలు చేపట్టారు. ఇందుకు కారణమైన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రామిరెడ్డితో పాటు కానిస్టేబుళ్లు జాకీర్, అఖిల, మోహన్‌లాల్, కరుణాకర్, రాజును సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. షాద్‌నగర్‌లోని దళితవాడలో గత నెల 24న నాగేందర్ అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగిన విషయం తెలిసిందే. కేసు విషయంలో ఇదే కాలనీకి చెందిన సునీత, భీమయ్య దంపతులతో పాటు వీరి కుమారుడైన మైనర్‌ను పీఎస్‌కు పిలిపించి తీవ్రంగా కొట్టారు. ఈ ఘటనపై విపక్షాలు నిప్పులు చెరుగుతున్నాయి. ప్రధాన ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పోలీసుల తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీసులు ఉండరని, లాఠీ పోలీసులు మాత్రమే ఉంటారని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలను షాద్‌నగర్ పోలీసులు నిజం చేసి చూపించారని మాజీ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు సునీతను సోమవారం సబితారెడ్డి, ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, మాజీ ఎంపీ మంద జగన్నాథం, పట్టభద్రుల ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. మహిళ అని చూడకుండా పీఎస్‌కు తీసుకెళ్లి దాడి చేయడం దారుణమన్నారు. ఇందుకు కారణమైన వారిని వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

సీఎం అండ చూసుకునే..

సీఎం రేవంత్‌రెడ్డి అండ చూసుకునే రాష్ట్రంలో పోలీసులు రెచ్చిపోతున్నారని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. బాధితురాలు చెప్పిన మాటలు వింటే బాధ కలిగిందన్నారు. మహిళలపై గౌరవం లేకుండా ఇద్దరు మహిళా ప్రజాప్రతినిధులపై నోరు పారేసుకున్న సీఎం రేవంత్‌కు ఇలాంటి ఘటనలు సాధారణంగానే కనిపిస్తాయన్నారు. సాయంత్రం ఆరు దాటితే మహిళలు, ఆడ పిల్లలను పీఎస్‌లో విచారించవద్దన్న విషయం పోలీసులకు తెలియదా అని ప్రశ్నించారు. బాధిత మహిళకు రూ.కోటి పరిహారంతో పాటు, కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇప్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితురాలికి తక్షణ సాయం కింద ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి రూ.లక్ష అందజేశారు. ఈ మొత్తాన్ని సబిత చేతుల మీదుగా ఇప్పించారు.

రాజకీయాల కోసం..

కేసును పక్కదారి పట్టించొద్దు

మేమూ దళితులమే: బాధితుడు నాగేందర్



షాద్‌నగర్: స్వార్థ రాజకీయాల కోసం చోరీ కేసును పక్కదారి పట్టించొద్దని.. ఇంట్లో బంగారం చోరీకి గురైన బాధితుడు నాగేందర్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తన చెల్లి వివాహం కోసం ఇంట్లో దాచిన బంగారాన్ని తలుపులు ధ్వంసం చేసి ఎత్తుకెళ్లారని, ఈ విషయమై చోరీ జరిగిన రోజు సాయంత్రమే షాద్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. అయితే సునీత అనే మహిళ వారి ఇంటి ముందు గడపపై ఓ కవర్‌లో బంగారు వస్తువులను పెట్టిన విషయాన్ని తన సోదరి రేణుక చూసిందన్నారు. కవర్‌ను పరిశీలిస్తే అందులో కొన్ని నగలు మాత్రమే ఉన్నాయని, మిగితా ఆభరణాలు ఎక్కడున్నాయని ప్రశ్నిస్తే.. మల్లీశ్వరి అనే మహిళకు ఇచ్చి శ్రీరామ జ్యువెలరీలో తాకట్టు పెట్టినట్లు సునీత చెప్పిందన్నారు. ఈ విషయాన్ని తాము డీఐ రామిరెడ్డికి దృష్టికి తీసుకెళ్లగా పోలీసులు వారిని ప్రశ్నించినట్లు వివరించారు. విచారణలో భాగంగా పోలీసులు దళిత మహిళను కొట్టారని చెబుతూ పరామర్శలకు వచ్చిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తదితర నేతలకు తాము కూడా దళితులమేననే విషయం తెలియదా అని నాగేందర్ ప్రశ్నించారు. దళితులపై అంత ప్రేమ ఉంటే.. బంగారం పోగొట్టుకున్న తమను పరామర్శించేందుకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. రాజకీయాల కోసం దళితులను వాడుకోవడం సరికాదన్నారు. చోరీ కేసును పక్కదారి పట్టించొద్దని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కాగ్నిజెంట్ భారీ విస్తరణ

▶ మొదటి పేజీ తరువాయి

విస్తరణకు కాగ్నిజెంట్ ఈ నగరాన్ని ఎంచుకుంది. కాగా ఒప్పందం సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ఐటీ రంగానికి మరింత అనుకూలమైన వాతావరణం కల్పించేందుకు తమ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని చెప్పారు. కాగ్నిజెంట్ కొత్త సెంటర్ ఏర్పాటుతో ప్రపంచ టెక్నాలజీ కంపెనీలన్నీ హైదరాబాద్‌ను తమ ప్రధాన గమ్యస్థానంగా ఎంచుకుంటాయని అభిప్రాయపడ్డారు. కాగ్నిజెంట్‌కు తమ ప్రభుత్వం తగిన మద్దతు ఇస్తుందని ప్రకటించారు.

క్లయింట్లకు మెరుగైన సేవలు

కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్ మాట్లాడుతూ.. టెక్నాలజీ, ఇన్నోవేషన్ హబ్‌గా సత్తా చాటుకుంటున్న హైదరాబాద్‌లో తమ కంపెనీ విస్తరించటం సంతోషంగా ఉందని అన్నారు. హైదరాబాద్‌లో నెలకొల్పే కొత్త సెంటర్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ క్లయింట్లకు మెరుగైన సేవలందించేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. ఐటీ సేవలతో పాటు కన్సల్టింగ్‌లో అత్యాధునిక పరిష్కారాలను అందిస్తామని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజనీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్ సహా వివిధ అధునాతన సాంకేతికతలపై కొత్త కేంద్రం ప్రత్యేకంగా దృష్టి సారిస్తుందని తెలిపారు. కాగా హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని ఇతర టైర్–2 నగరాలలో కూడా ఐటీ సేవలను విస్తరించాలని ముఖ్యమంత్రి చేసిన సూచనపై కంపెనీ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే ప్రముఖ టెక్ కంపెనీలన్నీ హైదరాబాద్ వైపు చూస్తున్నాయని, ఇక్కడ కొత్త కేంద్రాన్ని స్థాపించాలనే కాగ్నిజెంట్ నిర్ణయం హైదరాబాద్ అభివృద్ధికి దోహదపడుతుందని శ్రీధర్‌బాబు అభిప్రాయపడ్డారు.

వీ హబ్‌కు రూ.42 కోట్ల పెట్టుబడి: వీ హబ్‌లో రూ.42 కోట్ల పెట్టుబడులకు వాల్ష్ కర్రా హోల్డింగ్స్ ఒప్పందం కుదుర్చుకుంది. కంపెనీకి చెందిన ఫణి కర్రా, గ్రెగ్ వాల్ష్, వీ హబ్ సీఈవో సీతా ఒప్పందంపై సంతకాలు చేశారు. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో ఈ ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా వాల్ష్ కర్రా ప్రతినిధులను సీఎం అభినందించారు. కాగా వాల్ష్ కర్రా రాబోయే ఐదేళ్లలో స్టార్టప్‌లలో మరో రూ.839 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. వాల్ష్ కర్రా హోల్డింగ్స్ కంపెనీ అమెరికా, సింగపూర్ నుంచి పని చేస్తుంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సహకారంతో పెట్టుబడిదారులు గ్రెగ్‌వాల్ష్, ఫణి కర్రా దీన్ని నిర్వహిస్తున్నారు. రాబోయే శతాబ్దానికి సుస్థిరమైన ఆర్థిక వ్యవస్థను రూపొందించేందుకు అవసరమైన పెట్టుబడి అవకాశాలను అభివృద్ధి చేయాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది.

'డ్రిప్'తో పెద్దవాగు పునరుద్ధరణ

- కాల్వల కోసం క్యాడ్‌కమ్ సహాయం తీసుకోండి
- తెలుగు రాష్ట్రాలకు గోదావరిబోర్డు చైర్మన్ ఎంకే.సిన్హా సూచన



సాక్షి, హైదరాబాద్: ఇటీవల వరదల్లో తీవ్రంగా దెబ్బతిన్న పెద్దవాగు ప్రాజెక్టు పునరుద్ధరణకు డ్యామ్ రిహాబిలిటేషన్ ఇంప్లిమెంటేషన్ ప్రాజెక్టు(డ్రిప్) సహాయం తీసుకోవాలని గోదావరి నది యాజమాన్య బోర్డు(జీఆర్‌ఎంబీ) చైర్మన్ ముకేశ్ కుమార్ సిన్హా తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలను సూచించారు. ఇందుకు బోర్డు తరఫున సహకారం అందిస్తామన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలోని పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టు పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం జలసౌధలో తెలుగు రాష్ట్రాల అధికారులతో గోదావరిబోర్డు చైర్మన్ సిన్హా, టెక్నికల్ మెంబర్ కనోడియాలు సమావేశమై చర్చించారు. పెద్దవాగు ప్రాజెక్టు దెబ్బతినడానికి కారణాలేంటి? ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) పనులు సరిగ్గానే చేశారా ? వంటి వివరాలను సిన్హా ఆరా తీశారు. పెద్దవాగుకు వచ్చే వరద పెరుగుతున్నందున స్పిల్‌వే సామర్థ్యం పెంచుకోవాలని, కేంద్రం అమలు చేస్తున్న డ్రిప్ పథకంలో చేరాలని సూచించారు. ఇందుకుగాను కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాలని కోరారు. ఇక రెండు రాష్ట్రాల్లో దీని కాల్వలు ఉన్నందున. ఏ రాష్ట్రంలోని కాల్వలను ఆ రాష్ట్రం బాగుచేసుకోవాలని, అవసరమైతే ఆయకట్టు అభివృద్ధి, నీటి నిర్వహణ(క్యాడ్‌కమ్) సహాయం కోసం కేంద్రానికి అభ్యర్థించాలని సూచించారు. పెద్దవాగు తాత్కాలిక మరమ్మతులకు రూ.3.5 కోట్లు అవసరమవుతాయని అధికారులు ఆయనకు వివరించారు. ప్రాజెక్టుకు భారీ వరద వచ్చిన నేపథ్యంలో హైడ్రాలజీ అధ్యయనం చేయించాలని, శాశ్వత మరమ్మతులకు రెండు రాష్ట్రాలు సంయుక్తంగా అంచనాలను రూపొందించాలని సిన్హా సూచించారు.



"దీపం వెలుగులో ఒంటరిగా కూర్చొని,
తెరచి ఉన్న పుస్తకంలోని కనబడని తరాల మనుషులతో
సన్నిహితంగా సంభాషించటం పోలిక లేని ఆనందం.
– యోషిదా కెంకో

సాక్షి
మంగళవారం, 6 ఆగస్టు 2024

సంక్షుభిత బంగాళం

భయపడినంతా అయింది. బంగ్లాదేశ్ రాజకీయ సంక్షోభంలో కూరుకుపోయింది. హింసాత్మకంగా మారిన విద్యార్థుల నిరసనలు, వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహం మధ్య అవామీ లీగ్ పార్టీ సారథి షేక్ హసీనా ప్రధానిగా రాజీనామా చేసి, సైనిక విమానంలో దేశం విడిచిపోవాల్సి వచ్చింది. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా సాగిన 1971 నాటి బంగ్లాదేశ్ స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నవారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వోద్యోగాల్లో 30 శాతం రిజర్వేషన్లు కల్పించిన వివాదాస్పద కోటా విధానంపై మొదలైన రచ్చ చివరకు ఇంతకు దారి తీసింది. జూలైలో ఢాకా యూనివర్సిటీలో ఆరంభమైన విద్యార్థుల నిరసన ప్రదర్శనలు ఇంతలు అంతలై, ఘర్షణలకు దారి తీశాయి. గత నెలలోనూ, అలాగే ఈ ఆదివారమూ కలిపి 300 మందికి పైగా అమాయకుల ప్రాణాలు పోవడంతో బంగ్లాలో పరిస్థితులు వేగంగా మారాయి. గత నెలలో సుప్రీమ్ కోర్ట్ జోక్యం చేసుకొని, అన్నీ కలిపి 56 శాతమున్న రిజర్వేషన్లను 7 శాతానికి తగ్గించినప్పుడు నిరసనలు తగ్గి, ప్రశాంతత నెలకొంటుందని భావించారు. అప్పటికి కాస్త ఆగినట్టనిపించినా, మృతుల కుటుంబాలకు న్యాయం పేరిట మళ్ళీ నిరసనలు రేగాయి. ప్రభుత్వ అనుకూల, ప్రతికూల వర్గాల మధ్య మళ్ళీ రేగిన ఘర్షణల్లో ఒక్క ఆదివారమే 100 మంది దాకా చనిపోవడం, విద్యార్థుల 'చలో ఢాకా' ప్రదర్శన నేపథ్యంలో అగ్నిపర్వతం బద్దలైంది.

క్షేత్రస్థాయిలో ప్రజల మనోభావాలను గుర్తించకుండా, నిరంకుశంగా వ్యవహరిస్తే ఎంతటి పాపులర్ నేతకైనా ఎలాంటి దురవస్థ తలెత్తుతుందో సోమవారం నాటి దృశ్యాలు కళ్ళకు కట్టాయి. దేశవ్యాప్త కర్ఫ్యూ, ఇంటర్నెట్ సేవల సస్పెన్షన్ విధించినా ఢాకాలో రోడ్ల నిండా జనం, ప్రధాని నివాసాన్ని వారు చుట్టుముట్టిన తీరు, హసీనా రాజీనామా, విలాసవంతమైన ఆమె నివాసంలోకి జనం చొచ్చుకుపోయి లూటీ సాగించిన తీరు చూస్తుంటే... సరిగ్గా రెండేళ్ళ క్రితం 2022 జూలైలో శ్రీలంకలో అధ్యక్షుడు రాజపక్సేకు ఎదురైన ఘటనలు గుర్తుకొస్తాయి. దేశాలు, ప్రజలు వేరైనా, రెండు ఘటనల్లోనూ నిరంకుశ పాలన, అవినీతి, ఆశ్రిత పక్షపాతాలే ఇంతటి జనాగ్రహానికి కారణమయ్యాయని మరిచిపోరాదు. అయితే, బంగ్లాలో రెచ్చిపోయిన జనం ప్రధాని నివాసంలోకే కాక, ఆఖరికి దేశ పార్లమెంట్‌లోకి చొరబడి యథేచ్ఛగా ప్రవర్తించడం విస్మయం కలిగిస్తుంది. షేక్ హసీనా తండ్రి, బంగ్లాదేశ్ జాతిపిత అయిన ముజిబుర్ రెహమాన్ విగ్రహాన్ని సైతం ధ్వంసం చేయడం, బంగబంధు మ్యూజియమ్‌ను తగలబెట్టడం, అధికార అవామీ లీగ్ ఆఫీసులకూ – పోలీస్ స్టేషన్లకూ – ప్రభుత్వ ఆఫీసులకూ నిప్పు పెట్టడం ప్రజాస్వామ్య వాదులకు ఆవేదన, ఆందోళన కలిగించక మానవు.

అయిదు దశాబ్దాల స్వతంత్ర బంగాళం ఇటీవలెన్నడూ చూడని హింస, రాజకీయ సంక్షోభం ఇది. ఒక రకంగా ఇది అయిదుసార్లు బంగ్లా ప్రధానిగా వ్యవహరించిన 76 ఏళ్ళ హసీనా స్వయంకృతం. 2009 జనవరి నుంచి పదహారేళ్ళుగా నిర్విరామంగా అధికారంలో ఉన్న ఈ ఉక్కుమహిళ అనేక సంక్షోభాలనూ, హత్యాయత్నాలనూ దాటి వచ్చి, దేశాన్ని ఆర్థికంగా పైకి తెచ్చిన మాట నిజమే. ఒక దశలో ఇస్లామిక్ ప్రపంచంలో ప్రజాస్వామ్య, లౌకికవాదాలకు నమూనాగా తెచ్చుకున్న పేరూ పెద్దదే. కానీ, ప్రతిపక్ష నేతల్ని జైలులో పెట్టి, విమర్శకులను దేశద్రోహులుగా చిత్రించి, చట్టంతో పని లేకుండా ప్రత్యర్థుల్ని అడ్డు తొలగించుకుంటూ వచ్చి అభిమానుల్లో సైతం అప్రతిష్ఠ తెచ్చుకున్నారు. కోవిడ్ అనంతర పరిస్థితులు, రష్యా – ఉక్రెయిన్ యుద్ధంతో ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోలమైంది. పెరిగిన ధరలు, పెచ్చుమీరిన నిరుద్యోగం, అణచివేతలతో అన్ని వర్గాల్లో అసంతృప్తి పేరుకుంది. పైగా, గడచిన రెండు తడవలుగా బంగ్లా ఎన్నికలు పరిహాసప్రాయమయ్యాయి. ముఖ్యంగా ఈ ఏటి జనవరి ఎన్నికలు వట్టి రిగ్గింగ్ అనే ఆరోపణలూ వచ్చాయి. ఇప్పుడామె రాజీనామాతో రోడ్డు మీద కొచ్చి ఆడామగా ఆనందిస్తున్న తీరు చూస్తే మార్పుకై జనం ఎంతగా మొహం వాచారో అర్థమవుతుంది.

హసీనా రాజీనామాతో ప్రస్తుతం బంగ్లాదేశ్ సైన్యం కనుసన్నల్లోకి వెళ్ళింది. రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్మీ ఛీఫ్ సమావేశమైనట్టు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుత ఆందోళనలకు అడ్డుకట్ట వేసి పరిస్థితిని చక్కదిద్దుతామనీ, త్వరలోనే తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటవుతుందనీ ఆర్మీ ఛీఫ్ ప్రకటించారు. అయితే, అది అంత సులభమేనా? దేశమంతా అల్లకల్లోలంగా ఉంది. పాలనా యంత్రాంగం పూర్తిగా పడకేసింది. సాక్షాత్తూ సైన్యం ఎదుటే ప్రదర్శకులు రెచ్చిపోతున్న దృశ్యాలూ కనిపించాయి. గత వారం నిషేధానికి గురైన జమాతే ఇస్లామీ వర్గీయులు సహా ఇంతకాలం అణచివేతకు గురైన ప్రతిపక్షాల మద్దతుదారులూ రోడ్డెక్కడంతో నిరసనకారుల్లో అందరూ విద్యార్థులే అనుకోలేం. అనూహ్య విధ్వంసం చూస్తుంటే, అసాంఘిక శక్తులు చేరాయన్న అనుమానాలూ వినిపిస్తున్నాయి.

బంగ్లాదేశ్ పరిణామాలు భారత్‌పై చూపే ప్రభావమూ ఎక్కువే. కొన్నేళ్ళుగా భారత అనుకూల హసీనా ఏలుబడి మనకు కలిసొచ్చింది. ఇప్పుడిక ప్రతికూల పార్టీలు అక్కడ అధికారంలోకి వస్తే చిక్కులు తప్పవు. మళ్ళీ ఒకప్పటిలా సరిహద్దులో తీవ్రవాద సంస్థల పీడ పెరుగుతుంది. అవి అక్కడ తిష్ఠ వేసి, మన ఈశాన్య రాష్ట్రాల్లో సమస్యలు సృష్టిస్తాయి. చొరబాట్లూ ఎక్కువవుతాయి. కోటీ 30 లక్షల మంది హిందువులున్న బంగ్లాలో భారత మైనారిటీల భద్రత ప్రశ్నార్థకమవుతుంది. హసీనా ఉండగానే వారి పైన దాడులు తప్పలేదు. ఇక, ఛాందసవాద, ప్రతికూల శక్తులు గద్దెనెక్కితే పరిస్థితి ఎలా ఉంటుందో? అలాగే, ఢాకా దృశ్యాలను చూస్తే, ఇదే అదనుగా తీవ్రవాద శక్తులు విజృంభించకుండా బంగ్లా సమాజం అప్రమత్తం కావాలనిపిస్తోంది. ముందుగా శాంతిభద్రతలు నెలకొనడం అవసరం. ఎలాంటి సర్కారుతో సాగాలి, మళ్ళీ ఎన్నికలు లాంటివన్నీ ఆ తర్వాతే! అది పూర్తిగా ఆ దేశ అంతర్గత వ్యవహారం, ప్రజాభీష్టం. ఏమైనా రానున్నరోజులు బంగ్లాకే కాదు భారత్‌కూ కీలకం.

నైపుణ్యమే 'అగ్ని'కి ఆజ్యం!

విశ్లేషణ



మనోజ్ జోషీ

అగ్నిపథ్ విషయంలో మొదటి నుంచీ సమస్య ఉంది. పైగా అగ్నివీర్‌లను కేవలం ఆరు నెలల శిక్షణతో సైన్యంలోకి చేర్చుకున్నారు. నిజానికి గ్రామీణ నేపథ్యం, విద్యా స్థాయయులు, చేర్చుకున్న వయస్సు దృష్ట్యా, అగ్నివీరుడు సమర్థమైన నైపుణ్యాలతో బయటకు వచ్చే అవకాశం లేదు. ప్రాణాంతక ఆయుధాల వ్యవస్థలు, సంక్లిష్టమైన యంత్రాలు, ఎలక్ట్రానిక్స్ ఆపరేషన్ లేదా నిర్వహణను కొత్తగా చేరినవారికి అప్పగించాలంటే వారి అనుభవం చాలదు. అలాగని మొత్తానికే ఈ పథకాన్ని అవతల పడేయవలసిన అవసరం లేదు. ఈ పథకాన్ని రద్దు చేసే బదులు శిక్షణ, నైపుణ్యాభివృద్ధి వంటి లోపాలను అధిగమించ డానికి ప్రభుత్వం ఈ పథకాన్ని సవరించాలి. అగ్నివీర్ పదవీ కాలాన్ని నాలుగేళ్ల నుండి ఏడేళ్లకు పొడిగించడం మంచి ఆలోచన కావచ్చు.

కార్గిల్ జిల్లాలోని హిల్ స్టేషన్ అయిన ద్రాస్‌లో గత శుక్రవారం జరిగిన కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ, కాస్త తీవ్రంగానే స్పందించి ఉండవచ్చు. అగ్నిపథ్ అంశాన్ని ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని ఆయన ఆరోపణ. సైన్యాన్ని నిత్య యవ్వనంతో ఉంచడం, అలాగే దానిని నిరంతరం యుద్ధానికి సన్నద్ధం చేయటం ఈ పథకం లక్ష్యం. ''దురదృష్టవశాత్తు కొంత మంది వ్యక్తులు జాతీయ భద్రతకు సంబంధించిన ఈ సున్నితమైన విషయాన్ని రాజకీయ అంశంగా మార్చారు'' అని ఆయన అన్నారు.

మోదీ మరింత శక్తిమంతంగా చెప్పడానికి మరిన్ని పదాలు వాడి ఉండవచ్చు కానీ ఈ సందర్భం వాటికి తగినదా అనేది ఒక ప్రశ్న. నిజానికి ఒక ఆదర్శవంతమైన, హుందా అయిన సంప్రదాయానికి నాంది పలుకుతూ ప్రతిపక్షం, ప్రధానమంత్రి ఈ వేదికను ఉమ్మడిగా పంచుకుని ఉండవలసింది. కానీ బహుశా అది మరీ ఎక్కువగా ఆశించటమే అవుతుంది.

గడచిన 10 ఏళ్లలో సైన్యాన్ని సంస్కరించడం కోసం చాలా ఎక్కువగానే కృషి జరిగిందనటంలో సందేహం లేదు. 'చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్' నియామకం, 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ మిలిటరీ అఫైర్స్' ఏర్పాటు, 'డిఫెన్స్ అక్విజిషన్ పాలసీ' సంస్కరణ, రక్షణ పరిశ్రమ నిర్బంధ స్వదేశీకరణ, అలాగే రక్షణ పరిశ్రమలో ప్రైవేట్ రంగానికి తలుపులు తెరవడం, ఆ రంగానికి డిఫెన్స్ 'ఆర్ అండ్ డి' నిధుల నుండి 25 శాతం అందించడం... వీటిలో కొన్ని.

కానీ అగ్నిపథ్ దానికై అదిగా అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది. ఈ పథకం కింద, ఒక అగ్నివీర్ సైనికుడిని 17–21 సంవత్సరాల వయస్సులో నియమిస్తారు. అతను/ఆమె నాలుగు సంవత్సరాలు సైన్యానికి సేవలందిస్తారు. ఆ తర్వాత సైన్యం నుంచి వేరుపడి తగిన ప్యాకేజీతో నిష్క్రమిస్తారు. ఇలా రిటైరైన వారిలో 25 శాతం మందికి మరో 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ కాలం పాటు తిరిగి సైన్యంలో చేరే అవకాశం ఉంటుంది. బహుశా వీరు పెన్షన్‌కు అర్హులు అవుతారు. ఇక అగ్నివీర్‌లలో ఎక్కువ మంది విషయానికొస్తే, వారిలో 75 శాతం మంది వివిధ ప్రభుత్వ ఉద్యోగాలలో చేరే అవకాశం కలిగి ఉంటారు. అక్కడ వారు ప్రాధాన్యతా ప్రాతిపదికన రిక్రూట్‌మెంట్‌కు అర్హులు అవుతారు.

2023 చివరలో, మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎమ్ఎమ్ నరవణే తన అముద్రిత జ్ఞాపకాల రచనలో ఈ పథకం నౌకాదళానికి, వాయుసేనకు పిడుగుపాటు వంటిది అని వ్యాఖ్యానించారు. ఆ రెండింటికీ కాకుండా దీనిని తాను కేవలం సైన్యం (ఇండియన్ ఆర్మీ) కోసం మాత్రమే, అది కూడా 75 శాతం సిబ్బందిని ఉంచుకొని 25 శాతం సిబ్బందిని వదిలించుకోవాలనీ ప్రతిపాదించానని వ్యాఖ్యానించారు. అయితే రక్షణ మంత్రిత్వ శాఖ దీనిని కాస్తా మార్చేసి, 75 శాతం అగ్నివీర్‌లను



పంపించి, 25 శాతం మందిని మాత్రమే ఉంచుకోవటం జరుగుతోందని అనడంతో వివాదం తలెత్తింది.

అగ్నిపథ్ విషయంలో మొదటి నుంచీ సమస్య ఉంది. సైన్యం కోసం ఒక అగ్నివీర్ ఏమి చేయగలడు లేదా ఏమి చేయాలి? అన్నదే ఆ ప్రశ్న. ఆర్మీ సగటు వయస్సును అగ్నిపథ్ తగ్గించేస్తుంది అనేది ప్రాథమిక వాదన. ఒక ప్రభుత్వ అఫిడవిట్... ప్రపంచ వ్యాప్తంగా కనిష్ఠస్థాయి ర్యాంక్ సిబ్బంది సగటు వయస్సు 26 సంవత్సరాలు కాగా, ఇండియాలోనే ఆ సగటు వయస్సు 32 ఏళ్లు అని పేర్కొంది. కానీ మన సైన్యంలో నియామక వయస్సు దశాబ్దాలుగా 16.5–21 ఏళ్ల వయస్సులోనే ఉంటోంది. ఇప్పుడు అగ్నిపథ్‌లో భాగంగా 75 శాతం అగ్నివీర్‌లను బయటికి పంపించటం ద్వారా, ప్రతి వలయంలో కొత్త సిబ్బందిని చేర్చడం ద్వారా, ఈ పథకం సైనిక వయస్సును తగ్గించాలని ఆశిస్తోంది. అయితే దాని వల్ల ప్రతిఫలంగా ఏం పొందుతుంది?

భారతీయ నియామకాలలో గ్రహించవలసిన కొన్ని వాస్తవాలు ఉన్నాయి. యువకులు లేదా యువతులు మొదట సైనికులుగా నియమితులు అయినప్పుడు వారు తరచుగా తక్కువ బరువుతో, పోషకాహార లోపంతో ఉండి, విభిన్న నేపథ్యాల నుండి వచ్చినవారై ఉన్నారు. తొమ్మిది నెలల ప్రాథమిక శిక్షణ కేవలం శరీరాకృతి, క్రమశిక్షణ పరంగా వారిని ఒక కొలిక్కి తెస్తుంది. ఆ తర్వాత ట్యాంకులు, ఫిరంగిదళాలు, వాయు రక్షణ వ్యవస్థల నిర్వాహకులుగా మరింత సాంకేతిక ఉద్యోగాలు చేయగలిగిన పదాతిదళానికి తగినట్లుగా వీరికి వృత్తిపరమైన శిక్షణ అవసరం. ఇది కేవలం నైపుణ్యం కోసం. ఇది కాక మరొక సంవత్సరం వరకు ఎక్కడైనా వీరికి శిక్షణ అవసరం కావచ్చు.

ఇప్పుడు, అగ్నివీర్‌లను కేవలం ఆరు నెలల శిక్షణతో సైన్యంలోకి చేర్చుకున్నారు. గ్రామీణ నేపథ్యం, విద్యా స్థాయయులు, చేర్చుకున్న వయస్సు దృష్ట్యా, అగ్నివీరుడు సమర్థమైన నైపుణ్యాలతో బయ టకు వచ్చే అవకాశం లేదు. మెరుగైన దేశాల్లో, ఒక రిక్రూట్ అయిన సైనికుడు ముందే డ్రైవింగ్ వంటి నైపుణ్యంతో వస్తాడు, కానీ భారత దేశంలో దానికి మాత్రమే మూడు నెలలు పట్టవచ్చు.

కాగా, మాజీ అడ్మిరల్ అరుణ్ ప్రకాశ్ ఒక సందర్భంలో మాట్లాడుతూ... పదాతి దళ సిబ్బందికి, సాంకేతిక పరిజ్ఞానం ఎక్కువగా అవసరం లేని సైన్యానికి అగ్నిపథ్ ఉపయోగపడుతుందనీ, అయితే వైమానిక దళానికి, నౌకాదళానికి ఇది పెద్ద సమస్యగా మారుతుందనీ పేర్కొన్నారు. ''ప్రాణాంతక ఆయుధాల వ్యవస్థలు, సంక్లిష్టమైన యంత్రాలు, ఎలక్ట్రానిక్స్ ఆపరేషన్ లేదా నిర్వహణను అప్పగించడానికి ముందు తగినంత అనుభవాన్ని పొందడానికి కనీసం అయిదారేళ్ల సమయం అవసరం అవుతుంది'' అంటారాయన.

అగ్నిపథ్ పథకంలో యువతీయువకుల ప్రొఫైల్ మిలటరీ అవసరాలకు కాకుండా మరి దేనికోసమో ఉద్దేశించినట్లు అనిపిస్తోందన్న ఆరోపణలు ఉండగా ప్రభుత్వం వాటిని ఖండించింది. వాస్తవానికి ప్రభుత్వం పునరాలోచన తర్వాతనైనా ఈ పథకం దేశానికి ఆర్థిక పరిపుష్టిని చేకూర్చే అంశాలతో ప్రేరేపితమైందనే వాస్తవాన్ని ముందుగా తెలియజేయాల్సింది. అయితే ఈ పరిపుష్టి ఒక దశాబ్దం తర్వాత మాత్రమే ప్రారంభమవుతుంది. తాజా బడ్జెట్ ప్రకారం రూ. 1.41 లక్షల కోట్లు లేదా రక్షణ బడ్జెట్‌లో 22.7 శాతాన్ని వినియోగిస్తున్న పెన్షన్ బిల్లు సైన్యానికి గుదిబండ అయింది.

యువశక్తి కోసం గతంలో వచ్చిన పిలుపుల దృష్ట్యా, మనం మొత్తానికే ఈ పథకాన్ని అవతల పడేయవలసిన అవసరం లేదు. ఈ పథకాన్ని రద్దు చేసే బదులు శిక్షణ, నైపుణ్యాభివృద్ధి వంటి లోపాలను అధిగమించడానికి ప్రభుత్వం ఈ పథకాన్ని సవరించాలి. అగ్నివీర్ పదవీ కాలాన్ని నాలుగు సంవత్సరాల నుండి ఏడేళ్లకు పొడిగించడం మంచి ఆలోచన కావచ్చు. ఇది కొంతకాలంగా ఉన్న ఆలోచన. ఇది శిక్షణ కోసం తగినంత సమయాన్ని నిర్ధారిస్తుంది. అలాగే సేవకు సమర్థవంతమైన సహకారాన్ని అందిస్తుంది. అగ్నివీర్‌లు సైన్యం నుంచి బయటికి వచ్చినప్పుడు వారి వయస్సు 24–28 సంవత్సరాల మధ్య ఉంటుంది, ఇది వారికి కొంత ఆలస్యంగా తెరచుకునే అనేక అవకాశాలకు అనువుగా ఉంటుంది.

1999లో కార్గిల్ యుద్ధంలో మరణించిన 550 మంది సైనికులు అగ్నివీరులు కాదని, శిక్షణ పొందిన, దృఢమైన, అంకితభావం కలిగిన సైనికులు అనే విషయం గుర్తుంచుకోండి. ఆ రకమైన సామర్థ్య పరీక్ష ఇప్పటికీ అగ్నివీర్ పథకం కోసం వేచి ఉంది.

వ్యాసకర్త న్యూఢిల్లీలోని అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్‌లో డిస్టింగ్విష్డ్ ఫెలో । ('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఐదేళ్ల డివిడెండ్



నేను, నా భార్య జూలై నెలలో కశ్మీర్‌లో 3 వారాల పాటు ప్రయాణించాము. పర్యాటకం అభివృద్ధి చెందింది. ప్రతి చోటా పిల్లల విహారాలతో కళకళలాడుతూ ఉంది. ఆర్టికల్ 370ని రద్దు చేసిన 2019 ఆగస్టు 5 నుండి గత ఐదేళ్లలో కశ్మీర్‌కు లభించిన డివిడెండ్ ఈ ప్రశాంతత.

– వినోద్ భాటియా, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్

చీకటి రోజు



ఆర్టికల్ 370ని రద్దు చేసినా ఏమీ మారలేదు. కశ్మీరీల స్వయం ప్రతిపత్తిని లాక్కుని, రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించిన ఆగస్టు 5వ తేదీ జమ్మూ–కశ్మీర్ ప్రజలకు బ్లాక్ డేగా మిగిలిపోతుంది.

– గుఫ్తార్ అహ్మద్, జమ్మూ–కశ్మీర్ న్యాయవాది

'షా' వారసుడు!



పానిపట్ యుద్ధంలో మరాఠాలను ఓడించిన అఫ్గాన్ పాలకుడు అహ్మద్ షా అబ్దాలీ 'రాజకీయ వారసుడు' అమిత్ షా. ప్రభుత్వంపై నియంత్రణను కొనసాగించటానికి రాజకీయ పార్టీలను విచ్ఛిన్నం చేయటం ద్వారా బీజేపీ 'పవర్ జిహాద్'లో మునిగిపోయింది.

– ఉద్ధవ్ ఠాక్రే, యూబీటీ (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే) చీఫ్

క్రాష్ అవకండి



అస్థిర సమయంలో పరిణతి చెందిన, అనుభవజ్ఞులైన పెట్టుబడిదారులు ఎలా ప్రవర్తిస్తారు? వారు ఏమీ చేయరు. భయపడరు. ఆ క్షణాలను ఆనందిస్తారు. (స్టాక్ మార్కెట్ పతనంపై వ్యాఖ్యగా... ఊగుతున్న రంగులరాట్నంలోని తొట్టిలో ఒక్కడే అదరక బెదరక కూర్చొని ఉన్న చిన్న బాలుడి వీడియోను జత చేస్తూ).

– నీతూ ఖండేల్‌వాల్, ఇన్వెస్టర్

మౌనంగానే ఎదగమని!



మూడో రౌండ్‌లో తన ప్రత్యర్థి అయిన క్విన్వెన్ ఝెంగ్‌తో కరచాలనానికి నిరాకరిస్తూ, "నేను నిన్ను పోటీదారుగానే గౌరవించను" అని అమెరికన్ క్రీడాకారిణి ఎమ్మా నవార్రో ఆమెను అవమానించారు. అందుకు సమాధానమా అన్నట్లు ఫైనల్స్‌లో ఝెంగ్ విజయం సాధించి, ఒలింపిక్స్ టెన్నిస్ సింగిల్స్‌లో చైనా తొలి బంగారు పతక విజేతగా నిలిచారు.

– కై వాంగ్, స్పోర్ట్స్ ఎనలిస్ట్

ఇన్ బాక్స్

చరిత్రలో మాయని మచ్చలు

జపాన్‌లోని హిరోషిమా నగరంపై 1945 ఆగస్టు 6న, నాగసాకిపై ఆగస్టు 9న అమెరికా జారవిడిచిన అణుబాంబులు సుమారు 2 లక్షలకుపైగా పౌరులను బలి తీసుకున్నాయి. ఇవి చరిత్రలో మాయని మచ్చలు, అతిపెద్ద దుస్సంఘటనలు. అయినా దేశాలు చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవడం లేదు. ఒక్క క్షణంలో ప్రపంచాన్ని భస్మీపటలం చేసే అణ్వాయుధాలను పోగేస్తూనే ఉన్నాయి.

'స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' (సిప్రి) 2024 నివేదిక, అమెరికా వద్ద 5,044 అణ్వాయుధాలు ఉన్నట్టు తెలిపింది. అదే నివేదిక ప్రకారం, రష్యా దగ్గర 5,580, ఫ్రాన్స్ దగ్గర 290, చైనా దగ్గర 500, బ్రిటన్ దగ్గర 225, భారత్ దగ్గర 172 అణ్వాయుధాలు ఉన్నాయి. పాకిస్తాన్, ఉత్తర కొరియా, ఇజ్రాయెల్ కూడా అణుసంపత్తిని కలిగి ఉన్నాయి. పైగా ఈ దేశాలన్నీ తమ అణ్వాయుధాలను పెంచుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాయి. చైనా దగ్గర గతేడాది 410 ఉండగా, ఇప్పుడది 500కు చేరింది. యుద్ధాల కారణంగా ప్రపంచ దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరగడం, రాజకీయ దౌత్య సంబంధాలు క్షీణిస్తున్న నేపథ్యంలో అణ్వస్త్రాల పాత్ర ప్రముఖంగా మారిందని 'సిప్రి' రిపోర్ట్ పేర్కొన్నది.

అణ్వాయుధాలతో పాటు ఆయుధాలు కూడా ప్రపంచ శాంతికి విఘాతం కలిగించేవే. ప్రపంచంలో ఆయుధాలు ఎగుమతి చేస్తున్న దేశాలలో అమెరికా అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇక ఆయుధాలను దిగుమతి చేసుకుంటున్న దేశాలలో భారత్ మొదటి స్థానంలో ఉన్నది. భారత్ అతిపెద్ద ఆయుధ సరఫరాదారుగా రష్యా కొనసాగుతున్నది. భారత దిగుమతులలో రష్యా వాటా 36 శాతం. ఆయుధాల దిగుమతుల్లో మొదటి ఐదు స్థానాల్లో ఇండియా, సౌదీ అరేబియా, ఖతార్, ఉక్రెయిన్, పాకిస్తాన్ ఉన్నాయి. రష్యా–ఉక్రెయిన్, ఇజ్రాయిల్–పాలస్తీనా యుద్ధాలు కొనసాగుతున్న వేళ అణ్వాయుధాల భయం మళ్లీ పెరిగింది. ఆయా దేశాలు రక్షణ పేరుతో ఆయుధాలు పెంచుకుంటూ పోవడం ఆయుధ పోటీకి దారి తీస్తున్నది.

– నర్సింగు కోటయ్య, మిర్యాలగూడ
(హిరోషిమాపై అణుదాడికి నేటితో 80 ఏళ్లు)

బాట మార్చుకున్న మానవతావాది

సందర్భం



బి.ఎస్. రాములు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక శాంతియుత పరివర్తన రావాల్సింది పోయి, ఎక్కడికక్కడ ఉద్యమాలు తలెత్తాయి. కేంద్రం, రాష్ట్రాల నుండి బ్రిటిష్ పాలకులు వైదొలిగారు. కానీ గ్రామీణ వ్యవస్థలు మారలేదు. భూమిపై ఉన్న హక్కులు రద్దు కాలేదు. దాంతో భూస్వాముల వర్గం అన్ని రంగాల్లోనూ ఎదుగుతూ వచ్చింది. అంబేడ్కర్ భూమిని జాతీయం చేయాలన్నారు. ప్రజాస్వామ్యం ద్వారా సోషలిజాన్ని బహుళ పార్టీ వ్యవస్థలో సాధించడం ఎలాగో రోడ్ మ్యాప్ వేశారు. కానీ అది జరగలేదు. పర్యవసానంగా ప్రజలు భూమి కోసం ఉద్యమ బాట పట్టారు. ప్రభుత్వాలు సమస్యను పరిష్కరించే బదులు బల ప్రయోగంతో అణిచి వేయాలని చూశాయి.

రాజ్యాంగం మహోన్నత లక్ష్యాలతో రాయబడింది గానీ ప్రజలకు దాన్ని అందించలేదు, వివరించలేదు, చదివించలేదు. ఏదో రష్యాలో, చైనాలో గొప్పగా వుందట అని చెపితే జనం నమ్మారు. మార్క్సిజం సిద్ధాంతాలు చెప్తే బాగుందనుకున్నారు. ఆదర్శ సమాజం అనే భావన ఆకర్షించింది. ఆ బాటలో సాగిన గద్దర్ తన ప్రత్యేకతను చాటుకున్నాడు. అంటరాని కులంలో పుట్టి, ప్రభుత్వ హాస్టల్లో ఉండి చదివి, బ్యాంకులో ఉద్యోగం చేసి, తాను నమ్మిన కళ కోసం, సాంస్కృతిక విప్లవం కోసం ఉద్యోగాన్ని వదిలి, దిగంతాలకు ఎదిగిన మహా కళాకారుడయ్యాడు. అరుదైన గాయకుడిగా, ప్రజా కవిగా విప్లవోద్యమానికి ఊపిరులు ఊదాడు. ప్రజా వాగ్గేయ కారుడిగా విశ్వ వ్యాప్తం అవుతూ వచ్చాడు. గద్దర్ ఆట, పాట, కాలి అందెల సవ్వడి జనాన్ని ఉర్రూతలూగించి వేలాదిమంది యువకులను ఉద్యమాల బాట పట్టించింది. భారతదేశ చరిత్రలో ఒక గొప్ప విప్లవోద్యమానికి ఊపిరులు ఊదిన గద్దర్ ఫలితాలు రాక, విస్తరణ కోల్పోయిన ఉద్యమ దశను కళ్లారా చూశాడు. ఆశలు అడియాసలై, ఆత్మావలోకం చేసుకొని ఉద్యమకారులు అజ్ఞాతంలో ఉండి సాధించేది శూన్యం అని గుర్తెరిగి ప్రజాస్వామ్యం వైపు పరివర్తన చెందాడు.

అనుభవం నేర్పిన పాఠాలతో ఉద్యమాల బాట సాధించేది ఏమీలేదనీ, ప్రజాస్వామ్య బాటనే భేష్ అనీ భారత రాజ్యాంగాన్ని ఆలస్యంగా అధ్యయనం చేయడం ప్రారంభించాడు. అప్పటికి జరగరాని నష్టం జరిగిపోయింది. వేలాది మంది యువకులు నేలకొరిగారు. నడిచిన దారి తప్పు అని చెప్తే ఒక బాధ, చెప్పకపోతే ఇంకొక బాధ. ఈ రెండింటి మధ్య గద్దర్ చాలాకాలం నలిగి పోయాడు. ఈలోపు మలి తెలంగాణ ఉద్యమం రాజు కోవడంతో ఉవ్వెత్తున లేచాడు. చంద్రబాబు ప్రభుత్వ కాలంలో గద్దర్‌పై కాల్పులు జరిగాయి. 6 తూటాలు దిగాయి. అయినా తెలంగాణ కోసమే బతికినట్టయింది.



గద్దర్

ఆ మధ్య ఒక విలేఖరి ఇలా ప్రశ్నించాడు: ''మీరు భారత రాజ్యాంగం, దాని మౌలిక లక్ష్యాలు చదవకుండా, రాజ్యాంగ ఆచరణతో సమాజంలో, జీవితాల్లో వచ్చిన మార్పులు పరిశీలించకుండా మార్క్సిజం, మావోయిజం కరెక్టు అని ఎలా అనుకున్నారు? సాయుధ విప్లవంలో ఎందుకు చేరారు?'' ''రాజ్యాంగంలో ఎన్నో గొప్ప విషయాలు ఉన్నాయని మాకెవరూ చెప్పలేదు. సోషలిజం సాయుధ పోరాటంతోనే వస్తుందనుకున్నాం. భారత రాజ్యాంగం చదవకుండా విప్లవం చేయాలనుకోవడం తప్పే. సోషలిస్టు రష్యాలో, పీపుల్స్ చైనాలో ప్రజల హక్కులు, ప్రభుత్వ నిర్వహణ, న్యాయ వ్యవస్థ ఎలా ఉన్నాయో తెలుసుకోకుండా విప్లవం చేయాలనుకోవడం పొరపాటే. అందుకే ఇపుడు భారత రాజ్యాంగ మౌలిక లక్ష్యాల సాధన, రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలను చైతన్యవంతం చేస్తున్నాం'' అని చెప్పాను.

గద్దర్ ఆశయం ప్రజాస్వామ్య సోషలిజం సాధన. బౌద్ధం, అంబేడ్కరిజం, భారత రాజ్యాంగ మౌలిక లక్ష్యాల సాధన అంతిమ లక్ష్యం. అంటరానితనం, అసమానతలు, దోపిడీ, మనిషి పై మనిషి ఆధిపత్యం చేసే సంస్కృతి పోవడం గద్దర్‌తో పాటు మన లక్ష్యం కూడా కావాలి. అదే గద్దర్‌కు నిజమైన నివాళి.

వ్యాసకర్త తెలంగాణ బీసీ కమిషన్ తొలి చైర్మన్
(నేడు గద్దర్ తొలి వర్ధంతి)

కాలజ్ఞాని స్ఫూర్తితో బీసీ ఉద్యమం

సందర్భం



జూలూరు గౌరీశంకర్

డాక్టర్ కొత్తపల్లి జయశంకర్‌ను తలుచుకుంటేనే 1969లో తుపాకీ తూటాలకు బలై నేలకొరిగిన వందలాది తొలి తెలంగాణ రాష్ట్ర సాధన సమరయోధులు గుర్తు కొస్తారు. ఓరుగల్లు బిడ్డగా, తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్తగా, ప్రొఫెసర్‌గా, 'సీఫెల్' రిజిస్ట్రార్‌గా, కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా ఆయన జ్ఞానరంగాన్ని తీర్చిదిద్దారు. తెలంగాణ రాష్ట్ర సాధన తొలి మలి దశల ఉద్యమాల వెంట నడుచుకుంటూ ఉద్యమాన్ని సక్రమ పట్టాలపైకెక్కించి నడిపించిన జయశంకర్‌ను తెలంగాణ మట్టి ఎప్పటికీ మరిచిపోదు. తెలంగాణ అంతా నిరాశా నిస్పృహల్లోకి పోయినప్పుడు తమ ఒంటికి నిప్పంటించుకుని 'జై తెలంగాణ' నినాదాన్ని మిన్నంటేలా చేసిన శ్రీకాంతాచారి, యాదయ్య, కానిస్టేబుల్ కిష్టయ్యలు, ఆత్మబలిదానాలు చేసుకున్న వందలాది మంది ఆత్మగౌరవ యోధుల త్యాగాలు, తెగిపడ్డ తల్లి పేగుల ఆర్తనాదాలు ఇంకా చెవుల్లో మారు మ్రోగుతూనే ఉన్నాయి. తెలంగాణ మేధావుల సంఘమంటే, 'మేధావులన్న పదమెందుకు? విద్యావంతులంటే సరిపోతుం'దన్న విద్యావంతుడు జయశంకర్ సార్.

రెండు తెలుగు రాష్ట్రాలేర్పడితే అగ్రవర్ణ పెత్తనాల రాజకీయాలు క్రమంగా కనుమరుగవుతాయని జయశంకర్ చెప్పిన కాలజ్ఞానం బహుజన రాజ్యాలకు ముగ్గులు పోస్తుంది. తెలుగు భాషపై చర్చ ఎగుస్తున్న ఉద్యమకాలంలో 'నలుగురు ఖైదీలు జైలు నుంచి పరార్' అన్న దినపత్రికల బ్యానర్లలోని ఉర్దూ తెలుగు కలగలిసిన తెలంగాణ భాషపై జయశంకర్ పదే పదే చెప్పిన మాటలు జ్ఞప్తికొస్తున్నాయి. 14 ఏళ్ళ సుదీర్ఘ తెలంగాణ రాష్ట్ర సాధన మహోద్యమంలో ప్రజాసంఘాలు చేసిన పోరాటాన్నీ, రాజకీయ ప్రక్రియ ద్వారా జరిగే ఉద్యమ ప్రస్థానాన్నీ సమన్వయం చేసుకుంటూ జయశంకర్ నిలిచి కదిలారు. రాష్ట్రసాధన ఉద్యమం పిడికిలెత్తుతున్న సందర్భంలో మల్లెపల్లి రాజయ్య వర్ధంతి సభలో జయశంకర్ ప్రసంగాల్ని అక్షరాలుగా పేర్చి మల్లెపల్లి లక్ష్మయ్య అందించిన 'తెలంగాణలో ఏం జరుగుతుంది' అన్న పుస్తకం ఉద్యమానికి రూట్ మ్యాప్‌గా నిలిచింది.

జయశంకరుణ్ణి తలుచుకుంటుంటే మిలియన్ మార్చ్, సాగరహారం, సడక్ బంద్, జాతీయ రహదారులపై వంటావార్పుల దగ్గర నుంచి దేశచరిత్రలోనే మరువలేని 42 రోజుల సకల జనుల సమ్మె గుర్తుకొస్తాయి. ఢిల్లీ కార్ల యాత్రలు, దేశంలోని అన్ని రాజకీయ పార్టీల మద్దతు కూడ గట్టుకోవటాలు, కార్మిక, కర్షక, విద్యార్థి మేధావుల ఆందోళనలు, ప్రజాసంఘాల పోరాటాలు, ఊరూరు జేఏసీగా మారడాలు, ఉద్యమ నృత్యం చేసిన ధూంధాంలు తెలంగాణ స్మృతిపథంలో చెదిరిపోని జ్ఞాపకాలుగా నిలిచాయి. రాజకీయ పార్టీలన్నీ కలవవని ప్రచారాలు జరుగు తున్న సమయంలో 'ఆర్ఎస్ఎస్ నుంచి ఆర్ఎస్‌యు వరకు' స్వరాష్ట్రం కోసం అందరూ ఒక్కతాటిపైకి వస్తారన్న జయశంకర్ సూత్రీకరణ ఆచరణ రూపమైంది. క్యాన్సర్‌ను జయిస్తూ ఉద్యమ జీవితపు ఎగుడుదిగుళ్ళను జయశంకర్ చెబుతుంటే రాసుకుంటూ పోయిన వెంకట్ గౌడ్ అందించిన 'వొడవని ముచ్చట'నే కదా తెలంగాణ ముచ్చట. జయశంకర్ సార్‌ను ఇపుడు ఎవరు ఎట్లయినా విభజించుకుని మాట్లాడుకోవచ్చును. కానీ ఆయన తెలంగాణ ఉమ్మడి సంపద. తెలంగాణ స్వరాష్ట్రాన్ని చూడకుండానే సెలవంటూ వెళ్ళిపోయారు. కానీ ఆయన అందించిన స్ఫూర్తికి గుర్తుగా విశ్వవిద్యాలయానికి పేరుపెట్టుకోవటం తెలంగాణకు గర్వకారణంగా నిలుస్తుంది.



ప్రొ॥ కొత్తపల్లి జయశంకర్

రెండు తెలుగు రాష్ట్రాలేర్పడితే రెండు చోట్ల బడుగులు నాయకత్వ దశకు వస్తారని జయశంకర్ చెప్పారు. అది జరగాలంటే తెలంగాణలో అరవై శాతంగా వున్న బీసీలకు పల్లె నుంచి పార్లమెంటు దాకా చట్టసభల్లో రిజర్వేషన్లు రావాలి. కులగణన జరిగితేనే చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ల డిమాండ్ నెరవేరేందుకు దారి ఏర్పడుతుంది. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లకు తోడుగా బీసీ రిజర్వేషన్లు కూడా వస్తేనే రాజకీయ న్యాయం జరుగుతుంది.

వ్యాసకర్త తెలంగాణ తొలి బీసీ కమిషన్ సభ్యులు
(నేడు ప్రొ॥ కొత్తపల్లి జయశంకర్ జయంతి)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** శు.విదియ సా.6.08 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** మఖ సా.5.17 వరకు , తదుపరి పుబ్బ, **వర్జ్యం:** రా.2.02 నుండి 3.47 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.07 వరకు, తదుపరి రా.10.57 నుండి 11.41 వరకు, **అమృతఘడియలు:** ప.2.43 నుండి 4.22 వరకు, మంగళ గౌరీ వ్రతం; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.43, **సూర్యాస్తమయం:** 6.28.

ఇరవై రెండేళ్లు ఏమార్చి.. ఎట్టకేలకు సీబీఐకి చిక్కి

- బ్యాంకు మోసం కేసులో నిందితుడి కోసం 2 దశాబ్దాలకు పైగా కొనసాగిన సీబీఐ వేట
- హైదరాబాద్ టు తమిళనాడు వరకు పలుమార్లు సెర్చ్ ఆపరేషన్లు
- సీబీఐ నుంచి తప్పించుకునేందుకు చనిపోయినట్టు డ్రామాలాడిన నిందితుడు
- చివరికి ఈనెల 4న తమిళనాడులో నిందితుడు చలపతిరావు అరెస్టు

సాక్షి, హైదరాబాద్: తప్పుడు పత్రాలతో ఎస్‌బీఐ హైదరాబాద్ బ్యాంకు నుంచి రూ.50 లక్షలు కొట్టేసిన ఓ నేరస్తుడు సీబీఐ అధికారులకు రెండు దశాబ్దాలకు పైగా 'సినిమా'చూపించాడు. ఎప్పటికప్పుడు పేర్లు, అడ్రస్‌లు, ఫోన్ నంబర్లు మార్చుతూ..ఏమార్చాడు. నిందితుడు ఎన్ని 'వేషాలు'వేసినా..దాదాపు 22 ఏళ్ల పాటు పట్టువిడవక దర్యాప్తు చేపట్టిన సీబీఐ అధికారులు ఎట్టకేలకు సదరు నిందితుడు వి.చలపతిరావును తమిళనాడులోని తిరునల్వేలి జిల్లా నర్సింగనల్లూర్‌లో ఆదివారం(ఈనెల 4న) అరెస్టు చేసి సీబీఐ న్యాయస్థానంలో హాజరుపర్చారు. కోర్టు ఈనెల 4 నుంచి 16 వరకు చలపతిరావుకు రిమాండ్ విధించింది. సీబీఐ కార్యాలయం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్న ప్రకారం.. వివరాలివీ..

ఇదీ నేరం

నగరంలోని చందులాల్ బరాదారీ ఎస్బీఐ బ్రాంచ్‌లో కంప్యూటర్ ఆపరేటర్ చలపతిరావు తన కుటుంబ సభ్యులు, బంధువుల పేరిట తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి రూ.50 లక్షల రుణం తీసుకుని బ్యాంకును మోసగించాడు. దీనిపై బ్యాంకు ఉన్నతాధికారుల ఫిర్యాదుతో సీబీఐ అధికారులు 2002 మేలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. 2004 డిసెంబర్‌లో సీబీఐ అధికారులు చార్జిషీట్ కోర్టులో దాఖలు చేశారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న చలపతిరావును సీబీఐ అధికారులు నేరస్తుడిగా(ప్రొక్లెయిమ్డ్ అఫెండర్‌గా) ప్రకటించారు.

డెత్ సర్టిఫికెట్ కూడా జారీ చేసిన కోర్టు..

చలపతిరావు అదృశ్యమయ్యాడంటూ ఇదే కేసులో నిందితురాలిగా ఉన్న అతని భార్య 2004లోనే కామటిపుర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత ఏడేళ్లయినా అతని జాడ లేకపోవడంతో చనిపోయినట్టుగా ధ్రువీకరించాలని పిటిషన్ దాఖలు చేయడంతో హైదరాబాద్‌లోని సంబంధిత సివిల్ కోర్టు చలపతిరావు చనిపోయినట్టుగా నిర్ధారిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే నిందితుడు పరారీలో ఉండడంతో సీఆర్‌పీసీ సెక్షన్ 82,83 ప్రకారం సీబీఐ అధికారులు సదరు నిందితుడిని ప్రొక్లెయిమ్డ్ అఫెండర్‌గా ప్రకటించారు.

రాష్ట్రాలు మారుతూ.. అడ్రస్‌లు మారుస్తూ.. స్వామీజీల వేషంతో..

సీబీఐ దర్యాప్తు ముమ్మరం కావడంతో హైదరాబాద్ నుంచి పారిపోయిన నిందితుడు చలపతిరావు పలు ప్రాంతాలు మారుస్తూ 2007లో తన పేరు వినీత్‌కుమార్‌గా మార్చుకుని తమిళనాడు సేలంలో మరో మహిళను వివాహం చేసుకున్నాడు. అతడి రెండో భార్య ద్వారా సమాచారం సేకరించిన సీబీఐ అధికారులు అతడిని అరెస్టు చేసేందుకు ప్రయత్నించగా..అక్కడ నుంచి తెలివిగా పారిపోయాడు. ఆ తర్వాత భోపాల్‌లో లోన్‌రికవరీ ఏజెంట్‌గా పనిచేశాడు. తర్వాత ఉత్తరాఖండ్‌లో రుద్రాపూర్‌కు మకాం మార్చి అక్కడ ఓ పాఠశాలలో కొన్నాళ్లు పనిచేశాడు. సీబీఐకి తన జాడ తెలిసినట్టు పసిగట్టి అక్కడి నుంచి ఔరంగాబాద్‌లోని వెరుల్ గ్రామంలో ఓ ఆశ్రమంలో స్వామి విదిత్మానంద తీర్థగా తన పేరును మార్చుకుని అక్కడ చేరాడు. అక్కడ కొత్త ఆధార్ కార్డును తీసుకున్నాడు. 2021లో ఆశ్రమం నుంచి రూ.70 లక్షలు కొట్టేసి అక్కడి నుంచి పారిపోయాడు. అక్కడి నుంచి రాజస్తాన్‌లోని భరత్‌పూర్‌కు మకాం మార్చాడు. అక్కడ స్వామి విదిత్మానందతీర్థగా కొనసాగుతూ ఒక శిష్యురాలిని తీసుకుని తమిళనాడులోని తిరునల్వేలి ప్రాంతానికి మకాం మార్చాడు. అప్పటి నుంచి అక్కడే ఉంటున్నాడు.



పదుల సంఖ్యలో ఫోన్ నంబర్లు.. కొత్త పేర్లతో ఆధార్‌కార్డులు

నిందితుడు చలపతిరావు సీబీఐ కళ్లుగప్పేందుకు ఎప్పటికప్పుడు పేర్లు మార్చుతూ ఆధార్‌కార్డులు తీసుకోవడంతో పాటు దాదాపు పదిసార్లు ఫోన్ నంబర్లు మార్చాడు. నిందితుడి ఆధార్‌కార్డులు, అతడి ఫోన్ నంబర్లు, అతడు వాడిన ఈ-మెయిల్స్ ఆధారంగా సీబీఐ అధికారుల వేట రెండు దశాబ్దాలకు పైగా కొనసాగింది. ఎట్టకేలకు సీబీఐ అధికారుల పక్కా స్కెచ్‌తో తమిళనాడులోని తిరునల్వేలి జిల్లా నర్సింగనల్లూర్‌లో నిందితుడు చలపతిరావును ఆదివారం అరెస్టు చేశారు.

'పురుగుమందు' పట్టుకుని.. పీఏసీఎస్‌కు తాళం వేసి..

- రుణమాఫీ కాలేదని వేర్వేరు చోట్ల రైతుల ఆందోళన



పురుగుల మందు డబ్బాతో కెనరా బ్యాంక్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

మునగాల/గండేడ్: తమ రుణాలు మాఫీ కాలేదంటూ సోమవారం వేర్వేరు చోట్ల రైతులు నిరసన వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా రేపాలలోని కెనరా బ్యాంకుకు తాళం వేసేయత్నం చేసిన రైతులు అనంతరం పురుగుమందు డబ్బా పట్టుకుని ఆందోళనకు దిగారు. మహబూబ్‌నగర్ జిల్లా గండేడ్‌లో వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)కు సైతం అక్కడి రైతులు తాళం వేశారు. వివరాల్లోకి వెళ్తే.. రేపాల కెనరా బ్యాంక్ పరిధిలోని ఐదు గ్రామాలకు చెందిన 1,500 మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రుణమాఫీ పథకంలో 300 మందికే మాఫీ అమలైంది. తమకు వర్తించలేదంటూ 50 మంది రైతులు బ్యాంక్ ఎదుట నిరసనకు దిగి తాళం వేసే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన కటాఫ్ తేదీ పరిధిలో లేకపోవడమే మాఫీ కాకపోవడానికి కారణమని బ్యాంక్ సిబ్బంది చెబుతున్నారని, రాష్ట్రంలో ఏ బ్యాంక్‌లో లేని నిబంధనలు రేపాల కెనరా బ్యాంక్‌లో మాత్రమే ఎందుకని రైతులు ప్రశ్నించారు. కోదాడ ఎమ్మెల్యే పద్మావతి న్యాయం చేసేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారని రైతులు తెలిపారు. కాగా, మహబూబ్‌నగర్ జిల్లా గండేడ్, మహమ్మదాబాద్ మండలాలకు కలిపి గండేడ్‌లో పీఏసీఎస్ ఉంది. ఇక్కడ రూ.లక్ష, రూ.1.50 లక్షల రుణమాఫీల జాబితాను ప్రదర్శించారు. అయితే, తాము రుణం తీసుకోకుండానే పేరు వచ్చిందని, అలాగే మాఫీ వచ్చినా రూ.వేలల్లో వడ్డీ కట్టమంటున్నారంటూ సోమవా రం పీఏసీఎస్ సిబ్బందితో రైతులు వాగ్వాదానికి దిగారు. సిబ్బందితోపాటు అధికారులను పీఏసీఎస్ కార్యాలయం లోపల పెట్టి తాళం వేశారు. అనంతరం రోడ్డుపై బైఠాయించారు. సమస్య పరిష్కరిస్తామని పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ హామీనివ్వడంతో రైతులు తాళం తీశారు.



గండేడ్‌లోని పీఏసీఎస్‌కు తాళం వేసిన రైతులు

రుణాల కోసం రాత్రంతా జాగరణ

- పరకాల ఎస్‌బీఐ ఎదుట రైతుల బారులు
- అర్ధరాత్రి నుంచే పడిగాపులు
- సిబ్బంది కొరతతో రోజుకు 100 మందికే కొత్త రుణాలు.. అదనపు కౌంటర్ల ఏర్పాటుకు అన్నదాతల విజ్ఞప్తి



దోమల కాయిల్ పెట్టుకొని ఓ షాపు ఎదుట పడుకున్న రైతులు

హన్మకొండ(పరకాల): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రెండు దఫాలుగా రైతులకు రుణమాఫీ చేసిన నేపథ్యంలో కొత్త రుణాలు తీసుకునేందుకు రైతులు బ్యాంకుల ఎదుట బారులుదీరుతున్నారు. రోజుకు కేవలం100 మందికే రుణాలు ఇస్తామని బ్యాంకర్లు చెప్పడంతో హనుమకొండ జిల్లా పరకాలలోని ఎస్‌బీఐ ఎదుట రైతులు అరిగోస పడుతున్నారు. వివిధ గ్రామాల నుంచి ముందుగానే పట్టణానికి చేరుకుంటున్నా రు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయానికి వందలాదిమంది రైతులు బ్యాంకు సమీపంలో రోడ్డు పక్కన షాపులు, ఇతర ప్రదేశాల్లో కూర్చున్నారు. తెల్లవారే వ రకు నిద్రాహారాలు మానుకుని పడిగాపులు కాశారు. ఎప్పు డు తెల్లవారుతుందో.. క్యూలో ముందు వరుసలో ఉండి ఎప్పుడు రుణాలు తీసుకుంటామోనని ఆత్రుతగా ఎదురుచూశారు.

100 మందికే టోకెన్లు..

బ్యాంకు సిబ్బంది కొరత కారణంగా రోజుకు 100 మందికి టోకెన్ పద్ధతి ద్వారా రుణాలు ఇచ్చేందుకు అధికారులు నిర్ణయం తీసుకోవడంతో ఈ పరిస్థితి నెలకొందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మూడు, నాలుగు రోజులు తిరిగినా పనులు కాకపోవడంతో దూర ప్రాంతాలకు చెందిన రైతులు రాత్రి ఒంటిగంటకు బ్యాంకు వద్దకు చేరుకుని టోకెన్ నంబర్ రాయించుకుంటున్నారు. కొందరు రైతులు బ్యాంకు సమీపంలో ఉన్న దుకాణాల ఎదుట దోమల కాయిల్స్ పెట్టుకుని వేచిచూస్తున్నారు. మహిళా రైతులకు సైతం పడిగాపులు తప్పడం లేదు.

ఒకే బ్యాంకు.. 20 వేల ఖాతాలు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగె ఎస్‌బీఐ బ్రాంచ్ పేరుతో పరకాల నియోజకవర్గ కేంద్రం నుంచి లావాదేవీలు కొనసాగుతున్నాయి. దీంతో రెండు జిల్లాల్లోని పరకాల, నడికూడ, శాయంపేట, రేగొండ, చిట్యాల, టేకుమట్ల మండలాలకు చెందిన వేలాది మంది రైతుల ఖాతాలు ఇదే బ్యాంకులో కొనసాగుతున్నాయి. దీనికి తోడు ఎస్‌బీఐ కంఠాత్మకూరు బ్రాంచ్‌ను సైతం తీసేసి పరకాల ఎస్‌బీఐ (ఏడీబీ)లో విలీనం చేశారు. ఒక్కో గ్రామం నుంచి సుమారు 300 నుంచి 500మంది ఖాతాదారులు ఉన్నారు. మొత్తం 20వేల అకౌంట్లు ఉండగా.. రైతులవి సుమారు 10 వేల నుంచి 12 వేల వరకు ఉన్నాయి. రోజుకు 100 మందికే అవకాశం కల్పిస్తే రుణమాఫీ క్లియరెన్స్, కొత్త రుణాలు ఇచ్చేదెప్పుడని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈనెల 15న రూ.2 లక్షల రుణమాఫీ

- ఖమ్మంలో ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- వివరాలు వెల్లడించిన మంత్రి తుమ్మల



వైరాలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వైరా: ఇప్పటికే రైతులకు రూ.లక్షన్నరలోపు రుణాలను రెండు విడతల్లో మాఫీ చేయగా.. రూ.2 లక్షల వరకు రుణాలను ఈనెల 15న మాఫీ చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, పట్టు పరిశ్రమల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ మేరకు 15న ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనకు రానున్న సీఎం సీతారామ పంప్‌హౌస్‌లలో మోటార్లు స్విచాన్ చేయడమే కాక వైరాలో జరిగే రైతు సదస్సులో పాల్గొంటారని తెలిపారు. ఈ సదస్సులో రూ.లక్షన్నర నుంచి రూ.2 లక్షల లోపు రుణాలు ఉన్న పలువురు రైతులకు చెక్కులు అందజేస్తారని వెల్లడించారు. ఈ సందర్భంగా వైరాలోని కేవీసీఎం కళాశాల సమీపాన సభ నిర్వహణకు ఎంపిక చేసిన స్థలాన్ని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్‌తో కలిసి మంత్రి సోమవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. వైరాలో జరిగే సభలో వ్యవసాయ శాఖ అనుబంధ శాఖలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడమే కాక రైతాంగ సదస్సు చరిత్రలో నిలిచిపోయేలా లక్ష మంది రైతులతో సభ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సదస్సుకు సీఎం, మంత్రులతో పాటు జాతీయ, రాష్ట్ర స్థాయి వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు హాజరవుతారని వెల్లడించారు.

తెలుగు, ఉర్దూ భాషల్లోనూ ఆర్‌ఓఆర్ ముసాయిదా

సీసీఎల్‌ఏ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి

సాక్షి, హైదరాబాద్: రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌ఓఆర్)-2024 ముసాయిదా బిల్లును ఇంగ్లిష్‌తో పాటు తెలుగు, ఉర్దూ భాషల్లోనూ అందుబాటులో ఉంచినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. www.ccla.telangana.gov.in అనే వెబ్‌సైట్‌లో ముసాయిదా బిల్లు ఉందని, ఆ బిల్లు కనిపించిన చోట తెలుగు లింక్ క్లిక్ చేస్తే తెలుగులో, ఉర్దూ లింక్ క్లిక్ చేస్తే ఉర్దూ భాషలో బిల్లు వస్తుందని మండల రెవెన్యూ కార్యాలయాల కంప్యూటరీకరణ ప్రాజెక్టు డైరెక్టర్ (సీఎంఆర్‌ఓపీడీ) వి.లచ్చిరెడ్డి తెలిపారు. కాగా, ఈ బిల్లుపై ప్రజలు తమ సూచనలు, సలహాలను ఈనెల 23 వరకు ప్రభుత్వానికి ఈ-మెయిల్ లేదా పోస్టు ద్వారా పంపే అవకాశం ఉన్న సంగతి తెలిసిందే.

బొగ్గు బ్లాక్‌లను ప్రైవేటీకరిస్తే ప్రమాదం

- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు విజయరాఘవన్



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి బొగ్గు బ్లాకులను ప్రైవేటీకరిస్తే తెలంగాణ రాష్ట్ర భవిష్యత్‌కు ప్రమాదమని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు విజయరాఘవన్ ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గత నెల 29న ప్రారంభమైన సింగరేణి పరిరక్షణ బస్సు యాత్ర సోమవారం కొత్తగూడెంలో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. మూడోసారి కేంద్రంలో అధికారం చేపట్టిన బీజేపీ ఎన్నికల సమయంలో సింగరేణి బ్లాక్‌లను ప్రైవేటీకరించబోమని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ ఆ తర్వాత కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ కేంద్రంగా 61 బొగ్గు బ్లాకుల వేలానికి శ్రీకారం చుట్టిందని విమర్శించారు. లాభాల్లో ఉన్న సింగరేణిపై కార్పొరేట్ శక్తుల కళ్లు పడ్డాయని, అందుకే సింగరేణి బావులను తమ మిత్రులైన అదాని, అంబానీలకు కట్టబెట్టేందుకు ప్రధాని నరేంద్రమోదీ కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. బొగ్గు బ్లాకుల వేలాన్ని వ్యతిరేకించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం బీజేపీ పక్కన చేరిందన్నారు. ఈ విషయాన్ని గమనించి సింగరేణి కార్మికులు, ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు కొత్తగూడెం పట్టణంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, పోతినేని సుదర్శన్, నాయకులు భూపాల్, ఆశయ్య, కాసాని అయిలయ్య, మందా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో యువకుడి అనుమానాస్పద మృతి

- 14 రోజుల తర్వాత ఆలస్యంగా వెలుగులోకి...
- ఎంఎస్ చదివేందుకు సిద్దిపేట జిల్లా నుంచి సియాటెల్‌కు
- నేడు స్వగ్రామానికి మృతదేహం



చివరిసారిగా ఎయిర్‌పోర్ట్‌లో కుటుంబ సభ్యులతో సాయిరోహిత్ (మధ్యలోని వ్యక్తి)

మద్దూరు(హుస్నాబాద్): పేదరికమే అయినా పెద్ద చదువులకు అమెరికాకు పంపించారు. ప్రయోజకుడై తిరిగి వచ్చి కుటుంబానికి అండగా ఉంటాడని అనుకున్నారు. కన్నవారి ఆశలు తీరకుండానే...కొడుకు విగతజీవిగా తిరిగివస్తున్నాడు. కొడుకు మరణవార్త ఇంకా ఆ తల్లికి తెలియదు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా ధూళ్మిట్ట మండలం కూటిగల్‌కు చెందిన సాయిరోహిత్(23) 2022లో బీటెక్ పూర్తి చేశాడు. గతేడాది డిసెంబర్ 20న ఎంఎస్ చదివేందుకు అమెరికా వెళ్లాడు. నలుగురు మిత్రులతో ఒక రూమ్‌లో ఉంటూ వాషింగ్టన్‌లోని సియాటెల్ నగరంలోని యూనియన్ కాలేజీలో ఎంఎస్ చేస్తున్నాడు. జూలై 22న సాయంత్రం 5 గంటలకు క్యాబ్‌లో బయటకు వెళ్లిన సాయిరోహిత్, తిరిగి వస్తూ మార్గమధ్యలో వేరే క్యాబ్‌లోకి మారాడు. అప్పటి నుంచి రూమ్‌కు రాకపోవడంతో అతని స్నేహితుడు అవినాశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తానా (తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా) సభ్యులకు కూడా సమాచారం అందించాడు. వారు, మిత్రులు వెతుకుతుండగా జూలై 24న సమ్మామిష్ సరస్సులో సాయిరోహిత్ మృతదేహం లభ్యమైంది. ఈ విషయాన్ని జూలై 25న కుటుంబ సభ్యులకు చెప్పారు. కాగా, సాయిరోహిత్ మృతిపై కుటుంబసభ్యులు, గ్రామస్తులు, స్నేహితులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రోహిత్ మృతదేహం మంగళవారం స్వగ్రామానికి చేరుకుంటుందని కుటుంబసభ్యులు తెలిపారు.

పేదరికమే అయినా..పెద్ద చదువులు

సాయిరోహిత్ కుటుంబం పేదరికంతో అల్లాడుతోంది. ఉన్న 20 గుంటల వ్యవసాయ భూమి, చిన్నపాటి ఇల్లును తాకట్టు పెట్టి రూ.30 లక్షల అప్పులు చేశారు. ఈ డబ్బుతో సాయిరోహిత్‌ను అమెరికాకు పంపించారు. కుమారుడు ప్రయోజకుడై అప్పులు తీర్చి, తమకు అండగా ఉంటాడని అనుకుంటే శవమై తిరిగొస్తున్నాడు.

స్టార్టప్ కంపెనీ పెట్టాలనే ఆశ తీరకుండానే..

సాయి రోహిత్ ఇంజనీరింగ్ చేసే సమయంలోనే స్వతహాగా స్టార్టప్ కంపెనీ పెట్టి రాణించాలని కలలు కనేవాడని మిత్రులు చెబుతున్నారు. అమెరికా నుంచి ఇండియాకు రాగానే ఇక్కడే కంపెనీ పెట్టి తనతో పాటుగా పలువురికి ఉపాధి కల్పించాలనుకున్నాడన్నారు. కానీ ఈ ఆశ నెరవేరకుండానే చనిపోవడం బాధగా ఉందని భావోద్వేగంతో వారు చెప్పారు.

కొడుకు మరణవార్త ఇంకా తల్లికి తెలియదు

సాయిరోహిత్ మరణవార్త తల్లి మంగవ్వకు తెలియకుండా కుటుంబసభ్యులు, గ్రామస్తులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తెలిస్తే బాధతో విలపిస్తుందని, అనారోగ్యానికి గురవుతుందని విషయం చెప్పలేదు. రోజూ మాదిరిగానే ఆమె 4 రోజులుగా ఇంట్లో పని చేసుకుంటుంది.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- 'ఖంజర్‌ఖెర్వా' గ్యాంగ్‌గా గుర్తింపు
- రూ.3.10 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, కారు స్వాధీనం

జహీరాబాద్: మధ్యప్రదేశ్‌కు చెందిన 'ఖంజర్‌ఖెర్వా' అంతర్రాష్ట్ర దొంగల ముఠా పోలీసులకు చిక్కింది. సోమవారం జహీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంగారెడ్డి ఎస్పీ రూపేష్ ఆ వివరాలు వెల్లడించారు. జూలై 26వ తేదీన ముంబై వ్యాపారి విశాల్‌జైన్‌కు చెందిన బంగారు ఆభరణాలను విక్రయించేందుకు అతడి బంధువు ఆశిష్‌జైన్ ఓ ట్రావెల్స్ బస్సులో హైదరాబాద్‌కు బయలుదేరాడు. మధ్యరాత్రి చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోహినూర్ దాబా వద్ద భోజనం చేసేందుకు దిగాడు. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు ఆ బస్సులోంచి 2.955 కిలోల బంగారు ఆభరణాలను దొంగలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్‌టీం దొంగల కోసం గాలింపుచర్యలు మొదలుపెట్టింది. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి డీఎస్పీ ఆధ్వర్యంలో 65వ నంబరు జాతీయ రహదారిపై బూర్దిపాడ్ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అటువైపుగా వచ్చిన ఓ కారును తనిఖీ చేయగా.. అందులో నలుగురు ఉన్నారు. వారిని విచారించే సమయంలో పారిపోవడానికి ప్రయత్నించారు. అందులో ఒకరిని అదుపులోకి తీసుకొని వివరాలు సేకరించారు. పట్టుబడిన వ్యక్తిని మధ్యప్రదేశ్‌లోని దార్ జిల్లాలోని దార్వార్‌పురా ప్రాంతానికి చెందిన ముస్తాక్ ఖాన్, అలియాస్ మాసూమ్(40)గా గుర్తించారు. అతని నుంచి ఇటీవల కోహినూర్ దాబా వద్ద చోరీకి గురైన బంగారం ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన వారిలో అష్రఫ్, ఫెరోజ్, సాజిద్‌లుగా ఉన్నారు. నిందితుల గుర్తింపులో సీసీ కెమెరాలు ముఖ్యపాత్ర పోషించాయని డీఎస్పీ చెప్పారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మరో భారీ చోరీకి వస్తూ,,,

నలుగురు సభ్యులున్న ఈ ముఠా దేశవ్యాప్తంగా దాబా హోటళ్ల వద్ద ఆగిఉన్న ట్రావెల్స్ బస్సులను టార్గెట్‌గా చేసి దొంగతనాలకు పాల్పడతారని ఎస్పీ చెప్పారు. ముఖ్యంగా వ్యాపారులను టార్గెట్ చేస్తారని, ఆదివారంరాత్రి సైతం జహీరాబాద్ ఏరియాలో మరో పెద్ద దొంగతనం చేసి మొత్తం బంగారాన్ని హైదరాబాద్‌లో అమ్ముకుందామని మధ్యప్రదేశ్ నుంచి జహీరాబాద్ వైపు వస్తూ పోలీసులకు చిక్కార న్నారు. కేసును ఛేదించిన పోలీసులకు ఎస్పీ రివార్డులు అందజేశారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

పెంట్లవెల్లిలో మళ్లీ ఫుడ్‌పాయిజన్

- ఈసారి ముగ్గురు ఉపాధ్యాయులు, 15 మంది విద్యార్థినులకు అస్వస్థత
- కేజీబీవీని ఉదయమే సందర్శించిన కలెక్టర్, డీఈఓ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

పెంట్లవెల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లిలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ)లో మరోసారి ఫుడ్‌పాయిజన్ ఘటన చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి 25 మంది విద్యార్థినులు వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో చేరగా.. సోమవారం రాత్రి మరో 15 మంది విద్యార్థినులతో పాటు ముగ్గురు ఉపాధ్యాయులు సైతం అస్వస్థతకు గురయ్యారు. వీరిలో తొమ్మిది మంది విద్యార్థినులను కొల్లాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, ఆరుగురు విద్యార్థినులకు పాఠశాలలోనే చికిత్స అందించారు. ఫుడ్ పాయిజన్‌కు గురైన ఉపాధ్యాయుల్లో ఒకరు కొల్లాపూర్‌లో, ఒకరు వనపర్తిలో, మరొకరు పాఠశాలలోనే చికిత్స పొందుతున్నారు. కాగా, సోమవారం ఉదయమే పాఠశాలను కలెక్టర్ బదావత్ సంతోష్, డీఈఓ గోవిందరాజు సందర్శించారు. విద్యార్థినులతో కలిసి భోజనాలు కూడా చేశారు. మరోవైపు మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం రాత్రి ఆస్పత్రిలో విద్యార్థులను పరామర్శించడంతో పాటు సోమవారం కొల్లాపూర్‌లో నియోజకవర్గంలోని ఏడు కేజీబీవీల విద్యార్థినులతో సమావేశమయ్యారు. మంత్రి సమావేశంతో పాటు కలెక్టర్, డీఈఓలు పెంట్లవెల్లి కేజీబీవీని సందర్శించి వెళ్లిన తర్వాత కూడా పాఠశాలలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఫుడ్ పాయిజన్‌కు గురవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

9న 'కొడంగల్–1' టెండర్లు!

- రూ.4,350 కోట్ల అంచనాలతో నారాయణపేట-కొడంగల్ లిఫ్టు పనులు
- రూ.2,200 కోట్ల అంచనాలతో రెండు ప్యాకేజీలుగా తొలి దశ పనులకు టెండర్లు
- రెండో దశ పనులకు తర్వాతి కాలంలో టెండర్లు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా.. ఉమ్మడి మహబూబ్‌నగర్ సాగు, తాగునీటి అవసరాలను తీర్చడానికి ప్రతిపాదించిన నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం తొలి దశ పనులకు ఈ నెల 9న రాష్ట్ర నీటిపారుదల శాఖ టెండర్లను ఆహ్వానించనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా 10 చెరువులకు నీటిని మళ్లించి, మొత్తం 4.022 టీఎంసీలను నిల్వ చేసే జలాశయాలుగా ఈ చెరువులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రూ.4,350 కోట్ల అంచనాలతో ఈ ప్రాజెక్టు పనులకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు జారీ చేసింది. రెండు దశల్లో ఈ పథకాన్ని నిర్మించనుండగా, భూసేకరణతో కలిపి రూ.2,945 కోట్ల అంచనాలతో తొలి దశ, రూ.1,404.50 కోట్లతో రెండో దశ పనులను చేపట్టనున్నారు. తొలి దశలోని సివిల్, ఎలక్ట్రోమెకానికల్ పనులకు సంబంధించిన పనులను రెండు ప్యాకేజీలుగా విభజించి టెండర్లు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్యాకేజీ-1 కింద రూ.1,100 కోట్లు, ప్యాకేజీ-2 కింద మరో రూ.1,100 కోట్లతో టెండర్లను పిలుస్తున్నట్టు నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి. రెండు ప్యాకేజీల పనులకు కలిపి మొత్తం రూ.2,200 కోట్లు కానున్నాయి. తొలి దశ ప్రాజె క్టులోని మిగిలిన రూ.745 కోట్లను భూసేకరణ, డిస్ట్రి బ్యూటరీ కాల్వల నిర్మాణానికి కేటాయించనున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నారాయణపేట, కొడంగల్, మక్తల్ నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగునీరు, నారాయణపేట జిల్లాకు తాగునీరు అందించడం ఈ ప్రాజెక్టు లక్ష్యాలు. సీఎం రేవంత్‌రెడ్డి గత ఫిబ్రవ రిలో ఈ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు.

ప్రస్తుతానికి మూడు చెరువుల అభివృద్ధికి టెండర్లు..

భీమా పథకంలో భాగంగా నిర్మించిన భూత్పూర్ జలాశయం నుంచి నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి నీటిని తరలించనున్నారు. ప్యాకేజీ-1 కింద భూత్పూర్ నుంచి ఉట్కూరు చెరువుకు నీళ్లను తరలించే పనులు చేపట్టను న్నారు. ప్యాకేజీ-2 కిద ఉట్కూరు నుంచి జయమ్మ, కనుకుర్తి చెరువులకు నీళ్లను తరలించే పనులు ఉంటాయి. రెండు ప్యాకేజీల కింద మూడు చెరువుల ఆధునీకరణ, నిల్వ సామర్థ్యం పెంపుతో పాటు ప్రెజర్ మెయిన్స్, పంప్ హౌస్‌లు, అప్రోచ్ కాల్వలు, ప్రధాన కాల్వల పనులు చేయనున్నారు. రెండో దశ పనుల్లో జాజాపూర్, దౌలతాబాద్, బొమ్రాస్‌పేట, లక్ష్మీపూర్, ఎర్లపల్లి, హుస్నాబాద్, కొడంగల్ చెరువుల నిల్వ సామర్థ్యం పెంపు, వాటికి నీళ్లను తరలించే పనులకు తదుపరిగా టెండర్లు నిర్వహించనున్నారు.

లక్ష ఎకరాలకు ఏడు టీఎంసీలు

మక్తల్ నియోజకవర్గంలో ఉట్కూరు, మక్తల్ మండలాల పరిధిలో 25,783 ఎకరాలు, నారాయణపేట నియోజకవర్గంలో నారాయణపేట, ధన్వాడ, దామరగిద్ద మండలాల్లో 20,472 ఎకరాలు, కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, మద్దూరు, కోస్గి, దౌలతాబాద్, బొమ్రాస్ పేట మండలాల్లో 53,745 ఎకరాలు కలిపి మొత్తం లక్ష ఎకరాలకు సాగునీటిని సరఫరా చేసేందుకు 7 టీఎంసీల జలాలను తరలించనున్నారు. 0.38 టీఎంసీల జలాలను నారాయణపేట జిల్లాలోని పలు గ్రామాలకు తాగునీటి అవసరాలకు కేటాయించారు. ఇందుకోసం అప్రోచ్ చానళ్లు, పంప్‌హౌస్‌లు, డెలివరీ మెయిన్స్, సిస్టర్న్‌లను నిర్మించనున్నారు. నీటి తరలింపుకోసం భూగర్భ సొరంగాలకు బదులు ప్రెషర్ మెయిన్స్ నిర్మించాలని నిర్ణయించారు.


హసీనా నివాసాన్ని ఆక్రమించిన జనం


బెడ్రూంలో పడకపై పడుకుని పోజులు


పార్లమెంటులో సెల్ఫీలు, స్మోకింగ్


బాతులు, చేపలు, మేకలు, కుందేళ్లను తీసుకెళ్తూ...

సంక్షోభ బంగ్లా


రాజీనామా చేసి దేశం వీడిన హసీనా

▶ మొదటి పేజీ తరువాయి

దేశ బాధ్యతలన్నింటినీ తాత్కాలికంగా నేనే స్వీకరిస్తున్నా. దయచేసి సహకరించండి'' అని ప్రకటించారు. నిరసనకారులపై ఒక్క తూటా కూడా పేల్చొద్దని సైన్యాన్ని, పోలీసు శాఖను ఆదేశించారు. ''అందరికీ న్యాయం జరిగేలా చూస్తాం. నిరసనకారులు ఆందోళన విరమించాలి'' అని కోరారు. వీలైనంత త్వరగా మధ్యంతర ప్రభుత్వ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఆ వెంటనే పార్టీలతో భేటీ అయ్యారు. తర్వాత ఆయా పార్టీల నేతలతో కలిసి రాష్ట్రపతితో భేటీ అయ్యారు. అధికార అవామీ లీగ్ మినహా మిగతా పక్షాలు హాజరయ్యాయి. మరోవైపు హసీనా దేశం వీడారన్న వార్తతో ఆందోళనకారులంతా దేశవ్యాప్తంగా ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. హసీనా అధికార నివాసంలోకి చొరబడ్డారు. సర్వం లూటీ చేసి తమ ఆగ్రహావేశాలను ప్రదర్శించారు. ఆమె తండ్రి, బంగబంధు షేక్ ముజిబుర్ రెహ్మాన్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. అధికార అవామీ లీగ్ కార్యాలయానికి నిప్పు పెట్టారు. పార్లమెంటులోకీ చొరబడ్డారు.

పుట్టి ముంచిన రిజర్వేషన్లు

రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమాలతో కొద్ది నెలలుగా బంగ్లాదేశ్ అట్టుడికిపోతుండటం తెలిసిందే. బంగ్లా విముక్తి యుద్ధవీరుల వారసులకు ప్రభుత్వోద్యోగాల్లో 30 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తూ గత జూన్‌లో హసీనా సర్కారు తీసుకున్న నిర్ణయం చివరికి ఆమె పుట్టి ముంచింది. ఆ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ యువత, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో రోడ్డెక్కారు. దాంతో నెల క్రితం జరిగిన భారీ ఆందోళనలు, ఘర్షణల్లో 200 మందికి పైగా మరణించారు. చివరికి సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఆ రిజర్వేషన్లను 5 శాతానికి తగ్గించింది. దాంతో సమస్య సమసినట్టేనని అంతా భావించారు. కానీ హసీనా తప్పుకోవాలంటూ వారం రోజులుగా మళ్లీ నిరసనలు వెల్లువెత్తాయి. 200 మంది అమాయకుల మృతికి ఆమే కారణమంటూ ఆందోళనలు తీవ్ర రూపు దాల్చాయి. హసీనా రాజీనామా డిమాండ్‌తో జనం మరోసారి రోడ్డెక్కారు. శని, ఆదివారాల్లో దేశవ్యాప్త ఘర్షణల్లో 100 మందికి పైగా మరణించారు. హసీనా సర్కారు ఓ మెట్టు దిగి వారిని చర్చలకు ఆహ్వానించినా ససేమిరా అన్నారు. దాంతో వారిపై హసీనా తీవ్రంగా మండిపడ్డారు. ఆ క్రమంలో, 'యువత ముసుగులో సంఘవిద్రోహ శక్తులే ఘర్షణలకు దిగుతున్నా'రంటూ ఆదివారం ఆమె చేసిన వ్యాఖ్యలతో పరిస్థితి పూర్తిగా చేయి దాటిపోయింది. హసీనాను గద్దె దింపడమే లక్ష్యంగా 'ఢాకా లాంగ్ మార్చ్'కు నిరసనకారులు పిలుపునిచ్చారు. అది చివరికి హసీనా పలాయనానికి దారితీసింది. రిజర్వేషన్ల రగడ ఆమె 15 ఏళ్ల పాలనకు చివరికిలా తెరదించింది. నాలుగోసారి అధికారంలోకి వచ్చి ఆర్నెల్లు కూడా దాటకుండానే హసీనా సర్వం పోగొట్టుకుని శరణార్థిగా దేశం వీడాల్సి వచ్చింది!



ఆలయాల విధ్వంసం

హసీనా రాజీనామా చేశారన్న ప్రకటన వింటూనే దేశవ్యాప్తంగా జనం రెచ్చిపోయారు. ఢాకాలో ప్రధాని అధికార నివాసంతో పాటు హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్ నివాసంలోకి చొచ్చుకెళ్లారు. వాటిని పూర్తిగా లూటీ చేశారు. హసీనా భర్త డాక్టర వాజెద్ మియా ఇంటిని కూడా వదిలిపెట్టలేదు. దానికి నిప్పు పెట్టారు. బంగబంధు స్మారక మ్యూజియంతో పాటు బంగ్లాదేశ్‌తో భారత ద్వైపాక్షిక సంబంధాలకు ప్రతీకగా నిలిచిన ఇందిరా సాంస్కృతిక కేంద్రం తదితరాలకు కూడా నిప్పు పెట్టారు. దేశ ప్రధాన న్యాయమూర్తి నివాసంపైనా అల్లరి మూకలు దాడికి దిగాయి. కాసేపటికే ఇంట్లోంచి కేకలు, ఆక్రందనలు, మూలుగులు విన్పించినట్టు స్థానిక మీడియా పేర్కొంది. దేశవ్యాప్తంగా హింసాకాండ, ఆస్తుల విధ్వంసం తదితరాలు కొనసాగాయి. నాలుగు ఆలయాలను ధ్వంసం చేశారు. ఎంపీలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారుల నివాసాలు, కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లపై రాళ్లు రువ్వారు. వాటికి నిప్పు పెట్టారు.

రన్‌వే మీదా వెంటాడిన జనం...
త్రుటిలో తప్పించుకున్న హసీనా

సైనిక విమానంలో సోదరితో కలిసి ఉన్నపళంగా బంగ్లా వీడిన హసీనా తన సోదరి షేక్ రెహానాతో కలిసి ఢిల్లీ చేరుకున్నారు. ఆ క్రమంలో, వెల్లువెత్తిన జనాగ్రహం బారినుంచి ఆమె త్రుటిలో తప్పించుకున్నారు! హసీనాను వెంబడిస్తూ నిరసనకారులు ఢాకా విమానాశ్రయంలోకి కూడా చొచ్చుకొచ్చారు. వారిలో పలువురు గేట్లన్నింటినీ బద్దలు కొట్టుకుంటూ హసీనాకు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తిస్తూ రన్‌వే మీదికి కూడా చేరుకున్నారు. అప్పటికే ఆమె, సోదరి బంగ్లా వైమానిక దళానికి చెందిన సి–130జె రవాణా విమానం ఎక్కేశారు. దాంతో నిరసన మూక బారిన పడకుండా తప్పించుకున్నారు. కాసేపటికి వారిద్దరూ ఢిల్లీ సమీపంలో గాజియాబాద్‌లోని హిండన్ వైమానిక స్థావరానికి చేరుకున్నారు. విమానం భారత వాయుతలంలోకి ప్రవేశించగానే మన వాయుసేన విమానాలు రక్షణగా తోడు వచ్చాయి. దేశం వీడి వెళ్లిపోయేందుకు హసీనాకు సైన్యం 45 నిమిషాల సమయం ఇచ్చినట్టు సమాచారం!

హసీనా ఇంటి ముట్టడి

రెండేళ్ల క్రితం శ్రీలంక అంతర్యుద్ధం సందర్భంగా ఏం జరిగిందో గుర్తుందా? అధ్యక్ష నివాసాన్ని ముట్టడించిన జనం భవనమంతా కలియదిరిగారు. అధ్యక్షుని కుర్చీలో విలాసంగా కూర్చుని ఫొటోలకు పోజులిచ్చారు. సెల్ఫీలు దిగారు. కిచెన్లో దూరి ఉన్నవన్నీ తింటూ సరదాగా గడిపారు. ఈత కొలనుల్లో ఈదులాడారు. సోమవారం ఢాకాలోనూ అవే దృశ్యాలు పునరావృతమయ్యాయి. ప్రధాని హసీనా రాజీనామా చేసి దేశం వీడినట్టు తెలియగానే నిరసనకారులు సంబరాలు చేసుకున్నారు. ఆమె అధికార నివాసం 'గణభదన్'ను భారీ సంఖ్యలో ముట్టడించారు. డ్రమ్ములు వాయిస్తూ, కొమ్ముబూరాలు ఊదుతూ విజయనాదం చేశారు. జాతీయ పతాకాలు చేబూని స్వేచ్ఛా నినాదాలు చేశారు. లాన్ల నిండా పరుగులు తీస్తూ, స్విమింగ్‌పూల్స్‌లో ఈదులాడుతూ, భవనమంతా కలియదిరుగుతూ హసీనాపై తమ ఆగ్రహాన్ని వెలిగక్కారు. భద్రతా సిబ్బందితో ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. ప్రధాని కుర్చీలో కూర్చున్నారు. బెడ్రూంలో మంచంపై హాయిగా సేదదీరారు. వంట సామగ్రి మొదలుకుని ఫర్నిచర్, పురాతన వస్తువుల దాకా సర్వం ఎత్తుకెళ్లారు. ఎవరికి ఏది చేతికందితే అది తీసుకెళ్లారు. భవనాన్ని పూర్తిగా లూటీ చేసి వదిలారు. ఒక వ్యక్తి లిప్‌స్టిక్‌లు చేత బట్టుకుని మీడియా కంటబడ్డాడు. ''నియంత కబంధ హస్తాల నుంచి దేశాన్ని విముక్తం చేశాం. మా పోరాటానికి ప్రతీకగా ఈ లిప్‌స్టిక్‌ను నా దగ్గరుంచుకుంటా'' అని చెప్పుకొచ్చాడు! దేశ పార్లమెంటులోకి కూడా జనం వెల్లువలా దూసుకెళ్లారు. ప్రజాప్రతినిధురల కుర్చీల్లో కూర్చుని విలాసంగా పొగ తాగుతూ, సెల్ఫీలు తీసుకుంటూ గడిపారు.



భారత్‌పై ప్రభావం ఎంత?!

బంగ్లాదేశ్ సంక్షోభం భారత్‌పై ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది ఆసక్తికరంగా మారింది. హసీనా తొలి నుంచీ భారత్‌కు గట్టి మద్దతుదారు. ఆమె హయాంలో 15 ఏళ్లుగా ద్వైపాక్షిక బంధం నానాటికీ దృఢమవుతూనే వస్తోంది. ముఖ్యంగా బంగ్లాదేశ్‌లోని భారత వ్యతిరేకుల నోళ్లకు హసీనా గట్టిగా తాళం వేశారు. 2009లో ఆమె రెండోసారి గద్దెనెక్కినప్పుడు యూపీఏ-2 మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్నారు. ఆ ఐదేళ్లలో ఇరు దేశాల బంధం గట్టిపడింది. 2014లో నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక సంబంధాలు మరింతగా బలపడుతూ వచ్చాయి. మన ప్రబల ప్రత్యర్థి చైనాకు బంగ్లాదేశ్ మరీ దగ్గరవకుండా ఉండేందుకు పలు అంశాల్లో బంగ్లాకు ఇతోధికంగా సాయపడుతూ వచ్చింది. ఖలీదా జియా హయాంలో ఇరు దేశాల మధ్య మనస్పర్ధలు తలెత్తాయి. భారత వ్యతిరేకతే జియా ప్రధాన ఎన్నికల ప్రచారాస్త్రంగా ఉంటూ వస్తోంది కూడా! బంగ్లాదేశ్ మేలు కంటే హసీనా, అవామీ లీగ్ రాజకీయ ప్రయోజనాల పరిరక్షణే భారత్‌కు ప్రధానమని ఆ దేశంలో ఒక వర్గంలో ఉన్న అభిప్రాయానికి ఆమె గట్టి సమర్థకురాలు. జియా హయాంలో ఉల్ఫా తీవ్రవాదులు బంగ్లా కేంద్రంగా ఈశాన్య భారతంలో ధ్వంసరచన చేశారు. కొద్ది నెలల క్రితం బంగ్లాదేశ్‌లో సాగిన 'బాయ్‌కాట్ భారత్' ప్రచారానికి జియా, బీఎన్‌పీ నేతలు బాహాటంగా మద్దతిచ్చారు. ఈ నేపథ్యంలో జియా జైలు నుంచి విడుదలవడమే గాక సైన్యం దన్నుతో కూడిన మధ్యంతర ప్రభుత్వానికి సారథ్యం వహించవచ్చన్న వార్తలు భారత్‌కు ఇబ్బందికరమే.



అప్రతిష్ట మూటగట్టుకున్న ఐరన్ లేడీ!

హసీనా ప్రస్థానం.. ఆద్యంతం వెలుగునీడలమయం

బంగ్లాదేశ్‌కు స్వేచ్ఛా వాయువులందించిన బంగబంధు షేక్ ముజిబుర్ రెహ్మాన్ గారాలపట్టి. ఆయన వారసురాలిగా తొలినాళ్లలో బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య పరిరక్షణకు గళమెత్తిన నేతగా అంతర్జాతీయ గుర్తింపు. అనంతర కాలంలో రాజకీయ రంగంపైనా తిరుగులేని ముద్ర. దేశ చరిత్రలో ఏకంగా ఐదుసార్లు ప్రధాని పదవిని అధిష్ఠించిన ఏకైక నేత. ఇంతటి ఘనమైన రికార్డులు షేక్ హసీనా సొంతం. అభిమానుల దృష్టిలో ఐరన్ లేడీగా పేరు. కానీ ప్రధానిగా 2009లో రెండో దఫా పగ్గాలు చేపట్టిన నాటినుంచీ నియంతగా ఆమె ఇంటా బయటా అప్రతిష్ట మూటగట్టుకున్నారు. గత గత జనవరిలో విపక్షాలన్నీ మూకుమ్మడిగా బహిష్కరించిన ఏకపక్ష ఎన్నికల్లో 'ఘనవిజయం' సాధించి వరుసగా నాలుగోసారి ప్రధాని అయ్యారు. కానీ ఆర్నెల్లు కూడా తిరగకుండానే ప్రజల ఛీత్కారాలకు గురయ్యారు. అవమానకర రీతిలో ప్రాణాలు అరచేతిలో పట్టుకుని దేశం వీడారు!

విద్యార్థిగానే రాజకీయాల్లోకి

1947లో నాటి తూర్పు పాకిస్తాన్ (నేటి బంగ్లాదేశ్)లో జన్మించారు హసీనా. ఢాకా వర్సిటీలో చదివే రోజుల్లోనే చురుగ్గా రాజకీయాల్లో పాల్గొన్నారు. 1975లో సైన్యం ముజిబుర్, ఆయన భార్య, ముగ్గురు కుమారులతో పాటు 18 మంది కుటుంబీకులను దారుణంగా కాల్చి చంపింది. హసీనా, ఆమె చెల్లెలు రెహానా విదేశాల్లో ఉండటంతో ఈ మారణకాండ నుంచి తప్పించుకున్నారు. భారత్‌లో ఆరేళ్ల ప్రవాసం అనంతరం 1981లో హసీనా బంగ్లా గడ్డపై కాలు పెట్టారు. సైనిక పాలనకు వ్యతిరేకంగా గళం విప్పారు. పలుమార్లు గృహనిర్బంధానికి గురయ్యారు. 1996లో తొలిసారి ప్రధాని అయ్యారు. 2001లో ఓటమి చవిచూసినా 2008 ఎన్నికల్లో రెండోసారి గద్దెనెక్కారు. నాటినుంచీ ప్రధానిగా కొనసాగుతున్నారు. 2004లో గ్రెనేడ్ దాడి నుంచి త్రుటిలో బయటపడ్డారు.


1996లో తొలిసారి ప్రధానిగా ప్రమాణం చేస్తూ..

విపక్షాలను వెంటాడి...

నిజానికి ప్రధానిగా హసీనా సాధించిన విజయాలు తక్కువేమీ కాదు. రాజకీయ అస్థిరతతో, ఆర్థిక అవ్యవస్థతో కొట్టుమిట్టాడిన బంగ్లాదేశ్‌ను ఒడుపుగా ఒడ్డున పడేశారు. కానీ 2009లో రెండోసారి పగ్గాలు చేపట్టాక విపక్ష నేతలే లక్ష్యంగా ప్రతీకార రాజకీయాలకు హసీనా తెర తీశారు. 1971 యుద్ధ నేరాల కేసులను తిరగదోడారు. ట్రిబ్యునల్ ద్వారా శరవేగంగా విచారణ జరిపి పలువురు ఉన్నతస్థాయి విపక్ష నేతలను దోషులుగా తేల్చారు. ఖలీదా సారథ్యంలోని విపక్ష బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్‌పీ) కీలక భాగస్వాములను 2013లో ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధించారు. అవినీతి ఆరోపణలపై ఖలీదాకు 17 ఏళ్ల జైలుశిక్ష పడింది. వీటికి తోడు ఆర్థిక పరిస్థితి దిగజారింది. దేశంలో ఏకంగా 3.2 కోట్లమంది నిరుద్యోగులున్నారు. ఇలాంటి సమయంలో రిజర్వేషన్ల కోటాను తిరగదోడటం హసీనాకు రాజకీయంగా మరణశాసనం రాసింది. నాటి యుద్ధంలో ప్రధానంగా పాల్గొన్నది నేటి అధికార పార్టీ అవామీ లీగే. దాంతో, సొంత పార్టీ కార్యకర్తలకు అత్యధిక లబ్ధి చేకూర్చేందుకే రిజర్వేషన్లను తిరిగి తెరపైకి తెచ్చారంటూ దేశమంతా భగ్గుమంది. కీలక సమయంలో సైన్యం కూడా సహాయ నిరాకరణ చేయడంతో హసీనా రాజీనామా చేసి ప్రాణాలు కాపాడుకునేందుకు దేశం వీడాల్సి వచ్చింది.

నాడూ ఆరేళ్లు భారత్ ఆశ్రయం

ఆపత్కాలంలో షేక్ హసీనాకు భారత్ ఆశ్రయమివ్వడం కొత్తేమీ కాదు. ముజిబుర్‌ను సైన్యం పొట్టన పెట్టుకున్నాక 1975 నుంచి 1981 దాకా ఆరేళ్లపాటు సోదరి, భర్త, పిల్లలతో పాటు ఆమె భారత్‌లోనే ఆశ్రయం పొందారు. ఢిల్లీలోని లజ్‌పత్ నగర్, పండోరా రోడ్ నివాసాల్లో గడిపారు. రెండేళ్ల క్రితం ఓ ఇంటర్వ్యూలో నాటి రోజులను హసీనా గుర్తు చేసుకున్నారు. ''అప్పుడు నేను, నా భర్త పశ్చిమ జర్మనీలో ఉన్నాం. మాకు ఆశ్రయమిస్తామంటూ నాటి ప్రధాని ఇందిరాగాంధీ వర్తమానం పంపారు. ఢిల్లీలో దిగగానే నేరుగా ఆమెను కలిశాను. నా తండ్రితో పాటు కుటుంబంలో 18 మందిని సైన్యం పొట్టన పెట్టుకున్నట్టు ఆమె ద్వారానే నాకు తెలిసింది. రహస్యంగా ఢిల్లీలోనే కాలం వెళ్లదీశాం. నా భర్త ఇక్కడే ఉద్యోగం కూడా చేశారు'' అని చెప్పుకొచ్చారు హసీనా.

హసీనాతో దోవల్ భేటీ



జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ హిండన్ ఎయిర్‌బేస్‌లో హసీనాతో భేటీ అయ్యారు. వారు ఏం చర్చించిందీ తెలియరాలేదు. అనంతరం ఆమెను సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఢిల్లీలో ఉన్న తన కూతురు సైమా వాజెద్‌ను కలిసిన అనంతరం హసీనా లండన్ వెళ్తారని సమాచారం. వాజెద్ ప్రపంచ ఆరోగ్య సంస్థలో ఆగ్నేయాసినా ప్రాంతీయ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు.

తిరిగి రారు: కుమారుడు



లండన్: హసీనా తిరిగి బంగ్లాదేశ్ రాజకీయాల్లో వేలు పెట్టబోరని ఆమె కుమారుడు సజీవ్ వాజెద్ జాయ్ ప్రకటించారు. ఆమె క్షేమం కోరి కుటుంబీకులమంతా ఒత్తిడి చేసిన మీదటే దేశం వీడారని బీబీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు.

ఖలేదా జియాకు విముక్తి



ఢాకా: జైలు శిక్ష అనుభవిస్తున్న మాజీ ప్రధాని ఖలేదా జియాను వెంటనే విడుదల చేయాలని బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహ్మద్ షహబుద్దీన్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. షేక్ హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేయడంతోపాటు దేశం విడిచిపెట్టిన కొన్ని గంటల్లోనే ఈ పరిణామం సంభవించడం గమనార్హం. అధ్యక్షుడు షహబుద్దీన్ ప్రతిపక్ష పార్టీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) చీఫ్ ఖలేదా జియాను తక్షణమే విడుదల చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయానికి వచ్చినట్లు ఒక అధికారిక ప్రకటన వెలువడింది. షేక్ హసీనా మొదటిసారిగా 1996లో దేశ ప్రధానిగా పగ్గాలు చేపట్టారు. ఆ తర్వాత ఖలేదా జియా అధికారంలోకి వచ్చారు. అప్పటి నుంచి ప్రధాని కుర్చీ వారిద్దరి మధ్య మారుతూ వచ్చింది.

నిరసనలు ఇలా...

జూన్ 5: స్వాతంత్ర్యసమర యోధుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 30 శాతం రిజర్వేషన్ల కోటాను పునరుద్ధరిస్తూ కోర్టు తీర్పు
జూన్ 6: యూనివర్సిటీల్లో మొదలైన ఆందోళనలు. దేశమంతటికీ వ్యాప్తి.
జూన్ 7: విద్యార్థుల రహదారుల దిగ్బంధం
జూన్ 15: పెరిగిన నిరసనల తీవ్రత
జులై 15: హింసాత్మకంగా మారిన నిరసనలు
జులై 18: ఆందోళనలు తీవ్రరూపం..19 మంది మృతి. కర్ఫ్యూ, రంగంలోకి సైన్యం
జులై 19: దేశమంతటా హింస
జులై 21: కోటాను 5 శాతానికి తగ్గిస్తూ సుప్రీంకోర్టు తీర్పు
ఆగస్ట్ 3: మృతి చెందిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలంటూ మళ్లీ నిరసనలు
ఆగస్ట్ 4: దేశవ్యాప్త ఆందోళనల్లో మరో 100 మందికి పైగా మృతి. న్యాయ విచారణకు ప్రభుత్వం ఆదేశం. అయినా చల్లారని జనాగ్రహం
ఆగస్ట్ 5: ప్రధాని షేక్ హసీనా రాజీనామా. దేశం విడిచి పలాయనం

బడ్జెట్‌కు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ: 2024–25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌కు సోమవారం లోక్‌సభ ఆమోదముద్ర వేసింది. గత వారం బడ్జెట్‌పై చర్చ ముగిశాక తాజాగా పార్లమెంట్ దిగువసభ తన ఆమోదం తెలిపింది. దీంతోపాటు సభ ఆమోదించిన బడ్జెట్ పద్దుల మేరకు సంచిత నిధి నుంచి మొత్తాలను వినియోగించేందుకు అనుమతించే ద్రవ్య వినిమయ బిల్లుకు లోక్‌సభ ఆమోదముద్ర వేసింది. రైల్వే, విద్య, ఆరోగ్యం, మత్స్యరంగాలకు సంబంధించిన గ్రాంట్‌ల వినియోగానికి సంబంధిన బిల్లుకూ లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్తగా ప్రతిపాదించిన పన్ను శ్లాబుల సంబంధ ఫైనాన్స్ బిల్లుపై లోక్‌సభలో చర్చ జరగనుంది. రాజ్యసభలో వ్యవసాయం, పునరుత్పాదక శక్తి, సహకార రంగం, గృహ పట్టణాభివృద్ధికి కేటాయింపులపై చర్చ జరగనుంది. ఫైనాన్స్ బిల్లుపై రాజ్యసభలో చర్చ జరిగినా మార్పులు సిఫార్సు చేయబోదు. కేవలం ఆ బిల్లులను తిరిగి లోక్‌సభకు పంపగలదు. ఫైనాన్స్ బిల్లు ఆమోదం పొందాక బడ్జెట్ తంతు మొత్తం ముగుస్తుంది.

ఉద్యానవనాల కోసం రూ.18వేల కోట్లు

రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా వచ్చే ఐదేళ్లలో ఎగుమతి కోసం ఉద్దేశించి 100 ఉద్యానవనాల క్లస్టర్ల ఏర్పాటు కోసం మొత్తంగా రూ.18,000 కోట్లు కేటాయిస్తున్నట్లు కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సోమవారం రాజ్యసభలో చెప్పారు. వంటనూనెల దిగుమతి వ్యయం తగ్గించుకోవడంతో పాటు దేశీయంగా నూనెగింజల దిగుబడి పెంచేందుకు రూ.6,800 కోట్లను ఆయిల్‌సీడ్ మిషన్‌కు కేటాయిస్తున్నట్లు చౌహాన్ వెల్లడించారు. స్వాతంత్ర్య సిద్ధించాక సేద్యరంగం బాగు కోసం కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిందేమీలేదని వ్యాఖ్యానించారు. దీనిపై విపక్ష సభ్యులు తీవ్ర నిరసన తెలిపారు. దిగ్విజయ్‌సింగ్ వంటి కాంగ్రెస్ నేతలు మాట్లాడేందుకు ప్రయత్నించినా ఛైర్మన్ ధన్‌ఖడ్ అనుమతించలేదు. దీంతో విపక్ష సభ్యులు వాకౌట్‌చేశారు.

సర్వేలో ముందంజలో కమలా హారిస్

వాషింగ్టన్: బైడెన్ అభ్యర్థిత్వం వేళ దాదాపు ఏకపక్షంగా కనిపించిన అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచార సరళిలో అనూహ్య మార్పులు కనిపిస్తున్నాయి. రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌తో ధీటుగా మాట్లాడలేక తడబడి, చివరకు తప్పుకున్న బైడెన్ అభ్యర్థిగా ఉన్నంతకాలం ట్రంప్ ముందంజలో ఉండటం తెల్సిందే. తాజా డెమొక్రటిక్ పార్టీ తరఫున కమలా హారిస్ రంగంలోకి దిగాక పోరు హోరాహోరీగా సాగుతోందని విశ్లేషణలు వెలువడ్డాయి. వీటికి బలం చేకూరుస్తూ తాజా సర్వేలో ట్రంప్ కంటే కమల హారిస్‌కే ఆదరణ ఒక శాతం ఎక్కువగా ఉందని తేలింది. తాజాగా ఆదివారం సీబీఎస్ న్యూస్/యూగవ్ సంస్థ చేపట్టిన సర్వేలో కమల ఆధిక్యం కనబరిచారు. ట్రంప్ అధ్యక్ష పదవిలో మానసికంగా స్థిమితంగా ఆలోచించగలరని 51 శాతం మంది, కమల మెరుగ్గా పరిపాలించగలరని 64 శాతం చెప్పారు.

మృత్యుకుహరాలా..

కోచింగ్ సెంటర్లపై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: ఢిల్లీలోని కోచింగ్ కేంద్రాలు డెత్ ఛాంబర్‌లుగా తయారయ్యాయని సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. కోచింగ్ కేంద్రాలు అభ్యర్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని వ్యాఖ్యానించింది. రావూస్ స్టడీ సర్కిల్ బేస్‌మెంట్‌లో వరదనీరు పోటెత్తి ముగ్గురు విద్యార్థుల ప్రాణాలను బలిగొన్న ఉదంతంపై సూమోటోగా కేసును స్వీకరించిన సుప్రీంకోర్టు ధర్మాసనం వివరణ ఇవ్వాలంటూ సోమవారం కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులను జారీచేసింది. ''మేం చదివే అంశాలు భయంకరంగా ఉన్నాయి. వాస్తవానికైతే ఇలాంటి కోచింగ్ కేంద్రాలను మనం వెంటనే మూసేయించాలి. కానీ ప్రస్తుతానికి కోచింగ్ ఆపకూడదనే ఉద్దేశంతో వీటిని కేవలం ఆన్‌లైన్‌లో అయినా కొనసాగించాలి. భవన నిర్మాణ మార్గదర్శకాలు, భద్రతా ప్రమాణాలపై కఠినంగా వ్యవహరించాలి. ఇలాంటి కోచింగ్ సెంటర్లు డెత్ చాంబర్లుగా మారాయి. పోటీపరీక్షల ఆశావహుల ఆశలు, జీవితాలతో కోచింగ్‌కేంద్రాలు ఆటలాడుతున్నాయి. ఎన్నో కలలతో దేశరాజధానికొచ్చిన వారికి తమ కలల సాకారం ఎంతో కష్టమవుతోంది. ముగ్గురు అభ్యర్థుల మరణం నిజంగా మనందరికీ కనువిప్పు కల్గించే ఘటన. అసలు కోచింగ్ సెంటర్లలో ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారు? వాటిని ఏ మేరకు అమలుచేస్తున్నారో మాకు వివరణ ఇవ్వండి'' అంటూ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలను ఆదేశించింది.

కశ్మీర్ అసెంబ్లీకి సెప్టెంబర్‌లో ఎన్నికలు

కేంద్ర మంత్రి, జమ్మూకశ్మీర్ బీజేపీ ఇన్‌చార్జి జి.కిషన్ రెడ్డి వెల్లడి

ఆర్‌ఎస్‌పురా: జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి సెప్టెంబర్‌లో ఎన్నికలు జరుగుతాయని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ కేంద్ర పాలిత ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలు ఇకపైనా కొనసాగాలంటే బీజేపీకే అధికారమివ్వాలని ఆయన ప్రజలను కోరారు. ఆర్టికల్ 370 రద్దుకు ఐదేళ్లయిన సందర్భంగా సోమవారం జమ్మూ శివారులోని బానా సింగ్ స్టేడియంలో మహోత్సవ్ ర్యాలీనుద్దేశించిమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడారు.

కేజ్రీవాల్ అరెస్టు సబబే: ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: మద్యం కేసులో సీబీఐ తనను అరెస్ట్‌చేయడాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టు మెట్లెక్కిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు చుక్కెదురైంది. అవకతవకల మద్యం విధానం ద్వారా అవినీతి చోటుచేసుకుందంటూ కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) కేజ్రీవాల్‌ను అరెస్ట్‌చేయడాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నీనా బన్సల్ కృష్ణ సమర్థించారు. న్యాయసమ్మతమైన కారణం లేకుండా అరెస్ట్ చేశారని అనలేమని వ్యాఖ్యానిస్తూ కేజ్రీవాల్ పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. అయితే బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లే స్వేచ్ఛ కేజ్రీవాల్‌కు ఉందని ఈ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది. సీబీఐ అరెస్ట్‌ను సవాల్ చేస్తూ ఈ అంశంపై గతంలోనే వాదనలు విన్న కోర్టు జూలై 17వ తేదీన తీర్పును రిజర్వ్‌చేసి సోమవారం వెలువరిచింది.

సాక్షి హైదరాబాద్

మంగళవారం । 6 । ఆగస్టు । 2024



గంజాయి రవాణాలో కొత్త ప్లాన్
గంజాయి అక్రమ రవాణాలో పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు స్మగ్లర్లు కొత్త పంథాలను అనుసరిస్తున్నారు. గంజాయి రవాణాకు ఏకంగా ఓ బాలికనే వినియోగించారు. -8లో



సీడీ దొరక్క శిక్ష పడలేదు!
సీసీ కెమెరాల ఫుటేజీతో కూడిన సీడీ కోర్టుకు సమర్పించడంలో జరిగిన తప్పిదంతో ఓ ఉగ్రవాదికి శిక్ష పడలేదు. సీడీ పోలీసుల వద్దే మిస్ కావడంతో నిర్దోషిగా ప్రకటిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. -8లో

గరిష్టం/కనిష్టం
32.0/24.0

వాతావరణం
నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలిక పాటి వర్షం లేదా చినుకులు పడే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఉపరితల గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

అక్వేరియం ఏమైనట్టు!

కొత్వాల్‌గూడ ఎకో పార్కులో టన్నెల్ అక్వేరియంకు ప్రణాళికలు

- రెండు సార్లు టెండర్లు పిలిచినా స్పందన శూన్యం
- ఇంకా పెండింగ్‌లోనే ప్రాజెక్టు



అక్వేరియం నమూనా చిత్రం

సాక్షి, సిటీబ్యూరో: అక్వా మెరైన్ పార్కు...హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టన్నెల్ అక్వేరియం ప్రాజెక్టు ఇది. కొత్వాల్‌గూడ ఎకో పార్కులో అత్యాధునిక హంగులతో అక్వేరియం నిర్మాణానికి హెచ్ఎండీఏ అప్పట్లో ప్రణాళికలను రూపొందించింది. ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని తలపెట్టింది. కానీ ఏళ్లు గడిచినా ఆ ప్రాజెక్టు ఆచరణకు నోచలేదు. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంలో నిర్మించాలని భావించారు. రెండుసార్లు టెండర్లు కూడా ఆహ్వానించారు. కానీ నిర్మాణ సంస్థల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లభించలేదు. ప్రస్తుతం ఎకోపార్కు తుది దశకు చేరుకుంది. కానీ టన్నెల్ అక్వేరియం ఏర్పాటు మాత్రం పెండింగ్ జాబితాలో పడిపోయింది. కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ఇటీవల హెచ్ఎండీఏ చేపట్టిన పలు అభివృద్ధి ప్రాజెక్టులను, పార్కులను పరిశీలించారు. ఈ క్రమంలో గత ప్రభుత్వంలో ప్రతిపాదించిన టన్నెల్ అక్వేరియంపైన ప్రస్తుతం ఎలా ముందుకు వెళ్లనున్నదనేది చర్చనీయాంశంగా మారింది. సుమారు రూ.150 కోట్లతో ప్రతిపాదించిన అక్వేరియం ప్రతిపాదన ఉన్నట్లా? లేనట్లా అనే అంశంపైనా సందిగ్ధం నెలకొంది.

నగర పర్యాటకానికి మణిహారం....

హిమాయత్‌సాగర్‌కు చేరువలో హెచ్ఎండీఏ 85 ఎకరాల విస్తీర్ణంలో కొత్వాల్‌గూడ ఎకోపార్కు నిర్మాణం చేపట్టింది. నగరవాసులకు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు ఒక అందమైన, ఆహ్లాదకరమైన అనుభూతిని కలిగించే విధంగా పార్కును విస్తరించారు. ఈ పార్కులోనే సుమారు 4.27 ఎకరాల్లో టన్నెల్ అక్వేరియం ఏర్పాటుకు సన్నాహాలు చేపట్టారు.

ఇందుకోసం దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అక్వేరియంలపైన అధికారులు అధ్యయనం కూడా చేశారు. ఇప్పటి వరకు ఉన్న అన్ని అక్వా మెరైన్ పార్కుల కంటే మరిన్ని ఆధునిక హంగులతో దీన్ని అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. కానీ పీపీపీ పద్ధతిలో ప్రతిపాదించిన ఈ భారీ అక్వేరియం నిర్మాణానికి కాంట్రాక్టు సంస్థలు ముందుకు రాలేదు. గత సంవత్సరం రెండుసార్లు టెండర్లు పిలిచారు. స్పందన రాకపోవడంతో కొంతమంది ఆసక్తి కలిగిన డెవలపర్లతో ప్రీ బిడ్ సమావేశాన్ని కూడా ఏర్పాటు చేశారు. కానీ వారి నుంచీ పెద్దగా స్పందన కనిపించలేదు.

దీంతో ఈ ప్రాజెక్టు పెండింగ్ జాబితాలో పడిపోయింది. దీనిపై మరోసారి ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపైన అధికారులు ప్రస్తుతం సమాలోచనలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ ప్రాజెక్టును పూర్తిగా పెట్టేయడమా లేక, మరోసారి ఆసక్తి ఉన్న నిర్మాణ సంస్థల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి విధి విధానాల్లో మార్పులు చేయడమా అనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారినట్లు అధికారులు తెలిపారు. కొద్ది రోజుల్లోనే ఈ ప్రాజెక్టుపైన స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

రంగు రంగుల చేపలతో...

- కొత్వాల్‌గూడ ఎకో పార్కు ఏర్పాటు కోసం, చెన్నై వీజీటీ మెరైన్‌పార్కు, అహ్మదాబాద్ సైన్స్‌సిటీ ప్రాజెక్టులపైన అధికారులు అధ్యయనం చేశారు. ఆ తరువాత దేశంలోనే అతి పెద్ద టన్నెల్ పార్కుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను రూపొందించారు.
- వేయి రకాల రంగు రంగుల చేపలు, మెరైన్ స్పీసెస్, బహుళ టన్నెల్స్‌తో ఈ మెగా అక్వా మెరైన్ పార్కును అందంగా తీర్చి దిద్దాలని భావించారు. షార్క్ చేపల నుంచి డాల్ఫిన్‌ల వరకు ఉంటాయి. ఇది సందర్శకులకు ఒక అద్భుతమైన అనుభూతినిచ్చే విధంగా, అతి పెద్ద జలాశయం అడుగున పర్యటిస్తూ వీక్షిస్తున్న అనుభూతి కలిగించే విధంగా ఉంటుంది.
- అలాగే అక్వేరియంను దగ్గరి నుంచి వీక్షించేందుకు అనుగుణంగా ఒక రెస్టారెంట్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.
- అతి పెద్ద డోమ్ థియేటర్, సెవెన్ డీ థియేటర్, వర్చువల్ అక్వేరియం, టచ్ ట్యాంక్స్, హెల్మెట్ అక్వేరియం వంటివి ఏర్పాటు చేసేందుకు సైతం అప్పట్లో ప్రణాళికలను రూపొందించారు.
- పిల్లల కోసం కియోస్కలను కూడా ఏర్పాటు చేయవలసి ఉంటుంది.
- కనీసం 2500 మంది ఒకేసారి సందర్శించేందుకు వీలుగా సుమారు 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలని భావించారు. అక్వేరియంలో ఏర్పాటు చేసే టన్నెల్ ట్యాంక్ మలుపు 180 డిగ్రీల కోణంలో ఉంటుంది.
- కనీసం 100 మీటర్ల పొడవు, 3.5 మీటర్ల వెడల్పు వాక్ వేలతో టన్నెల్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.
- మొత్తం అక్వేరియం సుమారు 3 వేల మిలియన్ లీటర్ల నీటి సామర్థ్యానికి తగ్గకుండా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.



కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో చెత్తను తొలగిస్తున్న కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

స్వచ్ఛదనం పచ్చదనం ప్రారంభం

నగరవ్యాప్తంగా వ్యర్థాల తొలగింపు

- కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, కమిషనర్

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ వ్యాప్తంగా సోమవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో భాగంగా ఖైరతాబాద్ నియోజకవర్గంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి పాల్గొన్నారు. చెత్త తరలించే వాహనాలను ప్రారంభించారు. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, అరెకపూడి గాంధీ, కుత్బుల్లాపూర్‌లో, కేపీ వివేకానంద,ఉప్పల్‌లో బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు, కాచిగూడలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. జీహెచ్ఎంసీలోని ఆరు జోన్లలో జరిగిన కార్యక్రమాల్లో స్థానిక కార్పొరేటర్లు, సంబంధిత జోనల్ కమిషన్లు, డిప్యూటీ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు. కొన్ని ప్రాంతాల్లో మొక్కలు నాటారు. దోమల నివారణకు సంబంధించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

చెత్త తొలగింపు..

స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా తొలిరోజైన సోమవారం జీహెచ్ఎంసీలోని 340 కాలనీల్లో కార్యక్రమాలు నిర్వహించారు. 1104 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు, 800 మెట్రిక్ టన్నుల నిర్మాణవ్యర్థాలు తొలగించారు. 232 కి.మీ.ల మేర రోడ్ల వెంబడి పిచ్చిమొక్కలు తొలగించారు. 13,574 ఇళ్లవారికి చెత్త తరలించే కార్మికులతో పరిచయం కార్యక్రమం నిర్వహించారు. 373 స్వచ్ఛ ఆటోలను ఇళ్లు దుకాణాలు, తదితరమైన వాటికి కేటాయించారు.

ఆరోగ్యానికి సంబంధించి..

- 58,809 ఇళ్లలో దోమల నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్లు , 211 కాలనీల్లో , 9 చెరువుల్లో ఫాగింగ్ చేశారు.192 ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ గంబూసియా చేపలు వదిలారు.
- 464 వీధికుక్కలకు రాబిస్ నిరోధక టీకాలిచ్చి, సంతాన నిరోధక శస్త్రచికిత్సలు జరిపారు ఆపరేషన్లు జరగని 369 కుక్కలను గుర్తించారు.

నాలాలు.. రోడ్లు

దాదాపు 30 కి.మీ.ల మేర నాలాల్లో పూడిక తొలగించారు. రోడ్లపై 245 పాట్‌హోల్స్ పూడ్చివేశారు. 42 వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించినట్లు జీహెచ్ఎంసీ పేర్కొంది.

పరిసరాలు బాగుంటేనే ఆరోగ్యం: ఆమ్రపాలి



బంజారాహిల్స్: చాలా మంది మన ఇల్లు బాగుంటే చాలు పరిసరాల గురించి మనకెందుకులే అనుకుంటారని, కానీ అది తప్పని, మన ఇంటితో పాటు చుట్టూ ఉన్న పరిసరాలు కూడా బాగున్నప్పుడే మనం బాగుంటామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అన్నారు. సోమవారం బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎన్బీటీ నగర్ బస్తీలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ఆమె మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు స్వచ్ఛతను పాటించడంతో పాటు ఇతరులు రోడ్లపై చెత్త వేయకుండా అవగాహన కల్పించాలని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ఈ స్వచ్ఛత కార్యక్రమాల్లో, దోమల నియంత్రణ కార్యక్రమాల్లో వారియర్లుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛత విషయంలో, దోమల నివారణ విషయంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని అన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న ప్రతీ వీధి కుక్కను గుర్తించి వాటికి స్టెరిలైజేషన్ చేసి వ్యాక్సిన్లు వేసి వదిలేస్తున్నామని అన్నారు.

బైస్కిల్ 'సిటీ'

- దశలవారీగా ట్రాక్‌ల విస్తరణ
- కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్‌లో భాగంగా ప్రతిపాదనలు
- కేబీఆర్ పార్కు, హుస్సేన్‌సాగర్‌ల చుట్టూ ట్రాక్
- నాన్‌మోటరైజ్డ్ రవాణా సదుపాయాలపై దృష్టి

50 కిలోమీటర్ల సైకిల్ ట్రాక్‌కు ఉమ్టా ప్రణాళికలు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ అంటే ఒకప్పుడు సైకిళ్ల నగరం. వాహనాలు పెద్దగా రోడ్డెక్కని ఆ రోజుల్లో ప్రజలు సైకిళ్లనే అత్యధికంగా వినియోగించారు. బహుశా మరే నగరంలో లేనన్ని సైకిళ్లు హైదరాబాద్‌లో వినియోగంలో ఉన్నందుకే నిజాం కాలంలో దీన్ని సైకిళ్ల నగరం అని పిలిచారు. అలాంటి నగరం ఇప్పుడు వాహనాల నగరంగా మారింది. సుమారు 80 లక్షలకు పైగా వాహనాలు సిటీ రోడ్లపైన పరుగులు తీస్తున్నాయి. దీంతో సైకిల్‌కు చోటు లేకుండా పోయింది. ఈ క్రమంలో యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఉమ్టా) నాన్‌మోటరైజ్డ్ రవాణా సదుపాయాలపైన దృష్టి సారించింది. ఇందులో భాగంగా నగరంలో అవకాశం ఉన్న అన్ని ప్రాంతాల్లో సైకిల్ ట్రాక్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు ఉమ్టా అధికారులు తెలిపారు. మొదటి దశలో సుమారు 50 కిలోమీటర్ల వరకు సరికొత్త సైకిల్ ట్రాక్‌లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సైకిలిస్టులకు పూర్తి భద్రత ఉండేవిధంగా ఈ ట్రాక్‌లను ఏర్పాటు చేయనున్నారు. మెట్రోస్టేషన్‌లు, సిటీ బస్‌స్టేషన్‌లు, జంక్షన్‌లలో సైకిళ్లను వినియోగించే విధంగా పబ్లిక్ బైస్కిల్ షేరింగ్ సిస్టమ్‌ను అమలు చేయనున్నారు.


హుస్సేన్ సాగర్ చుట్టూ ట్రాక్...

ఈ ప్రణాళికలో భాగంగా కేబీఆర్ పార్కు చుట్టూ సైకిల్ ట్రాక్‌ను మరింత అభివృద్ధి చేయడంతో పాటు కొత్తగా హుస్సేన్‌సాగర్ చుట్టూ ప్రత్యేకంగా ట్రాక్‌ను ఏర్పాటు చేయనున్నారు. పర్యాటకులు, నెక్లెస్‌రోడ్ సందర్శనకు వచ్చేవారు సరదాగా సైకిళ్లపైన విహరించవచ్చు. అలాగే కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాక్‌లను విస్తరించడం వల్ల వాకింగ్‌తో పాటు సైకిలింగ్ కూడా ఒక వ్యాయామంగా మారనుంది. మరోవైపు పాదచారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అదేవిధంగా వాహనాల వల్ల సైకిలిస్టులకు ప్రమాదాలు వాటిల్లకుండా ఫుట్‌పాత్‌ల మధ్యలో ట్రాక్‌లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు ఒక అధికారి తెలిపారు.

మెట్రో స్టేషన్‌లకు సైకిళ్లు...

కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లానింగ్‌లో భాగంగా మెట్రో స్టేషన్‌లకు లాస్ట్‌మైల్ కనెక్టివిటీ కోసం నాన్‌మోటరైజ్డ్ సర్వీసులను అందుబాటులోకి తేవాలనే ప్రతిపాదన ఉంది. ఇందుకోసం మెట్రో స్టేషన్‌లకు 2 కిలోమీటర్ల పరిధిలో సైకిళ్లను వినియోగించేవిధంగా ట్రాక్‌లను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది. అవకాశం ఉన్న మెట్రో స్టేషన్‌ల వద్ద ఈ సదుపాయాన్ని ఏర్పాటు చేయనున్నారు. లాస్ట్‌మైల్ కనెక్టివిటీ కోసం పర్యావరణహితమైన ఎలక్ట్రిక్ వాహనాలను విరివిగా ప్రోత్సహించడంతో పాటు సైకిళ్ల వినియోగాన్ని పెంచేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నారు. అలాగే నగరం కొత్తగా విస్తరిస్తున్న ప్రాంతాల్లో చేపడుతున్న రోడ్డు నిర్మాణాల్లో సైకిళ్ల కోసం ప్రత్యేకమైన ట్రాక్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. మొదటి దశలో అవకాశం ఉన్న చోట 50 కిలోమీటర్ల వరకు ట్రాక్‌లను విస్తరించి దశల వారీగా ట్రాక్‌ల సంఖ్యను పెంచనున్నారు. గత సంవత్సరం నానక్‌రాంగూడ నుంచి తెలంగాణ పోలీస్ అకాడమీ వరకు, ఇటు కొల్లూరు వరకు హెచ్ఎండీఏ అధునాతన సైకిల్ ట్రాక్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.





కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లానింగ్...

- హైదరాబాద్ మహానగర విస్తరణకు అనుగుణంగా స్వల్పకాలిక, దీర్ఘకాలిక రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఉమ్టా కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లానింగ్‌పైన దృష్టి సారించింది. ఇందు కోసం వినియోగంలో ఉన్న ప్రజా, ప్రైవేట్, వ్యక్తిగత రవాణా సదుపాయాలపైన అధ్యయనం చేసి 2050 నాటికి అవసరమైన రహదారుల విస్తరణ, రవాణా,మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయవలసి ఉంది.
- ఇందుకోసం ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ లీ అసోసియేట్స్‌కు అధ్యయన బాధ్యతలను అప్పగించారు. ప్రస్తుతం హెచ్ఎండీఏ పరిధి 7,257 చదరపు కిలోమీటర్ల వరకు విస్తరించి ఉంది. భవిష్యత్తులో ఈ పరిధి 10 వేల చదరపు కిలోమీటర్లకు పైగా పెరగనుంది. అలాగే నగర జనాభా కూడా 3 కోట్లు దాటవచ్చునని అంచనా. ఈ మేరకు ప్రస్తుత, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ)ను రూపొందించవలసి ఉంది. ఇందులో భాగంగా సైకిల్ ట్రాక్‌ల అభివృద్ధిని చేపడతారు.

బఫర్ జోన్‌లో బరితెగింపు!



చెరువులో మట్టిపోసి పూడ్చేస్తున్నారిలా..

ఆనవాళ్లు కోల్పోతున్న పీరం చెరువు

- మట్టితో పూడ్చి.. సెల్లార్లు తవ్వి..నిర్మాణాలు
- పట్టించుకోని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

బండ్లగూడ: బఫర్‌జోన్‌లో కబ్జాదారులు బరితెగించారు. కంటికి రెప్పలా కాపాడాల్సిన ఇరిగేషన్ అధికారులు కళ్లుమూసుకుని నిరభ్యంతర పత్రాలు జారీ చేస్తున్నారు. ఫలితంగా చెరువులు, కుంటలు, కాల్వలు ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇప్పటికే అనేక ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యాయి. తాజాగా పీరంచెరువు బఫర్ జోన్లలోనూ భారీ ఆక్రమణలు కొనసాగుతున్నాయి. గుట్టుగా మట్టిని నింపి, ఆ తర్వాత భారీ సెల్లార్లతో బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. కళ్లముందే ఇంతజరుగుతున్నా..ఇటు ఇరిగేషన్ అధికారులు కానీ, అటు రెవెన్యూ యంత్రాంగం కానీ అటు వైపు కన్నెత్తి చూడకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఆక్రమించి..ఆనవాళ్లు లేకుండా చేసి..

హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి ప్రక్కన 34.20 ఎకరాల విస్తీర్ణంలో పీరం చెరువు ఉంది. ఇక్కడ గజం రూ.లక్ష వరకు పలుకుతోంది. కొంత మంది రియల్టర్లు చెరువులు, కుంటలు, బఫర్‌జోన్లపై కన్నేశారు. గుట్టుగా వాటిని ఆక్రమించి హద్దురాళ్లు నాటి, ఆ తర్వాత లోతట్టు ప్రాంతాల్లో మట్టి నింపుతున్నారు. లే అవుట్లు తయారు చేసి, రోడ్లు వేశారు. ఫలితంగా ప్రస్తుతం చెరువు తన ఆనవాళ్లు కోల్పోయింది. ఇప్పటికే పది ఎకరాలకుపైగా అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిపోయింది. ప్రస్తుతం 24 ఎకరాలే మిగిలింది. నిజానికి చెరువు బఫర్ జోన్‌లో ఎలాంటి నిర్మాణాలకు అనుమతి ఇవ్వకూడదు. కానీ ఇరిగేషన్ అధికారులు ఇవేవీ పట్టించుకోలేదు. ఇటీవల ఏసీబీకి చిక్కిన ఓ ఇరిగేషన్ ఏఈ నిఖేష్ అడ్డగోలుగా ఎన్‌ఓసీలు జారీ చేశారు. వీటిలో ఇప్పటికే అనేక బహుళ అంతస్తుల భవనాలు వెలిశాయి. తాజాగా ఓ రియల్టర్ ఏకంగా బఫర్‌జోన్‌లో భారీ ఎత్తున సెల్లార్ తవ్వకాలకు తెర తీశాడు. బహుళ అంతస్తుల భవనం నిర్మాణానికి ఇటు ఇరిగేషన్, అటు హెచ్ఎండీఏ ఏ విధంగా అనుమతి ఇచ్చిందనేదీ అంతు చిక్కని ప్రశ్నగా మిగిలింది.

కన్నెత్తి చూడని అధికారులు

చెరువు ఆనవాళ్లు లేకుండా చేస్తున్నా..సంబంధిత అధికారులెవరూ అటువైపు కన్నెత్తి చూడటం లేదు. నీటిపారుదల అధికారులు జారిచేసిన నిరభ్యంతర పత్రాలు (ఎన్‌ఓసీ) పరిశీలించి, పీరంచెరువు కొలతలతో హద్దులు ఏర్పాటు చేసి బఫర్ జోన్లలో జరుగుతున్న నిర్మాణాలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ అంశంపై గండిపేట తహసీల్దార్ శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా, చెరువులు, కుంటల పరిరక్షణ బాధ్యత పూర్తిగా ఇరిగేషన్ శాఖదేనని, బఫర్‌జోన్లపై వారికే అవగాహన ఉంటుందని, ఏది ఏమైనా ఇరిగేషన్‌శాఖ అధికారులను సమన్వయం చేసుకుని ప్రభుత్వ భూములను పరిరక్షిస్తామని స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే ఇదే అంశంపై ఇరిగేషన్ డీఈ రమను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా, ఆమె స్పందించక పోవడం కొసమెరుపు.




పీరంచెరువుకు సమీపంలో సెల్లారు తవ్వకం

ఎందుకు పరిష్కారం కాదో చెప్పాలి

ప్రజావాణి అర్జీలకు లిఖితపూర్వక సమాధానమివ్వాలి

సాక్షి, సిటీబ్యూరో: ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదులు పరిష్కారం సాధ్యం కాని పక్షంలో..అందుకు కారణాలేమిటో అర్జీదారులకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో పాల్గొన్న ఆమె ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చే అర్జీలను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని సూచించారు. లేని పక్షంలో ప్రజావాణి వల్ల ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. విజ్ఞప్తుల స్వీకరణకు ముందు నిర్వహించిన ఫోన్-ఇన్ ద్వారా 8 మంది తమ సమస్యలు తెలియజేశారు. ప్రధాన కార్యాలయంలో ప్రజావాణికి వచ్చిన 43 ఫిర్యాదుల్లో సగానికి పైగా (23) టౌన్‌ప్లానింగ్ విభాగానికి చెందినవే ఉన్నాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు, నళిని పద్మావతి, శ్రీవాత్సవ, సత్యనారాయణ, యాదగిరిరావు, గీతారాధిక, అడిషనల్ సీసీపీలు గంగాధర్, ప్రదీప్, ఎస్ఎన్‌డీపీ సీఈ కోటేశ్వర రావు,ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఇక జోనల్ కార్యాలయాల్లో జరిగిన ప్రజావాణిలో 75 అర్జీలు అందినట్లు జీహెచ్ఎంసీ పేర్కొంది.



ముగిసిన ఐఈఈఈ-2024

నగరాన్ని సందర్శించిన విదేశీ పరిశోధకులు



సాక్షి, సిటీబ్యూరో: నగరం వేదికగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఐఈఈఈ-2024 సదస్సు విజయవంతంగా ముగిసింది. నగరంలోని ది ప్లాజా వేదికగా గోకరాజు రంగరాజు ఇంజినీరింగ్ కాలేజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో సుస్థిర శక్తి, భవిష్యత్ విద్యుత్ రవాణాలో తాజా పురోగతులను అన్వేషించడానికి ప్రఖ్యాత నిపుణులు, పరిశోధకులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా నగరానికి విచ్చేసిన దేశ, విదేశాలకు చెందిన పరిశోధకులు నగరంలోని పలు ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్టూడెంట్ అండ్ యంగ్ ప్రొఫెషనల్ కార్యక్రమం ప్రస్తుత తరం పరిశోధకులకు విజ్ఞాన దర్శినిగా ఉపయోగపడుతుందని సదస్సు కన్వీనర్ డాక్టర్ ఫణీంద్ర బాబు బొబ్బా పేర్కొన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ రాజ్‌కిరణ్, ప్రొ.లలిత్ గోయెల్, ప్రొ.ఆండీ నైట్, ప్రొ.సుభాషిష్ భట్టాచార్య, ప్రొ.కౌశిక్ రాజశేఖర, ప్రొ.ఫ్రెడ్ వాంగ్, ప్రొ.పాట్ వీలర్, ప్రొ.బిప్లబ్ సిక్దర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాలో కొత్త ప్లాన్

రైలులో బాలికతో గంజాయి రవాణా..

- ఒడిశా టు సికింద్రాబాద్ ప్రయాణం
- పోలీసులకు పట్టుబడ్డ బాలిక
- 14 కిలోల గంజాయి స్వాధీనం
- పరారీలో ఇద్దరు వ్యాపారులు

సికింద్రాబాద్: గంజాయి అక్రమ రవాణాలో పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు ఒక బాలికను వినియోగించిన ఉదంతమిది. ఒడిశా నుంచి సికింద్రాబాద్ వరకు గంజాయి లగేజీతో ఉన్న బాలికతోనే ప్రయాణించిన ఇరువురు గంజాయి వ్యాపారులు బాలికను స్టేషన్‌లో వదిలేసి ఉడాయించారు. ఛత్రాపూర్ నుంచి సికింద్రాబాద్ మీదుగా ముంబైకి గంజాయిని రవాణా చేస్తున్న కేసులో బాలికను అదుపులోకి తీసుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు జువెనైల్ హోమ్‌కు తరలించారు. బాలిక వద్ద నుంచి రూ.3.50 లక్షల విలువ చేసే 14 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణాకు బాలికను వినియోగించుకున్న ఇద్దరు వ్యాపారులు పరారయ్యారు. వివరాలను జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సాయిఈశ్వర్‌గౌడ్ సోమవారం విలేకరులకు తెలిపారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌లు, రైళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన పోలీసులకు 7వ నంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఒంటరిగా కూర్చున్న ఓ బాలిక(17) కనిపించింది. ఆమె వద్ద ఉన్న లగేజీ తనిఖీ చేయగా అందులోంచి గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. పోలీసుల విచారణలో ఇద్దరు వ్యక్తులు తనను సికింద్రాబాద్ వరకు తీసుకువచ్చి కనిపించకుండా పోయారని పోలీసులకు తెలిపింది. కరణ్ శశిరావు పవార్, కిరణ్ శశిరావుపవార్ అనే ఇద్దరు గంజాయి రవాణా చేసే వ్యాపారులు. ఈ నెల 2వ తేదీన ఒక బాలికను వెంట తీసుకుని ఒడిశా రాష్ట్రం ఛత్రాపూర్ రైల్వే స్టేషన్‌కు వెళ్లి బాలికకు లగేజీ బ్యాగులు అప్పగించి నాగావళి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కించారు. వారు కూడా అదే రైలులో ఈ నెల 3న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. 7వ ప్లాట్‌ఫామ్‌పై బాలికను లగేజీతో కూర్చోబెట్టి స్టేషన్ బయటకు వెళ్లి ఏటీఎంలో డబ్బు డ్రా చేసుకుని వస్తామని చెప్పారు. బయటకు వెళ్లిన వ్యాపారులు తిరిగి రాకపోవడంతో స్టేషన్‌లో సోదాలు చేస్తున్న రైల్వే పోలీసులకు బాలిక చిక్కింది. బాలికను జువెనైల్ హోమ్‌కు తరలించిన పోలీసులు గంజాయి రవాణా చేసి పరారీలో ఉన్న వ్యాపారుల కోసం గాలిస్తున్నారు.

సీడీ దొరక్క శిక్ష పడలేదు!

ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రవాది సయ్యద్ ఎజాజ్

- దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల కేసులో ఇతగాడికీ మరణ శిక్ష
- జామా మసీదు 'ఉగ్ర మెయిల్స్'లోనూ నిందితుడు
- ఆ కేసులో కీలక సాక్ష్యమైన సీసీ కెమెరాల ఫుటేజ్ సీడీ
- హఠాత్తుగా అది కనిపించకపోవడంతో వీగిపోయిన కేసు





సాక్షి, సిటీబ్యూరో: అతడో కరుడుగట్టిన ఉగ్రవాది.. దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసులో మరణ శిక్ష పడిన వారిలో ఒకడు.. ఢిల్లీలోని జామా మసీదు వద్ద జరిగిన విధ్వంసం కేసులోనూ నిందితుడిగా ఉన్నాడు.. ఆ కేసులో కీలక సాక్ష్యంగా ఉన్న సీసీ కెమెరాల ఫుటేజ్‌తో కూడిన సీడీ అక్కడి కోర్టుకు చేరలేదు.. పోలీసుల వద్దే మిస్ కావడంతో నిర్దోషిగా ప్రకటిస్తూ న్యాయస్థానం గత వారం తీర్పు ఇచ్చింది. ఐటీ ప్రొఫెషనల్ నుంచి ఉగ్రవాదిగా మారిన పుణేవాసి ఎజాజ్ సయీద్ షేక్ నేపథ్యమిది. మహారాష్ట్రలోని పుణేలో ఉన్న ఘోర్‌పేట్ పీఠ్‌కు చెందిన ఎజాజ్ షేక్ ప్రముఖ బీపీఓ సంస్థలో ఐటీ నిపుణుడిగా పని చేశాడు. ఇండియన్ ముజాహిదీన్(ఐఎం) ఉగ్రవాద సంస్థ వ్యవస్థాపకులు రియాజ్ భత్కల్, ఇక్బాల్ భత్కల్ ప్రధాన అనుచరుడు మోహిసిన్ చౌదరికి సమీప బంధువు. అతడి ద్వారానే ఉగ్రవాద బాటపట్టాడు. 2008లో ఢిల్లీలోని బాట్లా హౌస్ ఎన్‌కౌంటర్ తర్వాత పాకిస్థాన్‌కు పారిపోయిన మోహిసిన్ చౌదరితో సంప్రదింపులు జరుపుతూనే ఉండేవాడు. ఇతడి ద్వారానే ఐఎం మాస్టర్‌మైండ్ రియాజ్ భత్కల్‌కు దగ్గరయ్యాడు. బాంబు పేలుళ్లకు కొన్ని నిమిషాల ముందు మీడియా సంస్థకు ఈ-మెయిల్స్ పంపడానికి ఐఎం ఓ మీడియా సెల్‌నే ఏర్పాటు చేసుకుంది. దీనికి ఇన్‌చార్జ్‌గా ఉన్న పుణేవాసి మన్సూర్ అస్గర్ పీర్భాయ్ వ్యవహరించాడు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి, ఢిల్లీలోని జామా మసీదు, పుణేలోని జర్మన్ బేకరీ ఉదంతాలకు ముందూ ఇలాంటి ఈ-మెయిల్స్ మీడియాకు వచ్చాయి. వీటిపై సాంకేతికంగా దర్యాప్తు చేసిన ఢిల్లీ స్పెషల్ సెల్ అధికారులు ఎజాజ్ పాత్రను గుర్తించారు. 2013 సెప్టెంబర్ 6న ఉత్తరప్రదేశ్‌లోని పశ్చిమ ప్రాంతమైన సహరంగ్‌పూర్ రైల్వే స్టేషన్‌లో ఇతడిని పట్టుకున్నారు. దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్లకు అవసరమైన నిధుల్ని పంపే బాధ్యతల్ని రియాజ్ భత్కల్ మహారాష్ట్రలోని పుణేలో ఉంటున్న ఎజాజ్‌కు అప్పగించాడు. దీంతో ఎజాజ్ మంగుళూరులోని హంపన్‌కట్టలో ఉన్న వెస్ట్రన్ యూనియన్ మనీ ట్రాన్స్‌ఫర్ సంస్థ ఔట్‌లెట్ సుపమ ఫారెక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు మంగుళూరులోని మార్కెట్ రోడ్డులో హవాలా వ్యాపారం నిర్వహించే డింగ్‌డాంగ్ దుకాణం యజమాని ద్వారా 2013 ఫిబ్రవరిలో రూ.6.8 లక్షలు పంపాడు. ఆ నగదుని వినియోగించే ఉగ్రవాదులు 2013 ఫిబ్రవరిలో దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్లకు పాల్పడ్డారు. ఈ కేసులో మిగిలిన నిందితులతో పాటు ఎజాజ్‌కు 2016లో ప్రత్యేక కోర్టు ఉరి శిక్ష విధించింది. అప్పటి నుంచి ఎజాజ్ కొన్నాళ్లు చర్లపల్లి కేంద్ర కారాగారంలోనే ఉన్నాడు. ఢిల్లీ కోర్టులో ట్రయల్ నడుస్తున్న జామా మసీదు వద్ద విధ్వంసం కేసులో అక్కడి పోలీసులు తీసుకువెళ్లారు. ఈ ఉదంతానికి ముందు ఈ-మెయిల్ పంపడానికి వినియోగించిన ఫోన్‌ను ఎజాజ్ ముంబైలోని మనీష్ మార్కెట్‌లో ఖరీదు చేశాడు. అప్పట్లో దర్యాప్తు అధికారులు దీనికి సంబంధించిన సీసీ కెమెరాల ఫుటేజ్‌ను సేకరించి సీడీలో భద్రపరిచారు. ఆ కేసులో ఎజాజ్ నేరం చేశాడని నిరూపించడానికి ఇదే కీలక ఆధారం. అయితే నాలుగున్నరేళ్ల క్రితం ఈ సీడీ పోలీసుల వద్ద నుంచి హఠాత్తుగా మిస్ అయింది. మరో కాపీ కూడా లేకపోవడంతో కోర్టులో దాఖలు చేయలేకపోయారు. దీంతో పాటు ఇతర అంశాలను పరిగణలోకి తీసుకున్న ఢిల్లీ కోర్టు ఎజాజ్‌ను నిర్దోషిగా ప్రకటించింది. దీంతో 2011లో ముంబైలో జరిగిన ట్రిపుల్ బ్లాస్ట్ కేసు విచారణ కోసం ఎజాజ్‌ను అక్కడకు తరలించనున్నారు.

నగరంలో నేడు

- గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి రవీంద్రభారతిలో గద్దరన్న యాదిలో.. ప్రథమ వర్ధంతి కార్యక్రమం జరుగుతుంది.
- ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలు బంజారాహిల్స్‌లోని బీఆర్‌ఎస్ కేంద్ర కార్యాలయంలో ఉదయం 10.30గంటలకు జరుగుతాయి.
- కోవా పీస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో రవీంద్ర భారతి సమీపంలోని బిర్లా ప్లానిటోరియంలో సామాజిక సమస్యలపై అవగాహన కల్పించే దిశగా విద్యార్థులు రూపొందించిన వీడియోలను ప్రదర్శిస్తారు. ఈ ప్రదర్శన ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుంది.
- మైండ్ బ్లోయింగ్ గేమ్ హైటెక్ సిటీలోని శిల్ప గ్రామ్ క్రాఫ్ట్ విలేజీలోని షూట్ హైదరాబాద్ ఉదయం 11 గంటల నుంచి ప్రత్యేక ఈవెంట్ జరుగుతుంది.

అర్జీలపై ప్రత్యేక దృష్టి

అదనపు కలెక్టర్ వెంకటాచారి



సాక్షి, సిటీబ్యూరో: ప్రజా అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి తక్షణమే పరిష్కరించాలని హైదరాబాద్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటాచారి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 187 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. అందులో గృహ నిర్మాణ శాఖకు 115, పింఛన్లు 19, భూసమస్యలు 20, ఉద్యోగాల కోసం 9, రుణాలు మంజూరు కోసం 4, రేషన్ కార్డుల కోసం 2, మహాలక్ష్మి పథకం 6, ఇతర 12 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ కదిరివన్, ఆర్డీవోలు మహిపాల్, దశరథ్ సింగ్, జిల్లా అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై కారు బీభత్సం

కారు నడుపుతూ డివైడర్‌ను ఢీ కొట్టిన మైనర్లు

లక్డీకాపూల్: మైనర్లు కారు నడుపుతూ డివైడర్‌ను ఢీ కొట్టిన ఘటన సైఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. లంగర్‌హౌస్ ప్రాంతానికి చెందిన యువకులు సోమవారం తెల్లవారుజామున ట్యాంక్‌బండ్‌పై తినడానికి వచ్చారు. వారంతా మైనర్లు కావడం గమనార్హం. ఈ క్రమంలో ట్యాంక్‌బండ్‌పై మైనర్లు నడుపుతున్న కారు అదుపు తప్పి బీభత్సం సృష్టించింది. ఈ ఘటనతో స్థానికులు వెంబడించడంతో భయంతో ఐమాక్స్ థియేటర్ వద్ద డివైడర్‌ను ఢీ కొట్టారు. దీంతో కారులోని ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో కారులోని మైనర్లకు ప్రాణాపాయం తప్పింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కారును సీజ్ చేసి మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రాయితో కొట్టి వృద్ధురాలి హత్య



చీమల బాలమ్మ(ఫైల్)

హస్తినాపురం: ఇళ్లలో పనిచేస్తూ జీవనం గడుపుతున్న వృద్ధురాలిని గుర్తు తెలియని వ్యక్తి బండరాయితో తలపై కొట్టి హత్య చేసిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చీమల బాలమ్మ(63) కృష్ణానగర్‌కాలనీలో దాదాపు 30 ఏళ్లుగా నివాసం ఉంటోంది. చుట్టుపక్కల ఇళ్లలో పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. సోమవారం ఇళ్లలో పనిచేయడానికి రాకపోవడంతో పక్కనే ఉన్న వారు బాలమ్మ ఇంట్లోకి వెళ్లి చూశారు. ఆమె మృతి చెంది ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాలమ్మ మృతదేహాన్ని పరిశీలించగా మృతురాలి తలపై రాయితో కొట్టిన గాయాలు ఉన్నాయని, గుర్తు తెలియని వ్యక్తి హత్యచేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. కాలనీకి చెందిన చింతకాయల హరిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు దొంగలకు రిమాండ్

రూ.1.20 లక్షల నగదు, 14 సెల్‌ఫోన్లు స్వాధీనం

శంకర్‌పల్లి: మొబైల్ షాప్‌లో చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మోకిల సీఐ వీరబాబు తెలిపిన ప్రకారం.. జులై 25న అర్ధరాత్రి మోకిలలో బాలాజీ మొబైల్ షాపులో గుర్తు తెలియని దుండగులు దొంగతనం చేసినట్లు యజమాని జీవన్ జులై 26న పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను లంగర్‌హౌస్‌లో గుర్తించారు. ఆదివారం హైదరాబాద్‌కు చెందిన దుర్గారెడ్డి(33), షేక్ మహబూబ్(31)ను మోకిల, రాజేంద్రనగర్ సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. పోలీసుల విచారణలో వీరిపై పలు పోలీస్‌స్టేషన్లలో పదుల సంఖ్యలో కేసులున్నట్లు తేలింది. నిందితుల వద్ద రూ.1.20లక్షల నగదు, 14 సెల్‌ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం చేవెళ్ల కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్ నిమిత్తం సంగారెడ్డి జిల్లా కందికి జైలుకు తరలించామని పోలీసులు తెలిపారు.

బాలికను నిర్బంధించి లైంగిక దాడి

సనత్‌నగర్: ఒంటరిగా ఉన్న బాలికను బెదిరించి, నిర్బంధించి లైంగికదాడికి పాల్పడిన యువకుడిపై బేగంపేట పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట ప్రాంతంలో నివసించే వ్యక్తి ఆదివారం సాయంత్రం తన విధుల కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఇంట్లో అతడి కుమార్తె(15) ఒంటరిగా ఉంది. పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వచ్చిన వ్యక్తి తలుపు మూసి ఉండటంతో తలుపు తట్టాడు. ఎవరూ తీయకపోవడంతో బలవంతంగా తలుపులను తెరిచాడు. ఇంట్లో నుంచి సోను(20) అనే యువకుడు తోసుకుంటూ బయటకు పరిగెత్తాడు. ఏం జరిగిందని కుమార్తెను ఆరా తీయగా తన నోట్లో గుడ్డలు కుక్కి లైంగికదాడికి పాల్పడినట్లు తెలిపింది. ఎవరికైనా చెబితే చంపేస్తానని నిందితుడు బెదిరించినట్లు కూడా చెప్పింది. దీంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

జలమండలి ఫైనాన్స్ డైరెక్టర్ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ



జలమండలి ఫైనాన్స్ డైరెక్టర్ సన్మానిస్తూ..

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి ఫైనాన్స్ డైరెక్టర్ వాసుదేవ నాయుడు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. జలమండలిలో 1989 సంవత్సరం అసిస్టెంట్ ఫైనాన్స్ మేనేజర్‌గా నియమితులైన ఆయన ఆ తర్వాత జీఎంగా, సీజీఎంగా, ఫైనాన్స్ విభాగానికి డైరెక్టర్‌గా సేవలందించారు. స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా సోమవారం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ బోర్డు ఒక మంచి డైరెక్టర్ సేవల్ని కోల్పోతుందన్నారు. సీజీఎం చంద్రజ్యోతి మాట్లాడుతూ ఎంత ఒత్తిడి ఉన్నప్పటికీ.. ప్రశాంతంగా పనులు పూర్తి చేయడంతో దిట్ట అని కొనియాడారు. మిగిలిన ఉద్యోగులు, సిబ్బంది సైతం.. ఆయనతో వారికున్న అనుబంధాన్ని పంచుకున్నారు.

వయనాడ్ ప్రకృతి విధ్వంసాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలి



వయనాడ్ బాధితుల కోసం విరాళాలు సేకరిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

హిమాయత్‌నగర్: వయనాడ్ ప్రకృతి విధ్వంసాన్ని జాతీయ విపత్తుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. వయనాడ్ బాధితుల కోసం విరాళాలు ఇచ్చి ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ మేరకు సోమవారం హిమాయత్‌నగర్ వై జంక్షన్ నుంచి సీపీఐ ఆధ్వర్యంలో కేరళ, వయనాడ్ ప్రకృతి విపత్తు బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి.నరసింహ, ఎస్.ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి.స్టాలిన్ తదితరులతో కలసి చాడ వెంకట్‌రెడ్డి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విపత్తులో నష్టపోయిన వారికి అవసరమైన సహాయాన్ని అందించడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వయనాడ్‌లో సీపీఐ శ్రేణులు రాత్రిపగలు లెక్కచేయక సహాయక చర్యల్లో పాల్గొంటూ దుస్తులు, ఆహారం, ఔషధాలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు కంపల్లి శ్రీనివాస్, నేతలు ఎండీ సలీమ్, నరేష్, ఆరుట్ల రాజ్‌కుమార్, జేరుపోతుల కుమార్, చైతన్య, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్ పుట్టినరోజు వేడుకల్లో అపశ్రుతి

ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడి హెడ్‌కానిస్టేబుల్ మృతి



డేవిడ్ క్రిస్టియన్ (ఫైల్)

మూసాపేట: ఇన్‌స్పెక్టర్ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న హెడ్ కానిస్టేబుల్ మూడవ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందిన ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్ట బండ్లగూడలో నివాసముండే 1995 బ్యాచ్‌కు చెందిన డేవిడ్ క్రిస్టియన్(56) యూసుఫ్‌గూడలోని ఫస్ట్ బెటాలియన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈయనకు భార్య హేమ, కుమార్తె ఉన్నారు. రాచకొండ కమిషనరేట్ కంట్రోల్ రూమ్‌లో శేఖర్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన పుట్టిన రోజు వేడుకలను కూకట్‌పల్లి హెచ్‌ఎంటీహిల్స్‌లో ఆదివారం నిర్వహించారు. 30 మంది స్నేహితులు పాల్గొన్నారు. ఇందులో డిపార్ట్‌మెంట్‌కు చెందిన 10మంది ఉన్నారు. 70 గజాల స్థలంలో నిర్మించిన ఇల్లు ఇరుగ్గా ఉండటంతో అందరూ భోజనాలు చేస్తున్న సమయంలో డేవిడ్ బయట ఉన్నాడు. 3వ అంతస్తులో ఉన్న పిట్టగోడ మూడు అడుగుల ఎత్తు ఉండటంతో ప్రమాదవశాత్తు డేవిడ్ కింద పడ్డాడు. బలమైన గాయాలు కావడంతో వెంటనే కేపీహెచ్‌బీలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య హేమ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అక్టోబర్‌లో గ్రేస్ క్యాన్సర్ రన్



సాక్షి, సిటీబ్యూరో: క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు గ్రేస్ క్యాన్సర్ రన్-2024 పేరుతో ప్రపంచంలోనే అతిపెద్ద రన్నింగ్ ఈవెంట్ నిర్వహించనున్నారు. అక్టోబర్ 6వ తేదీన జరగనున్న ఈ రన్నింగ్ ఈవెంట్‌కు 130 దేశాల నుంచి నేరుగా, వర్చువల్‌గా లక్ష మంది పాల్గొననున్నారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన నిధులను క్యాన్సర్ పరిశోధనలు, స్క్రీనింగ్ కోసం వినియోగించనున్నారు. హైసీ, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ ఏడాది 'రన్ ఫర్ గ్రేస్ స్క్రీన్ ఫర్ లైఫ్' థీమ్‌తో నిర్వహించనున్నారు. గచ్చిబౌలి స్టేడియంలో ఈ రన్‌ను 2కే వాక్, 5 కే ఫన్ రన్, 10కే రన్ విభాగాల్లో నిర్వహించనున్నారు.

న్యాయశాస్త్రంలో టి.పద్మకు డాక్టరేట్



సాక్షి, హైదరాబాద్: కేవీ రంగారెడ్డి న్యాయ కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.పద్మకు ఇక్ఫాయ్ యూనివర్సిటీ న్యాయశాస్త్రంలో డాక్టరేట్ ప్రదానం చేసింది. విక్టిమ్ కంపెన్సేషన్ స్కీం : ఎ క్రిటికల్ స్టడీ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు హైదరాబాద్ అండ్ రంగారెడ్డి డిస్ట్రిక్ట్ ఆఫ్ ద స్టేట్ ఆఫ్ తెలంగాణ'' అనే అంశంపై టి.పద్మ పరిశోధన చేశారు. ఈ పరిశోధనకు గానూ ఇక్ఫాయ్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది.

305 మంది ఆకతాయిలను అరెస్టు చేసిన షీ టీమ్స్

హిమాయత్‌నగర్: బోనాల పండగ సందర్భంగా ఆలయాల వద్ద మహిళలు, యువతులపై అసభ్యకరంగా ప్రవర్తించి వారిని వేధించిన ఆకతాయిలను షీ టీమ్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు విమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ కవిత తెలిపారు. ఈ సందర్భంగా 305 మందిని అరెస్టు చేసినట్లు, వీరిలో 289 మంది పెద్దలు, 16 మంది మైనర్లు ఉన్నారని పేర్కొన్నారు. 173 మందిని మందలించి, వారి కుటుంబ సభ్యులతో పాటు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఐదుగురు వ్యక్తులను మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. వారికి మూడు రోజుల జైలు, జరిమానా విధించారు.

విద్యుత్ స్తంభాల పునరుద్ధరణకు రూ.25.50 కోట్లు

- ఇప్పటి వరకు 4,46,540 పాయింట్లలో సర్వే పూర్తి
- తుప్పుపట్టి వంగిన పోల్స్ 12,598 ఉన్నట్లు గుర్తింపు
- 11 కేవీ ఫీడర్ మేనేజ్‌మెంట్ యాప్‌లో వివరాల నమోదు
- దెబ్బతిన్న పోల్స్, డీటీఆర్ పనులు ప్రారంభించాలని సీఎండీ ఆదేశం



సాక్షి, సిటీబ్యూరో: తుప్పుపట్టి, ఒక వైపు వంగిపోయి ప్రమాదకరంగా మారిన విద్యుత్ పోల్స్ సహా చుట్టూ కంచె లేకుండా తరచూ విద్యుత్ ప్రమాదాలకు కారణమవుతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పునరుద్ధరించేందుకు రూ.25.50 కోట్లు మంజూరు చేసింది. గుర్తించిన లోపాలను తక్షణమే సరిదిద్దాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. అంతేకాదు చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులను క్లెయిమ్ చేసే సమయంలో ఆయా పనులకు సంబంధించిన ఫొటోలను కూడా సమర్పించాల్సిందిగా సూచించింది.

ముగిసిన లైన్ టు లైన్ సర్వే..

విద్యుత్ వ్యవస్థలోని క్షేత్రస్థాయిలో అనేక లోపాలు ఉన్నాయి. నిర్వహణ లోపం వల్ల అనేక చోట్ల విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. ఇనుప స్తంభాలు తుప్పు పట్టడంతో పాటు సిమెంట్ స్తంభాలు ఏదో ఒక వైపు వంగిపోయాయి. లైన్లు లూజు కావడం, ఈదురుగాలులకు మెలికపడి షార్ట్‌సర్క్యూట్‌కు కారణమవుతున్నాయి. ఇళ్ల మధ్య ఉన్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె లేకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. విద్యుత్ ప్రమాదాలు, తరచూ అంతరాయాలకు కారణమవుతున్న పోల్స్, డీటీఆర్‌ను గుర్తించేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ జూన్ 24 నుంచి జులై చివరి వరకు 'లైన్ టు లైన్' సర్వే చేపట్టింది. గ్రేటర్‌లోని పది సర్కిళ్లలో 3,285 (11 కేవీ) ఫీడర్లను తనిఖీ చేసింది. మొత్తం 4,46,540 పాయింట్లలో తనిఖీ చేసి, ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలు, కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు, వేలాడుతున్న తీగల ఫొటోలు తీసి '11 కేవీ ఫీడర్ మేనేజ్‌మెంట్ యాప్‌లో నమోదు చేసింది. నిర్వహణ లోపం వల్ల ఒక వైపు వంగి, దెబ్బతిన్న, తుప్పు పట్టిన స్తంభాలు 12,598 వరకు ఉన్నట్లు గుర్తించింది. అదేవిధంగా కంచెలేని డీటీఆర్‌లు 1320 వరకు ఉన్నట్లు గుర్తించి, ఆ మేరకు వాటి ఫొటోలు సహా జీఐఎస్ మ్యాప్‌లను యాప్‌లో పొందుపర్చింది.

గ్రేటర్‌లో గుర్తించిన ప్రమాదకరమైన పోల్స్, డీటీఆర్లు ఇలా..

సర్కిల్	ప్రమాదకరమైన పోల్స్	ప్రమాదకరమైన డీటీఆర్
బంజారాహిల్స్	276	200
హైదరాబాద్ సెంట్రల్	598	100
హైదరాబాద్ సౌత్	399	100
సికింద్రాబాద్	573	100
సైబర్‌సిటీ	900	100
రాజేంద్రనగర్	1242	100
సరూర్‌నగర్	982	100
వికారాబాద్	262	50
సంగారెడ్డి	800	50
మేడ్చల్	3183	100
హబ్సిగూడ	2817	100

ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలి



రహమత్‌నగర్‌: ప్రజలకు ఉత్తమ సేవలందించడమే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని ఖైరతాబాద్‌ తహసీల్దార్‌ నయామొద్దీన్‌ సూచించారు. తహసీల్దార్‌గా సంవత్సర కాలంపూర్తి చేసుకున్న సందర్భంగా నయామొద్దీన్‌ను ఆర్‌ఐలు విజయ్‌, కిరణ్‌రాజ్‌లతో పాటు కార్యాలయ సిబ్బంది, జూబ్లీహిల్స్‌ కాంగ్రెస్‌ ఆర్గనైజింగ్‌ సెక్రటరీ దేవేందర్‌ తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా నయామొద్దీన్‌ మాట్లాడుతూ ప్రజలకు ఎంతమంచిగా సేవలు అందిస్తామో అదేస్థాయిలో గుర్తింపు కూడా వస్తుందని ఆయన అన్నారు.

8న జరిగే ధర్నాను విజయవంతం చేయండి

రహమత్‌నగర్‌: ఆర్టీసీ బస్సు సర్వీసులు పెంచాలని డిమాండ్‌ చేస్తూ ఈనెల 8న ఆర్టీసీ బస్‌భవన్‌ ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు రాపర్తి ఆశోక్‌, శేషగిరి రావు, చంద్రశేఖర్‌రావులు సోమవారం బోరబండ, మోతీనగర్‌, కార్మికనగర్‌, రహమత్‌నగర్‌ బస్‌స్టాప్‌ వద్ద ప్రయాణికుల సంతకాలు సేకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ నగర జనాభా అనుగుణంగా ఆర్టీసీ బస్సులులేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు యాదగిరి, సోమ్లనాయక్‌, నాగేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణమాస పూజలు



ఫిలింనగర్‌: ఫిలింనగర్‌ దైవ సన్నిధానంలో కొలువుదీరిన శ్రీధనలక్ష్మీ అమ్మవారికి శ్రావణ మాస విశేష పూజలు సోమవారం ప్రారంభమయ్యాయి. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 9న మొదటి శుక్రవారం ఉదయం 7గంటలకు పంచామృతాభిషేకం, అలంకరణ, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ, 9 గంటలకు సహస్ర పుష్పార్చన, 16న రెండో శుక్రవారం ఉదయం 9 గంటలకు శ్రీవరలక్ష్మీ వ్రతం, 23న మూడో శుక్రవారం ఉదయం 9 గంటలకు శ్రీ అష్టలక్ష్మీ మూలమంత్ర హోమం, 30న నాల్గో శుక్రవారం ఉదయం 9గంటలకు శ్రీ వరలక్ష్మీ వ్రతం జరుగుతుందని వివరించారు. అలాగే నాలుగు శుక్రవారాలు సాయంత్రం 6 గంటలకు శ్రీ లక్ష్మీ సహస్రనామ స్తోత్ర పారాయణ, కుంకుమార్చన, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ జరుగుతాయని తెలిపారు.

అమ్మవారికి బోనాల సమర్పణ



నల్లపోచమ్మ దేవాలయ బోనాల వేడుకల్లో భక్తులు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ డివిజన్‌లో బోనాల వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లపోచమ్మ దేవాలయంలోని అమ్మవారికి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని బోనాలు సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ ఫౌండర్‌ చైర్మన్‌ గంట మల్లేష్‌, వైస్‌ చైర్మన్‌ అలక వెంకటేష్‌, ప్రెసిడెంట్‌ రాజ్‌కుమార్‌ గంగపుత్ర, శ్రీశైలం, రవీందర్‌, శ్రీనివాస్‌, కతలయ్య, రాజేష్‌, నర్సింగరావు, దయానంద్‌ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



సాక్షి ఎఫెక్ట్‌

ఫిలింనగర్‌: జూబ్లీహిల్స్‌ డివిజన్‌ ఫిలింనగర్‌లోని దుర్గాభవానీనగర్‌ బస్తీలో 'ఆంజనేయస్వామి ఆలయ స్థలం కబ్జా' శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. గుడిని ఆనుకుని 30 గజాల ప్రభుత్వ స్థలం ఆలయానికి చెందినది కాగా, కొంతకాలంగా ఈ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. స్థానికులు ఇటీవల సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ కబ్జా వ్యవహారం 'సాక్షి' వెలుగులోకి తీసుకురాగా, షేక్‌పేట తహశీల్దార్‌ అనితారెడ్డి స్పందించి సోమవారం సాయంత్రం సంబంధిత సిబ్బందితో కూల్చివేయించారు.

ఆంధ్రప్రదేశ్‌లో అప్రజాస్వామిక పాలన

లిబర్టీ: అధికారంలోకి వచ్చాక విపక్షనాయకులపై దాడులు, కేసులు పెడుతూ ఏపీలో అప్రజాస్వామిక పాలన కొనసాగిస్తున్నారని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్‌ ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతలు నశించాయని, రాష్ట్రపతి పాలన విధించాలని కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రజాస్వామ్య పోరాటానికి పూర్తిస్థాయి మద్దతు పలికారు. ఈ ఘటనలపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా స్పందించి న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్‌ చేశారు. ఈ సమావేశంలో పిలువేరి వసంతరావు, గోలి నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

బాలామృతం పంపిణీ



ఫిలింనగర్‌: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్‌ ఖైరతాబాద్‌ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు బాలామృతం పంపిణీ చేశారు. అలాగే 0–24 నెలల వయస్సు ఉన్న పిల్లల నివాసాలను సందర్శించారు. ఈ సందర్భంగా తల్లులకు తమ శిశువులకు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలని, దాని వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. తల్లిపాలతో బిడ్డ ఆరోగ్యం శ్రేష్ఠంగా ఉంటుందని అవగాహన కలిగించారు. అలాగే పోషకాహార పదార్థాలు తీసుకోవడం ద్వారా తల్లీ బిడ్డ ఎలా క్షేమంగా ఉండవచ్చో, ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చో తెలియజేశారు.

బస్తీలు, కాలనీలు మురిసేలా...

'స్వచ్ఛదనం.. పచ్చదనం'

- 9 వరకు కార్యక్రమాలు..
- ప్రతి సర్కిల్‌కు నాలుగు వాహనాలు
- అన్ని శాఖలతో పాటు స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం
- కార్యక్రమాన్ని ప్రారంభించిన అధికారులు, ప్రజాప్రతినిధులు



ఎస్‌బీటీనగర్‌లో వాహనాన్ని ప్రారంభిస్తున్న మేయర్‌ విజయలక్ష్మీ, కమిషనర్‌ ఆమ్రపాలి

బంజారాహిల్స్‌: బస్తీలు, కాలనీలు మురిసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 'స్వచ్ఛదనం–పచ్చదనం' కార్యక్రమం నిర్వహించేందుకు ఆదేశాలు ఇచ్చింది. అన్ని వర్గాల వారి సమస్యలను తెలుసుకుని అక్కడే పరిష్కరించేలా చర్యలు చేపట్టడం దీని ముఖ్య ఉద్దేశం. ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్‌–18 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్‌ డివిజన్‌లో రోడ్డునెంబర్‌–12లోని ఎన్‌బీటీనగర్‌ బస్తీలో సోమవారం జీహెచ్‌ఎంసీ మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మీ, కమిషనర్‌ ఆమ్రపాలి, జోనల్‌ కమిషనర్‌ అనురాగ్‌ జయంతి, డీఎంసీ వి.ప్రశాంతి ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని చెత్తా చెదారం, వ్యర్థాలు తొలగించే వాహనాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా ఐదు రోజుల ప్రణాళికలను పకడ్బందీగా అమలు చేసే దిశలో సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఖైరతాబాద్‌ నియోజకవర్గం పరిధిలోని బంజారాహిల్స్‌, జూబ్లీహిల్స్‌, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్‌ డివిజన్ల పరిధిలో పలు రకాల కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రత–పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో సంబంధిత అధికారులతో పాటు స్వచ్ఛంద సంస్థలు, వలంటీర్లను కూడా భాగస్వాములను చేయనున్నారు. వార్డు కౌన్సిలర్లు, వార్డు అధికారులు ప్రత్యేక అధికారులతో కూడిన బృందం ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించనుంది. సంబంధిత అధికారులు రోజూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తారు. నెలలో ప్రతి మూడో శనివారం స్వచ్ఛదనం–పచ్చదనం దినోత్సవాన్ని నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ బృహత్తర కార్యక్రమంలో ఉద్యానవన శాఖ, నీటి పారుదల శాఖ, ఎంటమాలజీ విభాగం, వెటర్నరీ విభాగం, హెల్త్‌ అండ్‌ శానిటేషన్‌ అధికారులు, సిబ్బంది భాగస్వాములు కానున్నారు. జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్‌ సర్కిల్‌–17కు చెత్తా చెదారం, వ్యర్థాలు, భవన నిర్మాణ వ్యర్థాలు తొలగించేందుకుగాను నాలుగు టిప్పర్లతో పాటు ఒక జేసీబీని అందజేశారు. ఒక్కో టిప్పర్‌కు నలుగురు సిబ్బంది చొప్పున పనిచేస్తారు. అలాగే జూబ్లీహిల్స్‌ సర్కిల్‌–18కు కూడా నాలుగు వాహనాలు, ఒక జేసీబీ కేటాయించారు. ఈ వాహనాలు ఈ ఐదు రోజుల పాటు పేరుకుపోయిన చెత్తా చెదారం, తొలగించిన చెట్ల కొమ్మలు, భవన నిర్మాణ వ్యర్థాలను తరలిస్తారు.

రోజువారీగా చేయనున్న పనులు..

- కార్యక్రమంలో భాగంగా సోమవారం వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగించారు. వీధులు, బహిరంగ ప్రదేశాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శుభ్రత పాటించారు. భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించి తరలించారు. అలాగే చెత్తా చెదారం పేరుకుపోయిన చోట్ల వాటిని పూర్తిగా తొలగించి జీవీపీలను నిర్మూలించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.
- 6న దోమల నివారణ కోసం ఫాగింగ్‌ చేయడం, సీజనల్‌ వ్యాధుల నివారణపై, చర్యలపై ప్రజలకు అవగాహన కలిగిస్తారు. యాంటీ లార్వా ఫాగింగ్‌ చేపట్టి ఆయిల్‌ బాల్స్‌ వేస్తారు. చెరువుల్లో గంబూషియా చేపలు వదులుతారు. వీధి కుక్కలకు వ్యాక్సినేషన్‌ వేస్తారు.
- 7న స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఇరిగేషన్‌ శాఖ అధికారులు ఆయా వార్డులోని చెరువులను శుభ్రం చేస్తారు. చెరువుల క్లీనింగ్‌లో వలంటీర్లను భాగస్వాములను చేస్తారు.
- 8న వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా వార్డుల్లోని పార్కులను పరిశుభ్రం చేస్తారు. గ్రీన్‌ వేస్ట్‌ను తొలగిస్తారు. పచ్చదనాన్ని పెంపొందిస్తారు.
- 9న వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఖాళీ ప్రదేశాలు, పార్కుల్లో మొక్కలు నాటుతారు. ఇప్పటికే గుర్తించిన ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతారు. దుంప, కరివేపాకు, వేప, మామిడి, ఉసిరి, జామ, చింత, దానిమ్మ లాంటి పండ్ల మొక్కలను నాటుతారు.



చిన్నారులకు మొక్కలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్‌ దేదీప్య విజయ్‌



స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సంగీత యాదవ్‌



మహిళలకు మొక్కలను అందజేస్తున్న బాబా ఫసియుద్దీన్‌



ప్రమాణం చేయిస్తున్న సీఎన్‌ రెడ్డి

నిమ్స్‌ లో వేతన బకాయిలు చెల్లించాలని గార్డుల ధర్నా

న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు



పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌ ఎదుట నిమ్స్‌ కాంట్రాక్ట్‌ సెక్యూరిటీ గార్డులు

లక్డీకాపూల్‌: రెండు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదంటూ నిమ్స్‌లో భద్రత విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డులు ఆందోళన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం క్యాపిటల్‌ సెక్యూరిటీ సర్వీసెస్‌పై పంజగుట్ట పోలీసు స్టేషన్‌లో సెక్యూరిటీ గార్డులు ఫిర్యాదు చేశారు. అనంతరం నిమ్స్‌లో ప్రధాన గేట్‌ వద్ద నుంచి ఆస్పత్రిలోని యూనియన్‌ బ్లాక్‌ వరకు ర్యాలీ నిర్వహించి నిమ్స్‌ సెక్యూరిటీ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంటనే బకాయి వేతనాలను చెల్లించాలని డిమాండ్‌ చేశారు. జీతాలు సమయానికి రాకపోవడం మూలంగా ఇటీవల జరిగిన బోనాల పండుగకు చాలా ఇబ్బందిపడ్డమన్నారు. కిరాయి ఇళ్లలో ఉన్న కొంత మందిని ఇల్లు ఖాళీ చేయించారన్నారు. పని చేసి కూడా జీతం కోసం అడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిమ్స్‌ యాజమాన్యం నుంచి క్యాపిటల్‌ ఏజెన్సీకి క్రమం తప్పకుండా బిల్లులు చెల్లిస్తున్నప్పటికీ సెక్యూరిటీ గార్డులకు వేతనాలు చెల్లించడం లేదన్నారు. అదే తమతో పాటు పని చేస్తున్న శ్రీ కార్తికేయ సెక్యూరిటీ ఏజెన్సీకి చెందిన గార్డులకు ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు అందుతున్నాయన్నారు. వాళ్ళతో సరిసమానంలో పని చేయడం లేదా అని నిలదీశారు. కార్తికేయ సెక్యూరిటీ ఏజెన్సీ తమ గార్డులకు గత ఏడాది జులై 19 నుంచి రూ.15,600లు చెల్లిస్తుందన్నారు. క్యాపిటల్‌ సంస్థ మాత్రం రూ.13500లే వేతనం చెల్లిస్తుందని వాపోయారు. చాలీచాలని జీతాలతో బతుకుతున్న సెక్యూరిటీ గార్డులను సమయానికి జీతం కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న క్యాపిటల్‌ సెక్యూరిటీ సంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. ఈ సందర్భంగా క్యాపిటల్‌ సెక్యూరిటీ ప్రతినిధి ధర్నా వద్దకు వచ్చి రెండు రోజులలో జీతాలు వేస్తామని హామీ ఇవ్వడంతో సెక్యూరిటీ గార్డులు ఆందోళన విరమించారు.

కాంట్రాక్టర్‌ ఇంట్లో నగలు, నగదు చోరీ

బంజారాహిల్స్‌: అల్మారా లాకర్‌లో దాచిన ఖరీదైన ఆభరణాలు, నగదు చోరీకి గురైన ఘటన బంజారాహిల్స్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌–12లోని సయ్యద్‌నగర్‌లో నివసించే షేక్‌ సల్మాన్‌ మార్బుల్‌ వ్యాపారి ఇంట్లోని అల్మారాలో తన తల్లికి చెందిన 22 తులాల ఆభరణాలు, రూ.10 వేల నగదు భద్రపరిచి అల్మారాకు తాళం కూడా వేశారు. అయితే ఈనెల 4న తేదీ రాత్రి ఓ ఫంక్షన్‌కు వెళ్లేందుకు కుటుంబ సభ్యులు ఆభరణాల కోసం అల్మారా తెరిచారు. అయితే అల్మారాలోని లాకర్‌ను ధ్వంసం చేసి ఉండగా, అందులోని ఆభరణాలతో పాటు నగదు చోరీకి గురైందని గుర్తించారు. గత నెల 5వ తేదీన ఈ నగలు, నగదును లాకర్‌లో ఉంచడం జరిగిందని, ఈ నెల 4న చోరీకి గురయ్యాయని షేక్‌ సల్మాన్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంజారాహిల్స్‌ క్రైమ్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హాస్టల్స్‌లో ఆకస్మిక తనిఖీలు

పంజగుట్ట: ఇటీవల ఎస్‌ఆర్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఒక హాస్టల్‌లో డ్రగ్స్‌ దొరికిన నేపథ్యంలో సోమవారం పంజగుట్ట పోలీసులు పలు హాస్టళ్లను ఆకస్మిక తనిఖీ చేశారు. పంజగుట్ట ఏసీపీ మోహన్‌ కుమార్‌, ఇనిస్పెక్టర్‌ శోభన్‌తో సహా 22 మంది సిబ్బంది బృందాలుగా ఏర్పడి హ్యాపీహోమ్స్‌ మెన్స్‌ హాస్టల్‌, కావూరి మెన్స్‌ హాస్టల్‌తో సహా పలు హాస్టల్స్‌లో క్షుణంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతీ గదిలోని బ్యాగులు, పరుపుల కింద, బాత్‌రూంలల్లో సోదాలు నిర్వహించారు. అదే విధంగా నిర్వాహకులు తీసుకుంటున్న చర్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్‌ శోభన్‌ మాట్లాడుతూ డ్రగ్స్‌, దొంగతనాలు నియంత్రించేందుకు తనిఖీలు చేపట్టినట్లు, ఇది నిరంతర ప్రక్రియ అని, కేవలం హాస్టల్స్‌ కాకుండా లాడ్జీలు, హోటల్స్‌లో కూడా తనిఖీలు చేస్తామని తెలిపారు. యాజమాన్యాలకు తప్పనిసరిగా 24 గంటలు సెక్యూరిటీ గార్డు ఉండేలా చూడాలని, 30 రోజుల బ్యాకప్‌తో ప్రతీ గదినీ కవర్‌చేసేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చెయ్యాలని, ఒక్కరోజు కోసం వచ్చినా తప్పకుండా వారి ఆధార్‌ కార్డుగానీ, ఏదైనా గుర్తింపు కార్డు తప్పకుండా తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు.

దళిత మహిళపై దాడి హేయం

లిబర్టీ: ఆమె తప్పు లేకపోయిన దళిత మహిళను కొట్టడం హేయమైన చర్యని, దీనిపై సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ కోరారు. మాల మహానాడు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులపై ఇటీవల కాలంలో దాడులు, అణచివేత పరంపర కొనసాగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దళిత మహిళపై విచక్షణా రహితంగా కొట్టడంతో స్పృహ కోల్పోయిందని ఆయన పేర్కొన్నారు. దళిత మహిళను కొట్టిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని విన్నవించారు.

ట్రాలీ బీభత్సం



ఫిలింనగర్‌: అదుపుతప్పిన ఓ ట్రాలీ ఆగి ఉన్న ద్విచక్ర వాహనాలను ఢీకొట్టి బీభత్సం సృష్టించిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... ఫిలింనగర్‌ వైపు నుంచి కొత్త చెరువు వైపు వెళ్తున్న ఓ ట్రాలీ అదుపుతప్పి వేగంతో దూసుకొచ్చి వైన్‌షాపు ముందు ఆగి ఉన్న బైక్‌లు, కారును ఢీకొట్టి ఫుట్‌పాత్‌పైకి ఎక్కింది. ఈ ఘటనతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ప్రమాదానికి గల కారణాలపై ఫిలింనగర్‌ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా ఈ వైన్‌ షాపు ముందు రోజుకు పదికి పైగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, జీహెచ్‌ఎంసీ, స్థానిక పోలీసులు చర్యలు తీసుకోవాలని జూబ్లీహిల్స్‌ కార్పొరేటర్‌ వెల్దండ వెంకటేష్‌ డిమాండ్‌ చేశారు. ఈ విషయంపై తాను ఎన్నోసార్లు ఫిర్యాదు చేశానని, కమిషనర్‌ను కలిసి మరోసారి ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులు పరిశోధనల్లో ముందుండాలి



బంజారాహిల్స్‌: విద్యార్థులు పరిశోధనల్లో ముందుండాలని అప్పుడే వారికి ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని ఓయూ మాజీ వైస్‌ఛాన్సలర్‌, తెలంగాణ అకాడమీ ఆఫ్‌ సైన్స్‌ జనరల్‌ సెక్రటరీ సత్యనారాయణ అన్నారు. సైఫాబాద్‌ యూనివర్సిటీ కాలేజ్‌ ఆఫ్‌ సైన్స్‌ కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం జాతీయ సెమినార్‌ను నిర్వహించారు. రాయల్‌ సొసైటీ ఆఫ్‌ కెమిస్ట్రీ–లండన్‌, లోకల్‌ సెక్షన్‌ డెక్కన్‌ సంయుక్తంగా 'స్పెక్ట్రోస్కోపిక్‌ అనాలసిస్‌–ఐఆర్‌, యూవీ, నమర్‌ అండ్‌ మాస్‌ స్పెక్ట్రోస్కోపీ' అంశంపై జరిగిన ఒక్కరోజు జాతీయ సదస్సుకు సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెమిస్ట్రీలో ప్రతి శాంపిల్స్‌ మీద ఐఆర్‌, యూవీ, నమర్‌ అండ్‌ మాస్‌ స్పెక్ట్రోస్కోపీ పరికరాలను ఎందుకు ఉపయోగిస్తామో విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. ఈ సెమినార్‌కు సహకరించిన రాయల్‌ సొసైటీ ఆఫ్‌ లండన్‌ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఐసీటీ సైంటిస్ట్‌ ఆర్‌.శ్రీనివాస్‌, రాయల్‌ సొసైటీ ఆఫ్‌ లండన్‌ సభ్యులు ఎంవీ నరేంద్రకుమార్‌, నైపర్‌ ప్రొఫెసర్‌ శంకరయ్య, సైఫాబాద్‌ సైన్స్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ లక్ష్మణ్‌నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం'పై సమాచారమే లేదు

కార్పొరేటర్‌ కవితారెడ్డి



బంజారాహిల్స్‌: ప్రభుత్వం 'స్వచ్ఛదనం–పచ్చదనం' కార్యక్రమాన్ని సోమవారం నుంచి ప్రారంభించగా, ఈ కార్యక్రమానికి సంబంధించి తనకు సమాచారమే లేదని, అధికార పార్టీలో ఉంటే సమాచారం ఇస్తారు..? ప్రతిపక్షంలో ఉంటే చెప్పరా..? అని వెంకటేశ్వరకాలనీ డివిజన్‌ బీఆర్‌ఎస్‌ కార్పొరేటర్‌ మన్నె కవితారెడ్డి నిలదీశారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక రోజు ముందు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లుగా కార్పొరేటర్‌కు సమాచారం ఇవ్వాల్సి ఉండగా తనకు మాత్రం ఎలాంటి సమాచారం రాలేదన్నారు. అంతేకాకుండా సోమవారం మధ్యాహ్నం ఎస్‌ఎఫ్‌ఏ ఫోన్‌ చేసి ఒక టిప్పర్‌, ఒక జేసీబీ ఉన్నాయని, ఎక్కడకు పంపమంటారు అని అడిగారని, ముందస్తు ప్రణాళిక లేకుండా ఇదెక్కడి కార్యక్రమం అని ప్రశ్నించారు. అధికారంలో ఉంటేనే ప్రోటోకాల్‌ పాటిస్తున్నారని, లేకపోతే పక్కన బెడుతున్నారని దుయ్యబట్టారు. ఈ వ్యవహారంలో జీహెచ్‌ఎంసీ అధికారులు తగిన స్పష్టత ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. ఇంతటి బృహత్తర కార్యక్రమంలో కార్పొరేటర్లు లేకుండా ఎలా ముందుకుపోతారని, ప్రజలకు ఎలాంటి సంకేతాలు అందిస్తున్నారని ఆమె ప్రశ్నించారు.

కళాకారుల పాత్ర అమూల్యం

హిమాయత్‌నగర్‌: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కళాకారులు పోషించిన పాత్ర అమూల్యమైనదని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. హిమాయత్‌నగర్‌ మగ్దూం భవన్‌లో సోమవారం తెలంగాణ ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో నిర్వహించే 'ప్రజా కళల పండుగ' గోడ పత్రికను తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు కె. శ్రీనివాస్‌, ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహలతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని గ్రామాల్లో దౌర్జన్యాలు, భూస్వామ్య, పెట్టుబడిదారి వ్యవస్థను వ్యతిరేకిస్తు ప్రజా కళాకారులూ తమ కళారూపాలను ప్రదర్శించి ప్రజలలో చైతన్యం రగిలించారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్‌, పల్లె నరసింహలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



మందులు, పండ్లు పంపిణీ చేస్తున్న వైద్యులు

వెంగళరావునగర్‌: రాష్ట్రంలోని అన్ని ఆయుష్‌ మందిరాలలో జెరియాట్రిక్‌ క్యాంపులను (వృద్ధాప్య వైద్య శిబిరం) నిర్వహిస్తున్నామని ఆయుష్‌ శాఖ అడిషనల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ పరమేశ్వర్‌ నాయక్‌ తెలిపారు. సోమవారం వెంగళరావునగర్‌ డివిజన్‌ పరిధిలోని ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో ఆయుష్‌ డైరెక్టర్‌ ప్రశాంతి సూచనల మేరకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా దాదాపు 250 మంది వృద్ధులకు వైద్య పరీక్షలను నిర్వహించి వారికి మందులు, పండ్లు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్‌ పరమేశ్వర్‌ నాయక్‌ మాట్లాడుతూ 50 ఏళ్ళు పైబడిన వారందరూ ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. అన్నిరకాల వ్యాధులకు ఇక్కడ వైద్యం చేయడమే కాకుండా ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యునానీ అడిషనల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ వసంతరావు, సీసీఆర్‌యుఎం డైరెక్టర్‌ డాక్టర్‌ ఇస్తేకార్‌, ఎర్రగడ్డ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ రమాదేవి, ఆసుపత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ మమత కస్తూరి, ఆర్‌.ఓ.డాక్టర్‌ సాకేత్‌ రామ్‌, డాక్టర్‌ బిశ్వరాజన్‌దాస్‌, డాక్టర్‌ అష్ఫాక్‌ అహ్మద్‌, డాక్టర్‌ హిమబిందు, వైద్యకళాశాల ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్‌ విద్యే లక్ష్యం



మాట్లాడుతున్న శ్రీనివాసు సరస్వతుల

పంజగుట్ట: ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్‌ విద్య రూపొందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అసోసియేషన్‌ ఆఫ్‌ 41 క్లబ్స్‌ ఆఫ్‌ ఇండియా అధ్యక్షుడు శ్రీనివాసు సరస్వతుల తెలిపారు. మార్చి నెలాఖరు వరకు దేశంలోని మెట్రో నగరాలు, నగర శివార్లలో ఉన్న 300 పాఠశాలల్లోని తరగతి గదులు డిజిటల్‌ స్మార్ట్‌ క్లాస్‌రూముంగా మారుస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడలోని పార్క్‌ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజువారీ కూలీ చేసుకునే తల్లిదండ్రుల పిల్లలు కూడా మన పిల్లల మాదిరి విద్య అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. భారతదేశం డిజిటల్‌ ఇండియాలా, ఐదు ట్రిలియన్‌ డాలర్ల ఆర్థికవ్యవస్థగా మారాలన్నా పిల్లల్ని డిజిటల్‌ విద్యా సాధనాలవైపు మళ్లించాలన్నారు. ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి వరకు రాష్ట్ర బోర్డు లేదా సీబీఎస్‌ఈ పాఠ్యాంశాలల్లోని అన్ని సబ్జెక్టులు ఆకర్షణీయంగా, వినోదభరితంగా ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా వివరించి తమ సొంత విద్యా సాఫ్ట్‌వేర్‌ను తయారు చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం రెండు కోట్ల నిధులతో ఈ డిజిటల్‌ క్లాస్‌రూం ప్రాజెక్టు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జాతీయ కోశాధికారి మధుబాబు, వివేక్‌ మట్ట, సుమిత్‌ పాల్గొన్నారు.

బీసీల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి

లిబర్టీ: బీసీలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపాలని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహ్మద్‌ అజారుద్దీన్‌కు బీసీ దళ్‌ జాతీయ అధ్యక్షులు కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయనను కలసి బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించి ఏఐసీసీ నాయకత్వంపై తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేలా చొరవ చూపాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. అనేకేళ్లుగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కులగణన చేస్తే ఆయా వర్గాలకు ఆర్థికంగా, సంక్షేమ ఫలాలు మరింత అందించే అవకాశం ఉంటుందన్నారు. జాతీయ స్థాయిలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు బీసీల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్‌ చట్టసభల్లో రిజర్వేషన్‌ కల్పించే బిల్లుపై ఏఐసీసీ అధిష్ఠానంపై ఒత్తిడి పెంచాలని కోరారు. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తన సంపూర్ణ మద్దతు, సహకారం ఉంటుందని ఆయన హామీ ఇచ్చినట్లు కుమారస్వామి తెలిపారు.

గిరిజనులకు ఉద్యోగాలు కల్పించాలి



వినతి పత్రంతో డా.కళ్యాణ్‌ నాయక్‌

రహమత్‌నగర్‌: అనాధిగా అభివృద్ధికి నోచుకోని గిరిజనులకు విద్యా, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని బీజేపీ రాష్ట్ర ఎస్టీ మోర్చా అధ్యక్షుడు డా.కళ్యాణ్‌నాయక్‌ కోరారు. సోమవారం తెలంగాణ ఎక్సైజ్‌ శాఖలో గిరిజనులకు ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్ర ఎక్సైజ్‌ శాఖ కమిషనర్‌కు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డా. కళ్యాణ్‌ నాయక్‌ మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. గుడుంబా నిర్మూలన పేరుతో తండాలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. తండాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి బర్మవత్‌ రమేశ్‌ నాయక్‌, ప్రధాన కార్యదర్శి సునావాత్‌ రవికుమార్‌ నాయక్‌, ఎస్టీ మోర్చా మహిళా విభాగం కన్వీనర్‌ బానోత్‌ జ్యోతి నాయక్‌, సోషల్‌ మీడియా కన్వీనర్‌ విశాల్‌ నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
10
హైదరాబాద్, మంగళవారం, 6, ఆగస్టు, 2024

అద్భుతమైన కళాకృతిని సృష్టించాలంటే అతిపెద్ద కాన్వాస్‌లే అక్కర్లేదు.. అంగుళం చోటు చాలు.. అని నిరూపిస్తున్నారీ సృజనాత్మక చిత్రకారులు. నగరానికి చెందిన యువ ఆర్కిటెక్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యాన్ ఇంచ్ ఆగస్ట్.. సృజనలోని లోతుల్ని స్పృశిస్తూ కళా ప్రపంచంలోని విశేషాలను, విచిత్రాలను ఆవిష్కరిస్తోంది.
- సాక్షి, సిటీబ్యూరో



‘ఒలింపిక్’ స్ఫూర్తిని పంచేందుకు..

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచవ్యాప్తంగా క్రీడాస్ఫూర్తిని మేల్కొలిపే ఒలింపిక్స్ వైపు యువత దృష్టిని మరింతగా మళ్లించేందుకు ‘టుగెదర్ ఫర్ టుమారో, ఎనేబ్లింగ్ పీపుల్’ పేరిట ఓ కొత్త కార్యక్రమం రూపుదిద్దుకుంది. దీనిని పారిస్‌లో లాంచ్ చేసినట్టు నిర్వాహక సంస్థ శామ్‌సంగ్ ఇండియా సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. దీనిలో భాగంగా ఒలింపిక్ క్రీడా స్ఫూర్తిని పంచడంతో పాటు సామాజిక ప్రయోజనాన్ని అందించే విభిన్న కార్యక్రమాలు నిర్వహించనున్నామని, ఈ నేపథ్యంలో విద్యార్థుల కోసం తాము నిర్వహించిన సాల్వ్ ఫర్ టుమారో పోటీ విజేతలను ప్రచార కర్తలుగా వినియోగించుకోనున్నామని అన్నారు.





బాలికలకు స్కాలర్‌షిప్స్..

సాక్షి, సిటీబ్యూరో: కార్పొరేట్ సామాజిక బాధ్యతా కార్యక్రమాలలో భాగంగా కోటక్ మహీంద్రా గ్రూప్ ఆధ్వర్యంలోని కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ (కెఈఎఫ్) తమ కన్య స్కాలర్‌షిప్ ప్రోగ్రాం ద్వారా 500 మందికి స్కాలర్‌షిప్‌లను ప్రకటించింది. ఈ విషయాన్ని సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన బాలికల ఉన్నత విద్యార్జనకు వీలుగా ఏటా రూ. 1.50 లక్షల ఆర్థిక సహాయాన్ని 4–5 సంవత్సరాల పాటు అందిస్తామని చెప్పారు. రూ.6లక్షల లోపు వార్షికాదాయం కలిగిన కుటుంబాలకు చెందినవారై, 12వ తరగతి బోర్డ్ పరీక్షల్లో 75 శాతం ఆ పైన మార్కులు సాధించిన వారు ఈ స్కాలర్‌షిప్స్ దరఖాస్తుకు అర్హత పొందుతారని తెలియజేశారు.



An Inch ఆర్ట్ పంచ్..

రూపం సూక్ష్మం.. కళ అనంతం..

- అంగుళం సైజులో కళాకృతులు
- వందలాది మంది కళాకారుల సృజనకు పట్టం
- ఏడేళ్లుగా ఆగస్టులో నెలరోజుల పాటు సందడి
- మినియేచర్ కళాకారుల కోసం ఆన్‌లైన్ ఛాలెంజ్

ఇన్‌స్టాగ్రామ్ వేదికగా నిర్వహించే ఆన్‌లైన్ ప్రాజెక్ట్ ‘యాన్ ఇంచ్ ఆగస్ట్’ ఈ నెల అంతా జరుగుతుంది. అత్యంత చిన్నదైన ప్రదేశంలో అత్యుత్తమ కళాప్రతిభను ప్రదర్శించడం ఈ పోటీలో వైవిధ్యం. కేవలం ఒక అంగుళం చతురస్రంలో క్లిష్టమైన, అర్థవంతమైన కళాఖండాలను రూపొందించడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న కళాకారులను ఈ ఆన్‌లైన్ ఈవెంట్ ఆహ్వానిస్తోంది. సూక్ష్మ కళారూపాలలో సృజనాత్మక నైపుణ్యాన్ని ప్రేరేపిస్తూ యువ ఆర్టిస్టులకు సవాల్ విసురుతోంది. ఈ ఆన్‌లైన్ కార్యక్రమాన్ని కళాభిమానులు, ఆర్కిటెక్ట్స్ మేఘాలికా, నేహా శర్మలు 2018లో వార్షిక ఛాలెంజ్‌గా ప్రారంభించారు. డ్రాయింగ్, పెయింటింగ్, స్కల్ప్టింగ్, 3డీ మోడలింగ్, మ్యాక్రో ఫొటోగ్రఫీలలో ప్రవేశం ఉన్నవారి కోసం దీనిని నిర్వహిస్తున్నారు.

అంగుళంలో భళా.. అనిపించండి ఇలా..

ఈ ఆన్‌లైన్ ఛాలెంజ్ అధికారికంగా ప్రారంభం అవడానికి ముందు, ఎప్పటిలాగే బేగంపేటలోని పంచతంత్ర కెఫెలో జులై ఆఖరి ఆదివారం మధ్యాహ్నం 3 నుంచి 7 గంటల వరకు కళాభిమానులకు ప్రీ–ఓపెనింగ్ మీట్ నిర్వహించారు. ఈ ఛాలెంజ్ గురించి విశేషాలు వివరించడంతో పాటు తోటి కళాకారులతో పరస్పర చర్చలు జరిగాయి. ఒక అంగుళం పరిమితిలో సృజనాత్మక ఆవిష్కరణ ప్రక్రియ ఎలా అనేదానిపై సూచనలు కూడా ఈ మీట్ ద్వారా నిర్వాహకులు అందించారు. రోజుకు ఒకటికి తగ్గకుండా కళాకృతిని పోస్ట్ చేయడం ద్వారా ఈ ఛాలెంజ్‌లో పాల్గొనవచ్చు.





సృజనకు పదును పెట్టడమే లక్ష్యం..

కళలకైనా, సృజనకైనా ఆకాశమే హద్దు. చిట్టి చిట్టి కళాకృతులను సృష్టించడం ద్వారా కళాసృష్టిలోని వైవిధ్యాన్ని చూపించడమే ఈ యాన్ ఇంచ్ ఆగస్ట్ ముఖ్యోద్దేశ్యం. ఈ కార్యక్రమం తొలిదశలో ఫొటోగ్రఫీ యాడ్ చేయలేదు. కానీ కొందరి అభ్యర్థన మేరకు అంగుళం లోపల ఉన్న సబ్జెక్ట్‌ని ఫొటో తీయడాన్ని కూడా జతచేశాం. హైదరాబాద్‌లో ఇంత మంది మ్యాక్రో ఫొటోగ్రాఫర్స్ ఉన్నారని మాకు తెలీదు అని మాతో ఇప్పుడు చాలా మంది అంటున్నారు.. ఇలా ఈ కార్యక్రమం ద్వారా అనేక మంది కళాకారులకు గుర్తింపు లభిస్తోంది. అంతకు మించి మేం దీని నుంచి ఏమీ ఆశించడం లేదు. ఛాలెంజ్ ముగిసిన తర్వాత ఈ నెలాఖరులో పోస్ట్ మీటప్‌ను నిర్వహించనున్నాం. దానిలో కళాకారులు పాల్గొని నెల రోజుల పాటు తాము అందుకున్న సృజనాత్మక అనుభవాలను పంచుకుంటారు. – మేఘాలిక, నేహాశర్మ, నిర్వాహకులు

ఇంచ్ ఇంచై.. వటుడింతై..

అంగుళం–పరిమాణంలోని ఆవిష్కరణల్లో పాల్గొనడానికి వయస్సు, నైపుణ్య స్థాయితో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ ఈ ఆన్‌లైన్ పోటీ అవకాశం అందిస్తోంది. దీంతో ప్రారంభమైనప్పటి నుంచి దాదాపు 7వేలకు పైగా వన్ ఇంచ్ ఆర్ట్ వర్క్స్‌తో మంచి రెస్పాన్స్ అందుకుంది. కేవలం ఆన్‌లైన్‌కే పరిమితం కాకుండా కళాకారులతో సమావేశాలు నిర్వహించడం, టీ–వర్క్స్‌లో కళా ప్రదర్శనలు ఏర్పాటు చేయడం వంటి వాటి ద్వారా ఈ ఛాలెంజ్ ఇంచ్ ఇంచై వటుడింతై అన్నట్టుగా ప్రాచుర్యం పెంచుకుంటోంది.





నగరానికి పెళ్లి కళ..

17, 18 తేదీల్లో బలమైన ముహూర్తాలు

- ఆ రెండు రోజులు పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లు
- 7 నుంచి 28 వరకు కూడా ముహూర్తాలు..
- ఫంక్షన్‌హాళ్లు, కల్యాణ మండపాలకు భారీ డిమాండ్

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి పెళ్లి కళ వచ్చేసింది. ఆషాఢ మాసం వెళ్లి శ్రావణం రావడంతో శుభకార్యాలకు మంచి ముహూర్తాలు కూడా వచ్చేశాయి. దీంతో ఈ నెలలో పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లు జరుగనున్నట్లు పురోహితవర్గాలు అంచనా వేస్తున్నాయి. కొంతకాలంగా ఎలాంటి పెళ్లిళ్లు, వేడుకలు లేకుండా ఉన్న పురోహితులు ఈ నెల రోజుల పాటు బిజీబిజీగా గడపనున్నారు. ఈ నెల 7 నుంచి 28 వరకూ అన్నీ మంచి ముహూర్తాలే అయినా 17, 18 తేదీల్లో బలమైన ముహూర్తాలు ఉన్నాయి. ఆ రెండు రోజుల పాటు నగరంలో పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లు జరుగనున్నాయి. ఇందుకోసం ఇప్పటికే నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఫంక్షన్‌హాళ్లు, కల్యాణమండపాలు, హోటళ్లకు బుకింగ్ ఆర్డర్లు వెల్లువెత్తుతున్నాయి. అలాగే భాజాభజంత్రీలు, మండపాలను అలంకరించేవారికి, కేటరింగ్ సంస్థలకు సైతం ఆర్డర్లు పెరిగినట్లు అంచనా. ఈ నెల 7, 8, 9, 10, 11, 15, 17, 18, 22, 23, 24, 28 తేదీల్లో పెళ్లి ముహూర్తాలు ఉన్నట్లు ప్రముఖ పురోహితుడు చిలకమర్రి శ్రీనివాసాచార్యులు తెలిపారు. 15వ తేదీ నుంచి అన్నీ దివ్యమైన ముహూర్తాలే అని చెప్పారు. పెళ్లిళ్లు, గృహప్రవేశాలు, ఉపనయనాలు, తదితర శుభకార్యాలకు ఈ నెల ఎంతో అనుకూలమైనదని పేర్కొన్నారు. ఈ నెలలో పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లు జరుగనున్న దృష్ట్యా మార్కెట్‌లో సైతం సందడి పెరిగింది. వస్త్రదుకాణాలు, బంగారం దుకాణాల్లో అమ్మకాలు పెరిగినట్లు వ్యాపారవర్గాలు పేర్కొంటున్నాయి. ఇటీవల బంగారం ధరలు కూడా కొంత వరకూ తగ్గడం వల్ల అమ్మకాలు ఊపందుకున్నాయి. పైగా ఇప్పుడు పెళ్లిళ్ల సీజన్ రావడంతో అమ్మకాలు మరింత పెరిగే అవకాశం ఉంది.





కేన్..క్రాఫ్ట్

ఆకట్టుకునే ఆకృతులు.. పర్యావరణ స్నేహితులు

రూ.200 నుంచి రూ.25 వేల వరకూ..

ఒకొక్కటీ సుమారుగా రూ.200 నుంచి గరిష్ఠంగా రూ.25 వేల వరకూ ఉంటాయని తయారీదారులు చెబుతున్నారు. ఎన్ని మార్కెట్లు ఉన్నా మా వినియోగదారులు మాకున్నారంటున్నారు. చేసే పనిలో నైపుణ్యం ఉండాలే గాని ప్లాస్టిక్, ఫ్యాబ్రిక్, ఫైబర్, వంటివి ఎన్ని మోడల్స్ వచ్చినా సంప్రదాయ కళలకు ప్రజాదరణ ఉంటుందని ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చు.

నగరంలో వెదురు, కేన్ ఉత్పత్తులకు గిరాకీ

అందుబాటు ధరల్లో అలంకరణ వస్తువులు

సాక్షి, సిటీబ్యూరో: నడిరోడ్డుపైన కొలువుదీరిన ఉత్పత్తులు చేతి వృత్తుల నైపుణ్యానికి అద్దం పడుతున్నాయి. కాదేదీ సృజనకు అనర్హం అన్నట్టు వెదురు, కేన్‌లను ఉపయోగించి వివిధ రకాల ఆకృతుల్లో ఉత్పత్తులను తీర్చిదిద్దుతున్నారు. ఈ ఉత్పత్తులు అందానికీ, వైవిధ్యానికి పట్టం గడుతున్నాయి. ఖరీదైన మాల్స్‌లో మాత్రమే కాదు కచ్చా రోడ్లపై కూడా షాపింగ్ ప్రియుల్ని కట్టిపడేస్తున్నాయి. ముఖ్యంగా వెదురు, కేన్‌తో తయారు చేసిన బుట్టలు, బ్యాగ్‌లు, ఇతర ఉత్పత్తులు నగరవాసుల మది దోచుకుంటున్నాయి. తయారీ నైపుణ్యంతో పాటు అందుబాటు ధరల్లో ఉండటంతో వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

ఇదే జీవనాధారం..

పశ్చిమగోదావరి జిల్లా నుంచి హైదరాబాద్ వచ్చిన ఓ కుటుంబం సంప్రదాయ హస్తకళనే జీవనాధారంగా చేసుకుంది. రామానాయుడు స్టూడియో నుంచి కిందికి వెళ్లే రోడ్డులో ఫుట్‌పాత్‌పై ఈ ఉత్పత్తులు మన ముందే తయారు చేసి విక్రయిస్తున్నారు. పూలు, పండ్లు, ఇతర పూజా సామాగ్రి తీసుకెళ్లేందుకు వినియోగించే బుట్టల నుంచి గార్డెన్‌లో విద్యుత్తులైట్లు అమర్చుకునేందుకు వివిధ ఆకృతుల్లో బుట్టలు, లాంతరు లైట్లు, తయారుచేస్తున్నారు. లాంతరు లైట్లు, మూత ఉన్న బుట్టలు, గంపలు, పెద్దపెద్ద హాల్స్‌లో అలంకరణ కోసం పెట్టుకునే పలు రకాల వస్తువులను అక్కడికక్కడే తయారుచేసి అందిస్తున్నారు. వీటిని విభిన్నమైన రంగులతో అందంగా తీర్చిదిద్దుతున్నారు.

పర్యావరణ హితం కోసం..

వెదురుతో పర్యావరణ హితమైన వస్తువులను తయారు చేస్తున్నాం. మా కుటుంబానికి వంశపారంపర్యంగా వస్తున్న కళ ఇది. మాకు ఇదే జీవనాధారం. వివిధ ఆకృతుల్లో అందంగా, ఆకట్టుకునే వస్తువులను తీర్చిదిద్దుతున్నాం. వస్తువు తయారీకి ఉపయోగించిన ముడిసరుకును బట్టి దాని ధర నిర్ణయిస్తాం. పెద్దగా ఆశలు పెట్టుకోవడం లేదు. కూలి గిట్టుబాటు అయితే చాలనుకుంటాం. ఫలితంగా అందరికీ అందుబాటైన ధరలోనే వస్తువులు లభిస్తాయి. రోజు పదుల సంఖ్యలో వస్తువులు అమ్మకాలు జరుగుతున్నాయి.
– రమేష్, తయారీదారుడు, జూబ్లీహిల్స్





స్టార్ డిజైనర్ ‘ఓస్వాల్’

బాలీవుడ్ టూ హైదరాబాద్..

రిచ్ ఫ్యాషన్‌కు కేంద్రం భాగ్యనగరం

రాజసాన్ని కొనసాగిస్తున్న నగరం..

ఐశ్వర్యా రాయ్, ప్రియాంక చోప్రా తదితరులకు డిజైనర్‌గా

అనుభవాలు పంచుకున్న ఓస్వాల్..

సాక్షి, సిటీబ్యూరో: ఫ్యాషన్ డిజైనింగ్, అధునాతన ఫ్యాషన్ ట్రెండ్స్‌కు హైదరాబాద్ నగరం ‘సోల్ సిటీ’ అని ప్రముఖ బాలీవుడ్ ఫ్యాషన్ డిజైనర్ అనిత ఓస్వాల్ తెలిపారు. దశాబ్దాల కాలం నుంచే ఇక్కడి రిచ్ కల్చర్ ప్రసిద్ధి చెందిందని, ఆ సాంస్కృతిక వారసత్వాన్ని ఇప్పటికీ కొనసాగిస్తూ సౌందర్య వాణిజ్య రంగానికి కూడా కేంద్రంగా రాజసాన్ని నిలుపుకుంటుందని ఓస్వాల్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. విశ్వసుందరి ఐశ్వర్యరాయ్‌కు జ్యువెల్లరీ డిజైన్ చేస్తున్న సమయంలో పలుమార్లు దక్షిణాది సౌందర్య సొగసుల పైన చర్చించిన సందర్భాలూ ఉన్నాయని ఆమె గుర్తు చేసుకున్నారు. అనిత ఓస్వాల్ డిజైన్ చేసిన బంగారు, వజ్రాభరణాలను నగరంలోని రూం 9 పాప్ అప్ వేదికగా ‘రుహారి’ పేరుతో ప్రదర్శిస్తున్నారు. తనతో పాటు కవిత కోపార్కర్ ఆధ్వర్యంలోని అత్యంత విలువైన ప్రతా పైథానీ, బనారస్ శారీస్‌నూ ప్రదర్శిస్తున్న ‘రుహారి’ని ప్రముఖ సామాజిక వేత్త శ్రీదేవి చౌదరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓస్వాల్ నగరంలోని ఫ్యాషన్ హంగులను, బాలీవుడ్ తారల అభిరుచులను పంచుకున్నారు.





హైదరాబాద్.. డ్రీమ్ ప్రాజెక్ట్

విలాసవంతమైన జీవితాల్లో ఆభరణాలు, జీవన శైలి ప్రధానమైన అంశాలని ఓస్వాల్ వివరించారు. 25 ఏళ్లుగా బాలీవుడ్ తారలకు జువెల్లరీ డిజైన్స్ రూపొందిస్తున్నానని, కానీ హైదరాబాద్ వేదికగా తన డిజైన్స్ ప్రదర్శించడం డ్రీమ్ ప్రాజెక్ట్‌గా పెట్టుకున్నానని అన్నారు. మాజీ మిస్ యూనివర్స్ ఐశ్వర్య రాయ్, ప్రియాంక చోప్రా, కిరన్ ఖేర్, సోనాక్షి సిన్హా, సంజయ్ లీలా భన్సాలీ వంటి స్టార్స్‌కు డిజైనర్‌గా చేశాను. ఐశ్వర్యరాయ్ భారతీయ సంస్కృతిలోని ఆభరణాల సౌందర్య వైభవాన్ని మరింత ఉన్నతంగా గ్లోబల్ వేదికపైన ప్రదర్శించడానికి ఇష్టపడేదని ఆమె అన్నారు. ఫ్యాషన్ ఐకాన్ ప్రియాంక చోప్రా అంతర్జాతీయ స్థాయి డిజైనింగ్‌ను అందిపుచ్చుకోవడంలో ఆసక్తిగా ఉంటుంది. ఎప్పటికప్పుడు న్యూ ట్రెండ్స్‌ను అనుకరిస్తూ, సృష్టిస్తూ ఫ్యాషన్‌కు కేరాఫ్‌గా నిలిచే హైదరాబాద్ ఫ్యాషన్ ఔత్సాహికులను కలవడం, వారి అభిరుచులను మరింతగా గమనించడం సంతోషాన్నిచ్చింది. సెలబ్రిటీ సీక్రెట్స్ వ్యవస్థాపకురాలు డా.మాధవి నేతృత్వంలో రిచ్ లైఫ్‌ను ప్రతిబింబించే కవిత కోపార్కర్ ప్రతా పైథానీ, బనారస్ డిజైన్‌లతో రూం 9 పాప్ అప్‌లో... 3 రోజుల పాటు నగర ఫ్యాషన్ ప్రేమికులకు మరో ప్రపంచాన్ని చేరువ చేయనుందని ఆమె తెలిపారు.

టెండర్ల వైపు 'రింగు' అడుగులు

అటవీ అనుమతులు కొలిక్కి | 225 ఎకరాలకు ప్రత్యామ్నాయ భూములిచ్చేందుకు ఏర్పాట్లు | ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్ కోసం త్వరలో కేంద్రానికి దరఖాస్తు | నేషనల్ ఎక్స్‌ప్రెస్‌వే (ఎన్‌ఈ) సిరీస్‌లో రోడ్డు నంబర్ కేటాయించే అవకాశం | ఆ తర్వాత కేంద్ర కేబినెట్ అనుమతి.. ఆ వెంటనే టెండర్లు పిలవనున్న ఎన్‌హెచ్‌ఏఐ



సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగురోడ్డు నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. టెండర్ల ప్రక్రియకు అడ్డుగా ఉన్న అటవీ శాఖ అనుమతుల అంశం కొలిక్కి వచ్చింది. ప్రత్యామ్నాయ భూములు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఓకే చెప్పటంతో ఆ ప్రక్రియ తుది దశకు చేరింది. అటవీ అనుమతులు రాగానే, ఎన్‌హెచ్‌ఏఐ కేంద్ర ప్రభుత్వానికి పర్యావరణ అనుమతుల కోసం దరఖాస్తు చేయనుంది. ఇప్పటివరకు అడ్డంకిగా ఉన్న ఈ రెండు అనుమతులతో టెండర్ల ప్రక్రియకు మార్గం సుగమం కానుంది.

162 కి.మీ. ఉత్తర భాగానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియ జరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లో రైతుల నుంచి వ్యతిరేకతలు వ్యక్తమవుతున్నా, 95 శాతం ప్రాంతాల్లో ఎలాంటి అలజడులు లేవు. దీంతో మరికొద్ది నెలల్లో భూసేకరణ ప్రక్రియ పూర్తికాబోతోంది. ఈ నేపథ్యంలో రోడ్డు నిర్మాణానికి కావాల్సిన ఏర్పాట్లపై ఎన్‌హెచ్‌ఏఐ దృష్టి సారించింది. ఇటీవలే ఇంటర్ చేంజ్ కూడళ్ల డిజైన్లను ఖరారు చేసుకున్న అధికారులు, నిర్మాణానికి వీలుగా అంతా సిద్ధం చేసుకుంటున్నారు.

ప్రత్యామ్నాయ భూముల ఎంపిక షురూ..

రింగురోడ్డు ఉత్తర భాగం అలైన్‌మెంటు పరిధిలో దాదాపు 225 ఎకరాల అటవీ భూములున్నాయి. అడవి మధ్య నుంచి కాకుండా.. సరిహద్దు ప్రాంతం నుంచి రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంట్ ఖరారు చేసే సమయంలోనే జాగ్రత్త పడ్డారు. గజ్వేల్, నర్సాపూర్, యాదాద్రి సమీపంలోని కొన్ని ప్రాంతాల్లో ఎక్కువ అటవీ భూములు దీని పరిధిలో ఉన్నాయి. ఇవి కాకుండా మరో ఐదు చోట్ల పెంచిన సామాజిక అటవీ భూములు పాక్షికంగా కోల్పోవాల్సి వస్తోంది. ఈ మొత్తం భూములకు ప్రత్యామ్నాయ స్థలాలు ఇవ్వాలని ఇటీవల ఎన్‌హెచ్‌ఏఐ సీనియర్ అధికారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఆయన ఆదేశం మేరకు ప్రత్యామ్నాయ భూముల ఎంపిక జరుగుతోంది.

ఎన్‌ఈ సిరీస్‌లో రోడ్డు నంబర్..

అటవీ శాఖ అనుమతులు వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం పర్యావరణ అనుమతులిస్తుంది. దానికోసం త్వరలో ఎన్‌హెచ్‌ఏఐ దరఖాస్తు చేసుకోబోతోంది. పర్యావరణ అనుమతులు రావాలంటే రోడ్డు నంబర్ కేటాయింపు కూడా అవసరం. గతంలో రీజినల్ రింగ్‌రోడ్డుకు తాత్కాలికంగా ఎన్‌హెచ్ 161 ఏఏ నంబర్‌ను కేటాయించిన విషయం తెలిసిందే. ఇప్పుడు దీని స్థానంలో నేషనల్ ఎక్స్‌ప్రెస్ వే (ఎన్‌ఈ) సిరీస్‌ను కేటాయిస్తారని తెలుస్తోంది. దేశంలో ఇప్పటి వరకు నాలుగు నేషనల్ ఎక్స్‌ప్రెస్‌వేలు మనుగడలో ఉన్నాయి. వీటికి ఎన్‌ఈ 1 నుంచి ఎన్‌ఈ 4 వరకు నంబర్లను కేంద్రం కేటాయించింది. అహ్మదాబాద్–వడోదర, ఈస్టర్న్ పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్ వే, ఢిల్లీ–మీరట్, ఢిల్లీ–ముంబయి ఎక్స్‌ప్రెస్ వేలకు ఎన్‌ఈ సిరీస్ నంబర్లు ఉన్నాయి. త్వరలో అందుబాటులోకి రానున్న మరో ఏడు రోడ్లకు కూడా ఎన్‌ఈ5 నుంచి ఎన్‌ఈ 10 వరకు నంబర్లు కేటాయించారు. వీటిల్లో ఒకే సంఖ్యకు ఆల్ఫాబెట్ జత చేసి ఎన్‌ఈ5, ఎన్‌ఈ 5ఏ ను రెండు రోడ్లకు కేటాయించారు. ఈ సిరీస్‌లో రీజినల్ రింగురోడ్డు ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

రాష్ట్రంలో ఐదో ఎక్స్‌ప్రెస్ వేగా...

ప్రస్తుతం రాష్ట్రంలో పీవీ ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ వే, నెహ్రూ ఔటర్ రింగురోడ్డులు స్టేట్ ఎక్స్‌ప్రెస్ వేలుగా ఉన్నాయి. జాతీయ ఎక్స్‌ప్రెస్ వేలుగా రెండు నిర్మాణంలో ఉన్నాయి. ఖమ్మం –దేవరపల్లి ఎక్స్‌ప్రెస్ పూర్తి కావచ్చింది. మహారాష్ట్ర–తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మీదుగా సాగే నాగ్‌పూర్–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు జరుగుతున్నాయి. ప్రతిపాదిత ఎక్స్‌ప్రెస్‌వే జాబితాలో రీజినల్ రింగురోడ్డు కాకుండా హైదరాబాద్–విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ వే ఉంది. కేంద్రం నుంచి పర్యావరణ అనుమతులు రావాలంటే ఆ రోడ్డు జాతీయ/ఎక్స్‌ప్రెస్ వేగా ప్రకటించి ఉండాలి. అందుకు దానికి నంబర్ అవసరం. టెండర్ల ప్రక్రియ ప్రారంభించేందుకు కేంద్ర కేబినెట్ అప్రూవల్ కూడా అవసరం. త్వరలో ఆ తంతు కూడా పూర్తి కాబోతోంది. ఆ రోడ్డు నిర్మాణానికి అయ్యే అంచనా వ్యయానికి కేంద్ర ఆర్థిక వ్యవహారాల కమిటీ తుది అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. మరో నాలుగైదు నెలల్లో ఈ ప్రక్రియలన్నీ పూర్తి కాబోతున్నాయి.

అమిత్ షాతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ భేటీ



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సోమవారం పార్లమెంట్‌లోని కేంద్రమంత్రి కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణకు సంబంధించిన పలు అభివృద్ధి అంశాలతోపాటు రాష్ట్రానికి చెందిన ఇతర అంశాలపై చర్చించారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం' ప్రారంభించిన మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: పారి శుధ్య నిర్వహణ, పర్యా వరణ పరిరక్షణే లక్ష్యంగా స్వచ్ఛదనం –పచ్చదనం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైంది. సోమవారం ములుగు జిల్లాలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. శుక్రవారం వరకు వివిధ అంశాలకు ప్రాధాన్యతమిస్తూ ఈ కార్యక్రమం కొనసాగనున్న విషయం తెలిసిందే. ములుగు మండలం అబ్బాపూర్ ఫారెస్ట్ బ్లాక్ వద్ద అధికారులతో కలిసి మంత్రి ఈత చెట్లు నాటారు. వన సంరక్షణతోనే మానవ జాతి రక్షణ ఉంటుందని, పర్యావరణం కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి అడవులను కాపాడు కోవాలని మంత్రి కోరారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమా లను ప్రతిరోజు పక్కాగా నిర్వహించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో తగ్గించాలని కోరారు.

బీసీలకు రూ.2లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాల్సిందే

- వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య
- జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాంతో భేటీ



సాక్షి, న్యూఢిల్లీ: బీసీలకు రూ.2లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలని, ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీలో జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాంతో ఆర్.కృష్ణయ్య, బీసీ నేతలతో కలిసి భేటీ అయ్యారు. సుమారు ఓ గంటసేపు ఆయనతో చర్చలు జరిపి, వినతిపత్రాన్ని అందచేశారు. వినతిపత్రంలో ఉన్న ప్రతి ఒక్క అంశం అమలు అయ్యేలా జాతీయ బీసీ కమిషన్ చొరవ తీసుకోవాలని కోరారు. ఏపీలో గత ఐదేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యావ్యవస్థకు పెద్ద పీట వేశారని గుర్తు చేశారు.

రైతు చేతిలో పేలిన నాటు బాంబు

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఘటన

హుస్నాబాద్ రూరల్: అడవిలో పాడి పశువులను మేతకు తీసుకెళ్లిన ఓ రైతు నాటు బాంబు పేలుళ్లకు గురై గాయపడ్డాడు. హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ శివారులోని పొలంలో సోమవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానిక రైతు ఖలీల్ తన పాడి గేదెలను మేతకు అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి మేకులను కట్టేస్తుండగా, సమీపంలోని రాళ్లపై నాటు బాంబు కనిపించింది. దాన్ని చేతిలోకి తీసుకుని పరిశీలించే క్రమంలో ఒక్కసారిగా పేలి వేళ్లు తెగిపడ్డాయి. తీవ్రంగా గాయపడ్డ ఖలీల్‌ను ఆయన సోదరుడు వరంగల్ ఎంజీఎంకు తరలించాడు. కాగా, ఆ నాటుబాంబును అడవి పందుల కోసం వేటగాళ్లు పెట్టి వదిలేశారని నిర్ధారణకు వచ్చిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నన్ను అంతమొందించడమే
కూటమి లక్ష్యం



అందుకే నా భద్రతను భారీగా కుదించారు | 3-6-24 నాటికి నాకున్న భద్రతను పునరుద్ధరించేలా ఆదేశాలివ్వండి | ఏపీ హైకోర్టులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిటిషన్

సాక్షి, అమరావతి: గతంలో తనకున్న జెడ్ ప్లస్ కేటగిరీ భద్రతను కుదించడాన్ని సవాలు చేస్తూ మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తనను అంతమొందించడమే ప్రస్తుత అధికార కూటమి ప్రధాన లక్ష్యమని, తనకున్న ప్రాణహానిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదంటూ ఆయన సోమవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనకున్న ప్రాణహానిని సరైన రీతిలో మదింపు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా తన భద్రతను కుదించిందని, ఈ నేపథ్యంలో.. 3-6-2024 నాటికి తనకున్న భద్రతను పునరుద్ధరించేలా ఆదేశించాలని ఆయన తన పిటిషన్‌లో కోర్టును కోరారు. అంతేగాక.. పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్లు, కౌంటర్ అసాల్ట్ టీమ్స్, జామర్లను సైతం అందుబాటులో ఉంచేలా ఆదేశాలివ్వాలని అభ్యర్థించారు. తన భద్రత కుదింపు విషయంలో చట్టం నిర్దేశించిన ప్రమాణాలకు, రాజ్యాంగ అధికరణలకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిందని జగన్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై బుధవారం హైకోర్టు విచారణ జరిపే అవకాశం ఉంది. వైఎస్ జగన్ తన పిటిషన్‌లో ఏం పేర్కొన్నారంటే..

నన్ను ప్రమాదంలోకి నెట్టేందుకే..

ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నాకున్న జెడ్ ప్లస్ భద్రతను ఇప్పుడు కూడా కొనసాగించాలని కోరుతూ మా పార్టీ ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. రాష్ట్ర ప్రభుత్వ చర్యలు, నిర్ణయాలు అధికార కూటమి లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నాయి. నన్ను ప్రజల నుంచి దూరంగా ఉంచేందుకు, వ్యక్తిగతంగా నేను దాడులకు గురయ్యేలా చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. రాష్ట్రంలో గత రెండునెలలుగా యథేచ్ఛగా వ్యవస్థీకృత రాజకీయ హింస కొనసాగుతోంది. ఇంత జరుగుతున్నా పోలీసు పెద్దలు చోద్యం చూస్తున్నారు. ఈ నేపథ్యంలో.. నాకున్న ప్రాణహానిని సరైన కోణంలో మదింపు చేయలేదు. ప్రజాసేవలు, రాజకీయ జీవితంలో, రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారికి భద్రతను కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని హైకోర్టు గతంలోనే స్పష్టమైన తీర్పునిచ్చింది. అయినా కూడా రాష్ట్ర ప్రభుత్వం అసాధారణ రీతిలో నా ఇంటి వద్ద, ఆఫీసు వద్ద భద్రతను ఉపసంహరించింది. నా భద్రతపై ఆందోళన వ్యక్తంచేస్తూ మా పార్టీ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినా కూడా ఎలాంటి స్పందన లేదు. నా జీవితాన్ని, స్వేచ్ఛను ప్రమాదంలోకి నెట్టేందుకు ఈ అధికార కూటమి ప్రభుత్వం తన అధికారాన్ని వినియోగిస్తోంది. ఉన్నపళంగా, అకారణంగా, ఏకపక్షంగా నాకున్న భద్రతను కుదించింది. ఇటీవల నా భద్రతా వలయంలో ఉల్లంఘనలు జరిగినా కూడా పోలీసులు పట్టించుకోవడంలేదు. వారు కూటమి ప్రభుత్వ పెద్దల పల్లకీలు మోస్తున్నారు. ఉద్దేశపూర్వకంగా తమ విధులను వారు విస్మరించడంవల్లే ఇటీవల కాలంలో మా పార్టీ కేడర్‌పై, ఆస్తులపై వ్యవస్థీకృత హింస పెరిగిపోయింది. దీనిపై మేం ఢిల్లీలో నిరసన కార్యక్రమం కూడా చేపట్టాం. నన్ను భౌతికంగా లేకుండా చేయడమే అధికార కూటమి లక్ష్యం. ఈ విషయంలో టీడీపీ సీనియర్ నేతల మధ్య సంభాషణ కూడా జరిగింది. ఆ సంభాషణ మీడియాలో విస్తృతంగా వ్యాప్తి చెందింది. నర్సీపట్నం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రస్తుతం స్పీకర్‌గా ఉన్న అయ్యన్నపాత్రుడు నా గురించి మాట్లాడుతూ.. 'నేను ఎన్నికల్లో మాత్రమే ఓడిపోయానని, ఇంకా బతికే ఉన్నానని' ఆయన వ్యాఖ్యానించారు. అంతేగాక.. చచ్చేవరకు కొట్టాలని కూడా వారు మాట్లాడుకున్నారు.

సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా భద్రత కుదింపు..

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే నాకు భద్రతను కుదించారు. అది కూడా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, నోటీసులు ఇవ్వకుండా సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా తగ్గించారు. నాకు భౌతిక హాని తలపెడతామని కూటమి నేతలు ఎన్నికల సమయంలో పదేపదే చెప్పారు. అందులో భాగంగానే నాపై ఎన్నికల ప్రచార సమయంలో గులకరాయి దాడి జరిగింది. గతంలో నాపై కోడికత్తితో హత్యాయత్నం కూడా చేశారు. వీటన్నింటి దృష్ట్యా నాకు 3-6-2024 నాటికి ఉన్న భద్రతను పునరుద్ధరించేలా ఆదేశాలు జారీ చేయండి.

నాకు రక్షణగా ఇద్దరు అధికారులే ఉన్నారు..

రాష్ట్రంలో రాజకీయ పార్టీల మధ్య వైరం ఉంది. అయితే, అధికార పార్టీ కూటమి నేతల రెచ్చగొట్టే ప్రసంగాలే మా పార్టీ కేడర్, నేతలపై దాడులు జరగడానికి పునాది. నా భద్రతను కుదించేందుకు అధికారుల వద్ద సహేతుక కారణాలుగానీ, ఆధారాలుగానీ ఏమీలేవు. అత్యున్నత భద్రత వ్యవస్థ అయిన జెడ్ ప్లస్ నుంచి నా భద్రతను కుదించారు. వాస్తవానికి జెడ్ ప్లస్ కేటగిరీ భద్రతను తొలగించినప్పటికీ, నా చుట్టూ ఉన్న భద్రత సిబ్బందిని మాత్రం బాగా కుదించారు. నాకు రక్షణగా ఇద్దరు భద్రతాధికారులు మాత్రమే ఉన్నారు. నా ఇంటి వద్ద, ఆఫీసు వద్ద భద్రతను పూర్తిగా తొలగించారు. అధికార పార్టీ నుంచి నిరంతరం నేను బహిరంగ బెదిరింపులు ఎదుర్కొంటున్నాను. అందువల్ల ప్రభుత్వం నాకు ఇంటి వద్ద, ఆఫీసు వద్ద భద్రతను ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉంది. నాకు అత్యంత సమీపంలో ఉండే క్యాట్ ఆక్టోపస్ టీమ్స్‌ను ఈ ప్రభుత్వం ఉపసంహరించింది. దీంతో ప్రస్తుతం నా చుట్టూ ఇద్దరు భద్రతాధికారులు మాత్రమే ఉంటున్నారు. గతంలో ఇలా 10 మంది ఉండేవారు. ప్రస్తుతం ఎమ్మెల్యేల వద్ద ఉన్న వ్యక్తిగత భద్రతాధికారుల కంటే నా వద్ద ఉన్న వ్యక్తిగత భద్రతాధికారుల సంఖ్యే తక్కువ. గతంలో ఇల్లు, ఆఫీసు వద్ద 11 మంది గార్డులు ఉండేవారు. ఇప్పుడు ఇద్దరే ఉన్నారు. ఇక నా భద్రత విషయంలో ప్రభుత్వం ఎంత సీరియస్‌గా ఉందన్న విషయం నాకు రక్షణగా ఇచ్చిన బుల్లెట్ కారును చూస్తే అర్థమైపోతుంది. అద్దాలు పగుళ్లు వచ్చి ఉన్నాయి. వెనుక డోర్ తెరుచుకోవడంలేదు. అత్యవసర పరిస్థితుల్లో కారు నుంచి బయటకు వచ్చే పరిస్థితిలేదు. మధ్యలో ఆగిపోతోంది. ఇటీవల ఓ పర్యటనకు వెళ్తుండగా మధ్యలో ఆగిపోయింది. దీంతో పర్యటనను అర్ధాంతరంగా ముగించాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో.. నేను నా వ్యక్తిగత బుల్లెట్‌ప్రూఫ్ కారు వాడుకునేందుకు అనుమతి కోరగా అధికారులు అనుమతినివ్వలేదు. పైగా వాళ్లు ఇచ్చే కారునే వాడాలన్నారు. నేను ప్రజలను కలవకుండా ఇంటి వద్దనే ఉండాలన్న కారణంతోనే అలాంటి కారును ఇచ్చారు.

ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో
ఆ వైద్యుల బదిలీలు నిలిపివేయండి

మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో సూపర్ స్పెషాలిటీ డాక్టర్ల బదిలీలను వెంటనే నిలిపివేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నతాధికారులను ఆదేశించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ కార్యాలయంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖల ఉన్నతాధికారులతో సోమవారం ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ వైద్య సేవలను దృష్టిలో ఉంచుకొని ఆమేరకు సదరు వైద్యుల బదిలీలు నిలిపివేయాలన్నారు. అత్యంత ప్రధాన ఆస్పత్రులైన ఉస్మానియా, గాంధీలో వైద్యసేవలకు అంతరాయం లేకుండా నిరంతరం సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖల కార్యదర్శి డా.క్రిస్టినా జెడ్ చోంగ్తూ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ వాణి, ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ రవీంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

జీవన్‌దాన్‌లో ఎంపిక పట్ల మంత్రి అభినందన

రాష్ట్రంలో అవయవదానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నందుకు జాతీయస్థాయిలో తెలంగాణ ఉత్తమరాష్ట్రంగా ఎంపికైంది. 14వ ఇండియన్ ఆర్గాన్ డొనేషన్ డే సందర్భంగా న్యూఢిల్లీలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్రమంత్రి అనుప్రియ పటేల్ నుంచి రాష్ట్ర జీవన్‌దాన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ స్వర్ణలత అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి వైద్య,ఆరోగ్య శాఖ అధికారులను ప్రత్యేకంగా అభినందించారు.

ఖరీదైన కార్లు.. రూ.కోట్ల ఆస్తులు

- హీరాగ్రూప్ కంపెనీలు, నౌహీరా షేక్ ఇంట్లో సోదాల్లో గుర్తింపు

సాక్షి, హైదరాబాద్: హీరా గ్రూప్ కంపెనీలు, ఆ కంపెనీ డైరెక్టర్ ఇల్లు, కార్యాలయాల్లో జరిపిన సోదాల్లో పెద్ద మొత్తంలో ఆస్తిపత్రాలు, అత్యంత ఖరీదైన కార్లు స్వాధీనం చేసుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఐదు ప్రాంతాల్లో జరిపిన సోదాలకు సంబంధించి వివరాలను ఈడీ అధికారులు సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. అందులో పేర్కొన్న ప్రకారం ఒక బీఎండబ్ల్యూ, ఒక బెంజ్, 9 టయోటా ఫార్చ్యూనర్లు, ఒక మహీంద్రా స్కార్పియో సహా మొత్తం 12 ఖరీదైన కార్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. బంజారాహిల్స్‌లోని హీరాగ్రూప్ కార్యాలయం, నౌహీరా షేక్ ఇల్లు, ఆఫీస్‌లో రూ.90 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. నౌహీరా ఆమె కుటుంబ సభ్యులు, బంధువుల పేరుతో ఉన్న రూ.45 కోట్లు విలువ చేసే 13 ఆస్తుల పత్రాలు, 11 మంది బినామీల పేరిట ఉన్న రూ.25 కోట్లు విలువ చేసే ఆస్తుల పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే హీరాగ్రూప్ సంస్థలు, నౌహీరా పేరిట ఉన్న రూ.400 కోట్లకు పైగా ఆస్తులను ఈడీ జప్తు చేసింది.

'అనర్హత'పై స్పీకర్ నిర్ణయానికి ఇంకెంతకాలం?

ఫిర్యాదులపై స్పీకర్ నిర్ణయం ఏమిటో చెప్పండి?

- అడ్వొకేట్ జనరల్‌ను ప్రశ్నించిన హైకోర్టు
- రాజ్యాంగపరమైన అంశాలన్న సుదర్శన్‌రెడ్డి
- స్పీకర్ విధుల్లో జోక్యం కూడదని వాదన
- తదుపరి విచారణ నేటికి వాయిదా

సాక్షి, హైదరాబాద్: శాసనసభ స్పీకర్ ముందున్న ఎమ్మెల్యేల అనర్హత ఫిర్యాదులపై ఎప్పటిలోగా నిర్ణయం తీసుకుంటారు? అందుకోసం ఎంతకాలం వేచి ఉండాలని అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎ. సుదర్శన్‌రెడ్డిని హైకోర్టు ప్రశ్నించింది. బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికైనప్పటికీ శాసనసభ్యత్వాలకు రాజీనామా చేయకుండానే కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావు, దానం నాగేందర్‌లను అనర్హులుగా ప్రకటించాలంటూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం మరోసారి విచారణ చేపట్టారు. హైకోర్టు ప్రశ్నలకు అడ్వొకేట్ జనరల్ (ఏజీ) బదులిచ్చారు. ఇవన్నీ రాజ్యాంగపరమైన అంశాలని.. కోర్టులు ఆ అంశాలను దాటవేసి స్పీకర్ విధుల్లో జోక్యం చేసుకోలేవని పేర్కొన్నారు. రాజ్యాంగపరమైన పోస్టులో ఉన్న స్పీకర్‌పై పిటిషనర్లు అత్యంత అసభ్యకరమైన పదజాలాన్ని ఉపయోగించారని, స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన 10 రోజుల్లోనే హైకోర్టును ఆశ్రయించారని.. ఈ కారణాలతో పిటిషన్లను కొట్టేయవచ్చని వాదించారు. అనంతరం దానం తరఫున సీనియర్ న్యాయవాది జంధ్యాల రవిశంకర్, బీఆర్‌ఎస్ తరఫున గండ్ర మోహన్‌రావులు వాదనలు వినిపించారు. జంధ్యాల రవిశంకర్ వాదిస్తూ పిటిషనర్ల వాదనలను తోసిపుచ్చారు. పిటిషనర్లు ప్రస్తావించిన తీర్పులో పార్టీ గుర్తు, ఇతర సభ్యులను అసెంబ్లీలోకి రానివ్వకపోవడం లాంటి అంశాలపై మాత్రమే హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని, అనర్హత పిటిషన్లపై ఎలాంటి ఆదేశాలివ్వలేదని చెప్పారు.

3 నెలలు దాటినా నోటీసులైనా జారీ చేయలేదు..

పిటిషనర్ల (బీఆర్‌ఎస్) తరఫున గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపిస్తూ 'ఫిర్యాదు చేసిన 10 రోజుల్లోనే కోర్టును ఆశ్రయించి అనర్హత పిటిషన్లపై ఉత్తర్వులు జారీ చేసేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోర్టును ఆశ్రయించామన్న వాదనను తప్పుబట్టారు. మార్చి 10న స్పీకర్ కార్యాలయం తిరస్కరించడంతో ఏప్రిల్ 10న దాదాపు నెల రోజుల తర్వాత న్యాయస్థానాన్ని ఆశ్రయించామన్నారు. 'పార్టీ మారిన ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవడంలో స్పీకర్ విఫమయ్యారు. కోర్టు చెప్పిన తర్వాత ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులు స్వీకరించాలని ఎలా ఆదేశాలు జారీ చేశారో.. ఫిర్యాదులపై నిర్ణయం తీసుకోవాలని కూడా అలాగే ఆదేశాలు జారీ చేయవచ్చు. ఈ పిటిషన్లలో కౌంటర్లు దాఖలు చేసే నాటికి దాదాపు 3 నెలలకుపైగా సమయం అయింది. అయినా ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులైనా జారీ చేయలేదు. అసెంబ్లీ కార్యదర్శి కూడా పబ్లిక్ సర్వెంటే. స్పీకర్‌పై అందరికీ గౌరవం ఉంది. కానీ రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే ఆయన నిర్ణయం తీసుకోవట్లేదని భావించాల్సి ఉంటుంది. రాజ్యాంగబద్ధ పదవిలో కూర్చొని రాజకీయ ఒత్తిళ్లకు లొంగడం సరికాదు. ఇలాగే కొనసాగితే ఐదేళ్లు కూడా గడిచిపోతుంది. జిల్లా కోర్టులకు కూడా విచారణను నిర్దిష్ట సమయంలోగా పూర్తి చేయాలని గడువు పెడుతున్నారు. అలాంటప్పుడు ట్రిబ్యునల్ చైర్మన్‌గా స్పీకర్‌ను ఆదేశించే అధికారం రాజ్యాంగ ధర్మాసనాలకు ఉంటుంది' అని పేర్కొన్నారు. తదుపరి విచారణను న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి.. నేటికి వాయిదా వేశారు.

గ్రానైట్ కాలుష్యంపై ఏం చర్యలు తీసుకున్నారు?



- సర్కార్‌కు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్‌లో గ్రానైట్ అక్రమ తవ్వకాలు, నిబంధనలు పాటించకుండా కాలుష్యం వెదజల్లుతుండటంపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని అధికారులకు నోటీసులు జారీ చేసింది. 'కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్‌లో గ్రానైట్ క్వారీలతో పరిసర ప్రాంతాల్లో పర్యావరణం అధ్వానంగా మారింది. అక్కడి ప్రజల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయి. విచ్చలవిడిగా, అక్రమంగా గ్రానైట్ తవ్వకాలతో పాటు అనుబంధ పరిశ్రమలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తుండటంతో పర్యావరణ కాలుష్యం అంతకంతకూ పెరిగిపోతోంది. గ్రానైట్, స్టోన్‌కటింగ్, పాలిషింగ్ యూనిట్లతో గాలి మాత్రమే కాకుండా నీరు, ధ్వని కాలుష్యం పెరిగిపోయింది. ధూళి కారణంగా చుట్టుపక్కల గ్రామాల్లో పచ్చదనం అన్నదే మాయమైంది. 40 వేల కుటుంబాలతో పాటు జంతువులు కూడా శ్వాస పీల్చుకోవడానికి ఇబ్బందిపడుతున్నాయి' అని ప్రధాన న్యాయ మూర్తికి కరీంనగర్‌వాసి డి.అరుణ్‌కుమార్ రాసిన లేఖను హైకోర్టు సుమోటోగా విచారణకు నిర్ణయించింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రీనివాస్‌రావు జూకంటి ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషన్‌ను పరిశీలించిన ధర్మాసనం.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, గనులు, పరిశ్రమలు, వాణిజ్య, పర్యావరణ, అటవీ శాఖల ముఖ్య కార్య దర్శులతో పాటు కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి, జిల్లా కలెక్టర్, తదితరులకు నోటీసులు జారీ చేసింది.

ఇసుక అక్రమ తరలింపుపై వివరణ ఇవ్వండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలంలో గడువు ముగిసినా ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టడంపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలంటూ ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. కామారెడ్డి జిల్లాలోని బిచ్కుంద మండలం ఖద్గం–శెట్లూరు శివారులో రోజుకు సుమారు రూ.30 లక్షల విలువైన ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్నాయంటూ ఎ. ప్రకాశ్ అనే న్యాయవాది హైకోర్టు సీజేకు లేఖ రాయడం తెలిసిందే. ఈ లేఖను సుమోటో పిల్‌గా స్వీకరించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. వాదనల అనంతరం గనులు, భూగర్భ, రెవెన్యూ, రవాణా, హోం శాఖల ముఖ్య కార్యదర్శులు, జిల్లా కలెక్టర్, టీఎస్ఎండీసీ, తహసీల్దార్ తదితరులకు నోటీసులు జారీ చేసింది.

చిన్న పత్రికలకు అన్యాయం తగదు

- అక్రెడిటేషన్లపై 2 నెలల్లో కొత్త మార్గదర్శకాలు రూపొందించండి : హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: జిల్లా మరియు నియోజకవర్గస్థాయిల్లో చిన్న వార్తా పత్రికల జర్నలిస్టులకు అక్రెడిటేషన్ ప్రయోజనాలను కల్పించపోవడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం 2016లో తీసుకొచ్చిన 'షెడ్యూల్ ఈ' నిబంధనలను కొట్టివేసింది. చిన్నపత్రికల్లోని వారికి కూడా ప్రయోజనాలు విస్తరించడానికి రెండు నెలల్లో కొత్త మార్గదర్శకాలు రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మార్గదర్శకాలు న్యాయమైన, హేతుబద్ధమైన ప్రమాణాలపై ఆధారపడి ఉండాలని నొక్కి చెప్పింది. 2016లో ప్రభుత్వం తీసుకొచ్చిన 'షెడ్యూల్ ఈ'ను సవాల్ చేస్తూ కొన్ని చిన్న పత్రికల యాజమాన్యాలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. ఈ పిటిషన్‌పై ప్రధానన్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వ నిర్ణయం కారణంగా చిన్న పత్రికల రిపోర్టర్లకు అన్యాయం జరుగుతోందని, ఇది సమానహక్కును ఉల్లంఘించినట్లేనని పిటిషనర్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం.. న్యాయవాది వాదనతో ఏకీభవిస్తూ, చిన్న పత్రికలకు అన్యాయం జరగకుండా మరోసారి మార్గదర్శకాలు సిద్ధం చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

సీఈఓ, డీఆర్‌డీఓ, డీపీఓల బదిలీలు..పోస్టింగ్‌లు

సాక్షి, హైదరాబాద్ : జిల్లాపరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు (సీఈఓ), జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు (డీఆర్‌డీఓ), జిల్లా పంచాయతీ అధికారుల (డీపీఓ) బదిలీలతోపాటు, ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేస్తూ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పరిపాలనాపరంగా అవసరమైన మార్పుచేర్పుల్లో భాగంగా ఈ ప్రక్రియ చేపట్టారు.

- ఖమ్మం జెడ్పీ సీఈఓ ఎస్.వినోద్‌ను రాజన్న సిరిసిల్లజిల్లాకు, జగిత్యాల డీఆర్‌డీఓగా పనిచేస్తున్న ఎం.సంపత్‌రావును ములుగు సీఈఓ, డీఆర్‌డీఓ (ఎఫ్‌ఏసీ)గా బదిలీ చేశారు. యాదాద్రి జిల్లా సీఈఓ/డీఆర్‌డీఓగా పనిచేస్తున్న ఎంఏ.కృష్ణన్‌ను ప్రభుత్వానికి రిపోర్ట్ చేయాల్సిందిగా సూచించారు.
- డీఆర్‌డీఓలుగా బదిలీ అయిన జాబితాలో.. మహబూబాబాద్ జిల్లాకు జి.మధుసూదనరాజు, పెద్దపల్లికి ఆర్.రవీందర్, నారాయణపేటకు మొగులప్ప, జనగామకు వసంత, సూర్యాపేటకు వీవీ.అప్పారావు, కొమురంభీమ్ ఆసిఫాబాద్‌కు బి.దత్తారావు, జగిత్యాలకు ఎం.రఘువరన్ ఉన్నారు.
- డీపీఓలుగా మహబూబ్‌నగర్ జిల్లాకు సీహెచ్.పార్థసారథి, జోగుళాంబ గద్వాలకు బి.శ్యాంసుందర్, నారాయణపేటకు పి.కృష్ణయ్య, నాగర్‌కర్నూల్‌కు ఎంవీ.రామ్మోహన్‌రావులను బదిలీ చేశారు. సోమవారంఈ మేరకు పీఆర్‌ఆర్‌డీ శాఖ కార్యదర్శి డీఎస్.లోకేష్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు.

సైబర్ బాధితులకు ఊరట

- నేరగాళ్ల కొల్లగొట్టిన రూ.85.05 కోట్లు బాధితులకు రిఫండ్

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయి, ఆర్థికంగా నష్టపోయిన బాధితులకు ఊరట లభించింది. ఈ ఏడాది మార్చి నుంచి జూలై వరకు నమోదైన నేరాల్లో బాధితులు పోగొట్టుకున్న రూ.85.05 కోట్లు తిరిగి బాధితులకు ఇప్పించేలా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు చర్యలు తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6,449 కేసులలో బాధితులకు ఈ సొమ్ము అందనున్నట్టు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, టీజీ లీగల్ సర్వీసెస్ అథారిటీస్ అధికారుల సమన్వయంతో ఇది సాధ్యమైనట్టు తెలిపారు. 6,840 కేసులు కోర్టుల్లో నమోదవగా వీటిలో 6,449 కేసులలో పరిష్కారం దక్కినట్టు వెల్లడించారు. అత్యధికంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైన కేసులలో బాధితులకు రూ.36.8 కోట్లు రిఫండ్ చేసినట్టు చెప్పారు. బాధితులు సొమ్ము పోగొట్టుకున్న బ్యాంకు ఖాతా వివరాల ఆధారంగా వారికి తిరిగి చెల్లిస్తున్నారు.

న్యూస్‌మేకర్స్


రమజనోవా


నదా హఫెజ్

అమ్మతనం ఆటకు అడ్డు కాలేదు

గర్భిణి స్త్రీలు ప్రతి విషయంలో ఆచితూచి ఉండాలి. అయితే కొన్ని సందర్భాలు సవాళ్లు విసురుతాయి. దేశం కోసం నిలబడమంటాయి. పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో ఇద్దరు మహిళలు గర్భంతో పోటీల్లో నిలిచి ఆశ్చర్యపరిచారు. ఈజిప్ట్ ఫెన్సర్ నదా హఫెజ్ ఆరునెలల గర్భంతో, అజర్‌బైజాన్ ఆర్చర్ యయలాగుల్ రమజనోవా ఐదున్నర నెలల గర్భంతో ప్రత్యర్థులతో పోరాడారు. గెలుపు ఓటముల కంటే కూడా వాళ్లు పాల్గొనడమే పెద్ద గెలుపు. వీరు మాత్రమే కాదు, గర్భిణులుగా బరిలోకి దిగిన అథ్లెట్స్ గత ఒలింపిక్స్ లోనూ ఎంతోమంది ఉన్నారు.

పదహారవ రౌండ్‌లో ఓటమి తరువాత తాను ఏడు నెలల గర్భిణిని అని ప్రకటించింది ఈజిప్ట్ ఫెన్సింగ్ క్రీడాకారిణి నదా హఫీజ్. ఆమె ప్రకటన సంచలనం కలిగించింది. నిజానికి గర్భిణిగా ఒలింపిక్స్‌లోకి అడుగుపెట్టిన క్రీడాకారులు, ఒలింపిక్స్‌లోకి అడుగు పెట్టిన తరువాత గర్భిణి అని తెలుసుకున్న వారు ఎంతోమంది ఉన్నారు....

ఎలినార్ బర్కర్: టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొన్నప్పుడు బ్రిటిష్ సైకిలింగ్ స్టార్ ఎలినార్ బర్కర్ మూడు నెలల గర్భిణి. ఒలింపిక్స్‌లో సిల్వర్ మెడల్ గెలుచుకున్న ఎలినార్ ఆ తరువాతే తాను గర్భిణిని అనే విషయం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రకటించింది. ‘రేసుకు కొద్దిరోజుల ముందు టోక్యోలో నేను గర్భవతినని తెలుసుకున్నాను. ఇది నేను ఊహించని విషయం. ఆ సమయంలో ఒత్తిడికి గురయ్యాను’ ఆరోజును గుర్తు చేసుకుంటుంది ఎలినార్. ఎలినార్ బార్కర్ ఎండోమెట్రియోసిస్‌తో బాధపడుతుండేది. దీని వల్ల గర్భిణులకు సమస్యలు ఎదురయ్యే అవకాశాలు ఉండడం ఆమె ఒత్తిడికి కారణం. కొద్దిరోజుల్లో ఆట, మరో వైపు కొండంత ఒత్తిడి. టీమ్ డాక్టర్, సైకియాట్రిస్ట్‌ను సంప్రదించి సలహాలు తీసుకుంది. ధైర్యం తెచ్చుకుంది. మెడల్ గెలుచుకుంది.

ఆంకీ వాన్ గ్రన్స్వెన్: డచ్ డ్రెస్సేజ్ ఛాంపియన్ ఆంకీ వాన్ గ్రన్స్వెన్ అయిదు నెలల గర్భిణిగా ఒలింపిక్స్ బరిలోకి దిగి స్వర్ణ పతకం సాధించింది.

క్రిస్టీ మూర్: అయిదు నెలల గర్భిణిగా 2010 ఒలింపిక్స్ బరిలోకి అడుగు పెట్టింది కెనడియన్ కర్లర్ క్రిస్టీ మూర్. కాస్త వెనక్కి వెళితే...ఒకరోజు కర్లింగ్ టీమ్ నుంచి క్రిస్టీకి ఫోన్ కాల్ వచ్చింది. ‘ఐయామ్ ప్రెగ్నెంట్’ అని చెప్పింది క్రిస్టీ. ‘ఆడడం మీకు కష్టమవుతుందా’ అవతలి గొంతు.

ఎటూ తేల్చుకోలేని పరిస్థితి. ఆ సమయంలో తన టీమ్‌మెట్ ఒకరు.... ‘నువ్వు ప్రెగ్నెంట్ మాత్రమే. చనిపోలేదు’ అన్నది. దీని అర్థం ‘నీలో పోరాడే సత్తా’ ఉంది అని. దీంతో మరో ఆలోచన చేయకుండా ఒలింపిక్ బరిలోకి దిగింది క్రిస్టీ మూర్.

‘ఒలింపిక్స్‌లో పాల్గొనడం, మాతృత్వం... రెండూ అపురూపమే. పెద్ద సవాలు అని తెలిసినా ముందుకు వెళ్లాను’ ఆ రోజులను గుర్తు చేసుకుంటుంది క్రిస్టీ మూర్.

మరి కొందరి విషయానికి వస్తే....

అమెరికన్ ఐస్–హాకీ ప్లేయర్ **లీసా బ్రౌన్ మిల్లర్** 1998 వింటర్ ఒలింపిక్స్‌లో పాల్గొంది, అక్కడికి వెళ్లాకే తాను ప్రెగ్నెంట్ అనే విషయం తెలిసింది. అమెరికన్ సాఫ్ట్‌బాల్ ప్లేయర్ **మిషల్ గ్రెంజర్** మూడు నెలల గర్భిణిగా 1996 ఒలింపిక్స్‌లోకి అడుగు పెట్టింది. జర్మన్ ఆర్చర్ **కర్నోలియ** ఏడు నెలల గర్భిణిగా 2004 ఒలింపిక్స్‌లోకి అడుగుపెట్టింది... ఈ జాబితా ఇంకా ఉంది. వీరిలో స్వర్ణాలు గెలుచుకున్నవారు ఉన్నారు. గెలవకపోయినా సత్తా చాటిన వారు ఉన్నారు.

‘వీడు కడుపులో ఉన్నప్పుడే నాతో పాటు ఒలింపిక్స్ ఆడాడు’ అని తమ బిడ్డల గురించి గర్వంగా చెబుతుంటారు ఆ అథ్లెట్ తల్లులు.

ఆ సమయంలో...

రక్తస్రావంలాంటి సమస్యలు ఉన్నప్పుడు తప్ప సాధారణంగా తేలికపాటి వ్యాయామాలను గర్భిణి అథ్లెట్లకు సూచిస్తాం. ప్రెగ్నెన్సీ మొదటి మూడు నెలల్లో రొటీన్ ఎక్సర్‌సైజ్‌లు చేసినా ఫరవాలేదు. ఎక్కువగా చేయడానికి ప్రయత్నించవద్దు. మితంగా చేస్తే చాలు అని చెబుతుంటాం. బ్యాడ్మింటన్, టెన్నిస్‌లాంటి ఆటలు ఆడాలనుకునేవారికి మాత్రం సాధ్యమైనంత వరకు వద్దనే చెబుతాం.

– డా. ఆశా దలాల్, సర్ హెచ్‌ఎన్ రిలయన్స్ హాస్పిటల్స్ ఉమెన్ సెంటర్ డైరెక్టర్

వయనాడ్ లాస్ట్ కాల్

ఆమె గొంతుక మన గుండెల్లో...


నీతూ జోజో

‘దయచేసి మమ్మల్ని రక్షించండి’ వణుకుతున్న గొంతుతో సహాయం కోసం నీతూ జోజో చేసిన ఆర్తనాదం కొందరి ప్రాణాలను రక్షించగలిగింది. వయనాడ్‌లో జూలై 30 వరదల సందర్భంగా సహాయం కోసం మొదట వచ్చిన ఫోన్ కాల్ నీతూ జోజోదే. ఆ కాల్ రికార్డ్ కావడంతో ఇప్పుడు సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ అవుతోంది. తన కుటుంబమే కాదు ఇరుగు పొరుగు కుటుంబాలు కూడా సురక్షితంగా ఉండేలా ప్రయత్నిస్తున్న క్రమంలో ప్రాణాలు కోల్పోయింది నీతూ జోజో...

కేరళ వరదల (2018)పై గత సంవత్సరం వచ్చిన మలయాళ చిత్రం ‘2018’లో వరద బీభత్సం, చావుకు బతుకుకు మధ్య ఊగిసలాడిన బాధితుల దృశ్యాలు, వరద అనే అష్టదిగ్బంధనంలో కూరుకుపోయిన ఇండ్లు... ఒళ్లు జలదరింప చేసే దృశ్యాలెన్నో కనిపిస్తాయి. ఇప్పుడు వాటికి మించిన దృశ్యాలు వయనాడ్‌లో కనిపిస్తున్నాయి. ‘2018’ సినిమాలో ఇతరులను రక్షించాలని తపించిన వారిని ఉద్దేశించి ‘ఎవ్రీ వన్ ఈజ్ ఏ హీరో’ అనే పెద్ద అక్షరాలు తెరమీద కనిపిస్తాయి. అలాంటి ఒక హీరో నీతూ జోజో.

నీతు వయనాడ్‌లోని మూపెన్స్ మెడికల్ కాలేజీలో నర్స్. ‘కొండచరియలు విరిగిపడ్డాయి. నేను ఇక్కడ పాఠశాల వెనకాల నివసిస్తున్నాను. దయచేసి మాకు సహాయం చేయడానికి ఎవరినైనా పంపగలరా. మీకు ఫోన్ చేయడానికి ముందు నేను చాలా మందికి ఫోన్ చేశాను’ అంటూ చెప్పడి గ్రామం నుంచి మూపెన్ మెడికల్ కాలేజీకి ఫోన్ చేసింది నీతు.


ధ్వంసమైన నీతూ ఇల్లు

సిబ్బంది ఆమె నుంచి అన్ని వివరాలు అడిగి తెలుసుకొని సహాయ బృందాలు వస్తాయని భరోసా ఇచ్చారు. సమీపంలో నివసిస్తున్న ఏడు కుటుంబాలు తన ఇంట్లో ఆశ్రయం పొందారని, శిథిలాల మధ్య చిక్కుకుపోయిన తమ ఇంట్లోకి నీళ్లు వస్తున్నాయని ఫోన్‌లో చెప్పింది నీతు.

‘ఆమె చాలా ఆందోళన, బాధతో ఫోన్ చేసింది. నేను వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాను. ఆసుపత్రి నుంచి మా అంబులెన్స్ నీతు ఉంటున్న ప్రాంతానికి బయలుదేరింది’ అంటుంది మూపెన్స్ మెడికల్ కాలేజీ డీజీఎం షనవాస్ పల్లియాల్.

అయితే చెట్లు విరిగిపడడంతో రోడ్డు బ్లాక్ అయింది. అంబులెన్స్ ముందుకు వెళ్లలేని పరిస్థితి. దీంతో నీతూకు ధైర్యం చెప్పడానికి అంబులెన్స్ డ్రైవర్, ఇతర సిబ్బంది నాన్‌స్టాప్‌గా ఫోన్‌లు చేస్తూనే ఉన్నారు. రెండోసారి కొండ చరియలు విరిగిపడిన తరువాత ఫోన్ కనెక్షన్ కట్ అయింది.

రోడ్లు బ్లాక్ కావడం, చూరల మాల వంతెన కొట్టుకుపోవడం వల్ల సహాయ సిబ్బంది నీతూ దగ్గరకు చేరుకోలేక పోయారు. భర్త, బిడ్డ, అత్త , ఇరుగు పొరుగు వారు ప్రాణాలతో బయటపడినప్పటికీ నీతూ చనిపోయింది.

‘నేను నీతూకు ఫోన్ చేసినప్పుడు తాము మృత్యువు నుంచి తప్పించుకున్నామనే ధైర్యం ఆమె గొంతులో వినిపించింది. నీతూకు ధైర్యం ఇవ్వగలిగాం గానీ దురదృష్టవశాత్తు రక్షించలేకపోయాం’ అంటుంది షనవాస్ పల్లియాల్.

ఆరోజు అర్ధరాత్రి దాటిన తరువాత... చెప్పడి గ్రామంలోని నీతు ఇంటిపై కొండచరియలు విరిగి పడ్డాయి. నీరు ఇంట్లోకి ప్రవేశించడంతో అప్రమత్తమైంది. ఇరుగు పొరుగు వారిని అలర్ట్ చేసింది. ఒకవైపు తమను రక్షించమని ఫోన్ చేస్తూనే, మరో వైపు తన ఇంటి వారిని, పొరుగువారిని సురక్షిత ప్రాంతానికి తీసుకువెళ్లడానికి రకరకాల ప్రయత్నాలు చేసింది.

అయితే తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో మరోసారి కొండచరియలు విరిగిపడడంతో మృత్యువు చెంతకు వచ్చింది. ఇక ఎంత మాత్రం తప్పించుకోలేని పరిస్థితి. నీతూతో పాటు ముగ్గురి ప్రాణాలూ గాలిలో కలిసిపోయాయి.

‘మా ఇంట్లో ఉంటే సురక్షితం అని మమ్మల్ని తీసుకువెళ్లడమే కాదు. మాకు ధైర్యం చెప్పింది. ఇలా అవుతుందని అనుకోలేదు’ అని నీతును గుర్తు తెచ్చుకుంటూ కళ్లనీళ్లు పెట్టుకుంది పొరుగింటి మహిళ.

‘నీతూ ఫోన్ కాల్ ఇప్పటికీ చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంది. చిన్న చిన్న గాయాలతో బయటపడుతుంది అనుకున్నాం. దురదృష్టవశాత్తు ఆమెను నిర్జీవంగా చూడాల్సి వచ్చింది’ శోకతప్త హృదయంతో అంటుంది నీతూతో కలిసి మూపెన్స్ మెడికల్ కాలేజీలో పనిచేసిన ఉద్యోగి.

బీభత్సాలు జరిగినప్పుడు తమ ప్రాణాలు అడ్డేసి ఇతరుల ప్రాణాలు కాపాడేవారు ఉంటారు. నీతు జోసెఫ్‌ను వయనాడ్ ప్రజలు తలుచుకుంటూనే ఉంటారు.

విజేత

వచ్చాడు గెలిచాడు!


అవిర్భవ్

తుమ్ ముజేనా యూ బచానా పావోవే’... రఫీ పాడిన ఈ పాటను ఏడేళ్ల అవిర్భవ్ వేదిక మీద పాడుతుంటే అందరికీ కన్నీరు వచ్చింది. ఇంత బాగా పాడిన ఈ బుడతడిని సోనిలో సూపర్‌స్టార్ సింగర్ సీజన్ 3 (మార్చి 2024 నుంచి ఆగస్టు 2024 వరకు) చూసిన వారెవరూ అంత సులభంగా మర్చిపోలేరు. అందుకే మొత్తం 11 మంది ఫైనలిస్ట్‌లలో తమ ఓటింగ్ ద్వారా అవిర్భవ్‌నే విజేతగా నిలిపారు. పది లక్షల రూపాయల బహుమతి వచ్చేలా చూశారు. జడ్జిల చాయిస్‌గా అధర్వ బక్షి అనే మరో చిన్నోడు విజేతగా నిలిచినా ఈ సీజన్‌లో సంగీత ప్రియుల హృదయాలను కొల్లగొట్టింది మాత్రం అవిర్భవే. చిన్నగా కోమలమైన ఆకారంతో ఉన్నప్పటికీ అవిర్భవ్ రేంజ్ చాలా గొప్పది. కేరళకు చెందిన అవిర్భవ్ తన సోదరి అనిర్విన్య దగ్గర రెండేళ్ల వయసు నుంచే సంగీతం నేర్చుకున్నాడు. తెలుగు షోస్‌లో కూడా పాల్గొన్నాడు. కాని ఇపుడు సూపర్‌స్టార్ సింగర్ ద్వారా ప్రపంచ ప్రఖ్యాతమయ్యాడు. అర్జిత్ సింగ్ ఇతడి ఫేవరెట్ సింగర్. పెద్దయ్యాక గాయకుణ్ణి అయ్యి సల్మాన్, షారుక్‌ఖాన్‌లకు పాడతానని అంటున్నాడు అవిర్భవ్.

సాగుబడి

ఆశ్లేష కార్తె: ఆగస్టు 3 నుంచి

15న తార్నాకలో సేంద్రియ సంత

గ్రామభారతి, సిఎస్ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 15న సికింద్రాబాద్‌లోని తార్నాకలో మర్రి కృష్ణ హాల్‌లో ఉ. 10 గం. నుంచి సా. 6 గం. వరకు బ్యాక్ టు రూట్స్ మూలం సంత పేరిట సేంద్రియ/ప్రకృతి వ్యవసాయ దారుల ఉత్పత్తుల సంతను నిర్వహించనున్నారు. ఇతర వివరాలకు.. 94908 50766, 63051 82620.

17న హైదరాబాద్‌లో బయోచార్‌పై సెమినార్



హైదరాబాద్ యూసఫ్‌గూడలోని నిమ్స్‌మే ఆడిటోరియంలో ఈ నెల 17(శనివారం) ఉ. 9.30 నుంచి సా. 6 గం. వరకు బయోచార్ (కట్టెబొగ్గు)పై జాతీయ సదస్సు జరగనుంది. ప్రోగ్రెసివ్ బయోచార్ సొసైటీ ఆఫ్ హైదరాబాద్, నిమ్స్‌మే, రెయిన్‌బో బాంబూ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సు జరుగుతుంది. రిజిస్ట్రేషన్ తదితర వివరాలకు.. 63051 71362.

18న పెనుకొండలో....

బయోచార్ (కట్టెబొగ్గు) ఉత్పత్తిపై ఈ నెల 18న ఆంధ్రప్రదేశ్‌లోని పెనుకొండలో చార్ గోల్డ్ సంస్థ ఆవరణలో వర్క్‌షాప్ జరగనుంది. బయోచార్ నిపుణులు డాక్టర్ నక్కా సాయి భాస్కర్‌రెడ్డి, ప్రేమ్‌రాజ్ అవగాహన కల్పిస్తారు. రిజిస్ట్రేషన్ తదితర వివరాలకు.. వాట్సాప్ – 92463 52018.

11న సేంద్రియ చెరకు సాగు, 18న మట్టి సేద్యంపై శిక్షణ



‘రైతునేస్తం ఫౌండేషన్’ ఆధ్వర్యంలో ‘కర్షక సేవా కేంద్రం’ నిర్వహణలో హైదరాబాద్ ఖైరతాబాద్ దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆవరణలో ఈ నెల 11,18 తేదీల్లో రైతులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఆగస్టు 11 (ఆదివారం)న ఉ. 10 గం. నుంచి ‘సేంద్రియ పద్ధతిలో చెరకు సాగు, చెరకుతో బెల్లం తయారీ విధానం’పై రైతు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు శిక్షణ ఇస్తారు. 18(ఆదివారం)న ఉ. 10 గం. నుంచి ‘సేంద్రియ సాగులో మట్టి ద్రావణంతో పురుగులు తెగుళ్ళ నివారణ ఎలా?’ అనే అంశంపై రైతు శాస్త్రవేత్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత చింతల వెంకటరెడ్డి శిక్షణ ఇస్తారని రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ డా. వై. వెంకటేశ్వరరావు తెలిపారు. హాజరుకాగోరే వారు తప్పనిసరిగా ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు.. 95538 25532, 70939 73999.

- కుటుంబ సభ్యుల కేన్సర్ మరణాలకు కారణం రసాయనాలతో కూడిన ఆహారమేనని గ్రహింపు
- వైద్యుడి సలహా మేరకు ఉద్యోగం వదలి... 9 ఏళ్ల క్రితం ప్రకృతి సేద్య బాట పట్టిన బాపారావు
- ఆయన స్ఫూర్తితో 60 మంది రైతులు 85 ఎకరాల్లో దేశీ వరి ప్రకృతి సేద్యానికి శ్రీకారం

సేఫ్ ఫుడ్ సేనాని!



కుటుంబ సభ్యులు కేన్సర్ బారిన పడిన ఒకరి తర్వాత ఒకరు చనిపోతున్న నేపథ్యంలో ఆహారంలో రసాయనాల అవశేషాలే ఇందుకు మూల కారణంగా గుర్తించిన ఓ యువకుడు ఉద్యోగం వదలి ప్రకృతి సేద్య సేనానిగా మారారు. అతనే యర్రు బాపారావు (బాపయ్య). కేవలం ఎకరంన్నర సొంత భూమి మాత్రమే ఉన్నప్పటికీ ప్రకృతి వ్యవసాయం చేపట్టడంతో పాటు దేశీ వరి వంగడాలను సాగు చేస్తున్నారు. తమిళనాడు వెల్లూరులో ఈషా ఫౌండేషన్ ఇటీవల నిర్వహించిన ‘భారతీయ సంప్రదాయ వరి, ఆహారోత్పత్తుల ఉత్సవం’లో బాపారావు మరో ముగ్గురు తెలుగు రైతులతో పాటు ఉత్తమ రైతు పురస్కారం అందుకున్నారు.

సేఫ్ ఫుడ్ యువ ఉద్యమకారునిగా బాపారావు (39), లక్ష్మి సౌజన్య దంపతుల ప్రకృతి వ్యవసాయ జీవన ప్రస్థానం అత్యంత స్ఫూర్తిదాయకం. వారి స్వగ్రామం గుంటూరు జిల్లా కొల్లిపర మండలం అత్తోట. ఉన్నత విద్యావంతుడైన బాపారావు హైదరాబాద్‌లో గ్రాఫిక్ డిజైనర్, 2డి ఏనిమేటర్ గా ఉద్యోగం చేసేవారు. తమ కుటుంబంలోనే ముగ్గురు కేన్సర్ వ్యాధితో కొద్ది కాలంలోనే మృత్యువాతపడటంతో రసాయనాల మయమైన ఆహారమే ఆరోగ్యాన్ని నాశనం చేస్తోందని గ్రహించారు. ఓ వైద్యుని సలహా మేరకు ఉద్యోగానికి స్వస్తి చెప్పి.. 9 ఏళ్ల క్రితం ప్రకృతి వ్యవసాయం – సంప్రదాయ ఆహారోద్యమం ప్రారంభించారు. భార్య తోడ్పాటుతో బాపారావు తిరిగి స్వగ్రామం చేరుకొని ప్రకృతి వ్యవసాయం చేపట్టారు. సొంత భూమి ఎకరంన్నరకు తోడు 7 ఎకరాల కౌలు భూమిలో ఔషధ, పోషక విలువలతో కూడిన దేశీ వరి వంగడాలను గత తొమ్మిదేళ్లుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్నారు. ఆయన స్ఫూర్తితో అత్తోట గ్రామానికి చెందిన 60 మంది రైతులు సమష్టిగా ప్రకృతి వ్యవసాయం చేపట్టి సుమారు 85 ఎకరాల భూమిలో దేశీ వరి రకాలను సాగు చేస్తుండటం విశేషం. ఎకరంలో 365 రకాల దేశీ వరి రకాలను విత్తనాల పరిరక్షణ కోసం బాపారావు సాగు చేస్తున్నారు. 7 ఎకరాల్లో సార్వాలో మైసూర్‌మల్లిగ, బహురూపి తదితర దేశీ వరి రకాలను సాగు చేస్తున్నారు. గట్లపై బంతి, వంగ, చిక్కుడు, పొద్దు తిరుగుడు, బెండ, అరటి, మునగ, టమాటా, మిర్చి, తోటకూర, గోంగూర, ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నారు. వేసవిలో 20 రకాల ధాన్యాలు, పప్పుదినుసులు, నూనెగింజలు, కూరగాయల విత్తనాలు చల్లి.. 40 రోజులు పెరిగిన తర్వాత కోసి ఆవులకు మేతగా ఉపయోగించుకుంటున్నారు. కూరగాయలు, ఆకుకూరలు ఇంట్లోకి వాడుకుంటున్నారు. మిగతా పచ్చిరొట్టను భూమిలో కలియదున్ని తర్వాత వరి సాగు చేస్తున్నారు.



ప్రకృతి వ్యవసాయంలో పండించిన బియ్యం, కూరగాయలను స్నేహితులు, బంధువులకు అమ్ముకొని ప్రతి రోజూ ఆదాయం సంపాదిస్తున్నారు. లక్ష్మి దేవినేని సహకారంతో ‘తానా’ సహకారంతో గ్రామంలోనే ‘భూమి భారతి’ అనే సంస్థను నెలకొల్పారు. భూమి భారతి ద్వారా దేశీ వరి విత్తన నిధిని నిర్వహించటంతోపాటు.. రైతులు పండించిన దేశీ వరి బియ్యాన్ని, విలువ జోడించిన ఇతర ఆరోగ్యదాయక ఆహారోత్పత్తులను సంతల్లో, సోషల్ మీడియా ద్వారా సుమారు వెయ్యి కుటుంబాలకు విక్రయిస్తున్నారు. రైతు మిత్రుల ద్వారా దేశీ వరి విత్తనోత్పత్తి చేసి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సుమారు 4 వేల మంది ప్రకృతి వ్యవసాయదారులకు అందించటం బాపారావు విశేష కృషికి నిదర్శనం.

భావితరం కోసం...

ఆయన ఇలా చెబుతున్నారు.. ‘రసాయన ఎరువులు, పురుగు మందులు ఉపయోగించడం వలన భూమి సారం కోల్పోతున్నది, రైతులు అప్పుల పాలవుతూ, అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రకృతి సాగు పద్ధతిలో పండిస్తే ఖర్చులు తగ్గించుకోవచ్చు. నీటి తడులు పెట్టడం తగ్గుతుంది. అంతర పంటలతో అధికాదాయాన్ని పొందుతాం. దేశీ విత్తనం వాడటం వలన ఆ పంటలు తినే వారి ఆరోగ్యం బాగుంటుంది. ఇలా ఇతర రైతులు పండించే పంటదిగుబడులను బై బ్యాక్ సిస్టం కింద కొని భూమి భారతి ద్వారా నేరుగా ప్రజలకు అమ్ముతున్నాను. ప్రతి రైతూ ఏటీఎం మోడల్ వేసుకుంటే అదనపు ఆదాయం కూడా వస్తుంది. మంచి పోషక విలువలు కలిగిన ఆహారంతోపాటు మంచి భూమి భావితరానికి కావాలి అంటే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ప్రకృతి వ్యవసాయం చేయటమే మార్గం..’ అంటారు బాపారావు.

ప్రవాస భారతీయులు మౌనికా రెడ్డి దంపతుల సాయంతో విజయవాడలోని కనకదుర్గ అమ్మ వారికి, మరో ఎన్ఆర్ఐ తాళ్లూరి జయశేఖర్ దంపతుల సాయంతో భద్రాచలంలోని సీతారాముల వారికి ఏడాది పొడవునా నైవేద్యం కోసం దేశీ వరి బియ్యాన్ని పంపుతుండటం మరో విశేషం. వరి కోత సమయంలో వర్షాల కారణంగా ధాన్యం ఎండబెట్టడం, కలుపు తీసే సమయంలో కూలీల కొరత వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నానని ఆయన చెబుతున్నారు. బాలారిష్టాలను అధిగమించి నిలదొక్కుకున్న ఆయన నెలకు రూ. 4 లక్షల టర్నోవర్‌కు చేరుకోవటం విశేషం. ‘ఆరోగ్యమే మహాభాగ్యం. ఆరోగ్యదాయక ఆహారమే ఆరోగ్య సోపానమ’ని తన చేతల ద్వారా చాటిచెబుతున్న బాపారావు (91008 07308) దంపతులు యువతకు ఆదర్శప్రాయులు.

నిర్వహణ: పంతంగి రాంబాబు
సాగుబడి డెస్క్

17, 18 తేదీల్లో నల్లగొండలో రైతుబడి అగ్రి షో



తెలుగు రైతు బడి యూట్యూబ్ ఛానల్ వ్యవస్థాపకులు రాజేంద్రరెడ్డి అగ్రికల్చర్ ఎగ్జిబిషన్ల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ఆగస్టు 17, 18 తేదీల్లో నల్గొండలోని నాగార్జున గవర్నమెంటు కాలేజీ ఆవరణలో జరిగే తొలి వ్యవసాయ ప్రదర్శనలో వ్యవసాయం, డెయిరీ, పౌల్ట్రీ, ఆక్వా రంగాలకు చెందిన 150 దేశ విదేశీ కంపెనీలు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. 3 జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది రైతులు ఇందులో పాల్గొంటారని భావిస్తున్నారు. సందర్శకులు వెబ్‌సైట్ ద్వారా రిజిస్టర్ చేసుకొని ఉచిత పాస్‌లు పొందవచ్చు. ఇతర వివరాలకు... rbagrishow.com

28న అమలాపురంలో కొబ్బరి రైతుల సదస్సు



‘కలసి నడుద్దాం – కొబ్బరికి లాభసాటి ధర సాధిద్దాం’ నినాదంతో ఈ నెల 28 (బుధవారం) ఉ. 10 గం. నుంచి అమలాపురంలో భారతీయ కిసాన్ సంఘ్ అఖిల భారత కొబ్బరి రైతుల సదస్సును నిర్వహించనుంది. దేశం నలుమూలల నుంచి కొబ్బరి రైతులు ఈ సదస్సులో పాల్గొంటారని నిర్వహకులు తెలిపారు. ఇతర వివరాలకు.. 94906 66659, 95425 99666

29 నుంచి హైదరాబాద్‌లో నర్సరీ మేళా



హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో గల పీపుల్స్ ప్లాజాలో ఈ నెల 19 నుంచి సెప్టెంబర్ 2 వరకు 16వ అఖిలభారత నర్సరీ మేళా జరగనుంది. 140 సంస్థలు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇతర వివరాలకు... 98492 61710.

పరాజయాలకు ఆటగాళ్లు కూడా బాధ్యత వహించాల్సిన సమయం వచ్చింది. ఫలానా సౌకర్యాలు కావాలని అడగడమే కాదు... అవన్నీ ఇచ్చాక ఫలితాలతో పాటు పతకాలు కూడా తీసుకురావాలి. లక్ష్య సేన్ మరింత మెరుగవ్వాల్సి ఉంది. తప్పులు జరగడం సహజమే కానీ కోర్టులో పరిస్థితిని బట్టి ఆటను మార్చుకోవాలి. ఈ విషయంలో సేన్‌కు మానసికంగా కూడా కొంత శిక్షణ అవసరం. భారత బ్యాడ్మింటన్‌లో ఒకరిద్దరు టాప్ ఆటగాళ్లపై మాత్రమే దృష్టి పెట్టకుండా తర్వాతి స్థాయిలో వారిని కూడా తీర్చిదిద్దితేనే విజయాలు లభిస్తాయి. –ప్రకాశ్ పదుకోన్, లక్ష్య సేన్ కోచ్




ఏం తప్పు జరిగిందో కూడా చెప్పలేని స్థితిలో ఉన్నాను. నేను మ్యాచ్‌ను బాగా మొదలు పెట్టినా దానిని కొనసాగించలేకపోయాను. ఫలితంతో చాలా నిరాశ చెందాను. గత మ్యాచ్, ఈ మ్యాచ్‌లను ఎలా పోల్చాలో కూడా అర్థం కావడం లేదు. రెండూ కీలక మ్యాచ్‌లే. కానీ రెండూ ఓడిపోయాను. కీలక దశలో ఒత్తిడిని ఎదుర్కొన్నాను. నేను చాలా తప్పులు చేశాను. నా ప్రత్యర్థి రెండో గేమ్ నుంచి అద్భుతంగా పుంజుకున్నాడు. కుడి చేతికి గాయంతో కొంత రక్తం రావడంతో మధ్యలో ఆటను ఆపి చికిత్స చేయించుకో వాల్సి వచ్చింది. అయితే మ్యాచ్ ఫలితానికి దీనికి సంబంధం లేదు. –లక్ష్య సేన్

ఊరించి... ఉసూరుమనిపించి

రెండు కాంస్య పతకాలను చేజార్చుకున్న భారత క్రీడాకారులు

- బ్యాడ్మింటన్‌లో ఓడిన లక్ష్య సేన్
- షూటింగ్ స్కీట్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో ఒక్క పాయింట్‌తో ఓటమి పాలైన అనంత్‌జీత్–మహేశ్వరి జోడీ
- రెజ్లింగ్ క్వార్టర్ ఫైనల్ బౌట్‌లో చివరి నిమిషంలో తడబడిన నిషా

ఒలింపిక్స్‌లో పతకాలు సాధించా లంటే అపార నైపుణ్యంతోపాటు, చెక్కు చెదరని విశ్వాసం, మానసిక దృఢత్వం కలిగి ఉండాలి. లేదంటే కచ్చితంగా మెడలో పతకం వేసుకోవాల్సిన చోట... కీలకదశలో ఒత్తిడికిలోనై... అనవసరపు ఆందోళనతో తడబడి... ప్రత్యర్థికి పత కాలు అప్పగించాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. పారిస్ ఒలింపిక్స్‌లో సోమవారం భారత క్రీడాకారులకు ఇలాంటి అనుభవమే ఎదురైంది. రెండు కాంస్య పతకాల వేటలో బరిలోకి దిగిన మనోళ్లు ముందుగా ఊరించి చివరికొచ్చేసరికి ఉసూరుమనిపించారు. బ్యాడ్మింటన్‌లో లక్ష్య సేన్... షూటింగ్‌లో మహేశ్వరి–అనంత్‌జీత్ జోడీ మంచి అవకాశాలను వదులుకున్నారు. ఫలితంగా రెండు పతకాలు రావాల్సిన చోట ఒక్క పతకమూ దక్కలేదు. ఇక మహిళల రెజ్లింగ్ 68 కేజీల విభాగంలో నిషా దహియా అయితే చివరి నిమిషంలో ఏకంగా తొమ్మిది పాయింట్లు సమర్పించుకొని ఓటమిని మూటగట్టుకుంది.


లక్ష్య సేన్


నిషా

పారిస్: ఒలింపిక్స్ పురుషుల బ్యాడ్మింటన్‌లో పతకం గెలిచిన తొలి భారత క్రీడాకారుడిగా చరిత్ర సృష్టించే అవకాశాన్ని లక్ష్య సేన్ వదులుకున్నాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ కాంస్య పతక మ్యాచ్‌లో ప్రపంచ 22వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21–13, 16–21, 11–21తో ప్రపంచ ఏడో ర్యాంకర్ లీ జి జియా (మలేసియా) చేతిలో ఓడిపోయాడు. 71 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో లక్ష్య సేన్ తొలి గేమ్ గెల్చుకున్నప్పటికీ అదే జోరును తర్వాత కొనసాగించలేకపోయాడు. లక్ష్య సేన్ ఓటమితో 2008 బీజింగ్ ఒలింపిక్స్ తర్వాత బ్యాడ్మింటన్‌లో పతకం లేకుండానే భారత క్రీడాకారులు ఇంటిముఖం పట్టారు. 2012 లండన్‌లో సైనా నెహ్వాల్ కాంస్యం సాధించగా... 2016 రియోలో పీవీ సింధు రజతం, 2020 టోక్యోలో పీవీ సింధు కాంస్యం గెలిచారు. ఈసారి పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీపై భారీ అంచనాలు ఉన్నా వారు క్వార్టర్ ఫైనల్లో ఓటమి పాలయ్యారు. లీ జి జియాతో జరిగిన మ్యాచ్‌లో లక్ష్య సేన్ శుభారంభం చేశాడు. దూకుడుగా ఆడుతూ తొలి గేమ్‌ను అలవోకగా దక్కించుకున్నాడు. రెండో గేమ్ ఆరంభంలోనూ లక్ష్య తన ఆధిపత్యం చాటుకొని 8–3తో ఆధిక్యంలోకి వచ్చాడు. ఈ దశలో లక్ష్య సేన్ ఒక్కసారిగా గాడి తప్పాడు. వరుసగా తొమ్మిది పాయింట్లు సమర్పించుకున్నాడు. ఇక్కడి నుంచి లీ జి జియా జోరు మొదలైంది. 3–8తో వెనుకబడిన లీ జి జియా 12–8తో ఆధిక్యంలోకి వచ్చి చివరకు 21–16తో గేమ్‌ను సొంతం చేసుకొని మ్యాచ్‌లో నిలిచాడు. నిర్ణాయక మూడో గేమ్‌లో లీ జి జియా పూర్తి ఆధిపత్యం కనబరిచి 9–4తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఆ తర్వాత కూడా మలేసియా ప్లేయర్ ఎలాంటి తప్పిదాలకు తావివ్వకుండా ఆడటంతో లక్ష్య సేన్ కోలుకోలేకపోయాడు. పురుషుల సింగిల్స్ విభాగంలో విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్) తన స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకున్నాడు. ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ అక్సెల్‌సన్ 21–11, 21–11తో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ వితిద్‌సర్న్ కున్లావత్ (థాయ్‌లాండ్)పై విజయం సాధించాడు. మహిళల సింగిల్స్ ఫైనల్లో అన్ సె యంగ్ (దక్షిణ కొరియా) 21–13, 21–16తో హి బింగ్‌జియావో (చైనా)పై విజయం సాధించి పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది.


అనంత్‌జీత్


మహేశ్వరి

ఫినిషింగ్ 'గురి' తప్పింది...

షూటింగ్ పోటీల చివరిరోజు భారత్‌కు మరో పతకం వచ్చే అవకాశాలు కనిపించాయి. ఒలింపిక్స్‌లో తొలిసారి మెడల్ ఈవెంట్‌గా ప్రవేశపెట్టిన స్కీట్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు చెందిన మహేశ్వరి చౌహాన్–అనంత్‌జీత్ నరూకా జోడీ కాంస్య పతక పోరుకు అర్హత సాధించింది. కాంస్య పతక మ్యాచ్‌లో మహేశ్వరి–అనంత్‌జీత్ ద్వయం 43–44 పాయింట్లతో జియాంగ్ యిటింగ్–జియాన్లిన్ లియు (చైనా) జంట చేతిలో ఓడిపోయింది. ఒక్క పాయింట్ తేడాతో భారత జోడీకి కాంస్య పతకం చేజారడం గమనార్హం. ముందుగా 15 జోడీలు పాల్గొన్న క్వాలిఫయింగ్‌లో మహేశ్వరి–అనంత్‌జీత్.. జియాంగ్ యిటింగ్–జియాన్లిన్ (చైనా) జోడీలు 146 పాయింట్ల చొప్పున సాధించి వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో నిలిచి కాంస్య పతక మ్యాచ్‌కు అర్హత సాధించింది. దయానా బకోసి–గాబ్రియెలా రొసెట్టి జోడీ (ఇటలీ; 149 పాయింట్లు), ఆస్టిన్ జెవెల్–విన్సెంట్ హాన్‌కాక్ ద్వయం (అమెరికా; 148 పాయింట్లు) తొలి రెండు స్థానాల్లో నిలిచి స్వర్ణ–రజత పతక మ్యాచ్‌కు అర్హత పొందాయి. ఫైనల్లో దయానా–రొసెట్టి ద్వయం 45–44తో జెవెల్–హాన్‌కాక్ జంటను ఓడించి స్వర్ణ పతకం సాధించింది.

చివరి నిమిషంలో 'పట్టు' కోల్పోయి...

మహిళల రెజ్లింగ్ 68 కేజీల విభాగంలో భారత రెజ్లర్ నిషా దహియా క్వార్టర్ ఫైనల్లో 8–10 పాయింట్ల తేడాతో పాక్ సోల్ గుమ్ (ఉత్తర కొరియా) చేతిలో ఓడిపోయింది. బౌట్ ముగియడానికి ఒక నిమిషం ఉన్నంతవరకు నిషా 8–1తో ఆధిక్యంలో నిలిచింది. అయితే ఆఖరి 60 సెకన్లలో నిషా పట్టు కోల్పోయింది. ఉత్తర కొరియా రెజ్లర్ ధాటికి నిషా తొమ్మిది పాయింట్లు కోల్పోయి ఓటమి పాలైంది. అంతకుముందు నిషా తొలి రౌండ్‌లో 6–4తో తెతియానా సోవా (ఉక్రెయిన్)పై గెలిచింది. ఒకవేళ ఉత్తర కొరియా రెజ్లర్ ఫైనల్ చేరుకుంటే నిషాకు 'రెపిచాజ్' పద్ధతిలో కాంస్య పతకం సాధించే అవకాశం లభిస్తుంది.

3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్ ఫైనల్లో అవినాశ్

పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్ ఈవెంట్‌లో భారత అథ్లెట్ అవినాశ్ సాబ్లే ఫైనల్‌కు అర్హత సాధించాడు. రెండో హీట్‌లో అవినాశ్ 8 నిమిషాల 15.43 సెకన్లలో గమ్యానికి చేరి ఐదో స్థానంలో నిలిచి ఫైనల్లోకి ప్రవేశించాడు. 12 మంది అథ్లెట్స్‌తో కూడిన మూడు గ్రూప్‌లకు హీట్స్ నిర్వహించారు. మూడు గ్రూపుల్లో టాప్–5 నిలిచిన వారు ఫైనల్‌కు చేరారు. గురువారం రాత్రి ఫైనల్ జరుగుతుంది.





మనిక మెరిసె

క్వార్టర్ ఫైనల్లో భారత మహిళల టీటీ జట్టు

పారిస్: ఒలింపిక్స్ టేబుల్ టెన్నిస్ (టీటీ) మహిళల టీమ్ ఈవెంట్‌లో భారత జట్టు శుభారంభం చేసింది. తొలి రౌండ్ మ్యాచ్‌లో భారత్ 3–2తో రొమేనియా జట్టును బోల్తా కొట్టించింది. ఈ గెలుపుతో టీమిండియా క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. స్టార్ ప్లేయర్ మనిక బత్రా రెండు మ్యాచ్‌ల్లో గెలిచి భారత విజయంలో ముఖ్యపాత్ర పోషించింది. తొలి మ్యాచ్‌లో తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ–అర్చనా కామత్ జోడీ 11–9, 12–10, 11–7తో అదీనా దియకోను–ఎలిజబెటా సమారా (రొమేనియా) జంటను ఓడించి భారత్‌కు 1–0 ఆధిక్యాన్ని అందించింది. రెండో మ్యాచ్‌లో మనిక 11–5, 11–7, 11–7తో బెర్నాడెట్టి జాక్స్‌పై గెలిచింది. దాంతో భారత్ ఆధిక్యం 2–0కు పెరిగింది. మూడో మ్యాచ్‌లో భారత నంబర్‌వన్ శ్రీజ 11–8, 4–11, 11–7, 6–11, 8–11తో ఎలిజబెటా సమారా చేతిలో ఓడిపోయింది. నాలుగో మ్యాచ్‌లో అర్చన 5–11, 11–8, 7–11, 9–11తో బెర్నాడెట్టి జాక్స్ చేతిలో ఓటమి పాలైంది. దాంతో స్కోరు 2–2తో సమమైంది. నిర్ణాయక ఐదో మ్యాచ్‌లో మనిక 11–5, 11–9, 11–8తో అదీనా దియకోనుపై గెలిచి భారత్‌కు 3–2తో విజయాన్ని అందించింది. నేడు అమెరికా, జర్మనీ జట్ల మధ్య మ్యాచ్ విజేతతో బుధవారం జరిగే క్వార్టర్ ఫైనల్లో భారత జట్టు ఆడతుంది.



గన్ పేలింది... పురుషుల 100 మీటర్ల పరుగు ప్రారంభమైంది... ఎనిమిది మంది అసాధారణ అథ్లెట్లు దూసుకుపోయారు. 30 మీటర్లు ముగిసేసరికి థాంప్సన్ తొలి స్థానంలో, కెర్లీ రెండో స్థానంలో ఉండగా... అందరికంటే నెమ్మదిగా 0.178 సెకన్ల రియాక్షన్ టైమ్‌తో ఆలస్యంగా మొదలుపెట్టిన లైల్స్ చివరగా ఎనిమిదో స్థానంలో ఉన్నాడు. 60 మీటర్లు ముగిసేసరికి థాంప్సన్, కెర్లీ తొలి రెండు స్థానాల్లోనే కొనసాగగా... లైల్స్ మూడో స్థానానికి దూసుకుపోయాడు. కానీ తర్వాతి 40 సెకన్లలో కథ పూర్తిగా మారింది. లైల్స్ ఒక్కసారిగా అద్భుతాన్ని చూపించాడు. మెరుపు వేగంతో చిరుతలా చెలరేగిపోయి లక్ష్యం చేరాడు. 90 మీటర్ల వరకు కూడా ఏ దశలోనూ అగ్రస్థానంలో లేని లైల్స్ అసలైన ఆఖరి 10 మీటర్లలో అందరినీ వెనక్కి నెట్టేశాడు. ఒలింపిక్స్ 100 మీటర్ల పరుగులో కొత్త చాంపియన్‌గా అవతరించాడు.

ప్రపంచంలో అత్యంత వేగవంతమైన అథ్లెట్‌ను నిర్ణయించడం అంత సులువుగా జరగలేదు. నోవా లైల్స్ (అమెరికా), కిషాన్ థాంప్సన్ (జమైకా) ఇద్దరూ 9.79 సెకన్లలోనే రేసు పూర్తి చేశారు. దాంతో 'ఫోటో ఫినిష్'ను ఆశ్రయించాల్సి వచ్చింది. చాలాసేపు ఉత్కంఠ నెలకొంది. తామిద్దరిలో ఎవరు గెలిచామో కూడా తెలీని లైల్స్, థాంప్సన్ ఒకరి భుజంపై మరొకరు చేయి వేసి ఏం జరిగిందో ఎదురు చూస్తూ వచ్చారు. చివరకు ఇద్దరి మధ్య తేడా సెకనులో 5000వ వంతు మాత్రమే అని తేలింది. లైల్స్ టైమింగ్ 9.79 (.784) సెకన్లు కాగా, థాంప్సన్ టైమింగ్ 9.79 (.789)గా వచ్చింది. దాంతో 20 ఏళ్ల తర్వాత ఒలింపిక్స్‌లో 100 మీటర్ల పరుగు గెలిచిన అమెరికా అథ్లెట్‌గా లైల్స్ ఘనత సాధించగా... 98 మీటర్ల పాటు ఆధిక్యంలో ఉండి కూడా థాంప్సన్ రజతానికే పరిమితమయ్యాడు. ఫ్రెడ్ కెర్లీ (అమెరికా; 9.81 సెకన్లు) కాంస్య పతకం గెలుచుకున్నాడు.

సెకనులో 5000వ వంతు తేడాతో...

100 మీటర్ల స్ప్రింట్‌లో కొత్త విజేత

స్వర్ణం గెలుచుకున్న అమెరికన్ నోవా లైల్స్	జమైకా అథ్లెట్ థాంప్సన్‌కు రెండో స్థానం	ఇద్దరూ 9.79 సెకన్లలో రేసు పూర్తి	ఫోటో ఫినిష్‌తో తేలిన ఫలితం

పారిస్: అథ్లెటిక్స్ ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మక ఈవెంట్ పురుషుల 100 మీటర్ల పరుగు ఊహించినంత ఉత్కంఠను రేపి అదే స్థాయిలో ఆసక్తికర ఫలితాన్ని అందించింది. గత కొంత కాలంగా స్ప్రింట్స్‌లో అద్భుత ప్రదర్శనలు చేస్తూ ప్రస్తుత వరల్డ్ చాంపియన్ కూడా అయిన నోవా లైల్స్‌పై అంచనాలు పెరిగాయి. దానికి తగినట్లుగా అతను సిద్ధమయ్యాడు. తాజా రేసులో కూడా లైల్స్ తన స్థాయికి తగ్గ ప్రదర్శనతో విజేతగా నిలిచాడు. పరుగు పూర్తి చేసేందుకు లైల్స్‌కు 44 అంగలు పట్టగా, థాంప్సన్ 45 అంగలు తీసుకున్నాడు. చివరకు ఇదే తేడాను చూపించింది. 27 ఏళ్ల లైల్స్ తన కెరీర్ అత్యుత్తమ టైమింగ్‌తో ఒలింపిక్ స్వర్ణాన్ని అందుకున్నాడు. ఒలింపిక్స్ చరిత్రలో అత్యంత హోరాహోరీగా సాగిన 100 మీటర్ల పరుగు ఇది. ఫైనల్లో పాల్గొన్న ఎనిమిది మంది కూడా 10 సెకన్లలోపు పరుగు పూర్తి చేయడం ఇదే మొదటిసారి. విజేతకు, చివరి స్థానంలో నిలిచిన అథ్లెట్ టైమింగ్‌కు మధ్య అతి తక్కువ (0.12 సెకన్లు) తేడా మాత్రమే ఉండటం కూడా మరో విశేషం. ఈ రేసులో 4వ, 5వ, 6వ, 7వ, 8వ స్థానాల్లో నిలిచిన అథ్లెట్లు ఆయా స్థానాల్లో కొత్త ప్రపంచ రికార్డు టైమింగ్స్‌ను నమోదు చేయడం మరో ఆసక్తికర అంశం. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించిన ఇటలీ స్ప్రింటర్ మార్సెల్ జాకబ్స్ ఈసారి ఐదో స్థానంతో ముగించాడు.

పురుషుల 100 మీ. స్ప్రింట్ ఫలితం

1. నోవా లైల్స్ (అమెరికా)	9.79 సెకన్లు (.784)
2. కిషాన్ థాంప్సన్ (జమైకా)	9.79సె. (.789)
3. ఫ్రెడ్ కెర్లీ (అమెరికా)	9.81 సె.
4. అకానీ సిమ్‌బైన్ (దక్షిణాఫ్రికా)	9.82 సె.
5. మార్సెల్ జాకబ్స్ (ఇటలీ)	9.85 సె.
6. లెట్సిలె టెబోగో (బోట్స్‌వానా)	9.86 సె.
7. కెన్నెత్ బెడ్‌నరెక్ (అమెరికా)	9.88 సె.
8. ఆబ్లిక్ సివిల్లె (జమైకా)	9.85 సె.



'ఫోటో ఫినిష్' ఈ విధంగా...

రేస్ సమయంలో నిర్వాహకులు 'స్లిట్ వీడియో సిస్టం'ను ఏర్పాటు చేసి దీనిని ఫినిషింగ్ లైన్‌కు అనుసంధానిస్తారు. అథ్లెట్లు లైన్‌ను దాటే సమయంలో ఈ వీడియో సిస్టం సెకనుకు 2000 చొప్పున అత్యంత స్పష్టమైన చిత్రాలు (స్కానింగ్) తీస్తుంది. ఎవరైనా అథ్లెట్ అడ్డు వచ్చి మరో అథ్లెట్ స్పష్టంగా కనిపించే అవకాశం ఉండే ప్రమాదం ఉండటంతో ట్రాక్‌కు రెండోవైపు కూడా అదనపు కెమెరాను ఏర్పాటు చేస్తారు. ఈ రేసు ముగింపు క్షణాన్ని చూస్తే లైల్స్‌కంటే ముందే థాంప్సన్ కాలు లైన్‌ను దాటినట్లుగా కనిపిస్తోంది. కానీ అంతర్జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య నిబంధనల ప్రకారం అథ్లెట్ కాలుకంటే అతని నడుము పైభాగం (ఛాతీ, పొత్తికడుపు, వీపు) ముందుగా లైన్‌ను దాటాలి. సరిగ్గా ఇక్కడే లైల్స్ పైచేయి సాధించాడు. ఫోటో ఫినిష్‌లో దీని కారణంగానే టైమింగ్ విషయంలో మరింత స్పష్టత వచ్చింది.

పతకాల పట్టిక



ర్యాంక్	దేశం	స్వ	ర	కాం	మొ
1	చైనా	21	17	14	52
2	అమెరికా	19	29	27	75
3	ఆస్ట్రేలియా	13	11	8	32
4	ఫ్రాన్స్	12	15	18	45
5	బ్రిటన్	11	13	17	41
6	దక్షిణ కొరియా	11	8	7	26
59	భారత్	0	0	3	3

నోట్: స్వ–స్వర్ణం, ర–రజతం, కాం–కాంస్యం, మొ–మొత్తం. స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్ వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు.

అనామకుడేమీ కాదు!



100 మీటర్ల పరుగులో విజేతగా నిలిచి 'ఫాస్టెస్ట్ మ్యాన్'గా గుర్తింపు తెచ్చుకున్న నోవా లైల్స్ అనూహ్యంగా దూసుకు రాలేదు. గత కొంత కాలంగా అతను అంతర్జాతీయ పోటీల్లో నిలకడగా రాణిస్తున్నాడు. ఎనిమిదేళ్ల క్రితం ప్రొఫెషనల్‌గా మారిన అతను స్ప్రింట్స్‌లో మంచి విజయాలు సాధించాడు. వరుసగా మూడు వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో అతను పతకాలు గెలుచుకున్నాడు. 2019లో 200 మీ., 4x100 మీటర్ల రిలేలో 2 స్వర్ణాలు గెలుచుకున్న అతను 2022లో కూడా ఇవే ఈవెంట్లలో స్వర్ణం, రజతం సాధించాడు. అయితే 2023లో బుడాపెస్ట్‌లో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్‌లో అతని కెరీర్‌లో హైలైట్ ప్రదర్శన వచ్చింది. ఈ ఈవెంట్‌లో 100 మీటర్లు, 200 మీటర్లు, 4x100 మీటర్ల రిలేలలో స్వర్ణాలు సాధించిన అతను... దిగ్గజం ఉసేన్ బోల్ట్ (2015) తర్వాత ఒకే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 'ట్రిపుల్' సాధించిన తొలి ఆటగాడిగా ఘనత సాధించాడు. ఈ ప్రదర్శన వల్లే ఒలింపిక్స్‌లోనూ అతనిపై అంచనాలు పెరిగాయి. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో 200 మీటర్ల పరుగులో కాంస్యం గెలవడంలో సఫలమైన లైల్స్... అంతకు ముందు అమెరికా ఒలింపిక్ ట్రయల్స్‌లో విఫలం కావడంతో 100 మీటర్ల పరుగులో పాల్గొనే అవకాశం దక్కలేదు. ఇప్పుడు అదే ఈవెంట్‌లో స్వర్ణం గెలుచుకున్న అతను, 200 మీటర్ల పరుగులోనూ స్వర్ణంపై గురి పెట్టాడు.



ఒలింపిక్స్ ముగింపు వేడుకల్లో భారత బృందం పతాకధారిగా మనూ భాకర్

పారిస్ ఒలింపిక్స్‌లో తన అద్భుత ప్రదర్శన ద్వారా దేశానికి రెండు పతకాలు అందించిన స్టార్ షూటర్ మనూ భాకర్‌కు మరో గౌరవం దక్కింది. ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలిచిన తొలి భారత ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కిన మనూ... 'పారిస్' క్రీడల ముగింపు వేడుకల్లో పతాకధారిగా వ్యవహరించనుంది. ఈనెల 11న జరగనున్న ముగింపు వేడుకల్లో మనూ.. జాతీయ జెండా చేబూని భారత బృందాన్ని నడిపించనుంది. 'ముగింపు వేడుకల్లో మనూ ఫ్లాగ్ బేరర్‌గా వ్యవహరించనుంది. దీనికి భాకర్ పూర్తి అర్హురాలు' అని భారత ఒలింపిక్ సంఘం తెలిపింది. ఒలింపిక్స్ ఆరంభ వేడుకల్లో స్టార్ షట్లర్ పీవీ సింధు, టేబుల్ టెన్నిస్ (టీటీ) ప్లేయర్ ఆచంట శరత్ కమల్ పతాకధారులుగా వ్యవహరించారు. ముగింపు వేడుకల్లో ఫ్లాగ్ బేరర్‌గా వ్యవహరించనున్న పురుష అథ్లెట్ పేరు తర్వాత ప్రకటించనున్నారు.



నీరజ్ వస్తున్నాడు

నేడు పురుషుల జావెలిన్ త్రో క్వాలిఫయింగ్ పోటీలు

ఫేవరెట్‌గా భారత స్టార్ నీరజ్ చోప్రా ● కిశోర్‌పై కూడా ఆశలు

మధ్యాహ్నం గం. 3:20 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

పారిస్: భారీ అంచనాలతో పారిస్ ఒలింపిక్స్‌లో అడుగు పెట్టిన ఒలింపిక్ డిఫెండింగ్ చాంపియన్, భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా మంగళవారం క్వాలిఫయింగ్ బరిలోకి దిగనున్నాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో నీరజ్ పసిడి పతకం సాధించి దేశ అథ్లెటిక్స్ చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలికాడు. 'పారిస్' లోనూ టోక్యో ప్రదర్శనను పునరావృతం చేయాలని పట్టుదలతో ఉన్నాడు. టోక్యో విశ్వ క్రీడల తర్వాత అంతర్జాతీయ స్థాయిలో నిలకడైన ప్రదర్శన కొనసాగించిన 26 ఏళ్ల నీరజ్ గత ఏడాది ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించి విశ్వవిజేతగా నిలిచాడు. 'పారిస్' నుంచి కూడా పతకంతో తిరిగి వస్తాడని యావత్ భారతావని ఆశలు పెట్టుకోగా... వాటిని అందుకోవడమే లక్ష్యంగా నేడు నీరజ్ మైదానంలో అడుగు పెట్టనున్నాడు. గాయాల బారిన పడకుండా ఉండేందుకు ఆచితూచి టోర్నీల్లో పాల్గొన్న 26 ఏళ్ల నీరజ్.. ఈ ఏడాది బరిలోకి దిగిన మూడు టోర్నీల్లోనూ ఆకట్టుకున్నాడు. ఈ విభాగంలో భారత్ నుంచి నీరజ్ చోప్రాతో పాటు.. కిశోర్ కుమార్ జేనా కూడా పోటీ పడుతున్నాడు. రెండు గ్రూప్‌ల్లో కలిపి మొత్తం 32 మంది త్రోయర్లు బరిలోకి దిగుతున్నారు. గ్రూప్ 'బి'లో నీరజ్... కిశోర్ గ్రూప్ 'ఎ'లో ఉన్నారు. ఫైనల్ చేరడానికి అర్హత ప్రమాణంగా 84 మీటర్లు నిర్ణయించారు. క్వాలిఫయింగ్ రౌండ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన 12 మంది ఫైనల్‌కు అర్హత సాధించనున్నారు. ఒకవేళ 12 మంది కంటే ఎక్కువ మంది 84 మీటర్లను దాటి జావెలిన్‌ను విసిరితే ఇందులో నుంచి టాప్-12 మందికి ఫైనల్ బెర్త్‌లు లభిస్తాయి. ఫైనల్ గురువారం జరుగుతుంది. పాకిస్తాన్ త్రోయర్ నదీమ్ అర్షద్, జాకబ్ వాద్లెచ్ (చెక్ రిపబ్లిక్), వెబర్ (జర్మనీ), ఒలీవర్ (ఫిన్‌లాండ్) నుంచి నీరజ్‌కు ప్రధాన పోటీ ఎదురయ్యే అవకాశాలున్నాయి. నీరజ్ టైటిల్ నిలబెట్టుకుంటే.. ఒలింపిక్స్‌లో ఆ ఘనత సాధించిన ఐదో జావెలిన్ త్రోయర్ కానున్నాడు. విశ్వక్రీడల చరిత్రలో ఎరిక్ లామింగ్ (స్వీడన్; 1908, 1912), జానీ మైరా (ఫిన్‌లాండ్; 1920, 1924), జాన్ జెలెజ్నీ (చెక్ రిపబ్లిక్; 1992, 1996, 2000), ఆండ్రీస్ థోర్‌కిల్డ్‌సెన్ (నార్వే; 2004, 2008) స్వర్ణాన్ని నిలబెట్టుకున్నారు.


కిశోర్



ఫైనల్ వేటలో...

నేడు సెమీఫైనల్లో జర్మనీతో భారత్ 'ఢీ'

● రాత్రి గం. 10:30 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

పారిస్: ఒలింపిక్స్‌లో భారత హాకీకి పూర్వ వైభవం తీసుకొచ్చే క్రమంలో పురుషుల జట్టు మరో కీలక పోరుకు సిద్ధమైంది. హోరాహోరీగా సాగిన క్వార్టర్ ఫైనల్లో బ్రిటన్‌ను 'షూటౌట్'లో ఓడించిన భారత్... మంగళవారం జరిగే సెమీఫైనల్లో ప్రపంచ చాంపియన్ జర్మనీతో అమీతుమీ తేల్చుకోనుంది. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన టీమిండియా... ఇప్పుడు పతకం రంగు మార్చాలని కృతనిశ్చయంతో ఉంది. 1980కి ముందు ఒలింపిక్స్‌లో ఎనిమిది స్వర్ణాలతో తిరుగులేని ఆధిపత్యం కనబర్చిన భారత్.. తిరిగి ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. స్వర్ణ పతకమే లక్ష్యంగా పారిస్‌లో అడుగు పెట్టిన హర్మన్‌ప్రీత్ సింగ్ బృందం.. క్వార్టర్స్‌లో బ్రిటన్‌పై అసమాన ప్రదర్శన కనబర్చింది. స్టార్ డిఫెండర్ అమిత్ రోహిదాస్ రెడ్ కార్డుతో మైదానాన్ని వీడగా.. మిగిలిన 10 మందితోనే అద్భుతం చేసింది. ఇక 'షూటౌట్'లో గోల్ కీపర్ పీఆర్ శ్రీజేశ్ అడ్డుగోడలా నిలవడంతో 1972 తర్వాత భారత్ వరుసగా రెండోసారి ఒలింపిక్ సెమీఫైనల్లోకి అడుగుపెట్టింది. అదే జోరులో జర్మనీని కూడా చిత్తుచేస్తే.. 44 ఏళ్ల తర్వాత టీమిండియా విశ్వక్రీడల తుదిపోరుకు అర్హత సాధించనుంది. చివరిసారి భారత జట్టు 1980 మాస్కో ఒలింపిక్స్‌లో ఫైనల్ చేరి విజేతగా నిలిచింది. పారిస్ ఒలింపిక్స్ అనంతరం కెరీర్‌కు వీడ్కోలు పలకనున్న శ్రీజేశ్ మరోసారి కీలకం కానుండగా.. పెనాల్టీ కార్నర్ స్పెషలిస్ట్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. రోహిదాస్‌పై ఓ మ్యాచ్ నిషేధం పడటంతో అతడు జర్మనీతో సెమీస్ పోరుకు అందుబాటులో లేడు. అయితే ఇలాంటివి తమ చేతిలో లేవని... మైదానంలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడంపైనే దృష్టి పెడతామని ఈ టోర్నీలో ఏడు గోల్స్ చేసిన భారత సారథి హర్మన్‌ప్రీత్ పేర్కొన్నాడు. టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక పోరులో జర్మనీపై విజయంతోనే పతకం దక్కించుకున్న టీమిండియా... మరోసారి జర్మనీని చిత్తు చేసి ముందంజ వేయాలని ఆశిద్దాం. మరో సెమీఫైనల్లో నెదర్లాండ్స్‌తో స్పెయిన్ తలపడనుంది.

రోహిదాస్‌పై ఒక మ్యాచ్ నిషేధం

భారత డిఫెండర్ అమిత్ రోహిదాస్‌పై ఓ మ్యాచ్ నిషేధం పడింది. బ్రిటన్‌తో క్వార్టర్ ఫైనల్ సందర్భంగా.. రోహిదాస్ హాకీ స్టిక్ బ్రిటన్ ప్లేయర్ తలకు తగిలింది. ఉద్దేశపూర్వకంగా చేయకపోయినా.. మ్యాచ్ రిఫరీ అతడికి రెడ్ కార్డు చూపి మైదానం నుంచి తప్పించాడు. దీనిపై భారత జట్టు అప్పీల్ చేయగా.. వాదనలు విన్న అనంతరం అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ఒక మ్యాచ్ నిషేధం విధిస్తున్నట్లు వెల్లడించింది. దీంతో అతడు నేడు జరిగే సెమీఫైనల్‌కు అందుబాటులో లేకుండా పోయాడు.'నియమావళిని అతిక్రమించినందుకు అమిత్ రోహిదాస్‌పై ఒక మ్యాచ్ నిషేధం విధించాం'అని ఎఫ్ఐహెచ్ పేర్కొంది.

ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ థోర్ప్ మృతి

లండన్: మాజీ ఇంగ్లండ్ బ్యాటర్ గ్రాహమ్ థోర్ప్ సోమవారం మృతి చెందాడు. 55 ఏళ్ల థోర్ప్ 2022 నుంచి తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఆ ఏడాది అఫ్గానిస్తాన్‌కు హెడ్ కోచ్‌గా నియమించారు. కానీ అప్పటి నుంచి థోర్ప్ ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. అయితే స్పష్టమైన వ్యాధి, ఏ రకమైన అనారోగ్యమన్న సంగతి మాత్రం వెల్లడికాలేదు. ఆయనకు భార్య అమెండా, నలుగురు పిల్లలు హెన్రీ, అమెలియా, కిట్టీ, ఎమ్మా ఉన్నారు. ఎడంచేతి బ్యాటర్ అయిన థోర్ప్ 1993 నుంచి 2005 వరకు తన కెరీర్‌ను కొనసాగించాడు. కీలకమైన మిడిలార్డర్ బ్యాటర్‌గా సేవలందించాడు. 100 టెస్టులు ఆడిన థోర్ప్ 44.66 సగటుతో 6,744 పరుగులు చేశాడు. ఇందులో 16 సెంచరీలున్నాయి. 82 అంతర్జాతీయ వన్డేలు ఆడి 37.18 సగటుతో 2,830 పరుగులు సాధించాడు. కౌంటీ జట్టు సర్రేతో థోర్ప్‌ది సుదీర్ఘబంధం! అండర్-11 స్థాయిలోనే ఆ జట్టులో చేరిన థోర్ప్ ఏకంగా 17 ఏళ్ల పాటు సేవలందించి దాదాపు 20 వేల పరుగులు చేశాడు. అంతర్జాతీయ కెరీర్ ముగిశాక కోచ్‌గా పని చేశాడు.



సినిమా


● ఎన్టీఆర్, జాన్వీ కపూర్

నాయకుడు వచ్చాడు

విష్ణు మంచు టైటిల్ రోల్‌లో రూపొందుతోన్న చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో శివ భక్తుడు కన్నప్ప పాత్రలో విష్ణు నటిస్తున్నారు. ప్రభాస్, మోహన్‌బాబు, అక్షయ్ కుమార్, మోహన్‌లాల్, శరత్ కుమార్, బ్రహ్మానందం, కాజల్ అగర్వాల్, మధుబాల, ప్రీతి ముకుందన్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీలో నటిస్తున్న నటీనటుల లుక్‌ను ఒక్కొక్కటిగా రివీల్ చేస్తున్నారు మేకర్స్. తాజాగా కన్నడ నటుడు దేవరాజ్ పాత్ర లుక్‌ని రిలీజ్ చేశారు. "కన్నప్ప'లో ఎరుకల తెగ నాయకుడైన ముండడు పాత్రలో దేవరాజ్ నటిస్తున్నారు. ఆయన పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ షూటింగ్ చివరి దశకు చేరుకుంది'' అని చిత్రబృందం పేర్కొంది. అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై మంచు మోహన్‌బాబు నిర్మిస్తున్న 'కన్నప్ప' డిసెంబరులో ప్రేక్షకుల ముందుకు రానుంది.


● దేవరాజ్

క్లైమాక్స్‌లో పుష్ప


● అల్లు అర్జున్

హైదరాబాద్‌లో ఫైట్ చేస్తున్నాడు పుష్ప రాజ్. అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న చిత్రం 'పుష్ప: ది రూల్'. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇదే కాంబినేషన్‌లో వచ్చిన 'పుష్ప: ది రైజ్' 2021 డిసెంబరు 17న విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. 'పుష్ప: ది రైజ్'కి సీక్వెల్‌గా 'పుష్ప: ది రూల్' తెరకెక్కుతోంది. ప్రస్తుతం ఈ సినిమా క్లైమాక్స్ సన్నివేశాలను హైదరాబాద్‌లో చిత్రీకరిస్తున్నారు. ''పుష్ప: ది రైజ్' సూపర్ హిట్ కావడంతో 'పుష్ప: ది రూల్' కోసం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో భారీ ఖర్చుతో వేసిన సెట్‌లో జరుగుతోంది. హీరోతో పాటు సినిమాలోని కీలక నటీనటులపై పతాక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నాం. ఈ సీన్స్ హైలైట్‌గా ఉంటాయి. డిసెంబరు 6న మా చిత్రం ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది'' అని యూనిట్ పేర్కొంది. సునీల్, అనసూయ, ఫాహద్ ఫాజిల్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మిరోస్లా క్యూబా బ్రోజెక్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

నా లోకమే నా మైమరపు

దేవరపై తన ప్రేమనంతా పాట రూపంలో చూపించేసింది తంగమ్. 'చుట్టమల్లె చుట్టేస్తావె తుంటరి చూపు... ఊరికే ఉండదు కాసేపు... అస్తమానం నీ లోకమే నా మైమరపు... చేతనైతే నువ్వే నన్నాపు...' అంటూ తన ప్రేమను వ్యక్తపరిచింది. దేవరగా ఎన్టీఆర్, తంగమ్‌గా జాన్వీ కపూర్ నటిస్తున్న 'దేవర' చిత్రంలోని పాట ఇది. కొరటాల శివ దర్శకత్వంలో నందమూరి కల్యాణ్ రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ .కె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తొలి భాగం సెప్టెంబర్ 27న తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్ ఆరంభించి, ఒక్కో పాట విడుదల చేస్తున్నారు. సోమవారం 'చుట్టమల్లె చుట్టేస్తావె...' అంటూ సాగే ఈ సినిమాలోని రెండో పాటను రిలీజ్ చేశారు. అనిరుధ్ రవిచందర్ స్వరపరచిన ఈ రొమాంటిక్ మెలోడీ సాంగ్‌కు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా శిల్పా రావ్ పాడారు. బాస్కో మార్టిస్ కొరియోగ్రఫీ చేశారు.హై యాక్షన్ మాస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న 'దేవర' చిత్రానికి కెమెరా: ఆర్. రత్నవేలు.

తెలుగులో సూపర్ డీలక్స్


● సమంత, విజయ్ సేతుపతి, ఫాహద్

వైవిధ్యమైన పాత్రలతో విలక్షణ నటుడిగా పేరు తెచ్చుకున్న విజయ్ సేతుపతి ట్రాన్స్‌జెండర్‌గా నటించిన చిత్రం 'సూపర్ డీలక్స్'. సమంత కథానాయకగా నటించగా ఫాహద్ ఫాజిల్ ఓ కీ రోల్‌లో నటించారు. త్యాగరాజన్ కుమార రాజా దర్శకత్వంలో రూపొందిన ఈ తమిళ చిత్రం ఘనవిజయం సాధించింది. ఈ చిత్రం తెలుగులో ఈ నెల 9న థియేటర్లలో విడుదల కానుంది. సీఎల్ఎన్ మీడియా తెలుగులో విడుదల చేయనుంది. ''సూపర్ డీలక్స్'ని నాలుగు వందల థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నాం. నాలుగు విభిన్న కథలను జోడించి దర్శకుడు ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. ఈ చిత్రం తెలుగులోనూ మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అని తెలుగులో విడుదల చేస్తున్న సీఎల్ఎన్ మీడియా పేర్కొంది.

పాటలోనే కథ చూపించారు

\- ఎస్ఎస్ తమన్


● వైశాలి, తమన్, దీపు జాను

''ఫస్ట్ లవ్' టైటిల్ సాంగ్ మ్యూజిక్ వీడియో చాలా అందంగా ఉంది. ఈ పాటలోనే ఒక అద్భుతమైన కథ చూపించారు. మంచి సినిమా చూసిన అనుభూతి కలిగింది'' అని సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ అన్నారు. దీపు జాను హీరోగా బాలరాజు ఎం దర్శకత్వం వహించిన చిత్రం 'ఫస్ట్ లవ్'. వైశాలీ రాజ్ హీరోయిన్‌గా నటించి, నిర్మించారు. సంజీవ్ .టి సంగీతం అందించిన ఈ మూవీ టైటిల్ సాంగ్ ('ఫస్ట్ లవ్') లాంచ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఎస్ తమన్ మాట్లాడుతూ– ''ఫస్ట్ లవ్' పాటలు వినగానే 'వైశాలి, ఖుషి' సినిమాలు గుర్తుకు వచ్చాయి. మధు పొన్నాస్ అద్భుతమైన నేపథ్య సంగీతం ఇచ్చారు'' అన్నారు. ''చాలా కష్టపడి ప్రేమతో 'ఫస్ట్ లవ్..' పాట చేశాం'' అన్నారు. ''అందరూ సెలబ్రేట్ చేసుకునే స్పెషల్ ఆల్బమ్ ఇది'' అన్నారు బాలరాజు ఎం.

స్వేచ్ఛ కోసం పోరాటం


● పార్వతి తిరువోతు, విక్రమ్, మాళవిక

''తంగలాన్' అనేది ఒక తెగ పేరు. ఈ సినిమాలోని నా లుక్‌ని ఫస్ట్ టైమ్ రిలీజ్ చేసినప్పుడు 'కేజీఎఫ్' మూవీలా ఉంటుందా? అన్నారు. అలాగే తెగ నాయకుడి గెటప్ రిలీజ్ చేశాక రా అండ్ రస్టిక్‌గా ఉంటుందన్నారు. కానీ 'తంగలాన్' లో ప్రేక్షకులకు కావాల్సిన అన్ని అంశాలున్నాయి'' అని హీరో విక్రమ్ అన్నారు. - విక్రమ్

పా.రంజిత్ దర్శకత్వంలో విక్రమ్ హీరోగా, పార్వతీ తిరువోతు, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'తంగలాన్'. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ మూవీ ఈ నెల 15న రిలీజ్ కానుంది. ఈ చిత్రాన్ని తెలుగులో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ రిలీజ్ చేస్తోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో విక్రమ్ మాట్లాడుతూ– ''రంజిత్ నా ఫేవరెట్ డైరెక్టర్. ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ రిలేట్ అయ్యే స్టోరీ 'తంగలాన్'. బంగారం వేట అనేది హైలైట్ అవుతున్నా.. ఈ కథలో స్వేచ్ఛ కోసం చేసే పోరాటం ఉంది'' అన్నారు. పాన్ ఇండియా అని మనమే అంటున్నాం. నేను ఎక్కడ నటించినా అది అన్ని భాషల ప్రేక్షకులకు చేరువకావడం సంతోషం'' అన్నారు.

సర్దార్ ప్రపంచంలోకి...


● ఆషికా రంగనాథ్

సర్దార్ ప్రపంచంలోకి హీరోయిన్ ఆషికా రంగనాథ్‌కి స్వాగతం పలికారు మేకర్స్. కార్తీ హీరోగా పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సర్దార్ 2'. కార్తీ–మిత్రన్ కాంబినేషన్‌లో సూపర్‌హిట్‌గా నిలిచిన 'సర్దార్' మూవీకి సీక్వెల్‌గా 'సర్దార్ 2' రూపొందుతోంది. ఈ చిత్రంలో ఓ హీరోయిన్‌గా మాళవికా మోహనన్ నటిస్తున్నట్లు ఇటీవల ప్రకటించారు. తాజాగా ఆషికా రంగనాథ్ మరో హీరోయిన్‌గా కనిపించనున్నట్లు ప్రకటించారు. సోమవారం (ఆగస్టు 5) ఆషికా బర్త్ డే. ఈ సందర్భంగా ఆమెను 'సర్దార్ 2' ప్రాజెక్ట్‌లోకి స్వాగతం పలుకుతూ ఆమె లుక్ రిలీజ్ చేశారు మేకర్స్. ప్రిన్స్ పిక్చర్స్‌పై ఎస్. లక్ష్మణ్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: యువన్ శంకర్ రాజా.

అవార్డులు ఉత్సాహం ఇస్తాయి

\- మారుతి


● విజయ్ బుల్గానిన్, అనంత శ్రీరామ్, సాయి రాజేశ్, మారుతి, ఎస్‌కేఎన్, వైష్ణవి, శ్రీరామచంద్ర

''అవార్డ్స్ అంటే పెద్ద సినిమాలకే వస్తాయి.. చిన్న చిత్రాలకు రావు' అని నిరాశ పడేవారికి ఉత్సాహాన్నిచ్చేలా 'బేబి'కి ఐదు ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ దక్కడం ఆనందంగా ఉంది. అవార్డులు సరికొత్త ఉత్సాహం ఇస్తాయి. 'బేబి' టీమ్‌కి అభినందనలు'' అని దర్శకుడు మారుతి అన్నారు. ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య లీడ్ రోల్స్‌లో సాయి రాజేశ్ దర్శకత్వం వహించిన చిత్రం 'బేబి'. ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ సినిమా 2023లో విడుదలై హిట్‌గా నిలిచింది. కాగా 69వ 'శోభ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ 2024'లో వివిధ విభాగాల్లో 'బేబి' మూవీ ఐదు అవార్డులు అందుకుంది. ఈ నేపథ్యంలో సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సాయి రాజేశ్ మాట్లాడుతూ– ''మా సినిమాకు ఐదు అవార్డ్స్ దక్కడం సంతోషంగా ఉంది'' అన్నారు. ''ఉత్తమ నటిగా పురస్కారం అందుకోవడం హ్యాపీ'' అన్నారు వైష్ణవి. ''నేనొక మంచి మూవీ చేయాలి.. అలాగే ఒక ఫిల్మ్‌ఫేర్ అందుకోవాలనుకునేవాణ్ణి. ఈ రెండు ఆకాంక్షలు 'బేబి'తో తీరడం సంతోషంగా ఉంది'' అన్నారు సంగీత దర్శకుడు విజయ్ బుల్గానిన్. ''నాకు తొలి ఫిల్మ్‌ఫేర్ అవార్డ్ వచ్చిన పుష్కరకాలం తర్వాత రెండో అవార్డ్ రావడం సంతోషంగా ఉంది'' అన్నారు రచయిత అనంత్ శ్రీరామ్. ''బేబి'లో నేను పాడిన 'ఓ రెండు మేఘాలిలా..' పాటకు బెస్ట్ సింగర్‌గా నాకు అవార్డ్ దక్కడం ఆనందంగా ఉంది'' అన్నారు శ్రీరామచంద్ర. ''ఒక మంచి సినిమా చేస్తే తప్పకుండా అన్నీ వస్తాయని చెప్పేందుకు 'బేబి' ఓ ఉదాహరణ'' అన్నారు నిర్మాత ఎస్‌కేఎన్. 'బేబి' చిత్ర సహ నిర్మాత ధీరజ్ మొగిలినేని మాట్లాడారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	2,223	78,759
నిఫ్టీ ▽	662	24,055

విదేశీ సూచీలు (సోమ రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	16,301 ▽	475
డోజోన్స్	38,856 ▽	881
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,008 ▽	166
డాక్స్	17,339 ▽	550
షాంఘై	2,861 ▽	45
నికాయ్	31,458 ▽	4,451

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్


బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	69,117
బంగారం (99.5 స్వచ్ఛత)	68,840
వెండి (కేజీ)	78,950

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎన్‌క్యాశ్	83.38	84.40
£	బ్రిటన్ పౌండ్	ఎన్‌క్యాశ్	106.08	108.67
€	యూరో	ఎన్‌క్యాశ్	90.45	92.83
¥	జపాన్ ఎన్ (100)	ఎన్‌క్యాశ్	57.21	58.52
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎన్‌క్యాశ్	53.56	55.49
S$	సింగపూర్ డాలర్	ట్రావెలర్ చెక్	61.03	65.70
SAR	సౌదీ రియాల్	ట్రావెలర్ చెక్	21.47	23.02
UAE D	యూఏఈ దిర్హామ్	ట్రావెలర్ చెక్	21.94	23.72
¥	చైనా యువాన్	ట్రావెలర్ చెక్	10.89	12.71

బేర్ విశ్వరూపం 'అమ్మో'రికా!



- కుప్పకూలిన ప్రపంచ మార్కెట్లు
- సెన్సెక్స్ 2223 పాయింట్లు క్రాష్ 79 వేల స్థాయిని కోల్పోయిన సూచీ
- నిఫ్టీకి 662 పాయింట్ల నష్టం
- ఒక్క రోజులో రూ.15 లక్షల కోట్లు ఆవిరి

ముంబై: అమెరికాలో మాంద్యం భయాలు మార్కెట్లను ముంచేశాయి. జపాన్ కరెన్సీ యెన్ భారీ వృద్ధి బెంబేలెత్తించింది. పశ్చిమాసియా యుద్ధ ఉద్రిక్తతలు వణికించాయి. వెరసి దలాల్ స్ట్రీట్ సోమవారం బేర్ గుప్పిట్లో విలవిలలాడింది. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్ల ప్రతికూల సంకేతాలకు తోడు దేశీయ షేర్ల విలువ భారీగా పెరిగిపోవడంతో అమ్మకాల సునామీ వెల్లువెత్తింది. ఫలితంగా సెన్సెక్స్ 2,223 పాయింట్లు క్షీణించి 80 వేల స్థాయి దిగువన 78,759 వద్ద ముగిసింది. నిఫ్టీ 662 పాయింట్లు పతనమై 24,055 వద్ద నిలిచింది. సార్వత్రిక ఎన్నికల ఫలితాల ప్రకటన రోజు జూన్ 4న (5.76% పతనం) తర్వాత ఇరు సూచీలకిదే భారీ పతనం.

రోజంతా నష్టాల కడలిలో ...

అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు ఏకంగా 3% నష్టాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్ 2,394 పాయింట్ల నష్టంతో 78,588 వద్ద, నిఫ్టీ 415 పాయింట్లు క్షీణించి 24,303 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. ఇన్వెస్టర్ల కొనుగోళ్లకు సాహసించకపోవడంతో సూచీలు రోజంతా నష్టాల్లో కొట్టిమిట్టాడాయి. ఒకదశలో సెన్సెక్స్ 2,686 పాయింట్లు క్షీణించి 78,296 వద్ద, నిఫ్టీ 824 పాయింట్లు కుప్పకూలి 23,893 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి.

- బీఎస్ఈలోని అన్ని రంగాల సూచీలు ఎరుపెక్కాయి. సర్వీసెస్ సూచీ 4.6%, యుటిలిటీ 4.3%, రియల్టీ 4.2%, క్యాపిటల్ గూడ్స్ 4.1%, ఇండస్ట్రియల్ 4%, విద్యుత్ 3.9%, ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్ 3.75% చొప్పున క్షీణించాయి.
- సెన్సెక్స్ సూచీలో హెచ్‌యూఎల్(0.8%,) నెస్లే (0.61%) మాత్రమే లాభాలతో గట్టెక్కాయి. మిగిలిన 28 షేర్లు నష్టపోయాయి. ఇందులో టాటా మోటార్స్ 7%, అదానీ పోర్ట్స్ 6%, టాటాస్టీల్ 5%, ఎస్‌బీఐ 4.50%, పవర్ గ్రిడ్ 4% షేర్లు అత్యధికంగా పడ్డాయి.
- చిన్న, మధ్య తరహా షేర్లలో భారీ లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు 4%, 3.6% చొప్పున క్షీణించాయి.
- బీఎస్ఈ ఎక్స్ఛేంజీలో లిస్టయిన మొత్తం 4,189 కంపెనీల షేర్లలో ఏకంగా 3,414 కంపెనీల షేర్లు నష్టాలు చవిచూశాయి.
- రిలయన్స్ 3% పడి రూ. 2,895 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో 4.50% పతనమై రూ.2,866 కనిష్టాన్ని తాకింది. మార్కెట్ క్యాప్ రూ. 70,195 కోట్లు ఆవిరై రూ. 19.58 లక్షల కోట్లకు తగ్గింది.
- మార్కెట్లో ఒడిదుడుకులు సూచించే వొలటాలిటీ ఇండెక్స్(వీఐఎక్స్) 42.23 శాతం పెరిగి 20.37 స్థాయికి చేరింది. ఇంట్రాడేలో 61% ఎగసి 23.15 స్థాయిని తాకింది. లేమాన్ బ్రదర్స్, కోవిడ్ సంక్షోభాల తర్వాత ఈ సూచీకిదే ఒక రోజులో అత్యధిక పెరుగుదల.

2 రోజుల్లో రూ.19.78 లక్షల కోట్లు ఆవిరి

ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మొత్తం విలువ సోమవారం ఒక్కరోజే రూ.15.32 లక్షల కోట్లు హరించుకుపోయాయి. శుక్రవారం కోల్పోయిన రూ.4.46 లక్షల కోట్లను కలిపితే గడచిన రెండు ట్రేడింగ్ సెషన్లో ఇన్వెస్టర్లకు మొత్తం రూ.19.78 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది. బీఎస్ఈలో మార్కెట్ విలువ రూ. 441.84 లక్షల కోట్లకు పడింది.

84 దిగువకు రూపాయి కొత్త ఆల్‌టైమ్ కనిష్టం



ఈక్విటీ మార్కెట్ల భారీ పతనంతో రూపాయి విలువ సరికొత్త జీవితకాల కనిష్టానికి పడిపోయింది. డాలర్ మారకంలో 37 పైసలు క్షీణించి 84 స్థాయి దిగువన 84.09 వద్ద స్థిరపడింది. ఫారెక్స్ మార్కెట్లో ఉదయం 83.78 వద్ద మొదలైంది. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు, దలాల్ స్ట్రీట్ భారీ పతన ప్రభావంతో ఇంట్రాడే, జీవితకాల కనిష్టం 84.09 వద్ద స్థిరపడింది.

ముసిరిన మాంద్యం భయాలు..

- ఉద్యోగాల కోత.. హైరింగ్ తగ్గుముఖం..
- మూడేళ్ల గరిష్టానికి నిరుద్యోగం.. 4.3%కి అప్
- పశ్చిమాసియాలో యుద్ధ మేఘాల ఎఫెక్ట్...
- ఫెడ్ రేట్ల కోత సుదీర్ఘ వాయిదా ప్రభావం కూడా

జపాన్ నికాయ్	4451(13.5%)
కొరియా కాస్పీ	235(10%)
తైవాన్ వెయిటెడ్	1087(9%)
షాంఘై కాంపోజిట్	45(2.5%)
హాంకాంగ్ హాంగ్‌సెంగ్	247(1.50%)
జర్మనీ డాక్స్	550(3%)
ఫ్రాన్స్ సీఏసీ	103(1.50%)
బ్రిటన్ ఎఫ్‌టీఎస్‌ఈ	166(2%)
నాస్‌డాక్	475(3%)
ఎస్అండ్‌పీ	148(3%)
డోజోన్స్	881(2%)

(అమెరికా సూచీలు ఇంట్రాడేలో)

అమెరికాకు జలుబు చేస్తే.. ప్రపంచమంతా తుమ్ముతుందనే నానుడిని నిజం చేస్తూ, ప్రపంచ స్టాక్ మార్కెట్లు అతలాకుతలం అవుతున్నాయి. యూఎస్ తయారీ, నిర్మాణ రంగంలో బలహీనతకు గత వారాంతంలో విడుదలైన జాబ్ మార్కెట్ డేటా ఆజ్యం పోసింది. జూలైలో హైరింగ్ 1,14,000 ఉద్యోగాలకు పరిమితమైంది. అంచనాల కంటే ఏకంగా 1,80,000 జాబ్స్ తగ్గాయి. మరోపక్క, జూన్‌లో 4.1 శాతంగా ఉన్న నిరుద్యోగ రేటు.. జూలైలో 4.3 శాతానికి ఎగబాకింది. 2021 అక్టోబర్ తర్వాత ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. అంతేకాదు, ప్రపంచ చిప్ దిగ్గజం ఇంటెల్‌తో సహా మరికొన్ని కంపెనీలు తాజా కొలువుల కోతను ప్రకటించడం కూడా అగ్గి రాజేసింది. ఈ పరిణామాలన్నీ ఇన్వెస్టర్లలో మాంద్యం ఆందోళనలను మరింత పెంచాయి. వెరసి, గత శుక్రవారం అమెరికా మార్కెట్లు కకావికలం అయ్యాయి. నాస్‌డాక్ 2.4% కుప్పకూలింది. డోజోన్స్ 1.5%, ఎస్అండ్‌పీ-500 ఇండెక్స్ 1.84 చొప్పున క్షీణించాయి. కాగా, గత నెలలో ఆల్‌టైమ్ రికార్డుకు చేరిన నాస్‌డాక్ అక్కడి నుంచి 10% పైగా పతనమై కరెక్షన్‌లోకి జారింది. ఆసియా, యూరప్ బాటలోనే సోమవారం కూడా అమెరికా మార్కెట్లు 3-6% గ్యాప్ డౌన్‌తో మొదలై, భారీ నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

టెక్ స్టాక్స్.. ట్రిలియన్ డాలర్లు ఆవిరి

రెండో త్రైమాసిక ఫలితాల నిరాశతో నాస్‌డాక్‌లో టాప్-7 టెక్ టైటాన్స్ (యాపిల్, మైక్రోసాఫ్ట్, ఆల్ఫాబెట్, అమెజాన్, ఎన్‌వీడియా, టెస్లా, మెటా) షేర్లు అతలాకుతలం అవుతున్నాయి. ఏఐపై భారీగా వెచ్చిస్తున్న మైక్రోసాఫ్ట్, ఆల్ఫాబెట్ వంటి కంపెనీలకు ఆశించిన ఫలితాలు రావడం లేదనే ఆందోళనలు నెలకొన్నాయి. ఇక బలహీన ఆదాయంతో అమెజాన్ షేర్లు 10% క్రాష్ అయ్యాయి. ఫలితాల నిరాశతో ఇంటెల్ షేర్లు ఏకంగా 26% కుప్పకూలాయి. 1985 తర్వాత ఒకే రోజు ఇంతలా పతనమయ్యాయి. కంపెనీ ఏకంగా 15,000 మంది సిబ్బంది కోతను ప్రకటించడంతో జాబ్ మార్కెట్లో గగ్గోలు మొదలైంది. వెరసి, షేర్ల పతనంతో టాప్-7 టెక్ షేర్ల మార్కెట్ విలువ ట్రిలియన్ డాలర్లకు పైగా ఆవిరైంది. కాగా, సోమవారం ఈ షేర్లు మరో 6-10% కుప్పకూలాయి. ఎకానమీ పరిస్థితి బయటికి కనిపిస్తున్న దానికంటే చాలా బలహీనంగా ఉందని సీఈఓలు సిగ్నల్స్ ఇస్తున్నారు.

యుద్ధ సైరన్..: పశ్చిమాసియాలో హమాస్ చీఫ్ హనియేను ఇజ్రాయిల్ తుదముట్టించడంతో పరిస్థితులు మరింత దిగజారాయి. ఇజ్రాయిల్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ ప్రకటించడంతో పూర్తి స్థాయి యుద్ధానికి తెరలేస్తోంది. రష్యా-ఉక్రెయిన్ ఉద్రిక్తతలు సద్దుమణగక ముందే మరో వార్ మొదలైతే క్రూడ్ ధర భగ్గుమంటుంది. బ్యారల్ 100 డాలర్లను దాటేసి, ద్రవ్యోల్బణాన్ని ఎగదోస్తుంది. వెరసి ఎకానమీలు, మార్కెట్లపైనా తీవ్ర ప్రభావం పడుతుంది.

జపాన్.. సునామీ

అమెరికా దెబ్బతో ఆసియా, యూరప్ మార్కెట్లన్నీ సోమవారం కూడా కుప్పకూలాయి. జపాన్ నికాయ్ సూచీ ఏకంగా 13.5 శాతం క్రాష్ అయింది. 1987 అక్టోబర్ 19 బ్లాక్ మండే (14.7% డౌన్) తర్వాత ఇదే అత్యంత ఘోర పతనం. నికాయ్ ఆల్‌టైమ్ హై 42,000 పాయింట్ల నుంచి ఏకంగా 31,000 స్థాయికి దిగొచ్చింది. గత శుక్రవారం కూడా నికాయ్ 6% క్షీణించింది. ముఖ్యంగా జపాన్ యెన్ పతనం, ద్రవ్యోల్బణం 2% లక్ష్యంపైకి ఎగబాకడంతో అందరికీ భిన్నంగా బ్యాంక్ ఆఫ్ జపాన్ వడ్డీరేట్ల పెంపు బాటలో వెళ్తోంది. గత బుధవారం కూడా రేట్ల పెంపు ప్రకటించింది. దీంతో డాలర్‌తో ఇటీవల 160 స్థాయికి చేరిన యెన్ విలువ 142 స్థాయికి బలపడి ఇన్వెస్టర్లకు వణుకు పుట్టించింది. జపాన్, అమెరికా ఎఫెక్ట్ మన మార్కెట్ సహా ఆసియా, యూరప్ సూచీలను కుదిపేస్తోంది.

- సాక్షి, బిజినెస్ డెస్క్

ఫెడ్ రేట్ల కోత పైనే ఆశలు..

కరోనా విలయం తర్వాత రెండేళ్ల పాటు ఫెడ్ ఫండ్స్ రేటు 0-0.25% స్థాయిలోనే కొనసాగింది. అయితే, ద్రవ్యోల్బణం ఎగబాకి, 2022 జూన్‌లో ఏకంగా 9.1 శాతానికి చేరడంతో అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ మళ్లీ రేట్ల పెంపును మొదలెట్టింది. 2023 జూలై నాటికి వేగంగా 5.25-5.5% స్థాయికి చేరి, అక్కడే కొనసాగుతోంది. మరోపక్క, ద్రవ్యోల్బణం ఈ ఏడాది గతేడాది జూన్‌లో 3 శాతానికి దిగొచ్చింది. ఈ ఏడాది జూన్ క్వార్టర్లో (క్యూ2) యూఎస్ జీడీపీ వృద్ధి రేటు 2.8 శాతంగా నమోదైంది. ద్రవ్యోల్బణం దిగొచ్చినప్పటికీ, ఫెడ్ మాత్రం రేట్ల కోతను సుదీర్ఘంగా వాయిదా వేస్తూ వస్తోంది. గత నెలఖర్లో జరిగిన పాలసీ భేటీలోనూ యథాతథ స్థితినే కొనసాగించింది. అయితే, తాజా గణాంకాల ప్రభావంతో సెప్టెంబర్‌లో పావు శాతం కాకుండా అర శాతం కోతను ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. ద్రవ్యోల్బణం దిగొచ్చినప్పటికీ రేట్ల కోత విషయంలో ఫెడ్ సుదీర్ఘ విరామం తీసుకుందని, దీనివల్ల ఎకానమీపై, జాబ్ మార్కెట్‌పై ప్రభావం పడుతోందనేది వారి అభిప్రాయం. అధిక రేట్ల ప్రభావంతో మాంద్యం వచ్చేందుకు 50% అవకాశాలున్నాయని జేపీ మోర్గాన్ అంటోంది!

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ప్యాసింజర్ వాహనాల జోరు | 5 ఐపీవోలకు సెబీ ఓకే

సి.ఆర్.ఐ పంప్స్‌కు ప్రతిష్టాత్మక ఈఈపిసి అవార్డు



పుదుచ్చేరి: ఇంజనీరింగ్ ఎగుమతి రంగంలోని సి.ఆర్.ఐ పంప్స్ 20వ సారి ప్రతిష్టాత్మక ఈఈపీసీ అవార్డు దక్కించుకుంది. పుదుచ్చేరిలో జరిగిన 45వ దక్షిణ ప్రాంత ఎగుమతి అవార్డు ప్రధాన కార్యక్రమంలో భారత వాణిజ్య శాఖ జాయింట్ సెక్రటరీ విమల్ ఆనంద్ చేతుల మీదుగా కంపెనీ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ ఆర్.భూపతి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా భూపతి మాట్లాడుతూ 'అవార్డులు మా సమిష్టి కృషికి, కస్టమర్లు మాపై ఉంచిన నమ్మకానికి నిదర్శనం. ఫ్లూయిడ్ మేనేజ్‌మెంట్‌లో అగ్రస్థానంలో ఉన్నందుకు గర్విస్తున్నాము. మరింత మన్నికైన ఉత్పత్తుల తయారీకి ప్రయత్నిస్తూనే ఉంటాం' అన్నారు.

ఎయిర్‌టెల్ దూకుడు

క్యూ1 లాభం రూ. 4,160 కోట్లు



న్యూఢిల్లీ: భారతీ ఎయిర్‌టెల్ ఈ ఏడాది తొలి త్రైమాసికం (2024-25, క్యూ1) లో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం 2.5 రెట్లు దూసుకెళ్లి రూ. 4,160 కోట్లను తాకింది. గతేడాది (2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 1,613 కోట్లు ఆర్జించింది. ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) మెరుగుపడటానికితోడు.. రూ. 735 కోట్ల అనూహ్య లాభం నికర లాభాల్లో వృద్ధికి దోహదపడింది. మొత్తం ఆదాయం మాత్రం 3 శాతం పుంజుకుని రూ. 38,506 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 37,440 కోట్ల టర్నోవర్ నమోదైంది. దేశీ ఆదాయం మరింత అధికంగా 10 శాతం ఎగసి రూ. 29,046 కోట్లను తాకింది. ప్రస్తుత సమీక్షా కాలంలో ఎయిర్‌టెల్ ఏఆర్‌పీయూ రూ. 200 నుంచి రూ. 211కు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో ఎయిర్‌టెల్ షేరు 2.6 శాతం నీరసించి రూ. 1,059 వద్ద ముగిసింది.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎస్ఎస్‌సీ-కంబైన్డ్ హిందీ ట్రాన్స్‌లేటర్స్ ఎగ్జామినేషన్-2024

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో హిందీ ట్రాన్స్‌లేటర్, జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్, జూనియర్ ట్రాన్స్‌లేటర్, సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్, సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్ పోస్టుల భర్తీకి కంబైన్డ్ హిందీ ట్రాన్స్‌లేటర్స్ ఎగ్జామినేషన్-2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 312.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్(జేహెచ్‌టీ), జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్(జేటీవో), జూనియర్ ట్రాన్స్‌లేటర్(జేటీ), సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్(ఎస్‌హెచ్‌టీ), సీనియర్ ట్రాన్స్‌లేటర్(ఎస్‌టీ).
» **అర్హత:** పోస్టును అనుసరించి మాస్టర్ డిగ్రీ (హిందీ/ఇంగ్లిష్), డిగ్రీ స్థాయిలో హిందీ/ ఇంగ్లిష్ సబ్జెక్ట్ ఉండాలి. దీనితో పాటు ట్రాన్స్‌లేషన్(హిందీ/ఇంగ్లిష్) డిప్లొమా/సర్టిఫికేట్ కోర్సు చేసి ఉండాలి. లేదా కేంద్ర ప్రభుత్వ సంస్థలో ట్రాన్స్‌లేషన్ అనుభవం ఉండాలి. సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీతో పాటు ట్రాన్స్‌లేషన్ అనుభవం ఉండాలి. బ్యాచిలర్ డిగ్రీ/పీజీ(హిందీ/ఇంగ్లిష్)అర్హతతో పాటు అనుభవం ఉండాలి. డిగ్రీ స్థాయిలో హిందీ/ఇంగ్లిష్ సబ్జెక్ట్ ఉండాలి.
» **వయసు:** 01.08.2024 నాటికి 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్/ సీనియర్ ట్రాన్స్‌లేటర్ పోస్టులకు రూ.44,900 నుంచి రూ.1,42,400. ఇతర పోస్టులకు రూ.35,400 నుంచి రూ.1,12,400.
» **పరీక్ష విధానం:** పేపర్-1 (ఆబ్జెక్టివ్ టైప్/ కంప్యూటర్ బేస్డ్ మోడ్) సబ్జెక్టులు: జనరల్ హిందీ(100 ప్రశ్నలు/100 మార్కులు), జనరల్ ఇంగ్లిష్(100 ప్రశ్నలు/100 మార్కులు).
» **పరీక్ష వ్యవధి:** 2 గంటలు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 02.08.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.08.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తు ఫీజు చెల్లింపు చివరితేది:** 25.08.2024.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 04.09.2024 నుంచి 05.09.2024 వరకు.
» **కంప్యూటర్ ఆధారిత పరీక్ష(పేపర్-1):** అక్టోబర్/నవంబర్, 2024.
» **వెబ్‌సైట్:** https://ssc.nic.in/

హెవీ వెహికల్ ఫ్యాక్టరీలో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ అప్రెంటిస్‌లు

చెన్నై అవడిలోని హెవీ వెహికల్ ఫ్యాక్టరీ.. గ్రాడ్యుయేట్, డిప్లొమా, నాన్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ ఇంజనీర్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 300.
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ ఇంజనీర్ అప్రెంటిస్-100, డిప్లొమా ఇంజనీర్ అప్రెంటిస్-100, నాన్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్-100. » **విభాగాలు:** మెకానికల్-50, ఎలక్ట్రికల్-ఎలక్ట్రానిక్స్-30, కంప్యూటర్ సైన్స్/ఐటీ-07, సివిల్-05, ఆటోమొబైల్-18.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, ఇంజనీరింగ్, బీఏ /బీఎస్సీ /బీకామ్ /బీబీఏ /బీసీఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు ఇంజనీరింగ్,నాన్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ ఇంజనీర్ అప్రెంటిస్‌లకు రూ.9000,డిప్లొమా ఇంజనీర్ అప్రెంటిస్‌లకు రూ.8000.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 29.07.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.08.2024
» **ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడి తేది:** 26.08.2024.
» **ధ్రువపత్రాల పరిశీలన తేదీలు:** 09.09.2024 నుంచి 11.09.2024.
» **వెబ్‌సైట్:** https://nats.education.gov.in

ఐటీబీపీలో 143 కానిస్టేబుల్/ ట్రేడ్స్‌మెన్ పోస్టులు

ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ) వివిధ విభాగాల్లో కానిస్టేబుల్ /ట్రేడ్స్‌మెన్(బార్బర్, సఫాయి కర్మచారి-గార్డెనర్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 143.
» **అర్హత:** కానిస్టేబుల్/ట్రేడ్స్‌మెన్(బార్బర్, సఫాయి కర్మచారి-గార్డెనర్) పోస్టులకు మెట్రిక్యులేషన్/పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు సంబంధిత వృత్తిలో పని అనుభవం ఉండాలి. కానిస్టేబుల్(గార్డెనర్)పోస్టులకు మెట్రిక్యులేషన్ లేదా పదో తరగతితో పాటు సంబంధిత విభాగంలో ఐటీఐ/డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలి.
» **పే స్కేల్:** నెలకు రూ.21,700 నుంచి 69,100.
» **వయసు:** కానిస్టేబుల్(బార్బర్/సఫాయి కర్మచారి) పోస్టులకు 21 నుంచి 25 ఏళ్లు, కానిస్టేబుల్ (గార్డెనర్) పోస్టులకు 21 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్(పీఈటీ), ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్(పీఎస్‌టీ), రాతపరీక్ష, ఒరిజినల్ డాక్యుమెంట్ల వెరిఫికేషన్, ప్రాక్టికల్ స్కిల్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 28.07.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.08.2024.
» **వెబ్‌సైట్:** https://recruitment.itbpolice.nic.in

బీమా.. కొలువుకు ధీమా!

బీమా రంగం.. వేగంగా వృద్ధి చెందుతున్న విభాగం! ప్రభుత్వ రంగ బీమా సంస్థలు సైతం తమ కార్యకలాపాలను విస్తరిస్తూ.. వినియోగదారులకు విస్తృత సేవలను అందుబాటులోకి తెస్తున్న పరిస్థితి! ప్రముఖ ప్రభుత్వ రంగ బీమా సంస్థ.. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా.. హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు దేశ వ్యాప్తంగా ఉన్న కార్యాలయాల్లో.. జూనియర్ అసిస్టెంట్ పోస్ట్‌ల భర్తీకి శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో.. ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ జూనియర్ అసిస్టెంట్ నోటిఫికేషన్ వివరాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర సమాచారం..

» మొత్తం 200 జూనియర్ అసిస్టెంట్ పోస్ట్‌లు
» తాజాగా నియామక ప్రకటన విడుదల
» రాత పరీక్ష, ఇంటర్వ్యూతో ఎంపిక



మొత్త పోస్టులు 200

ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ప్రకటించిన తాజా నోటిఫికేషన్ ద్వారా 15 రాష్ట్రాల్లో మొత్తం 200 జూనియర్ అసిస్టెంట్ పోస్ట్‌లను భర్తీ చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 12 పోస్టులు, తెలంగాణలో 31 పోస్ట్‌లు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు ఏదైనా ఒక రాష్ట్రంలోని పోస్ట్‌లకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

అర్హతలు

- 2024, జూలై 1 నాటికి 60 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- కంప్యూటర్ ఆపరేషన్స్/కంప్యూటర్ లాంగ్వేజ్‌లో సర్టిఫికెట్/డిప్లొమా/డిగ్రీ కలిగుండాలి (లేదా) హైస్కూల్/కాలేజ్/ఇన్‌స్టిట్యూట్ స్థాయిలో కంప్యూటర్/ఐటీని ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి.
- **వయసు:** 2024, జూలై 1 నాటికి 21-28 ఏళ్లు(జూలై 2,1996-జూలై 1,2003 మధ్యలో జన్మించి ఉండాలి).

రెండు దశల ఎంపిక ప్రక్రియ

ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ జూనియర్ అసిస్టెంట్ పోస్ట్‌ల నియామకానికి రెండు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి.. రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ.

200 మార్కులకు రాత పరీక్ష

ఎంపిక ప్రక్రియలో తొలిదశ రాత పరీక్షను అయిదు విభాగాల్లో 200 మార్కులకు నిర్వహిస్తారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు-40 మార్కులు, లాజికల్ రీజనింగ్ 40 ప్రశ్నలు-40 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు-40 మార్కులు, న్యూమరికల్ ఎబిలిటీ 40 ప్రశ్నలు-40 మార్కులు, కంప్యూటర్ స్కిల్స్ 40 ప్రశ్నలు-40 మార్కులకు పరీక్ష ఉంటుంది. పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులు తగ్గిస్తారు.

రెండో దశ ఇంటర్వ్యూ

తొలిదశ రాత పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. రాష్ట్రాల వారీగా మెరిట్ జాబితా రూపొందించే అవకాశం ఉంది. ఒక్కో రాష్ట్రంలో ఉన్న పోస్ట్‌లను పరిగణనలోకి తీసుకుని 1:3 లేదా 1:4 నిష్పత్తిలో(ఒక్కో పోస్ట్‌కు ముగ్గురు లేదా నలుగురిని చొప్పున) ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూలో అభ్యర్థులకు బీమా రంగంపై ఉన్న అవగాహన, ఈ రంగంలో సమకాలీన పరిణామాలు, కొలువుపై ఆసక్తి, వ్యక్తిగత నేపథ్యం వంటి అంశాలను పరిశీలిస్తారు.

తుది నియామకాలు

తుది నియామకాలు ఖరారు చేసే క్రమంలో.. రాత పరీక్షలో పొందిన మార్కులను, ఇంటర్వ్యూలో ప్రతిభను పరిగణనలోకి తీసుకుంటారు. ఈ రెండింటిలోనూ పొందిన మార్కులతో మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఆ తర్వాత రిజర్వేషన్లు, ఇతర నిబంధనలను పరిగణిస్తూ రాష్ట్రాల వారీగా తుది జాబితా సిద్ధం చేస్తారు.

వేతనం

జూనియర్ అసిస్టెంట్ కొలువు ఖరారైన ప్రాంతం ఆధారంగా నెలకు కనిష్ఠంగా రూ.30 వేలు; గరిష్ఠంగా రూ.32,800 వేతనం లభిస్తుంది. కేటగిరీ-1 నగరాల్లో నియమితులైన వారికి నెలకు రూ.32,800; కేటగిరీ-2 నగరాల్లో నియమితులైన వారికి నెలకు రూ.31,200; కేటగిరీ-3 నగరాల్లో నియమితులైన వారికి నెలకు రూ.30,000 నికర వేతనం అందిస్తారు. అదే విధంగా విధుల్లో చేరిన తర్వాత ఆరు నెలల ప్రొబేషన్ పీరియడ్ విధానాన్ని పాటిస్తున్నారు. ఈ సమయంలో పనితీరు సంతృప్తిగా ఉంటే శాశ్వత నియామకం ఖరారు చేస్తారు.

విధులివే

ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా నియమితులైన వారు.. గృహ రుణ దరఖాస్తు ప్రక్రియను నిర్వహించడం, డాక్యుమెంట్ స్కానింగ్, డాక్యుమెంట్ మేనేజ్‌మెంట్, డేటాఎంట్రీ, ఈఎంఐల పేమెంట్‌కు సంబంధించి వినియోగదారులతో నిరంతరం సంప్రదించడం వంటి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. దీంతోపాటు కస్టమర్ సర్వీసింగ్, క్యాష్ కౌంటర్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ కార్యకలాపాలతోపాటు సంస్థ అప్పగించే ఇతర బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, ఆగస్టు 14
- **ఆన్‌లైన్ ఎగ్జామినేషన్:** సెప్టెంబర్‌లో నిర్వహించే అవకాశం.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** విశాఖపట్నం, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, విజయనగరం, శ్రీకాకుళం, తిరుపతి, నెల్లూరు, కర్నూలు, కడప, హైదరాబాద్, సికింద్రాబాద్, కరీంనగర్, వరంగల్.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.lichousing.com/jobopportunities
- **ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్:** https://ibpsonline.ibps.in/licjajul24

రాత పరీక్షలో విజయం ఇలా

ఇంగ్లిష్ లాంగ్వేజ్

అభ్యర్థుల్లోని ఇంగ్లిష్ లాంగ్వేజ్ నైపుణ్యాలను పరీక్షించే విభాగం ఇది. ఇందులో రాణించేందుకు బేసిక్ గ్రామర్‌తో మొదలు పెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

లాజికల్ రీజనింగ్

రీజనింగ్ విభాగంలో రాణించేందుకు ప్రాక్టీస్‌కు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలి. విశ్లేషణ సామర్థ్యం, తార్కికత్వం పెంచుకునే విధంగా కృషి చేయాలి. సిరీస్, అనాలజీ, కోడింగ్-డీ కోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్ వంటి అంశాలపై అవగాహన పొందాలి.

జనరల్ అవేర్‌నెస్

ఈ విభాగంలో స్కోర్ సాధించేందుకు హిస్టరీ, జాగ్రఫీ, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్ అంశాలపై పట్టు సాధించాలి. కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి జాతీయ,అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న పరిణామాలను తెలుసుకోవాలి. అదే విధంగా ద్వైపాక్షిక ఒప్పందాలు,జాతీయ-అంతర్జాతీయ సదస్సులు వంటి వాటిపై దృష్టి పెట్టాలి. వీటితోపాటు ఆయా దేశాలకు సంబంధించిన నూతన అధ్యక్షులు, అంతర్జాతీయ క్రీడలు-విజేతలు,అవార్డులు వంటి సమాచారాన్ని కూడా సేకరించుకోవాలి.

హౌసింగ్ ఫైనాన్స్‌పై ప్రత్యేక దృష్టి

జనరల్ అవేర్‌నెస్‌లో భాగంగా అభ్యర్థులు హౌసింగ్ ఫైనాన్స్‌కు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. దేశంలోని హౌసింగ్ ఫైనాన్స్ స్కీమ్‌లు, ఎల్ఐసీ అందిస్తున్న రుణ సదుపాయాలు, హౌసింగ్ ఫైనాన్స్ మార్కెట్ విలువ తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

న్యూమరికల్ ఎబిలిటీ

ఈ విభాగానికి సంబంధించి అర్థమెటిక్‌పై పట్టు సాధించాలి. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. అదే విధంగా.. ప్యూర్ మ్యాథమెటిక్స్ అంశాలపై దృష్టి సారించాలి. టేబుల్స్, డయాగ్రమ్స్, నంబర్ డేటా, లైన్ గ్రాఫ్, బార్ గ్రాఫ్ తదితర గ్రాఫ్ ఆధారిత డేటాలలోని సమాచారాన్ని క్రోడీకరించే విధంగా ప్రాక్టీస్ చేయాలి.

కంప్యూటర్ స్కిల్స్

ఈ విభాగానికి సంబంధించి బేసిక్ కంప్యూటర్ హార్డ్‌వేర్‌పైనా, అదే విధంగా కంప్యూటర్ ఆపరేటింగ్ స్కిల్స్ సాధనపైనా దృష్టి పెట్టాలి. ముఖ్యంగా ఎంఎస్ ఆఫీస్ టూల్స్ (ఎంఎస్ వర్డ్, ఎంఎస్ ఎక్సెల్, పవర్ పాయింట్ తదితర)పై అవగాహన ఏర్పరచుకోవాలి. డాక్యుమెంట్స్ క్రియేషన్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ స్లైడ్స్ రూపొందించడం వంటి వాటిపై దృష్టి పెట్టాలి. వీటితోపాటు కంప్యూటర్ కీబోర్డ్ షార్ట్ కట్ ఇంప్రెషన్స్ తెలుసుకోవాలి.

పైసలూ పోయాయి.. నాన్న ప్రాణమూ పోయింది..



ఈ ఫొటోలో కన్నీరు పెడుతూ కనిపిస్తున్న వ్యక్తి పేరు జయరాజ్. చేయని తప్పుకు యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తూ ఆరేళ్ల కిందట జైల్లో చనిపోయిన తర్వాత తాజాగా హైకోర్టు నిర్దోషిగా తేల్చిన సిద్దిపేట జిల్లాకు చెందిన పోచయ్య పెద్ద కొడుకు. 'మా తండ్రి అన్యాయంగా జైలు పాలయ్యాడు.. మేము దిక్కులేని పక్షుల్లా అయ్యాం.. ఆర్థికంగా చాలా నష్టపోయాం. మా తండ్రి ఏ తప్పూ చేయలేదని హైకోర్టు తీర్పు ఇవ్వడం సంతోషమే. కానీ ప్రాణాలు పోయిన తర్వాత తీర్పునిస్తే మా నాన్న తిరిగొస్తాడా?' అంటూ జయరాజ్ ఆవేదన వ్యక్తం చేశాడు. 'మా నానమ్మ 80 ఏళ్ల వయస్సులో అనారోగ్యం బాధ భరించలేక ఉరి వేసుకొని చనిపోతే మా తండ్రే చంపాడని పోలీసులు అన్యాయంగా కేసు పెట్టి జైలుపాలు చేశారు. చివరకు 11 ఏళ్ల తర్వాత నిర్దోషి అంటూ కోర్టు తీర్పు వచ్చింది. మా నాన్న చనిపోయాక, నాన్న కోసం పొలం అమ్మేసి ఆర్థికంగా నష్టపోయాక.. కోర్టు తీర్పు ఇస్తే ఏం లాభం? మా కన్నీళ్లు ఎవరు తుడుస్తారు?' అంటూ జయరాజ్ 'సాక్షి'తో మాట్లాడుతూ కన్నీరుమున్నీరయ్యాడు.

తండ్రి ఫొటోతో జయరాజ్

సిద్దిపేట జిల్లాకు చెందిన పోచయ్య కొడుకు ఆవేదన

- జరగాల్సిన నష్టం జరిగిపోయాక నిర్దోషి అని తీర్పు వస్తే మా నాన్న తిరిగొస్తాడా అంటూ కన్నీరు
- తల్లిని హత్య చేశాడంటూ 2013లో పోచయ్య అరెస్టు.. యావజ్జీవ కారాగార శిక్ష విధించిన సెషన్స్ కోర్టు
- హైకోర్టును ఆశ్రయించిన కుటుంబం.. 11 ఏళ్ల తర్వాత నిర్దోషి అంటూ తీర్పు.. ఆరేళ్ల క్రితమే చనిపోయిన పోచయ్య.. హైకోర్టుకు అందని సమాచారం

దుబ్బాక: సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పెద్దగుండవెల్లికి చెందిన పెద్దగుండెల పోచయ్య తల్లి ఎల్లవ్వ 2013లో ఆత్మహత్యకు పాల్పడింది. వృద్ధాప్యంలో ఉన్న తల్లిని పోషించలేక పోచయ్యే ఈ హత్య చేశాడనే ఆరోపణలతో దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో సిద్దిపేట సెషన్స్ కోర్టు 2015లో పోచయ్యకు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అయితే చేయని నేరానికి శిక్ష పడిందంటూ పోచయ్య కుటుంబీకులు హైకోర్టులో అప్పీలు దాఖలు చేశారు. తర్వాత చర్లపల్లి జైల్లో ఉన్న పోచయ్యను బయటకు తీసుకురావడానికి బెయిల్ పిటిషన్ వేశారు. అయితే హైకోర్టు ఆ పిటిషన్‌ను కొట్టేసింది. హైకోర్టులో కేసు కొనసాగుతుండగా..సెషన్స్ కోర్టు తీర్పు మేరకు జైలుశిక్ష అనుభవిస్తున్న పోచయ్య 2018 ఆగస్టు 15న గుండెపోటుతో చనిపోయాడు. జైలు అధికారుల సమాచారంతో కన్నీరుమున్నీరైన కుటుంబసభ్యులు.. స్వగ్రామంలో పోచయ్య అంత్యక్రియలు నిర్వహించారు. అయినా హైకోర్టులో పోచయ్య కుటుంబ సభ్యులు దాఖలు చేసిన అప్పీల్ అలాగే కొనసాగింది. కాగా కొన్నాళ్ల క్రితం కేసు విచారణ చేపట్టిన హైకోర్టు.. తమ ముందున్న సాక్ష్యాధారాల మేరకు సెషన్స్ కోర్టు తీర్పును కొట్టేసింది. పోచయ్యను నిర్దోషిగా ప్రకటిస్తూ ఇటీవల తీర్పునిచ్చింది. జైలు నుంచి విడుదల చేయాలని ఆదేశించింది. అయితే హైకోర్టుకు పోచయ్య చనిపోయాడనే విషయం తెలియకపోవడం గమనార్హం. పోచయ్య చనిపోయాడని జైలు అధికారులు హైకోర్టుకు సమాచారం ఇవ్వలేదు. మరోవైపు పోచయ్య తరఫున వాదించిన న్యాయవాది కూడా కొంతకాలం క్రితం మరణించాడు. మొత్తం మీద పోచయ్య చనిపోయిన ఆరేళ్ల తర్వాత కోర్టు అతన్ని విడుదల చేయాలని ఆదేశించడంతో విషయం తెలిసిన వారంతా విస్తుపోయారు. కుటుంబ సభ్యులకు కూడా ఎవరి ద్వారానో విషయం తెలియడం గమనార్హం. అయితే అంతా పోచయ్య గురించే మాట్లాడుతుండటంతో.. 'డాడీ తాత ఎప్పుడు వస్తాడు..' అంటూ ఐదేళ్ల జయరాజ్ కూతురు అక్షయరాణి తండ్రిని అడగడం అందరినీ కదిలించింది.

2 ఎకరాల పొలం అమ్మేశారు

పోచయ్యను జైలు నుంచి బయటకు రప్పించాలని కుటుంబసభ్యులు ఎన్నో ప్రయత్నాలు చేశారు. కోర్టు ఖర్చుల కోసం తమకున్న 3 ఎకరాల్లోంచి 2 ఎకరాలు అమ్మేశామని జయరాజ్ చెప్పాడు. ఇలా ఆర్థికంగా నష్టపోవడంతో పాటు మానసికంగా ఎన్నో కష్టాలను అనుభవించామని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జయరాజ్ గ్రామంలో కూలి పని చేసుకుంటూ తన కుటుంబంతో ఉంటుండగా, చిన్న కుమారుడు దావీదు హైదరాబాద్‌లో భార్య, తల్లి మల్లవ్వతో ఉంటూ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు.

క్లుప్తంగా...

ప్రాణ రక్షణలో డాక్టర్‌లానే పోలీస్ కూడా..

- 'ఎక్స్'లో డీజీపీ జితేందర్



సాక్షి, హైదరాబాద్: ఒక వ్యక్తి ప్రాణం కాపాడేందుకు డాక్టర్ ఎంత కష్టపడతారో.. అదేవిధంగా ప్రజల ప్రాణ రక్షణలో పోలీస్ కూడా ఎప్పుడూ ముందుంటారని డీజీపీ జితేందర్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన తన ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. అందులో రెండు వేర్వేరు వార్తలను డీజీపీ అటాచ్ చేశారు. ములుగు జిల్లాలో జనజీవన స్రవంతిలో కలిసిన వ్యక్తితో ఆ జిల్లా ఎస్పీ శబరీష్ ఉన్న వార్త క్లిప్ ఒక వైపు, మరోవైపు ములుగు జిల్లాలో ప్రమాదవశాత్తూ ఓ వ్యక్తి గోడ మీద నుండి పడి స్పృహ కోల్పోగా దగ్గర్లో ఉన్న కానిస్టేబుల్, అధికారులు వెంటనే సీపీఆర్ చేసి ఆ వ్యక్తిని కాపాడిన వీడియోను ట్యాగ్ చేశారు. "ఇవి రెండు వేర్వేరు వార్తలు..వ్యక్తి ప్రాణాలను కాపాడిన ఆ కానిస్టేబుల్, అధికారులను అభినందిస్తున్నాను. వ్యక్తి ప్రాణం విలువ కాపాడటానికి డాక్టర్ ఎంత కష్టపడతాడో ప్రజల ప్రాణరక్షణలో పోలీస్ కూడా ఎప్పుడూ ముందుంటాడు. క్షణికావేశాలతో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా లేని అడుగులు వేయటం కన్నా జన జీవన స్రవంతిలో కలిసి సమాజ ఉన్నతిలో పాలుపంచుకోవటం ద్వారా ప్రజాస్వామ్యం మరింత ఫరిడవిల్లుతుంది"అని డీజీపీ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

కెమెరా ఉంది జాగ్రత్త



కురవి: సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ.. ఓ రైతు వినూత్నంగా బీరకాయ సాగు చేస్తున్నాడు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నేరడ శివారు ఎల్కచెట్టుతండా జీపీ పరిధిలోని ప్రధాన రహదారి పక్కన నందూలాల్ అనే రైతు.. 30 గుంటల్లో బీర పంట సాగు చేశాడు. పంట చుట్టూ వల ఏర్పాటు చేసుకున్న రైతు.. కోతులు, దొంగలు దూరితే పసిగట్టేందుకు.. రోడ్డు పక్కన ఒక చెట్టు కొమ్మ పాతి దానికి సీసీ కెమెరా ఏర్పాటు చేశాడు. విద్యుత్ సౌకర్యం అవసరం లేకుండా సీసీ కెమెరా పైభాగంలో సోలార్ ప్లేట్ అమర్చాడు. నిరంతరం నిఘా నీడలో బీర పంటను చూసుకుంటూ.. అక్కడి కాపలాదారులకు సలహాలు ఇస్తున్నాడు.

నిద్రను కొలిచే ఏఐ



నిద్ర నాణ్యత, నిద్రలేమి సమస్యల గుర్తింపు కోసం కృత్రిమ మేధ సహకారం

ఐఐటీ హైదరాబాద్ శాస్త్రవేత్తల వినూత్న ప్రయత్నం

కళ్లకు ధరించగలిగే మాస్క్ అభివృద్ధి.. నిద్ర నాణ్యతను సొంతంగా తెలుసుకొనే వీలు

'ఇండియన్ స్లీప్ స్ట్రోక్ డేటా' సేకరణకు నిమ్‌హాన్స్‌తో ఒప్పందం



సాక్షి హైదరాబాద్: మనిషి ఆరోగ్యంగా జీవించేందుకు గాలి, నీరు, ఆహారం ఎంత ముఖ్యమో నిద్ర కూడా ఎంతో ముఖ్యం. తగిన నిద్ర ఉంటేనే మన ఆరోగ్యం మన చేతుల్లో ఉన్నట్టే. కానీ నేటి ఆధునిక కాలంలో మారిన జీవనశైలి వల్ల సమయానికి నిద్రపోకపోవడం లేదా నిద్ర పట్టకపోవడంతో చాలా అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. సరిగ్గా నిద్రలేకపోతే శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. ఈ నేపథ్యంలో నిద్ర నాణ్యతను కొలిచేందుకు, నిద్రలేమి వల్ల కలిగే సమస్యలను గుర్తించేందుకు, ఐఐటీ హైదరాబాద్ పరిశోధకులు వినూత్న ప్రయత్నం చేశారు.

కృత్రిమ మేధ సాయంతో..

సాధారణంగా నిద్రలో పలు దశలు ఉంటాయి. ప్రతి దశలో మన మెదడులోని తరంగాలు ఒక్కో విధంగా ప్రతిస్పందిస్తుంటాయి. ఈ తరంగాలు జ్ఞాపకశక్తితో పాటు జీవ ప్రక్రియలకు ఎంతో ముఖ్యం. అయితే ప్రస్తుతం నిద్రలోని దశలను ఎలక్ట్రోఫిసియోలాజికల్ సిగ్నల్స్ ఆధారంగా మాన్యువల్‌గా లేదా ఏదైనా అల్గారిథమ్ సాయంతో గుర్తిస్తున్నారు. కానీ ఈ పద్ధతుల ద్వారా తప్పుడు సమాచారం లభించే అవకాశం కూడా ఉంది. అందుకే ఐఐటీ హైదరాబాద్ పరిశోధకులు నిద్రపోయే సమయంలో ఉన్న దశలను డీప్ లెర్నింగ్ సాయంతో కచ్చితత్వంతో గుర్తించే పద్ధతిని అభివృద్ధి చేశారు. మల్టీ వ్యూ సెల్ఫ్ సూపర్‌వైజ్డ్ లెర్నింగ్ పద్ధతి ద్వారా ఈ ప్రక్రియను అమలు చేశారు. ఈ పద్ధతిలో 8 రెట్లు వేగంగా మెషీన్ సమాచారం నేర్చుకుంటోందని పరిశోధకులు చెబుతున్నారు.



మాస్క్ రూపంలో..

కళ్లకు మాస్క్‌లా ధరించే వీలున్న ఎలక్ట్రోఆక్యులోగ్రామ్ (ఈవోజీ)ని పరిశోధకులు రూపొందించారు. ఇది కనుగుడ్ల కదలికలను, స్థానాన్ని గుర్తించేందుకు విద్యుత్ తరంగాల కదలికలను కొలుస్తుంది. వెంటనే సమస్యలను గుర్తించి మనకు సమాచారం అందిస్తుంది. ఈ మాస్క్‌ను ఇంట్లో కూడా ఉపయోగించి మనం ఎంత నాణ్యతతో నిద్రపోయామనే విషయాన్ని సొంతంగా అంచనా వేసుకోవచ్చు.

ఈ నేపథ్యంలో 'ఇండియన్ స్లీప్ స్ట్రోక్ డేటా'ను సేకరించేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసైన్సెస్ (నిమ్‌హాన్స్)తో ఐఐటీ హైదరాబాద్ ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో నిద్రలేమికి సంబంధించిన పరిశోధనలకు ఈ డేటా ఎంతగానో ఉపయోగపడనుంది.

ఈ పరిశోధనకు సంబంధించిన వివరాలు టెక్ ఫార్వార్డ్ డిస్పాచ్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

చెవిని సృష్టించిన ఎయిమ్స్ వైద్యులు






పుట్టుకతోనే చెవి లేని బాలుడు

పుట్టుకతో చెవి లేకుండా ఉన్న ఓ బాలుడికి సర్జరీ ద్వారా చెవిని సృష్టించారు యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ ఎయిమ్స్ వైద్యులు. ఏపీలోని విజయవాడకు చెందిన 7వ తరగతి చదువుతున్న 11 ఏళ్ల బాలుడికి పుట్టుకతో కుడి చెవి పూర్తిగా మూసుకుపోయింది. చాలా ఆస్పత్రులకు తిరిగినా ఫలితం లేకపోయింది. ఎయిమ్స్‌లో సర్జరీల ద్వారా అరుదైన శస్త్రచికిత్సలు చేస్తున్న విషయం తెలుసుకున్న ఆ బాలుడి తల్లిదండ్రులు.. జూలై నెలలో ప్లాస్టిక్ సర్జరీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మూలా రోహిత్ బాబును సంప్రదించారు. జూలై 24న డాక్టర్ రోహిత్‌బాబు పర్యవేక్షణలో బాలుడికి శస్త్రచికిత్స నిర్వహించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి మూసుకుపోయిన చెవికి రంధ్రం ఏర్పాటు చేశారు. బాలుడి ఛాతీభాగం నుంచి మృదులాస్థి ఎముకను తీసి చెవి ఆకారంలో చెక్కి చెవిలేని ప్రదేశంలో అమర్చారు. అనంతరం వారం రోజుల పాటు ఆస్పత్రిలోనే తమ పర్యవేక్షణలో బాలుడిని ఉంచుకున్నారు. అతనికి ఎలాంటి ఆరోగ్యపరమైన సమస్య తలెత్తకపోవడం, ఇతరులు చెప్పే మాటలు స్పష్టంగా వినిపిస్తుండడంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. చెక్ చేయించుకునేందుకు బాలుడు మరోసారి సోమవారం ఎయిమ్స్ రాగా డాక్టర్లు పరిశీలించి ఎలాంటి సమస్య లేదని చెప్పారు. విజయవంతంగా శస్త్ర చికిత్స పూర్తి చేసిన డాక్టర్ రోహిత్‌బాబును ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా, మెడికల్ సూపరింటెండెంట్ అభిషేక్ అరోరా అభినందించారు.

..: బీబీనగర్ :..

టుడేస్ గ్రాఫిక్



టాప్-5లో ఉన్న రాష్ట్రాలన్నీ పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉన్నవే కావడం గమనార్హం

ఆధారం: ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా

వైద్యుల భర్తీకి ప్రభుత్వం సిద్ధం

భద్రాద్రి జిల్లాలో ఉన్నతాధికారుల పర్యటన ● 'ఏజెన్సీ నాడి పట్టేదెవరు' కథనానికి స్పందన



భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చిన్నారిని పరిశీలిస్తున్న అజయ్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్..


సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఏజెన్సీ ఏరియాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ వెల్లడించారు. 'ఏజెన్సీ నాడి పట్టేదెవరు'శీర్షికన ఆదివారం 'సాక్షి' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు భద్రాద్రి జిల్లాలో పరిస్థితులను పరిశీలించి నివేదిక ఇవ్వాలన్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ , కార్యదర్శి క్రిస్టీనా చోంగ్తుల ఆదేశాల మేరకు అజయ్‌కుమార్ భద్రాద్రి జిల్లా కొత్తగూడెం బోధనాసుపత్రి, భద్రాచలం ఏరియా ఆస్పత్రులను సోమవారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్, వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ, ఏజెన్సీ ఆస్పత్రుల్లో సేవలందించేందుకు వైద్యులు ముందుకు రావడం లేదని, అయినప్పటికీ భద్రాచలం ఏరియా ఆస్పత్రితో పాటు ఇతర ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న స్పెషలిస్టు డాక్టరు పోస్టుల భర్తీకి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వేతనాల విషయంలో ఇబ్బంది ఉంటే ఇన్సెంటివ్‌లు అందించేందుకు ఇప్పటికే భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేశ్ పాటిల్ ముందుకొచ్చారని తెలిపారు. అన్నింటిపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందిస్తానని అజయ్‌కుమార్ తెలిపారు.

బస్తర్ ఫైటర్స్‌గా ట్రాన్స్‌జెండర్లు



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కొనసాగుతున్న మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ల (కూంబింగ్)లో ట్రాన్స్‌జెండర్లు సైతం రాణిస్తున్నారు. మావోయిస్టుల ఏరివేత కోసం 2021లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్, దంతెవాడ, కాంకేర్, బీజాపూర్, నారాయణపూర్, సుక్మా, కొండగావ్ జిల్లాల్లో బస్తర్ ఫైటర్స్ పేరిట ప్రత్యేక దళాలను ఏర్పాటు చేశారు. ఈ విభాగంలో మొత్తం 2,100 మంది పనిచేస్తున్నారు. వీరిలో 90 మంది మహిళా కమాండోలు ఉండగా, 13 మంది ట్రాన్స్‌జెండర్లు సైతం ఉన్నారు. ఇటీవల మరో తొమ్మిది మంది ట్రాన్స్‌జెండర్లను విధుల్లోకి తీసుకోగా శిక్షణ అనంతరం వారు సోమవారం విధుల్లో చేరారు. కేంద్ర పారామిలటరీ బలగాలతో కలిసి ఫైటర్స్‌లోని సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు.

..: చర్ల :..



శ్రీశైలం



పులిచింతల

తెరుచుకున్న సాగర్ 20 గేట్లు

గంటగంటకూ పెరిగిన నీటి ప్రవాహం | దిగువకు కృష్ణమ్మ పరవళ్లు | 'పులిచింతల'4 గేట్లు ఎత్తి కృష్ణాడెల్టాకు నీటివిడుదల

సాక్షి, హైదరాబాద్/నాగార్జునసాగర్/ హుజూర్‌నగర్/ దోమలపెంట : నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి దిగువకు కృష్ణమ్మ పరుగులు తీస్తోంది. జలాశయంలో నీటిమట్టం గరిష్టస్థాయికి చేరుకోవడంతో సోమవారం ఉదయం 11.30 గంటల నుంచి ఒక్కో గేటు 5 అడుగుల మేర ఎత్తుతూ దిగువకు నీటిని వదిలారు. మొత్తంగా రాత్రి పదిగంటలకు 20 గేట్లు ఎత్తి 1,47,260 క్యూసెక్కులు, సాగర్ ప్రధాన కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ మరో 28,907 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. సాగర్ కుడికాల్వకు 8452 క్యూసెక్కులు, ఎడమకాల్వకు 4613 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ కాల్వకు 1800 క్యూసెక్కుల నీటిని వదిలారు. నాగార్జునసాగర్ గరిష్ట నీటిమట్టం 590 అడుగులు.. పూర్తి నీటినిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు. ప్రస్తుతం సాగర్‌లో 584 అడుగుల నీటిమట్టం, 294.55 టీఎంసీల నిల్వను కొనసాగిస్తూ మిగిలిన వరదను కిందకు విడుదల చేస్తున్నారు.

➤ సాగర్ నుంచి వరద ప్రవాహం గంటగంటకూ పెరగడంతో పులిచింతల ప్రాజెక్టులోకి సోమవారం సాయంత్రం 6 గంటలకు 30,388 క్యూసెక్కుల నీరు చేరింది. కృష్ణా డెల్టా అవసరాలకు 4 గేట్లు ఎత్తి 26,083 క్యూసెక్కుల నీటిని ప్రకాశం బరాజ్‌కు తరలిస్తున్నారు. ప్రస్తుతం పులిచింతలలో 6.72 టీఎంసీల నీటినిల్వ ఉంది. పులిచింతల ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు.. ఎగువ నుంచి భారీ వరద వస్తున్న నేపథ్యంలో మరో రెండ్రోజుల్లో పులిచింతల ప్రాజెక్టు కూడా నిండనుంది. పులిచింతల వరద ప్రవాహం పెరగడంతో మంగళవారం టీఎస్ జెన్‌కోలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమయ్యే అవకాశముంది.

➤ శ్రీశైలం ప్రాజెక్టులోకి 3,44,218 క్యూసెక్కులు చేరుతుండగా.. పదిగేట్లు 12 అడుగుల మేర ఎత్తి 3,10,840 క్యూసెక్కులు, ఎడమ విద్యుత్ కేంద్రం నుంచి 26,481, కుడి విద్యుత్ కేంద్రం నుంచి 37,857 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లలోకి ప్రవాహం కొంత మేర తగ్గింది.

సోమవారం సాయంత్రం 6 గంటలకు కృష్ణా బేసిన్‌లో ప్రధాన ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, ప్రవాహాలు ఇవీ..

ప్రాజెక్టు పేరు	గరిష్ట మట్టం (అడుగుల్లో)	గరిష్ట నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత మట్టం (అడుగుల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
శ్రీశైలం	885	215.81	883.00	204.79	3,44,218	3,75,538
నాగార్జునసాగర్	590	312.05	584.00	294.55	3,23,331	1,47,775
పులిచింతల	175	45.77	130.41	6.72	30,388	26,083

త్వరగా నిండిన సాగర్

2019లో రికార్డు స్థాయిలో వరద

నాగార్జునసాగర్: భారీస్థాయిలో వరద చేరి అతి తక్కువ రోజుల్లోనే జలాశయం గరిష్ట స్థాయికి చేరుకున్నది ఈ ఏడాదేనని అధికారులు వెల్లడించారు. అత్యంత వరద ఎక్కువ రోజులు కొనసాగింది 2019లోనే,.

- 2014లో సాగర్ జలాశయం గరిష్ట స్థాయికి చేరుకోగా సెప్టెంబర్ 4న గేట్లెత్తి దిగువకు కొద్దిపాటి నీటినే విడుదల చేశారు. ఆ ఏడాది కృష్ణానదికి అదనంగా వచ్చిన వరద 73.74టీఎంసీలుగా రికార్డులు చెబుతున్నాయి.
- 2015లో 9.259 టీఎంసీల వరద వచ్చి చేరింది. దిగువకు నీరు విడుదల కాలేదు.
- 2018 సంవత్సరంలో సెప్టెంబర్ 2న గేట్లెత్తి కొద్దినీటిని మాత్రమే దిగువకు వదిలారు.
- 2019వ సంవత్సరంలో ఆగస్టు 12వ తేదీన సాగర్ జలాశయం గరిష్ట స్థాయికి చేరుకోగా గేట్లెత్తారు. సెప్టెంబర్ మాసమంతా గేట్లు ఎత్తి ఉండగా, అక్టోబర్ నెల చివరి వరకు గేట్లెత్తి దిగువకు నీటిని వదిలారు. దీంతో 343 టీఎంసీలు సముద్రం పాలైనట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి.
- వరుసగా 2020లో ఆగస్టు 21న, 2021లో ఆగస్టు 1న, 2022లో ఆగస్టు 11న సాగర్ గేట్లెత్తి దిగువకు కొంత మేరకు నీటిని విడుదల చేశారు.
- 2023లో వర్షాభావంతో సాగర్‌లోకి నీరు చేరలేదు.

తెరుచుకున్న ఉజ్జయిని గేట్లు

- మహారాష్ట్రలో భీమానదిపై నిర్మించిన ఉజ్జయిని ప్రాజెక్టు నిండటంతో గేట్లు ఎత్తి 1,27,705 క్యూసెక్కుల నీటి దిగువకు విడుదల చేస్తున్నారు. ఆ జలాలూ కృష్ణా ప్రధానపాయ నీటితో కలిసి జూరాల మీదుగా శ్రీశైలానికి చేరనున్నాయి.
- ఇక తుంగభద్రలో వరద ప్రవాహం కొంత తగ్గింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 82 వేల క్యూసెక్కుల నీరు చేరుతుండగా, దిగువకు 50 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.